అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక 311
సంపుటి: 38 సంచిక: 4 ఫిబ్రవరి 2015
పేజీలు: 52 వెల: రు. 15

"…. శ్రామికులు చూపిరి మార్గం
లేచిందోయ్ విముక్తి పథం
…. ఇంటర్నేషనల్
ఒకటవుదాం - మానవులం
కలవండోయ్ ఏకంగా …"

సామాజిక ఉద్యమాలు-ప్రజాస్వామిక విప్లవం

7, 8 ఫిబ్రవరి 2015

కా॥ గోరుమాధవరావు ప్రాంగణం, కా॥ గంటి ప్రసాదం వేదిక

(బొడ్డు వారి కళ్యాణ మండపం, దిబ్బ వీధి, బొబ్బిలి, విజయనగరం జిల్లా)

కార్యక్రమం
7.02.2015 (శనివారం)
ఉదయం 10 గంటలకు : పతాకావిష్కరణ
(కామ్రేడ్ గోరుమాధవరావు ప్రాంగణం)
11.00 గంటలకు: ప్రారంభ సమావేశం
(కా. యం.టి.ఖాన్ హాలు,
కా. గంటి ప్రసాదం వేదిక)
అధ్యక్షత: వర్మ
ప్రారంభోపన్యాసం: కాళీపట్నం రామారావు
సామాజిక ఉద్యమాలు- ప్రజాస్వామిక విప్లవం
కీ నోట్: పాణి
భోజన విరామం: 1.00 - 2.00
2.00 గంటలకు: పుస్తకావిష్కరణలు
3.00 గంటలకు
అంశం: వలస కాలంలో బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలు-సాహిత్యం
అధ్యక్షత: చంద్రయ్య, వక్త: రివేరా
4.30నిలకు: కవిగాయక సభ
నిర్వహణ: కేక్యూబ్ వర్మ, వడ్డెబోయిన శ్రీనివాస్
6.30ని.లకు: "మన్యం" డాక్యుమెంటరీ ప్రదర్శన,
ప్రజాకళామండలి, విరసం సాంస్కృతిక కార్యక్రమాలు
08.02.2015 (ఆదివారం)
ఉదయం 10 గంటలకు
అంశం: అంబేద్కర్ సామాజిక సిద్ధాంతం-సాహిత్య ప్రతిఫలనం
అధ్యక్షత: ఉజ్వల్, వక్త: కాశీం
12.00 గంటలకు
అంశం: కులం, మతం-కమ్యూనిస్టు విప్లవ పోరాటాలు
అధ్యక్షత: బాసిత్, వక్త: సిఎస్ఆర్ ప్రసాద్
భోజన విరామం: 1.30 - 2.30
2.30ని.లకు: పుస్తకావిష్కరణలు
3.30ని.లకు
అంశం: హిందుత్వ-సామ్రాజ్యవాదం-ప్రజా ప్రత్యామ్నాయం
అధ్యక్షత: గీతాంజలి, వక్త: వరలక్ష్మి
5.00 గంటలకు:
"ప్రజావైద్యులు" విరసం నాటక ప్రదర్శన,
5.30నిలకు:
బహిరంగ సభ (విద్యుల్లత విజయ్‌కుమార్ వేదిక)
అధ్యక్షత: నల్లూరి రుక్మిణి,
వక్తలు: చలసాని ప్రసాద్, కళ్యాణరావు,
వరవరరావు, పి.వి రమణ

విరసం సాహిత్య పాఠశాల ఈ ఏడాది బొబ్బిలిలో నిర్వహిస్తున్నాం. బొబ్బిలికి ఇతరేతరంగా చరిత్రలో చాలా ప్రాధాన్యత ఉన్నప్పటికీ, విరసానికి సంబంధించినంత వరకు అది అమరుడు గంటి ప్రసాదం పుట్టి పెరిగి, చివరి దాకా అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించిన నేల. శ్రీకాకుళ పోరాటానికి బొబ్బిలి పట్టణం సహా ఆ చుట్టుపక్కల పల్లెలు ప్రతిస్పందించాయి. వలస పాలన కాలం నుండీ

ఉత్తరాంధ్రలో రైతాంగ ఉద్యమాలు, సామాజిక ఉద్యమాలు ఎన్నో జరుగుతున్నాయి. దోపిడికి, ఆధిపత్య కులవ్యవస్థకు వ్యతిరేకంగా సంస్కరణల నుండి ప్రజాస్వామిక విప్లవాల దాకా దేశ వ్యాప్తంగా అనేక ఉద్యమాలు పెల్లుబికి సామాజిక చైతన్యానికి ఎంతగానో దోహదం చేశాయి. ముఖ్యంగా 19, 20వ శతాబ్దాల్లో ఒకవైపు సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలు, మరోవైపు శ్రామికవర్గ తిరుగుబాట్లు వెల్లువగా వచ్చాయి. ఆనాటి కాలం నుండి అనేక రకాల ఆధిక్యాలను, దోపిడీ పీడనలను ఎదిరిస్తూ ప్రజా ఆకాంక్షలను ఎత్తిపట్టిన ఉద్యమాలను బొబ్బిలి సాహిత్య పాఠశాల చర్చిస్తుంది.

భారతదేశంలో అవైదిక, బ్రాహ్మణేతర సంప్రదాయం అత్యంత ప్రాచీనమైనది. కొందరు చరిత్రకారులు ఆర్య సంస్కృతిని కీర్తిస్తూ ఆ వైపు నుండి భారత ఉపఖండ చరిత్ర రాశారు. కాని అవైదిక ప్రజా జీవితం జీవజల వలె కొనసాగుతూ వచ్చింది. చార్వాకుల కాలం నుండి అది ఆలోచనా రంగంలో భౌతిక ఆలోచనా సంప్రదాయంగా విస్తరించింది. ఆ రకంగా అది బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ధిక్కరించిన ప్రత్యామ్నాయపరంపర. సాహిత్య, కళా సాంస్కృతిక రంగాల్లో అది దేశీ మార్గం, జానపదం, ఆస్థానేతరం. సారాంశంలో ప్రజా మార్గం.

ఈ ఒరవడి వలస కాలంలో సామాజిక ఉద్యమాలుగా విస్తరించింది. అక్షరాస్యత అనే అర్థంలో తొలితరం బ్రాహ్మణేతర విద్యావంతులెందరో సాంఘిక, సాంస్కృతిక ప్రపంచంలో అంతకు ముందటి కంటే విలక్షణమైన ఆందోళనలు నడిపారు. వలస చట్రంలో భాగంగా మొదలైన ఈ "వికాస క్రమం"లో ఈ నూతన శక్తులు వెలి, వివక్ష, అంటరానితనాల నిర్మూలన, సమాన అవకాశాలు, ఆత్మగౌరవం వంటి నినాదాలతో రంగం మీదికి వచ్చాయి. ఈ ఆందళనలనే సామాజిక ఉద్యమాలని అంటున్నాం.

ఆధిపత్య కులవ్యస్థకు వ్యతిరేకంగా సామాజిక, సాంస్కృతిక వికాసోద్యమ సేనానిగా, పునరుజ్జీవన పితామహుడిగా జ్యోతిరావు ఫూలే కృషిని, వ్యక్తిత్వాన్ని, లక్ష్యాలను గమనిస్తే ఈ తేడా ఏమిటో స్పష్టమవుతుంది. ఆయనలాంటి వారు ఎందరో దేశవ్యాప్తంగా స్థల కాల ప్రత్యేకతలతో అనేక సామాజిక ఉద్యమాలను నిర్మించారు. తొలి దశలో అంబేద్కర్ ఇలాంటి ప్రభావశీలమైన పోరాటాలు చేపట్టారు. జాతీయోద్యమ కీలక దశలో ఆయన దళితుల పక్షాన సామాజిక, రాజకీయ పోరాటాలు రెండూ నిర్వహించాల్సి వచ్చింది. సామాజిక పార్శ్వాలెన్నింటిలోనో నిర్దిష్టమైన డిమాండ్లతో వివిధ రాష్ట్రాల్లో సామాజిక ఉద్యకారులు పని చేశారు. కళా సాహిత్య మాధ్యమాలతోనూ సామాజిక ఉద్యమాలు వచ్చాయి.

వీరి ఉద్యమ వ్యక్తిత్వంలో ప్రాచీన కాలం నుండి కొనసాగుతున్న అవైదిక సంప్రదాయాన్నీ, వలస యుగంలోని ఆంగ్ల విద్యా ప్రభావాన్నీ చూడవచ్చు. తద్వారా ధిక్కారం, సాంఘిక విముక్తి ఆకాంక్ష రెండూ ఆ ఉద్యమాల్లో కనిపిస్తాయి. ఇదంతా వలసవాద చట్రంలో భాగంగా జరిగింది. వారి ఆకాంక్షలను వినిపించడానికి, వాటిని నిజం చేసుకోడానికి బ్రిటీష్ ప్రభుత్వమే ఆనాటి వ్యవస్థలో ఆలంబనగా కనపడిరది. ఇలాంటి సామాజిక ఉద్యమకారుల్లో చాలా మంది తమ భావజాల ప్రచారానికి, అట్టడుగు దళిత, బహుజనులను కదిలించడానికి సాహిత్య, కళా ప్రక్రియలను ఎన్నుకున్నారు. ప్రజా సాహిత్యంలో అదంతా ముఖ్యమైన భాగం.

(మిగతా 50వ పేజిలో...)

3

KLVA101M175

అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

311

సంపుటి : 38 సంచిక : 4 ఫిబ్రవరి, 2015

సంపాదక లేఖ...

ప్రభుత్వమంతా సింగపూర్ చుట్టే తిరుగుతోంది.

'ప్రపంచంలో అలాంటిది ఎక్కడా లేద'ని జానపద కథల్లో పిల్లలు చెప్పుకుంటారు. అవి ఎంత ఊహాత్మకంగా ఉంటాయో చెప్పలేం. అయితే అవి కథలు మాత్రమే. నారా చంద్రబాబు నాయుడు ఇప్పుడు అలాంటి కథల్లో, కలలో ప్రజలను ముంచెత్తుతున్నాడు. సింగపూర్ కంటే ఇంచుక తగ్గేది లేదని శపథాలు చేస్తున్నాడు.

రైతులు ఇక తమ భూములు ఇచ్చేసి సింగపూర్ వాళ్లు కట్టే రాజధానిని తలచుకుంటూ ఉండాల్సిందే. 'ప్రజా ప్రయోజనం' కోసమైతే ఇక ఎవరి భూమినైనా లాగేసుకోవచ్చు. రైతులను అడగాల్సిన పనే లేదు. బైటి వాడు కాబట్టో ఏమో మరి బ్రిటీష్ వాడు కూడా ఇంత సాహసం చేయలేదు. 'ప్రజా ప్రయోజనం' కోసం ప్రభుత్వం భూమి తీసుకోడానికి కూడా చట్టం అవసరం అనుకున్నాడు. హక్కుదారు అనుమతి కావాలి కదా అనే విచక్షణ ప్రదర్శించాడు. ఈ దేశాన్ని 'గుజరాత్' చేస్తానంటున్న మోదీకిగాని, రాష్ట్రాన్ని సింగపూర్ చేస్తానంటున్న చంద్రబాబు నాయుడికి గాని అది లేదు. రైతుల పొలాలకు తామే యజమానులమని అనుకుంటున్నారు.

దీనికంతా 'ప్రజా సమ్మతి' ఉందని చాటడానికి చంద్రబాబు అనధికార పత్రికలు చేస్తున్న కసరత్తు, ప్రచారం పరమ జుగుప్సాకరం. ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చి 'సింగపూర్' రాజధానికి తమ భూములు ఇస్తున్నారని ఊదరగొడుతున్నాయి.

ఇక్కడితో ఆగక పొమ్మనకుండా పొగపెట్టడానికి రైతుల పంట పొలాలు తగలబడిపోతుంటాయి. ఏది నిజమో.. ఏది అబద్ధమో చెప్పలేని సంరంభం రాజధాని నిర్మాణం చుట్టూ అల్లి ఊహా స్వర్గం తప్ప మరే నిజం అందుబాటులోలేని స్థితి కల్పిస్తున్నారు. సింగపూర్ మాయాజాలాన్ని ఛేదించే దృక్పథం, దృఢమైన ప్రజా పక్షపాతం లేకుంటే భవిష్యత్ తరాలు పొలాలు, ఇండ్లు, ఊళ్లూ మాత్రమేగాదు అస్థిత్వమే కోల్పోయే ప్రమాదం ఉంది. మన నేలకు, మనకు అవసరమైనవి కాకుండా పాలకుల ఇష్టాలను, ప్రయోజనాలను, అవసరాలను ప్రజలు భరించాల్సి వస్తుంది. పాలకులు ఎప్పటి నుంచో అమలు చేస్తున్న ఈ అభివృద్ధి నమూనా మీద ఇప్పటి దాకా కొంత విమర్శ ఉండేది. 'సింగపూర్' ఈ విమర్శా దృక్పథాన్ని గల్లంతు చేస్తే అది అన్నిటికంటే ప్రమాదం.

ఇంతకూ సింగపూర్‌లో ఏముందో ఇప్పటి వరకూ ప్రభుత్వం చెప్పలేదు. ఎందుకు అది మనకు ఆదర్శమో చెప్పలేదు. చంద్రబాబుకు అది ఎందుకో నచ్చింది. ఆయన వెనుక ఉన్న కార్పొరేట్లకు అది అవసరమైంది. వాళ్ల కోసం రాష్ట్రాన్ని సింగపూర్ చేస్తానని అనడం తప్ప మరే దాపరికం ఇందులో లేదు.

ఇంతకూ ఆ దేశం ఆర్థిక వ్యవస్థ ఏమిటి? అక్కడ రెండు పూటలా అన్నం తినాలంటే ఎంత ఖర్చవుతుంది? పేదరికం ఎంత ఉంది? వాళ్ల కనీస అవసరాలు తీరుతున్నాయా? ఆ సమాజపు సాంస్కృతిక సమ్మేళనమేమిటి? ఏ రకంగానైనా మన రాష్ట్రానికి అది ఆదర్శమవుతుందా? ఈ ప్రశ్నలు ఏమీ సమాజంలో లేకపోతే ఎంత నష్టం? రాష్ట్రానికి రాజధాని కావాల్సిందే.. ప్రజలు ఇంకా అవసరం.

ప్రజలు, వ్యవసాయం లేని రాజధాని ఎందుకు?

కార్పొరేట్లస్వామ్యాన్ని చాటుకోడానికి తప్ప.

తొలితరం విప్లవ రచయిత, కథకులు విరసం సంస్థాపక సభ్యులు కామ్రేడ్ తాడిగిరి పోతరాజు (80) జనవరి 9న అనారోగ్యంతో చనిపోయారు. ఆయనకు విరసం అరుణారుణ జోహార్లు అర్పిస్తోంది. ఆయనపై జ్ఞాపకాలు, రచనలు వచ్చే సంచికలో ప్రచురిస్తాం. - సం.

విరసం

సంపాదకుడు
చలసాని ప్రసాద్

వర్కింగ్ ఎడిటర్
డి.వి. రామక్రిష్ణారావు
ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా,
మౌలాలి, హైదరాబాద్ - 500 040.

* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్‌ల ద్వారా రచనలు పై చిరునామాకూ, ఇ-మెయిల్ ద్వారా **arunatara1977@gmail.com** కూ పంపవచ్చు

సంపాదకవర్గం :
ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్

చందాలు పంపాల్సిన చిరునామ
మేనేజర్
ఎస్. రవికుమార్
5-1307, దొరసానిపల్లె రోడ్,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.
సెల్ : 9866021257

విరసం కార్యదర్శి చిరునామా
పి. వరలక్ష్మి
5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.

డి.టి.పి. అండ్ లే అవుట్
ఆర్. భాగ్యలక్ష్మి

మొదటి కవర్
అంతర్జాతీయ గీతానికి గ్రిబెల్ చిత్రరూపం

చివరి కవర్
పెరుమాళ్ ముర్గన్‌కు సంఘీభావంగా

2, 3 కవర్ డిజైన్
ఆర్. భాగ్యలక్ష్మి

Like Page://arunatara viplava rachayitala sangham
website : *www.virasam.in*

ఈ సంచిక వెల : రు. 15/-

సంచిక - 311

సంపాదకీయం (5-6)
భావప్రకటనా స్వేచ్ఛపై నిషేధాలు, నియంత్రణలు - **పి. వరలక్ష్మి**

పాటలు/కవిత్వం (7-8)
విశ్వాసమే బలం - **ఎం. రాఘవాచారి**
ఏప్రిల్ పండు - **రివేరా**
లారి + లూరి = సర్కార్ - **పచ్చల కిరణ్‌కుమార్**

కథలు (9-25, 29)
ప్రకృతి బిడ్డలు - **షహీదా**
స్మృతి - **జి. వెంకటకృష్ణ**
'నియంత' - **సాదత్ హసన్ మంటో**; అనువాదం : **రివేరా**

సీరియల్ (26-29)
సూర్యుడు (13) - **కె.వి. కూర్మనాథ్**

వ్యాసం (30-32)
"రాబంధు" వస్తోంది - **ఎం. ఆదిత్య**

సాహిత్య వ్యక్తిత్వం (33-35)
కవితా శిల్ప రహస్యాలు తెలిసిన కొప్పర్తి - **అరసవిల్లి కృష్ణ**

సంస్మరణ (35-38)
మూగబోయిన "లాల్‌బనో" గళం - **వివి**

వ్యాసం (38-40)
ఇస్లాం తీవ్రవాద మూలాలు - పరిణామాలు
- **ఎర్రంరెడ్డి వర్షింహారెడ్డి**

అనువాద వ్యాసం (41-44)
ఈజిప్ట్: విప్లవం - ప్రతికూల విప్లవం - సోషల్ మీడియా
- **మేరిలిన్ వోట్-డౌని**; అనువాదం : **పి. అరవింద**

పుస్తక సమీక్ష (45-46)
మార్కెట్ మాయలో చక్రబంధమైన భూమి కథ - **పి. వరలక్ష్మి**

కళ (46-47)
పోరు పాటకు రంగులద్దిన ఆటోగ్రీబల్ - **పి. మోహన్**

సాహిత్య వ్యాసం (48-49)
తెలుగులో నిషేధిత నాటకాలు : జమీన్ రైతు
- **ఎస్. చంద్రయ్య**

సాహిత్య పాఠశాల కరపత్రం (50)
2వ కవర్ తరువాయి

విరసం సాహిత్యాన్ని కరపత్రాలను, స్టేట్‌మెంట్లను, అరుణతార పత్రికను **www.virasam.in** వెబ్‌సైట్‌లో చూడవచ్చు. అలాగే వివిధ సాహిత్య పత్రికల బ్లాగులు, సైట్‌ల లింకులను కూడా చూడవచ్చు.

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.
డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.
విడి సంచిక వెల - రు. 15; సంవత్సర చందా - రు. 180;
రెండు సంవత్సరాల చందా - రు. 350; మూడు సంవత్సరాల చందా - రు. 500;
ఐదు సంవత్సరాల చందా - రు. 800; దశాబ్ది చందా - రు. 1600/-

మీ రచనలను అరుణతారకు ఈ-మెయిల్ కూడా చేయవచ్చు!
పేజ్‌మేకర్ ఓపెన్ ఫైల్, పి.డి.ఎఫ్. పద్ధతులలో (అను 6.0లో అయితే మేలు),
మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎం.ఎస్. భాషలో కూడా అరుణతారకు మెయిల్ చేయగలరు
ఈ-మెయిల్ : **arunatara1977@gmail.com**
http://www.facebook.com/arunatara.virasam

భావప్రకటనా స్వేచ్ఛపై నిషేధాలు, నియంత్రణలు

- పి.వరలక్ష్మి

కలం మీద జులుం కొత్త కాదు. రాజ్యం, మతం కన్నెర్రజేయని సాహిత్యం ఏ యుగంలోనూ లేదు. ఈసారి మతోన్మాద శక్తులు తమిళ రచయిత పెరుమాళ్ మురుగన్‌ను ఆత్మహత్య చేసుకునేదాకా వదిలిపెట్టలేదు. ఆయన నాలుగేళ్ళ క్రితం రాసిన నవల "మధోరుభగన్" మీద నెల రోజులుగా రాజేసిన మంటల్లోకి నవలనూ, నవలా రచయితను కూడా తోసేశారు. పాతికేళ్ళ సృజన నెత్తురు కక్కుకుంటూ నేల రాలింది. పెరుమాళ్ మురుగన్ రచయితగా మరిణించానని, ఇక తాను అధ్యాపకున్ని మాత్రమేనని ప్రకటించి కనిపించకుండా వెళ్ళిపోయాడు. ప్రాణం నిలబెట్టుకోవడం కోసం ప్రాణప్రదమైన రచనను చంపుకోవడం నిజంగా ఏ రచయితా వర్ణించలేని బాధ. పెరుమాళ్ మురుగన్ చివరి ఫేస్‌బుక్ ప్రకటనలో (చివరిది కాకూడదని ఆశిద్దాం) ప్రతి అక్షరం క్షతగాత్రమైనట్టు కనపడుతుంది. ఇది ఆయన ఒంటరి దు:ఖం కాదు. భావ ప్రకటనపై దాడి రచయితలందరిపైనా దాడి. అందుకే సాహిత్యలోకం మురుగన్‌కు కాపాడుకోవాలి. దగ్ధమైపోతున్న భావాలను పంచుకోవాలి.

మధోరుభగన్ వందేళ్ళ క్రితం నాటి ఒక కాల్పనిక ప్రేమ కథ. పెళ్ళై పన్నెండేళ్ళయినా వన్నె తగ్గని ప్రేమ కాళి, పొన్నలది. వాళ్ళకొకటే బాధ. ఎన్ని దేవుళ్ళకు మొక్కుకున్నా పిల్లలు పుట్టలేదు. సంతానం లేని దంపతులు, మరీ ముఖ్యంగా స్త్రీలు సమాజం దృష్టిలో శాపగ్రస్తులే. మానవ పాధాన్యతల్లో సహజంగానూ, సొంతాస్తి పరిరక్షణలో భాగంగానూ పునరుత్పత్తి, వారసత్వం, ముఖ్యమైనవి. ఇప్పుడంటే ఆధునిక వైద్యం, టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్లు ఉన్నాయి. ఆనాటి కాలంలో తిరుచెంగోడులో ఒక ఆచారం ఉండేది. పిల్లలు కలుగని మహిళలు ఏడాదికొకసారి జరిగే తిరునాళ్లలో పరపురుషులతో కలుస్తారు. తప్పనిసరి పరిస్థితుల్లో పొన్న కూడా అందులో పాల్గొనవలసి వస్తుంది. సున్నితమైన ప్రేమకు, సాంప్రదాయ రీతికి మధ్య పొన్న విలవిల్లాడుతుంది. పొన్న ఇంకో మగవాడితో కలిసే ఊహే భరించలేదు కాళి. ఈ సంక్లిష్టతలో చిక్కుకున్న స్త్రీ హృదయ వేదనను పెరుమాళ్ మురుగన్ ఆవిష్కరిస్తాడు. మామూలుగా సాహిత్య పత్రికల్లో చర్చనీయాంశమయ్యే కథను మతోన్మాదశక్తులు వీధుల్లోకి లాగాయి. అంత మాత్రమే అయితే మంచిదే. కాని వారు రేపే వివాదంలో చర్చ ఉండదు. మనోభావాలనే హేతువుకందని విచిత్రమైన మాటలుంటాయి. వాటి పేరు మీద బెదిరింపులు, దౌర్జన్యాలు చివరికి హత్యలు కూడా చేయడానికి వెసులుబాటు ఉంటుంది. ప్రభుత్వం, పోలీసులు, అధికార యంత్రాంగం ఆ వెసులుబాటునిచ్చింది కూడా.

పెరుమాళ్ మురుగన్ ఊహాలోకాల్లో కాల్పనిక సాహిత్యాన్ని సృష్టించే రచయిత కాదు. సంస్కృతీ పరిరక్షకులకు తెలియని, వారు ఊహించనైనా లేని కృషిని తమిళ సాహిత్య సాంస్కృతిక రంగాల్లో చేశాడాయన. తిరుచెంగోడులో పుట్టి ఆ ప్రాంతపు యాసభాషలకు తమిళ సాహిత్యంలో స్థానం కల్పించాడు. కొంగునాడు మాండలికాలను నిఘంటువులో నిక్షిప్తం చేశాడు. తను పుట్టి పెరిగిన ప్రాంతపు విశిష్టతను, జీవన వైవిధ్యాన్ని కాల్పనిక సాహిత్యంలో ఆవిష్కరించాడు. మధోరుభగన్ (అర్ధనారీశ్వరుడు) నవల అటువంటిదే. ఇప్పుడు హిందుత్వ శక్తులు అభ్యంతరపెడుతున్న సాంప్రదాయం గతంలో ఉండేదని చెప్పే చారిత్రక ఆధారాలు కొల్లలుగా ఉన్నాయి. కాలంతో పాటు ఆచారాలు, సాంప్రదాయాలు మారతాయి. ఈనాటి విలువలతో ఆనాటి రివాజుల్ని చూడకూడదనే కనీస జ్ఞానం వారికి ఉండదు. ఉన్నా మతరాజకీయాల లక్ష్యం జనంలో భావోద్వేగాలు రెచ్చగొట్టి తమ ఆధిపత్యాన్ని స్థాపించుకోవడమే కాబట్టి మధోరుభగన్ నవల కైలాసనాధర్ దేవాలయాన్ని, శివుడిని, మహిళా భక్తులను కించపరిచిందని ప్రచారం చేశారు. రచయితతో ఏ మాత్రం చర్చించకుండా ఆరెస్సెస్, హిందూ మున్నానితో పాటు స్థానిక కుల సంఘం వాళ్ళు నవలలో తమకు కావల్సిన పేజీలు మాత్రమే తీసి వేలాది ప్రతులు పంచారు. పోస్టర్లు వేశారు. రోడ్ల మీద పుస్తకాలు తగులబెట్టారు. బందులు, హర్తాళ్ళు చేశారు. రచయితను చంపుతామని ఫోన్లో బెదిరించారు. రక్షించాల్సిన పోలీసులు కుటుంబంతో సహా ఊరు విడిచి వెళ్ళిపొమ్మని సలహా ఇచ్చారు. అప్పటికే పెరుమాళ్ మురుగన్‌ను హత్య చేయాలని సంకల్పించారు. వారితో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం కూడా కలిసి ఒక రచయితను నిస్సహాయున్ని చేసి మరీ చంపేశాయి.

తన రచన కారణంగా అల్లరి మూకలు చెలరేగడం, హింసాత్మక వాతావరణం ఏర్పడటం సహజంగానే రచయితను ఆందోళనకు గురిచేశాయి. వందేళ్ళ క్రితం నాటి సాంప్రదాయాలను ఇప్పటి విలువలతో పోల్చి చూడటం సరికాదంటూ ఆ నవలపై చర్చించడానికి తాను సిద్ధమని ప్రకటించినా వారు వినలేదు. చివరికి తిరుచెంగోడు ప్రజల దైనందిన జీవితం కన్నా తన నవల ప్రధానం కాదని, తన నవల ఎవరినైనా నొప్పించి ఉంటే క్షమించమని కోరాడు. అందులోని ఊరిపేరు తీసేస్తానన్నాడు. అభ్యంతరకర భాగాల్నీ తీసేస్తానన్నాడు. అయినా ఆందోళనలు ఆగలేదు. జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకొని ఆందోళనకారులను, రచయితను

శాంతి చర్చలకు పిలిచింది. కాని అక్కడ జరిగింది చర్చ కాదు. అందరూ కలిసి మురుగన్‌ను ఒంటరి చేసి, బెదిరించి, ఆయనతో అత్యంత అవమానకరమైన షరతులకు ఒప్పించడం. వారతన్ని బేషరతుగా క్షమాపణ చెప్పమనడమే కాదు, తన పుస్తకం ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించమన్నారు. ఇక మీదట మతపరమైన సెంటిమెంట్లను గాయపరిచే అంశాల మీద రాయనని, ఇప్పటికే అమ్మకానికి ఉన్న పుస్తకాలను కూడా ఉపసంహరించుకుంటున్నట్లు చెప్పమన్నారు. ఇంత జరిగాక ఇక చేయడానికైనా రాయడానికైనా ఏముంటుంది? ఆ మరుసటి రోజే పెరుమాళ్ మురుగన్ తను రచయితగా మరణించినట్లు ప్రకటించాడు. సోషల్ మీడియా నుండి కూడా వైదొలగుతూ, తనను ఒంటరిగా వదిలేయమని కోరాడు.

పెరుమాళ్ మురుగన్ ప్రకటన ఒక రచయిత నిస్సహాయ ఒంటరి వేదన మాత్రమే కాదు. ఆయనే చెప్పినట్లు ఇది మధోరుభగన్‌తో అయిపోయేది కాదు. ఏదో ఒక గుంపు ఎప్పుడైనా ఏ పుస్తకాన్నయినా తీసుకొని అల్లరి చేయగలదు. కాబట్టి అదొక హెచ్చరిక కూడా. మధోరుభగన్ ప్రచురణ పొంది నాలుగేళ్ళయ్యాక దాని మీద వివాదం రాజేశారు. అది ఇంగ్లీషులో విడుదలయ్యాకే గొడవ మొదలు కావడానికి వెనక ఒక పకడ్బందీ ప్రణాళిక ఉందని, ఢిల్లీ నుండి ఒక బృందం అదే పనిగా పుస్తకాలు చదువుతూ ఇటువంటి వివాదాలు సృష్టించి ఆందోళనలు చేయిస్తున్నదని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇవి సహేతుకమే అనడానికి సంఘపరివార్ విద్వేష కాంపెయిన్ల అనుభవాలు చాలు. సంఘపరివారే కాదు, శాస్త్రీయ పరిశోధన, చరిత్ర, పురోగామి భావనల మీద ఏ మతానిదైనా ఒకటే వైఖరి. హేతుబద్ధ జ్ఞానం, ప్రశ్న ఏ మతానికీ గిట్టవు. వాటితో అవి ఎట్లా వ్యవహరిస్తాయో చరిత్రలలోనూ, వర్తమానంలోనూ ఉదాహరణలు కోకొల్లలు. అయితే నిర్దిష్టంగా భారతదేశంలో హిందుత్వ శక్తుల సాంస్కృతిక ఆధిపత్యం వల్ల, ఇప్పుడు అగ్గికి గాలి తోడైనట్లు అధికారం కూడా తోడైంది కనక అది మరింత ఫాసిస్టు రూపం తీసుకుంటున్నది. పురోగామి భావాలు, శాస్త్రీయ పరిశోధన, చరిత్ర, సాహిత్యం కూడా కత్తి అంచుమీద నడవక తప్పదు.

జ్ఞానం నశింపజేసి ప్రజల్ని మూర్ఖులుగా, బానిసలుగా తయారుచేయరు చేసే పనిముట్లే మతం, పవిత్ర గ్రంథాలని పెరియార్ అన్నాడు. ఆయన ఏ సమాజంలో హేతువాద ఉద్యమాన్ని నిర్మించాడో అక్కడ ఇప్పుడు మూర్ఖత్వం వర్ధిల్లుతున్నది. ఆయన స్థాపించిన ద్రవిడ రాజకీయ పార్టీ వారసుల అవకాశవాద మౌనం పార్లమెంటరీ రాజకీయాల దౌర్బల్యాన్ని ఎత్తి చూపుతోంది. తిరుచెంగోడులో ఓట్ల ప్రాబల్యం ఉన్న కులానికి, మెజారిటీ మతానికి ద్రవిడ రాజకీయాలు లొంగిపోయాయి. సెక్యులర్, ప్రజాస్వామిక భావనలు ఎదగని సమాజంలో ఎన్నికల ప్రజాస్వామ్యం ఒక మాయాజాలమని అన్ని పార్టీలకు తెలుసు. ప్రజల్ని ఓటర్లుగా, గుంపులుగా లొంగదీసుకునే మాయ అందులో ఉంటుంది. కొన్ని దశాబ్దాల అనుభవంలో సంఘపరివార్‌కు ఆ కిటుకు తెలిసిపోయింది. మతం, దేశభక్తి, అభివృద్ధి - ఏ సమూహానికి ఏది ఎక్కించాలో అర్థం చేసుకుని అమలు చేస్తున్నారు.

అదలా ఉంచితే ఇక్కడ చర్చించాల్సిన మరో అంశం ఉంది. పెరుమాళ్ మురుగన్ సంచలనాత్మక ప్రకటన చేశాక గాని ఆయనపై దాడి గురించి లోకానికి, కనీసం సాహితీ లోకానికి తెలియలేదు. తెలిసాక స్పందించడం, అక్కడక్కడా ఏదో ఒక స్థాయిలో మధోరుభగన్‌ను సామూహికంగా చదివి సంఘీభావం తెలపడం, కోర్టులో కేసు వంటివి నడుస్తున్నాయి. అంతకు ముందు సరిగ్గా ఇటువంటి దాడుల్నే ఎదుర్కున్న మరో ఇద్దరు తమిళ సాహిత్యకారులు కణ్ణన్, దురైగుణల గురించి పెద్దగా బైటికి కూడా రాలేదు.- ఇంచుమించు ఇదే కాలంలో జరిగింది కనక చార్లీహెబ్డే పోలిక ఇక్కడ సహజంగానే వస్తుంది. ఫ్రెంచ్ పత్రిక చార్లీహెబ్డే మీద ముస్లిం మతఛాందసవాదుల దాడికి పెషావర్ స్కూలు పిల్లల మీద దాడి సందర్భంలోలాగే లోకం పెద్ద ఎత్తున స్పందించింది. భావ ప్రకటనా స్వేచ్ఛను ఉక్కు పాదాల కింద నలిపేసిన రాజ్యాధినేతలతో సహా మిలియన్ల మంది ఆ పత్రికకు సంఘీభావం తెలిపారు. అది అన్ని సందర్భాల్లో వ్యక్తం కావడం లేదంటే అన్ని సందర్భాల్లోనూ భావాల మీద దాడి ఖండనార్హం కాదని మీడియా, రాజకీయ పక్షాలు చెప్పకనే చెబుతున్నాయా?

చార్లీ హెబ్డే మీద దాడిని ఖండించాల్సిందే. మతాలనో, ప్రవక్తలనో ఏమోగాని, బురఖా ధరించే మహిళల్ని అసభ్య రేఖల్లో చిత్రించిన చార్లీ హెబ్డే వ్యంగ్యంలోని మంచి చెడ్డల గురించి, బలవంతుడి మీద కాక, దెబ్బలు తింటున్న సమూహం మీదే ప్రయోగించే వ్యంగ్యంలోని ఔచిత్యం గురించి కూడా మాట్లాడుకుంటే గాని ఈ స్పందనలు ఎవరు స్పాన్సర్ చేస్తున్నారో అర్థం కాదు. ఆ చర్చ చేస్తూనే రాజకీయాలను మతం నియంత్రిస్తే, అది ఆధిపత్య రాజకీయాలు కావచ్చు, ప్రతిఘటనా రాజకీయాలు కావచ్చు మొత్తంగా ఫండమెంటలిజం సమాజానికి, ప్రజాస్వామిక భావజాలానికి ఎంత ప్రమాదకరమో గుర్తించాలి. తక్షణం అన్నింటి కన్నా మనల్ని ఆవరించిన ప్రమాదం మరొకటుంది. మన స్పందనలను, ఆవేశాలను ఆమోదయోగ్యమైన పరిమిత చట్రంలో బిగించివేయడం కంటికి కనిపించే హింస కన్నా ప్రమాదకరం. సమాజం దేనికి స్పందించాలి, దేని గురించి ఆలోచించాలి వాటి పరిధుల్ని నిర్ణయించేదేదో జరిగిపోతోంది. ఇందులో ప్రముఖంగా కార్పొరేట్ ప్రాయోజిత మీడియా పాత్రను చర్చించాలి. సమాజాన్ని మొత్తంగా నిశ్శబ్దం చేయడం సాధ్యం కాదు. చలనం లేని సమాజం ఉండదు కనక ఆ చలనాల్ని ఒక పరిమితిలో నియంత్రించే వ్యూహం ఇది. దీని నేపథ్యంలో భావప్రకటన స్వేచ్ఛ గురించి మాట్లాడుకోవాలి. అప్పుడుగాని పెరుమాల్ మురుగన్‌లు మనకెంత ముఖ్యమో అర్థం కాదు.

విశ్వాసమే బలం

- ఎం. రాఘవాచారి

కొండలకు లేని బలం
గుండెలకు ఎక్కడిది
ఆదివాసి అంతరంగ
మర్మమేమిటి
తెలియని శక్తి ఏమిటి?

లేవు నిలువు (పెద్ద) బంగళాలు
ఉన్నదింత బొద్దు గుడిసె
బొద్దు పేగు కోసి తల్లి
ఏ వెలుగులు చూపినదో
గుండె దిటవు నేర్పినదో ॥ కొండ ॥

చెట్టులెక్కి తేనెతీసి
మనసుకు తాపినరొ ఏమొ
తేట మాటల తీయని
పాటలుతరు
ధింసా ఆటలవుతరు ॥ కొండ ॥

గుట్టలు ఎదురెక్కి ఎక్కి
అందని శిఖరాల కెదిగి
ఎదద విశాలతకు వారు
నెలవులవుతరు
జీవన పాఠమవుతరు ॥ కొండ ॥

ఆదివాసి సహనానికి
ఎదురులేని ధీశక్తికి
ఆయుధము దినచర్యలో
భాగమైనది
బతుకున దీపమైనది ॥ కొండ ॥

పులిబారిన బడి బతికిన
జీవాలను ప్రేమజేసి
సమరానికి నడిపించే
సంఘమైనరు
ఆగని సమరమైనరు ॥ కొండ ॥

రాంజి గోందు వారసులు
కొమురంభీం సాహసులు
గూండాదూర్ బాటలోన
యోధులైనరు
సాహస యోధులైనరు ॥ కొండ ॥
వలస సైనికశక్తిని
తరిమి తరిమి కొట్టినారు
నూతన జనస్వామ్యానికి
కదులుతున్నరు
విజయం మనదె అన్నరు ॥ కొండ ॥

ఏప్రిల్ పండు

- రివేరా

ఆపిల్‌ని ముక్కలు చేసినట్టు
ఏప్రిల్ నెలలో మేం పుట్టాం
ఏభాగం ఎవరిదో తెలియదు
ఎవరిని ఎవరం పునర్జీవిస్తున్నామో తెలదు
ఒకసారికే ఆకులు మేస్తుంటే
పదిరోజుల ఎడంతో
రెండు జన్మలు ఎత్తాం
వాళ్ళలా చిగురాకాశాన్నంతా
దూసేయలేం గానీ
పరిగెత్తే బాతుల గుంపుతో సహా వాళ్ళలా
అమాంతం ఏ సరస్సులోకో దూకేయలేం గానీ
వాళ్ళు ఆస్తులు అడుగుతున్నప్పుడు
మేం యవ్వనాన్ని అడుక్కుంటే తప్పా?

రాద్ధాంతం చేయకుండానే
ప్రబంధం అనుకోకుండానే
ఏడో నెలలో పుట్టేస్తాం
కొందరు డిసెంబరులో పుడతారు
కొందరు జూలై లోనే మళ్ళీ మళ్ళీ
పుడతామంటారు
కొందరు మేలో పుట్టొద్దని ప్రార్థిస్తారు
కొందరు క్యాలెండర్‌ని తిప్పేటప్పుడో, తిరగేసినప్పుడో
ప్రసరించి అక్కడే పడేసి పోతారు
ఎప్పుడూ పుట్టినట్టు ఉండదు
మరణిస్తున్నప్పుడంతా గమ్మత్తుగా ఉంటుంది
నిస్సందేహంగా ఏప్రిల్ నెల సాదాసీదా కల
గిరికీలు కొట్టే కాలంపై ఏమరుపాటులో
రెండు కాళ్ళూ మోపామంతే!

కారణజన్ముల్లా
రెండు శరీరాలు కలిసినప్పుడు జననం
స్పర్శని స్మృతీతలంలో బిగబట్టిన
ఒకానొక గుప్పెట విప్పితే పావురాల టపటప
అరచేతి గీతల్లా గజిబిజి అనిపించవచ్చు గానీ
ఎవరో పారేస్తే ఎత్తుకున్నట్టు ఉంటుంది గానీ
పోలికలే కాదు...నవ్వినా, నడిచినా
ఎదురుబొదురు ముఖాలు పుష్పించినట్టే!

చీటింగ్‌ని టీచింగ్ అని
మిర్చిని మికిచి అంటుంటే
నిఘంటువు అట్టల మధ్య కొత్త భాషేదో విచ్చుకున్నట్టే!

అయినా
మాట్లాడుతూ మాట్లాడుతూనే
ఎంతకూ అర్థం కాకుండాపోతారు
పక్క పక్కనే ఉన్నట్టు అనిపించినా
అంతకంతకూ సమాంతరం అయిపోతారు
అప్పుడల్లా నీరెండ దిగులు
దానిలాగే నీటి కోసం, ఎండ కోసం బెంగ!
ఒక్కమాటలో ఏప్రిల్ నెల ఒక మజిలి, ఒక వెలితి
ఎప్పుడూ అమ్మానాన్నలేనా....
వాళ్ళ కోసం ఒక్కసారైనా
ఈ పిల్లలు మళ్ళెందుకు పుట్టరో!

లాఠి + లూఠి = సర్కార్

- పచ్చల కిరణ్‌కుమార్

వంద రోజుల ఉపాధిలో
వంద రూపాయల కూలీని
మద్యంగా కొల్లగొట్టడం
ప్రజాస్వామ్యం!

భూమినంత పిడికిట్లో పెట్టుకుని
రగులుతున్న కడుపులను
తలవొక్కింటికి నాలుగు చొప్పున
రూపాకి కిలో బియ్యంతో చల్లార్చాలనుకోవడం
ప్రజాస్వామ్యం!

లక్షల కోట్లను
కొల్లగొట్టినోళ్ళను ఆరాధిస్తున్న చోట
పిడికెడు మెతుకులు దొంగిలించినోడ్ని
కొట్టి కొట్టి చంపడం
ప్రజాస్వామ్యం!

అంటరానితనం
ధిక్కార స్వరమవుతూన్నప్పుడు
వాడలకు వాడల్ని
నరికి ఉప్పుపాతెరలేస్తూ
అత్యాచారాలకు తెగబడటం
ప్రజాస్వామ్యం!

హంతక ముఠాలకు
శిక్షలు ఖరారు చేయాల్సిన న్యాయస్థానాలు
నిర్లజ్జగా దోషులను తప్పించడం
ప్రజాస్వామ్యం!

లౌకికరాజ్యమంటూ
మొదలు నుండి
చివరి వరకు
కరికులాన్ని కాషాయికరించడం
ప్రజాస్వామ్యం!

గర్భాన్ని చీల్చి
నెత్తుటి గుడ్డును
ముక్కలు ముక్కలుగా నరకడం
ప్రజాస్వామ్యం!

మర్మాయువాల్లో
రాళ్ళు కూర్చి
బాయినెట్లతో పొడవడం
ప్రజాస్వామ్యం!

చైతిపల్లో
వందనాదుర్వేలను
టాడాలు పోటాల నల్లచట్టాలతో
బందీగ చేయడం
ప్రజాస్వామ్యం!

ఇప్పపూల సాక్షిగా
ఆదివాసుల గూడేలను గుడిశలను తగలబెడుతు
నిరాశ్రయులను చేయడం
ప్రజాస్వామ్యం!

తొమ్మిది సంవత్సరాల యవ్వనమైనా
తొంభై సంవత్సరాల వృద్ధాప్యమైనా
రాజ్యం తూటాలకు వొరిగిపోవడం
ప్రజాస్వామ్యం!

నూతన మానవుల
తలలకు వెలలు కట్టి
మనిషి మనుగడను ధ్వంసం చేయాలనుకోవడం
ప్రజాస్వామ్యం!

కోల్ట్ సెవెన్‌పాయింట్ సిక్స్టిటూ
పై పాయింట్ ఫిఫ్టిసిక్స్ బ్యారెల్ల ముందు నిలబెట్టి
శ్వాస స్వేచ్ఛను నిర్మూలించడం
ప్రజాస్వామ్యం!

కథ

ప్రకృతి బిడ్డలు

- షహీదా

"తల్లి లేని పిల్ల"

ఎవరి మనసు నుండైనా ప్రేమ, ఆప్యాయత, అనుతాపం, దయ లేదా కరుణ వంటి ఎన్నో భావోద్వేగాలను పొంగి పొర్లేలా చేసే మరొక్క మాటను నాకు చూపించండి చూద్దాం. అందులోనూ వారు మహిళలైనప్పుడు. వారు ఆదివాసులు కూడా అవుతేనో? అంతటితో ఆగక వారు మావోయిస్టులు కూడా అయితే'

ఆ "తల్లిలేని పిల్ల" మానవ శిశువు కాకుంటేనేం? ఒక బుజ్జి ఉడతపిల్లే అయితేనేం?

"గిల్లూ" అని ఆ తర్వాత రోజుల్లో నేను మనసులో పేరు పెట్టుకున్న ఆ ఉడతపిల్ల అ ప్రపంచంలోకి అడుగు పెట్టే శిశువులన్నిటి వలనే ఎంతో అమాయకంగా మా జీవితాల్లోకి అడుగిడింది. అంతే ఆనందాన్నీ తీసుకుని వచ్చింది.

ఆ ఉదయాన నేను నా నరాల్లోకి సెలైన్ ఎక్కుతుండగా నిద్రకూ మెలకువకూ మధ్యన ఏదో దశలో ఉన్నాను. ఏదో గోల వినిపించడంతో కళ్ళు తెరిచే ప్రయత్నం చేస్తూ నాతో ఉన్న గెరిల్లా డాక్టరును అడిగాను.

"ఏంటది?"

"మన కామ్రేడ్సుకు ఏదో జంతువు కనిపించినట్టుంది" అన్నది సోనీ రాటుదేలిన ఆదివాసీ గెరిల్లా కుండే సహజాతంతో.

నా సైగనర్థం చేసుకుని, సెలైన్ అయిపోవడానికి ఇంకా సమయం ఉందని నిర్ధారించుకుని ఆమె అటువైపు వెళ్ళింది. చిరునవ్వు పెదాలపై నాట్యం చేస్తుండగా తిరిగి వచ్చింది.

"అది బెట్టుడుత పిల్ల. దాని తల్లి హడావుడిలో దాన్ని వదిలేసి పోయినట్టుంది. అది చెట్టుమీంచి కిందపడితే సదురు దాన్ని పట్టుకున్నాడు..."

అంత నీరసంలోనూ నా పెదాలు విచ్చుకున్నాయి. బెట్టుతను చూసినవాళ్ళెవరి పెదాలైనా విచ్చుకుని తీరాల్సిందే. మా దండకారణ్యంలోని వేర్వేరు డివిజన్లకు నేను రాజకీయ గురువుగా వెళ్ళిన సందర్భాల్లో అక్కడి వనాల్లో నివసించే ఈ ఉడుతను చూసే అవకాశం కలగడం వల్ల నాకది పరిచయమే.

కోయలో దీన్ని "వెర్చే" అంటాము. అడవుల్లో నివసించే ఈ బెట్టుడతకు వీపు, శరీర పైభాగం నిండా ముదురు ఎరుపు-ఇటుక రంగు వెంట్రుకలు, ఒక పొడవాటి నల్లటి కుచ్చు తోక, ఆ తోక చివర బంతిలా వేలాడే తెల్లటి వెంట్రుకలు, ఎద, ఇంకా శరీర కిందిభాగం అంతా లేత పసుపు రంగు బొచ్చు, చిన్ని గుండ్రటి చెవులు, కాటుక నలుపు కళ్ళు ఉంటాయి. దాని పెద్ద కనుగుడ్లు గుండ్రంగా కళ్ళ నిండా వుండి ఏ పసిపాపలకైనా చేకూర్చే ఒక అమాయకత్వాన్ని దానికీ చేకూరుస్తుంటాయి. దాని అవయవాలు, రంగులూ అన్నీ ఎంత చక్కగా, పొందికగా అమరిపోయి ఉంటాయంటే, దాని లేత పసుపు రంగు కింది భాగానికీ, ముదురు ఎరుపు-ఇటుక రంగు పైభాగానికీ మధ్య గీత గీసినట్టు ఆ రేఖలు కూడా ఎంత లయబద్ధంగా ఉంటాయంటే దాన్ని చూడడమే శ్రద్ధగా సంగీతంకట్టిన ఒక పాటను వింటున్నంత ఇంపుగా ఉంటుంది. దీనికి దాని చురుకైన విన్యాసాలు కూడా తోడైనాయంటే అంతే, ఒక దాని ఆకర్షణ నుండి తప్పుకోవడం ఎవరి తరం కాదు. అది పూర్తిగా ఎదిగాక బహుశా పది కిలోగ్రాముల బరువు తూగచ్చు. అది చెట్ల మీద జీవిస్తూ, ఎక్కువగా కొమ్మల మీద పరుగులు పెడుతూ కనిపిస్తుంటుంది. శాఖాహారి.

ఆ రోజు మేం ప్రయాణం చేయాల్సిన దూరం ఎక్కువగా ఉంటుందనీ, అంత జ్వరంతో మిగతా అందరితో సమానంగా నడవడం కష్టం కనుక ఒక చిన్న టీమును తీసుకుని నేను ముందుగానే బయలుదేరితే మంచిదనీ కామ్రేడ్స్ చెప్పారు. నేను కృతజ్ఞతగా ఒప్పుకుని కొద్ది గంటల్లో బయలుదేరడానికి తయారయ్యాను. అప్పటికి నేను బుజ్జి బెట్టుడుత గురించి మర్చేపోయాను. నడవడానికి ఫర్మేషన్‌లో నుంచున్నప్పుడు హఠాత్తుగా నా కళ్ళ నాకంటే ముందు గెరిల్లాల ముందు నుంచుని ఉన్న పాలి భుజం మీద ఎంచక్కా కూచుని ఉన్న ఆ ఉడుతపిల్ల మీ పడ్డాయి.

అది తొలిచూపు ప్రేమ. అంతకంటే మరోవిధంగా ఉండే అవకాశమే లేదు.

అది ఎంత బుజ్జిగా, ఎంత ముద్దుగా, ఎంత "తల్లిలేని తనం"తో ఉండిరదంటే మనసులు కరిగిపోవల్సిందే. అయినా మనసులు ఉన్నది కూడా ఇంకెందుకు గానీ...

ఆ విధంగా మొదలైంది గిల్లూతో నా/మా మరుపురాని ప్రయాణం.

ఎంతో కష్టంగా ఉండాల్సిన ఆ ప్రయాణం గిల్లూ నా తోటి ప్రయాణీకురాలుగా ఉండడంవల్ల ఎంతో ఆహ్లాదకరంగా మారిపోయింది.

మేం విశ్రాంతి కోసం దారిలో ఆగినప్పుడల్లా మా అందరికీ అదో పెద్ద ఆకర్షణ కేంద్రమైపోయింది. పిల్లల్లా పళ్ళికిలించుకుంటూ దాని చుట్టూ మూగే ఆ గెరిల్లాలు భారత రాజ్యానికి "అతి పెద్ద అంతర్గత ముప్పు"ల భాగం కూడా అనేది వేరే విషయం.

ప్రతి ఒక్కరూ మఖమల్ బంతిలా ఉన్న ఆ బుజ్జిపిల్లను ముట్టకోవాలని, దాన్ని తమ చేతుల్లో నిలుపుకోవాలని, గుండెలకు హత్తుకోవాలని చూస్తున్నారు. దాన్ని నిమురుతున్నారు, కౌగలించుకుంటున్నారు. కొందరైతే ముద్దు పెట్టుకుంటున్నట్టుగా కూడా దాన్ని దగ్గరకు తీసుకుంటున్నారు. దాన్ని చెట్ల మీదకి ఎక్కిస్తున్నారు, మళ్ళీ దింపుతున్నారు.

మరో పసిపాప తప్ప మరేదీ కూడీ బెట్టుడత పిల్లకేసి చూస్తున్న గెరిల్లాల ముఖాల్లో వెల్లివిరుస్తున్న ఆ అందమైన నవ్వుల్ని సృష్టించలేకపోయేది. నేను దేనికేసి ఎక్కువ ఆనందంగా చూస్తున్నానో తేల్చుకోలేకపోయాను - ఉడుత పిల్లనా? లేక అందమైన నవ్వులతో వెలిగిపోతున్న ఆ ముఖాలనా?

మేం చేరాల్సిన చోటుకు చేరే వరకు అలిసి పులుసైపోయాం. త్వరత్వరగా పడుకోడానికి జాగాలు చేసుకుని వాలిపోయాం. ఒక చేతిసంచీ అడుగున పాతగుడ్డలను బూరుగదూది పరుపులా మెత్తమెత్తగా తయారు చేసి నిద్రకొచ్చిన ఉడుతపిల్లను అందులో మృదువుగా పడుకోబెట్టాం. దాని తిండి కార్యక్రమం దారిలోనే ముగిసింది.

నిద్రపోతున్న ఆ బుజ్జిపిల్లను చూస్తుంటే నేను ఎప్పుడో డైరీలో రాసుకున్న వాక్యాలు గుర్తుకొచ్చాయి.

"ప్రపంచంలోకెల్లా ఆనందాన్నిచ్చే దృశ్యం - బడికి పోయే అమ్మాయిలు

ప్రపంచంలోకెల్లా అందమైన దృశ్యం - నిద్రపోయే పసిపాప"

గిల్లా ఈన చేతులూ, కాళ్ళూ గాల్లోకి లేపి వెల్లకిలా పడుకుంది. కింద దాని కుచ్చుతోక కొద్దిగా వంపు తిరిగింది. ఆ పోజు బుజ్జిపిల్ల తనను ఎత్తుకోమని అడుగుతున్నట్టుగా ఉండింది. ఆ పోజును చూసిన క్షణంలోనే గెరిల్లా అమ్మాయిలందరూ దాని మీద తమ మనసులను పారేసుకున్నారు.

డికెలోని ఒక డివిజనుకు చెందిన 40,50 మంది గెరిల్లాలతో ఉన్నాను నేను. వాళ్ళు డికె కూడా భాగమైన సెంట్రల్ రీజియన్‌లో తీసుకున్న బోల్షవీకరణ క్యాంపెయిన్‌లో భాగంగా కొన్ని రాజకీయ తరగతులు జరుపుకోవాలని ప్లాన్ చేసుకున్నారు. నేను కూడా వాటిలో కొన్ని క్లాసులు చెప్పాల్సి ఉంది. క్లాసులు రెండు బ్యాచులుగా జరపాలనుకున్నాం. ఒకటి ఏసియంలకు, రెండవది పార్టీ సభ్యులు, పిఎల్‌జిఎ సభ్యులకు. ఆ తర్వాత కొన్ని మీటింగులు కూడా ఉండినాయి. అందుకని మేం కొద్దిరోజులు క్యాంపు వేయాలనుకున్నాం. అయితే మేం త్వరత్వరగా క్యాంపు జాగాను మారుస్తూ తిరగాలనుకున్నాం. మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ మొదలైంది. దాని ఒత్తిడిని మేం అనేక రూపాల్లో చవి చూస్తున్నాం. ఎప్పుడూ కదలికలో ఉండడమనేది మా భద్రతలో కీలకమైన అంశం. క్యాంపు వేస్తుంటాం కనుక బెట్టుడుత పిల్లని కొద్దిరోజులు మాతో ఉంచుకోవాలని నిర్ణయించుకున్నాం.

మా గెరిల్లా జీవితంలో జంతువుల్ని పెంచడం సాధారణంగా జరిగే విషయమేం కాదు. అలాగని అది ఏమాత్రం జరగని, ఎరుగని విషయమూ కాదు. మా పిఎల్‌జిఎ గెరిల్లాలకు ఈ భూమ్మీది తమ తోటి జీవాలతో కలిసి ఉండే అవకాశం వేర్వేరు సమయాల్లో దక్కింది. వాటి నుండి విడిపోవాల్సి వచ్చినప్పుడు కొంత బాధ కలిగినప్పటికీ వాటితో కలిసి ఉన్న ఘట్టాలన్నీ ఆనందరకమైన సమయాలే. వేర్వేరు గెరిల్లా జోన్లలోని పిఎల్‌జిఎ గెరిల్లాలు కోళ్ళు, నెమళ్ళు, చిలుకలు, కోతిపిల్లలు, మైనా పిట్టలు, బెట్టుడతలు, తాబేళ్ళు, కుక్కలు, కొండగొర్రె పిల్లలు, కుందేళ్ళు, "చెట్టుకుక్క"లు మొదలైన రకరకాల జంతువుల్ని కొద్ది రోజులే గావచ్చు పెంచిన సందర్భాలు ఉన్నాయి. కొన్ని చోట్ల గాడిదలు, గుర్రాలు కూడా కొద్ది కాలం పాటు మాతో ఉన్నవి. వాటిని బరువులు మోయడానికి ఉపయోగించే వాళ్ళం. ఎప్పుడైనా రోగులువాటిపై కూచుని ప్రయాణించేవారు. కానీ అది చాలా అరుదే. గాడిదలకూ, గుర్రాలకూ మేం ఎప్పుడూ పేర్లు పెట్టే వాళ్ళం.

ఒకసారి ఒక యువ గెరిల్లా మజాక్ చేస్తూ ఒక గాడిదకు జార్జిబుష్ పేరు పెట్టబోయాడు. వెంటనే అక్కడున్న వాళ్ళందరూ మన "మంచి", "నిస్వార్థమైన", "కష్టజీవి" అయిన గాడిదను ఆ ప్రపంచ నెంబర్ వన్ దుర్మార్గుడితో పోలుస్తావా అని వాదిస్తూ అతని మీద పడినంత పనిచేసారు. ఇది గుర్తొచ్చినప్పుడల్లా ఇప్పటికీ నాలో నేనే నవ్వుకుంటూ ఉంటాను.

ఒక గుర్రం పిల్ల పుట్టినప్పుడు అక్కడే ఉండే అదృష్టం, దానికి పేరు పెట్టే గౌరవం నాకు దక్కాయి. నిజం చెప్పాలంటే, అప్పుడే పుట్టి ముద్దొస్తున్న ఆ బుజ్జి గుర్రంపిల్లకు "బుధ్‌రాం" అనో, "ముంగల్" అనో మన కామ్రేడ్లు పేరు పెట్టబోవడం నాకు అస్సలుకు మింగుడు పడలేదు. దాంతో నేను గబగబా జోక్యం చేసుకుని ఆ గుర్రం పిల్ల మాకు అంత "ఖుషీ" (ఆనందాన్ని) తెస్తోంది కనుక దానికి "ఖుషీ" అనే పేరును పెట్టేసాను. ఆ పేరే దానికి ఖాయం అయిపోవడం నాకు ఎంతో "ఖుషీ" నిచ్చింది.

మేం వేర్వేరు సమయాల్లో పెంచిన వేర్వేరు జంతువుల గురించి గెరిల్లా జోన్లలో ఎన్నో కథలు మౌఖికంగా ప్రచారమవుతూ ఉంటాయి. నేను చాలా సార్లు ఎంతోమందితో పంచుకున్న కథ ఒక కుక్కది. అదసలు మా దళాన్ని విడిచపెట్టలేదంటే, ఆఖరికి మేం పడవలో నదిని దాటుతుంటే కూడా అది వదలకుండా నదిలో దూకేసి, పడవ దగ్గరకి ఈదుకుంటూ వచ్చేసింది. అప్పటివరకూ కఠినంగా వ్యవహరిస్తూ దాన్ని తరిమేయాలని చూసినకమాండర్ ఇక ఆగలేకపోయాడు. దాన్ని పడవలోకి ఎక్కించాడు.

ఆ కుక్క తీవ్రమైన నిర్బంధపు రోజుల్లో మాతో ఉండింది. అదసలు మొరగకుండా, మా ఆచూకీని ఏమాత్రం పట్టివ్వకుండా ఉండడం చూసి మాకు ఆశ్చర్యం వేసేది. మాది మైదాన ప్రాంత దళం కనుక మేం రోజంతా మెదలకుండా, చప్పుడు చేయకుండా ఉండాల్సి వచ్చేది. అది కూడా మాతో పాటే అలాగే ఉండేది. అది మాత ఉండాలని కోరుకున్నదంతే. నీళ్ళ కోసం, తిండి కోసం వెళితే కూడా ఎన్‌కౌంటర్లు జరుగుతున్న రోజులు. అయినా గానీ ఏ తిండి దొరికినా ముందుగా దానికి పెట్టి గానీ తినేవాళ్ళం కాదు. దాన్ని వెళ్ళగొట్టడం మా తరం కాలేదు. గెరిల్లాలకు కూడా దానితో అనుబంధం పెరిగింది. అది అంత క్రమశిక్షణగా, ప్రేమాస్పదంగా ఉండేది మరి. ఆఖరికి మేం దాన్ని "మోసం" చేసి ఒక గ్రామంలో వదిలేసాం. దాన్ని మేం వదిలేసం అని అర్థమయ్యాక ఆ అర్ధరాత్రి పూట అది చేసిన హృదయవిదారకమైన రోదన ఎందో దూరం మాకు వినిపిస్తూనే ఉండింది. మేం ఎప్పరం దాన్ని మర్చిపోలేక పోయాం.

రాజ్యం మమ్మల్ని విడదీసింది.

గడ్చిరోలి వంటి కొన్ని ప్రదేశాల్లో అడవిలో తల్లి లేకుండా కనిపించిన పసికూనల్ని కామ్రేడ్స్ గ్రామస్తుల ద్వారా అటువంటి జంతువుల్ని పెంచే సంస్థలకు పంపించిన సందర్భాలు కూడా ఉన్నాయి.

అయితే మేం పెంచిన అన్ని రకాల జంతువుల్లో, నాకు గమనించే అవకాశం కలిగిన, పైన నేను పేర్కొన్న జంతువులన్నిటిలోకీ బెట్టుడుత బెట్టుడుతే. ఏ జంతువూ మిగతా వేటి కంటే ఎక్కువా కాదు, తక్కువా కాదు అనేది మనకు తెలిసిందే. అలాగే అన్ని పసికూనలూ ముద్దుగానే ఉంటాయి. కానీ మనసులను దోచేసే అల్లరీ, అత్యంత అమాయకంగా ఉండే ముఖం, కళ్ళూ ఉండడం వల్ల బెట్టుడతకు ఆ ప్రత్యేకత చేకూరింది. వార్తాపత్రికలైతే దానికి "రాక్‌స్టార్" అని నామకరణం చేసేసి ఉండేవి కావచ్చు. దాని అభిమాన సంఘంలో అత్యంత పై స్థాయి నాయకుల దగ్గర నుండి అప్పుడే భర్తీ అయిన పిఎల్‌జిఎ సభ్యుల వరకూ, ఆ

మధ్యలో ఉన్నవారందరూ కూడా ఏ మినహాయింపు లేకుండా సభ్యులే. కొన్నేండ్ల క్రితం ఒక టిల్లూని పెంచినప్పుడూ అంతే. ఇప్పుడీ గిల్లూ విషయంలోనూ అంతే. అది మాపై కరుణించి మాతో కలిసి ఉన్న కాలం అంతటా అది విప్లవకారుల ముద్దులమూటే, వారి కంటిపాపే.

గిల్లూ "ఆకాశం నుండి మా ఒడిలోకి దూకిన"ప్పటికి దాని వయసు కొద్ది రోజులే. అందుకని తల్లి లేకుండా అది తనతిండిని స్వంతంగా సంపాదించుకోలేని స్థితి. దాంతో అడవిలో తినదగిన ప్రతి పువ్వూ, కాయా, కసరూ, ఆకూ దేన్నీ వదిలిపెట్టకుండా గెరిల్లాలు భక్తిగా వాటిని గిల్లూ దగ్గరకు తీసుకుపోసాగారు. అది తన ముందుకాళ్ళతో వాటిని పట్టుకుని చాప్లిన్‌లా ఎంత త్వరత్వరగా వాటిని మునిపళ్ళతో కొరికి తినే ప్రయత్నం చేసేదంటే చూసే వాళ్ళందరికీ నవ్వు వచ్చేది. దాంతో దానికి ఏమైనా తినడానికి పట్టుకు రావడం, అది గబగబా తినే ప్రయత్నం చేస్తుంటే చూసి నవ్వడం గెరిల్లాలకు అత్యంత వినోదకరమైన ఆటగా మారింది.

అయితే గిల్లూని మాత్రం నేను భలే మెచ్చుకున్నాను. అది మనుషులలాగ ఎక్కువ తినేది కాదు. తనకు అవసరమైనంతే తినేసి ఆడుకోడానికి పరుగెట్టేది. ఈ జంతు సహజాతాన్ని అది వదులుకోనందుకు నేను సంతోషించాను. అపేకుంటేనా, అది తినడాన్ని చూసి పరవశించే గెరిల్లాలు దాన్ని ఎప్పుడో ఊబకాయంగా తయారు చేసేసేవారే. "సిటీ ఆఫ్ జాయ్" పుస్తకంలో రచయిత కోల్‌కతా మురికివాడల్లో స్త్రీలు పసిపాపలకు స్నానం చేయించే దృశ్యాన్ని చేసి ముగ్ధుడుకావడం గురించి ఆజాద్ దాదా ఎప్పుడో చెప్పింది గుర్తొచ్చింది నాకు. మాకు కూడా బెట్టుడత తినే దృశ్యాన్ని చూస్తుంటే అలాంటి అనుభూతే ఏదోకలుగుతుండేది.

అది తన ముందరి కాళ్ళతో ముఖం తుడుచుకోవడం, నాలుకతో తనను తాను శుభ్రం చేసుకోవడం, చెట్టు బెరళ్ళనూ, తన తోకనూ మునిపళ్ళతో కొరకడం, తల్లి వెనకాల పాకే పిల్లల్లా మావెనకాలే నేల మీద గెంతుకుంటూ రావడం, చెట్టు మీదకూ, కిందకూ ఉరుకులు పెట్టడం, కొమ్మల మీద వేగంగా పరుగులు పెట్టడం, వెనక్కాళ్ళతో కొమ్మల నుండి తలకిందులుగా వేలాడ్డం, సన్నటి కొమ్మల మీద లేదా బట్టలు ఆరేసే తాళ్ళ మీదా కరుచుకుని నడవడం, ఆ ఎగరడం, ఆ దూకడం... ఓహ్! ప్రతి ఒక్కటీ ఒక అద్భుతమే, ఒక కనువిందే.

చిన్న వయసు గెరిల్లాలు ఒకరి చేతినొకరు పొడుచుకుంటూ, "ఏయ్, చూడు, బెట్టుడుత పిల్ల ఎలా చేస్తోందో..." అంటూ దాని అల్లరి చేష్టలకు మురిసిపోయేవారు.

ఇదంతా చూస్తూ ఒక రోజు అజితతో అన్నాను "ఏమనిపిస్తోంది నీకు, ఆ తల్లిలేని పసికూనకు మనం అవసరమయ్యామా లేక పిల్లలు లేని తల్లులమైన మనకు మన మధ్య ఒక పసిపాప అవసరమైందంటావా?"

అజిత చిన్నగా నవ్వింది. చెట్టుమీదరకు ఎగబాకుతున్న బెట్టుడతను కంటి నిండుగా చూస్తున్న ఆమె చూపు మాత్రం ఇటు తిరగలేదు.

అజిత పార్టీ టెక్నికల్ (టిడి) చెందిన కామ్రేడ్. ఈ విభాగం తుపాకులు, విస్ఫోటన పదార్థాల తయారీ, తుపాకుల రిపేర్ పనులు చేస్తుంటుంది. ఆమె సీనియర్ కామ్రేడ్. ఆమె పట్టణాలలో టిడి పని చేస్తుండేది. అయితే కోల్‌కతాలో, ముంబైలో అనేకమంది టిడికి చెందిన ముఖ్యమైన నాయకత్వం, కార్యకర్తలు అరెస్టయ్యాక ఆమెను ఇటీవలే డికెకి మార్చారు. అరెస్టుల సమయంలో ఆమె వేరే గెరిల్లా జోన్‌లో తుపాకుల తయారీ ప్రాజెక్టులో ఉడడం వల్ల అదృష్టవశాత్తూ తప్పించుకుంది. ఆమె ఇక్కడ ఒక రిపేరింగ్ క్యాంపు నడపడానికి వచ్చింది. ఇతర పనులతో పాటు ఆ పనినీ ఇక్కడ పెట్టుకున్నాం.

అందరం క్లాసులు, రిపేరుక్యాంపు, ఇతర పనులతో ఊపిరి సలపకుండా ఉన్నాం. అయితే, ఈ ఏడాది రోగాలపరంగా చాలా దుర్భరంగా మారి మా పనులను ఓ మేరకు అడ్డుకుంటోంది. తమలో పిసరంత ఓపిక మిగిలి ఉన్నా కూడా గెరిల్లాలెవరూ విశ్రాంతి తీసుకోకుండా పని చేస్తున్నారు. ఈ కమ్యూనిస్టు చేవే లేకుండిరటే మా క్యాంపు విఫలమే అయి ఉండేది.

మా కొస్తున్న రోగాల లక్షణాలు కొన్ని మాకసలు అర్థమే కావడం లేదు. పాలకుల అత్యంత హానికరమైన పర్యావరణ విధానాల వల్ల జరుగుతున్నవాతావరణ మార్పులతో దీనికి ఖచ్చితమైన సంబంధం ఉందని అజితకు నమ్మకం. చైతు డికెలోని సీనియర్ కామ్రేడ్స్‌లో ఒకరు. సీనియర్ గెరిల్లా డాక్టరు కూడా. ఆయన కూడా గత అనేక సంవత్సరాలుగా మాకొస్తున్న మలేరియా లక్షణాలు తీవ్రంగా మార్పు చెందాయంటున్నాడు. కానీ ఆయనకు కూడా కారణాల అంతు దొరకడం లేదు.

కశ్మీరులో వరదల వల్ల పెద్దెత్తున వినాశనం కొనసాగుతోంది. అజిత రేడియో వార్తలు వింటూ కోపంగా తలను విదిలిస్తూ

ఉండడం నా కంట బడుతూనే ఉండేది రోజూ. గతంలో భారీ వర్షాల్లో ముంబై మునిగిపోవడం, పోయినేడాది ఉత్తరాఖండ్, ఇప్పుడు కశ్మీర్ అకస్మాత్తు వరదలు, పోయినేడాది బస్తర్‌లో ఊహకందనంత భారీగా కురిసిన వర్షాలు, ఈ ఏడు మేం చూస్తున్న వింతైన రోగ లక్షణాలు - అన్నీ ఒకే కారణం నుండి అంటే పర్యావరణ విధ్వంసం నుండి వస్తున్నాయనీ, అన్నిటికీ శత్రువులు ఒకరే అనీ అంటే "సామ్రాజ్యవాదులూ, వారి తైనాతీ భారత పాలకులు" అనీ తనకు కరతలామలకం అయిన అనేకవివరాలను అందిస్తూ అజిత చైతును ఒప్పించడానికి ప్రయత్నం చేస్తూ ఉండేది.

రోగులు చాలా మందే ఉంటున్నారు. అయితే అందరూ ఒకేసారి పడడం లేదు. సోనీ, చైతు, ఇతర గెరిల్లా డాక్టర్లు అదనంగా పని చేస్తున్నారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్ దుష్ఫలితాల్లో ఒకటేంటంటే మా రోగులకు మేం కొంత అదనపు పౌష్టికాహారం ఇవ్వలేకపోవడం. అయితే మాకు ఉన్నంతలో మేం వారికే మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఏ అదనపు ఆహారం దొరికినా వారికే ఇచ్చేవాళ్ళం.

ఒకరోజు నేను రీతాని ఎప్పట్లాగే కలవడానికి వెళ్ళాను. రీతా ఏరియా కమిటీ సభ్యురాలు. చాలా రోజుల్నుండి మలేరియాతో బాధపడుతోంది. ఆ సమయంలో ఆమె బెట్టుడతకు ఏదో తినిపిస్తోంది.

"అబ్బా రీతా, నువ్వు నీకిచ్చే "పేషెంటు స్పెషల్ ఫుడ్"ని ఈ బెట్టుడతకు తినిపించకూడదు. నువ్వు తిని తొందరగా నయం కావాలి. అది తినగల్గినదానికంటే ఎక్కువ అడవి పండ్లు, పూలు దానికి మనవాళ్ళు తినిపిస్తున్నారు లెద్దూ" అని గదమాయించబోయాను.

"మీనా దీదీ చూడు దీనికి ఎంత అసహనమో. ఒకవైపేమో ముందు కాళ్ళతో కిస్మిస్‌లు పట్టుకుని తినడానికి ప్రయత్నిస్తోంది. మళ్ళీ వాటిలోనే ఒక దాంతో నా చేతుల్లో ఉన్న ఇంకొన్ని కిస్మిస్‌లు అందుకవాలని చూస్తోంది. ఈ ప్రయత్నంలో ఇంకా ఎక్కువ కిస్మిస్‌లను కింద

పారేసుకుంటోంది" అంటూ గలగలా నవ్వింది రీతా. ఆమె అసలు నేను అన్న మాటల్ని విన్నట్టే తోచలేదు.

చాలా రోజుల తర్వాత రీతా నవ్వులో, గొంతులో అంత ఆనందాన్ని చూస్తున్నాను. నాకు కూడా ఆ "అసహనపు" బెట్టుడుతను చూస్తుంటే నవ్వాగలేదు. అది తినే వేగం కంటే కిస్మిస్‌లను కింద పడేసే వేగం ఎక్కువగా ఉన్నది.

"అయితే ఇప్పుడిక బెట్టుడత గారు పేషంట్లకు డాక్టరుగా, మానసిక రోగ నిపుణులుగా కూడా పని చేస్తున్నారన్న మాట" కింద పడ్డున్న కిస్మిస్‌లను అరచేతిలో పెట్టుకుని తిరిగి బెట్టుడతకు అందిస్తూ అజిత కూడా మాట కలిపింది.

కానీ గిల్లాకి కడుపు నిండిపోయింది. కళ్ళు మూసి తెరిచేంతలోగానే అది చెట్టు మీదకి ఎగబాకి కొమ్మల మీంచి పరుగులు పెట్టసాగింది.

"అయితే బెట్టుడతను పేషెంట్ల దగ్గరే ఉంచేసి, దాన్ని కూడా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కి వ్యతిరేకంగా దాని పోరాటం దాన్ని తనదైన శైలిలో చేయనియ్యడం ఉత్తమమేమో కదూ" అన్నాను నేను ఆప్యాయంగా రీతా భుజం చుట్టూ చేతులు వేస్తూ.

"ఇంగో" రీతా కళ్ళు మెరిసాయి.

"అజితాదీదీ, తెలుసా నిన్న ఇది భలే అల్లరి చేసింది. తల కిందులుగా వేల్లాడుతూ నన్నే చూస్తుండింది తెలుసా. ఇది అచ్చం మనం చేసినట్టే తాడు మీద "మంకీ వాక్" చేస్తున్నది. మీనా దీదీ తెలుసా"

"తెలుసా"లు అలా కొనసాగుతూనే ఉండినాయి.

క్లాసుల కోసం తయారు కావల్సిన అవసరం లేనప్పుడు నేను తీరిక సమయాల్లో రిపేర్ వర్క్‌షాపుకు పోతుండేదాన్ని. ఒకరోజు అలా వెళ్లినప్పుడు అక్కడ గెరిల్లాలు అడవిలో దొరికే వాటి నుండే అజిత నేర్పిన పద్ధతుల్లో ఒక ముడి కాగితాన్ని తయారు చేసి ఎండకు ఆరబెట్టడం నా కళ్ళబడింది. అది ఒక నోట్‌బుక్కు అట్టలా అదే రంగూ, రూపంతోఉన్నది.

నేను తినే ఇటు వచ్చిను. రిపేరు క్యాంపు వాళ్ళంతా అప్పుడే తినడానికి వెళుతున్నారు. నేనూ అజితతో పాటు తిరిగి కిచెన్‌క వెళ్ళాను కబుర్లు చెప్పవచ్చని.

"మనం ఇలాంటి కాగితాల్ని పెద్దెత్తున చేయవచ్చని నీకనిపిస్తున్నదా, ఈ దశలో?" నా గొంతులో అపనమ్మకం దాగలేదు.

"ఉహు, ఇప్పుడే కాదు, కానీ భవిష్యత్తులో మనం విముక్తి ప్రాంతాలు ఏర్పర్చినప్పుడు సాధ్యం కావచ్చేమో. ఇప్పుడు నేను కేవలం మార్కెటు సరుకులు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం విషయంలో మన యువ కామ్రేడ్ల ఊహా శక్తిని కొంత వెలికి తీద్దామని మాత్రమే ప్రయత్నిస్తున్నాను. తెలుసా, వాళ్ళకి ఎల్లుండి సబ్బు తయారీ కూడా నేర్పిస్తానని వాగ్దానం చేసాను. అబ్బా, మీనా, మనం ఈ మూడవ దశను ఓడించాలే గానీ చూస్తుండు మనం ఏమేం తయారు చేయగల్గుతామో"

పొంగి పొర్లే అజిత ఉత్సాహం కొంత నాకూ అంటుకుంది.

"ఊ, జనతన సర్కార్లను కలుపుకొచ్చుకుంటే సబ్బు తయారీ కొంత ఊపందుకోవచ్చేమో" ఇందాకటి నా అపనమ్మకాన్ని ఒకింత వదిలించుకుంటూ అన్నాను.

కొత్తగా వచ్చిన పట్టణ కామ్రేడ్స్ ఎప్పుడూ ఆహ్వానించదగిన కొన్ని అద్భుతమైన తాజా ఆలోచనల్ని పట్టుకొస్తారు. కానీ వారు ఇక్కడి మా వాస్తవాల్ని తాముగా పరిశీలించి తమ "కలల్ని" వాటికి "అనుగుణంగా" మార్చుకునే వరకూ కొంత వేచి చూడడం నాకలవాటు.

"ఆ, బహుశా, నాయకత్వం దాన్ని కొంత ప్రోత్సహిస్తే జరగచ్చు. మన జంగల్ సురక్ష విభాగాలు మాత్రం అడవిని కాపాడ్డంలో మెచ్చుకోదగిన కృషి చేస్తున్నాయని నాకనిపిస్తుంది"

"కానీ అదేమాత్రం సరిపోదు. మా చిన్నప్పుడు మేం పెరిగిన అడవి ఇంకా ఎంతో దట్టంగా ఉండేది. ఇప్పుడదంతా చాలా తరిగిపోయింది"

"నిజమే. ఒక రోజేమైందో తెలుసా, మన విజ్జాల్ లేడూ, ఒక చెట్టును కొట్టబోతున్నాడు. సగంలోకే అనుకో, అలా చేస్తే అది మళ్ళీ పెరుగుతుంది కదా. దాన్ని కొట్టడం అంత అవసరమా, అతన్ని నేను ఆపాలా అని ఇంకా ఆలోచిస్తూనే ఉన్నాను, ఇంతలోనే మన పాలి ఏమందో తెలుసా, ఇగో, అనవసరంగా చెట్లు కొట్టకు, జనతన సర్కారు వాళ్ళు నిన్ను జైల్లో పడేస్తారు అంది. అద జోకులాగానూ అన్నది, చిన్నగా అతనికి హెచ్చరికలాగానూ అన్నది. అది విన్నాక నాకెందుకో భలే నమ్మకం అనిపించిందనుకో"

ఇద్దరం నవ్వుకున్నాం. అజిత ప్లేటు కడుక్కుని వచ్చాక తన డేరాకా నా డేరాకా అన్నట్టుగా దారి చీలే దగ్గర ఆగాం.

"అవునూ, నువ్వు రోజూ అన్నం తిన్నాక సిఎన్నెం వాళ్ళ డేరా వైపు వెళుతుంటావు కదా?" అడిగింది అజిత కుతూహలంగా.

"అర్రెరే, అజితా, దా, నేను రోజూ అటెందుకు వెళతానో చూద్దువు" అని తన చేయి పట్టుకుని అటు దారి తీసాను.

డివిజన్ సిఎన్నెం కామ్రేడ్స్ పార్టీ పదవ వార్షికోత్సవాల సభల కోసం పాటలు, డాన్సులూ, నాటకాలూ తయారు చేస్తూ తీరిక లేకుండా ఉన్నారు. అయినా ఎప్పట్లాగే వాళ్ళు విశాలంగా నవ్వుతూ మమ్మల్ని కూచోమనీ, తమ ప్రాక్టీసు చూడమనీ ఆహ్వానించారు.

అజిత నన్ను కళ్ళతోనే ప్రశ్నిస్తోంది. నేనూ "ఒక్క క్షణం" అన్నట్టు సైగ చేసి డేరా వెనకవైపుకు వెళ్లి సొరకాయ బుర్రతో తయారు చేసిన నీళ్ళ సీసాను తీసుకుని వచ్చాను. అజితకిచ్చి,

"తాగి చూడు" అన్నాను.

అజిత ఒక్క గుక్క తాగిందో లేదో, ఆమె కళ్ళు విశాల మయ్యాయి.

"అబ్బో, ఇంత తాజాదనాన్నిచ్చే, చల్లటి నీళ్ళు నా జీవితంలో ఎప్పుడూ తాగలేదు" అంటూ ఇంకొన్ని నీళ్ళు గటగటా తాగింది. "అరే, దీన్ని పట్టుకోవడానికి పేనిన తాడు కూడా ప్లాస్టిక్‌ది కాదు!" అని అరిచినంత పని చేసింది.

"దాన్ని పావురు తీగెతో పేనారు. అడవిలో నాకు ఎంతో ఇష్టమైన తీగె అది. దాని ఆకులు దాని జీవితంలోని ప్రతి దశలోనూ ఎన్ని రంగుల్ని మారుస్తాయనుకున్నావు. లేత గులాబి రంగు నుండి మొదలై ముదురు ఆకుపచ్చగా మారే దాకా అవి రంగుల్ని మారుస్తాయి. అది చూడ్డానికి అందంగా ఉండడమే కాదు, ఎంతో ఉపయోగపడ్తుంది కూడా. ఆ తీగెలోని ప్రతి భాగాన్నీ మా ఆదివాసులం ఉపయోగిస్తాం. పావురు లేని మా జీవితాన్ని నాకు ఊహించడం కష్టం" అన్నాను.

అజిత వెంటనే డివిజన్ సిఎన్నెం ఇన్‌ఛార్జ్ ఊర్మిల కేసి తిరిగింది. ఊర్మిళ రానుతో కలిసి ఏవో కొత్త బాణీలను చూస్తోంది.

"ఊర్మిళా, ఇగో మీరు మీ పనిలో భాగంగా ఈ సొరకాయ బుర్ర నీళ్ళ సీసాల్ని ప్రచారం చేయాల్సిందే" అన్నది.

ఊర్మిళ తలూపుతూ, "కనీసం మేమైతే రెండేళ్ళుగా దీన్ని వాడుతున్నాం. ప్రయత్నం చేస్తే..."

అప్పుడే ఆరుబయట కొన్ని నృత్యాల్ని ప్రాక్టీసు చేయడానికి గుమిగూడిన సిపిన్నెం కామ్రేడ్స్ దగ్గర గలాభాలాగ వినిపించడంతో ఊర్మిళ వాక్యం పూర్తి కాలేదు.

"హు, నాకు తెలుసు ఆ గలాభా ఏంటో. ఈ బెట్టుడుతకి సిపిన్నెం డాన్సులంటే తెగ ఇష్టం. సరిగ్గా సమయానికి వచ్చేస్తుంది ఎక్కడున్నా. చూడు రానూ! ఈ బెట్టుడుత వూకే మన దృష్టిని మరలుస్తోంది" ఊర్మిళ ఉత్తుత్తి ఫిర్యాదు చేసింది. నిజానికి అప్పటికే ఆమె దృష్టంతా సిపిన్నెం వాళ్ళ కాళ్ళలో దూరిపోతూ పరుగులు పెడ్తున్న గిల్లూ మీదే కేంద్రీకరించి ఉన్నది.

"భలే ఉన్నావు ఊర్మిళా దీదీ. పాపం బెట్టుడుతనేం అనకు, అది మన దృష్టిని మరల్చిందెక్కడ, మనమే దాన్ని చూడ్డంతోనే మన దృష్టంతా దానివైపు మరల్చేస్తుంటేనూ" రానూ తక్షణం దాన్ని వెనకేసుకొచ్చాడు.

అందరం పకపకా నవ్వాం.

"అజిత దీదీ, నేను ఏదో ఒకరోజు మన బెట్టుడుత మీద పాట రాసేసేలా ఉన్నాను. కోయలో దాన్ని "వెర్చే" అంటాం కదా. అంటే దాని పేరు చే పేరుతో ప్రాస కలుస్తోంది చూసావా. మన బెట్టుడుత కూడా చే గువారా అంత సాహసంగా, అంత కనువిందుగా, అంత జనరంజకంగా, అంత ధైర్యంగా ఉంటుంది గమనించావా?" రానూ నోట్లోంచి మాటలు ఉత్సాహంగా దొర్లుకొస్తున్నాయి. ఒకసారి గడ్చిరోలి డివిజనుకి వెళ్ళినప్పుడు రానూకి అక్కడి సంతలో ఒక చేగువారా టీ-షర్టు దొరికింది. తరచూ దాన్ని తొడుక్కుని తిరగడం అతనికిష్టం.

"ఓ. భలే ఉంటుంది. నేనూ ఓటు వేస్తాను. కానీ మన విప్లవమే మన బెట్టుడత లాంటి కనువిందైన జంతువులనూ, మన భూమినీ ఎలా పరిరక్షిస్తుందో కూడా అందులో రాయాలి నువ్వు. కేవలం బెట్టుడత గురించే రాస్తే ఈ క్యాంపులో ఉన్నంతకాలం మాత్రమే కామ్రేడ్స్ పెదాల మీద ఆడుతుందా పాట. తర్వాత ఆయుస్సు ఖతం" అన్నాను. నేను ఉత్సాహపడ్డాను. ఎందుకంటే రానూ చాలా మంచి సాహిత్యంతో పాటలు కడుతుంటాడు. అతను తన పాటలకు ఆ "అదనపు అందాన్ని" సమకూర్చడంలో దిట్ట.

"నిజంగా నేను నమ్మలేకపోతున్నాను. ఈ బెట్టుడత ఇంకా ఎన్ని అవతారాలెత్తు తుందేం? ఇప్పుడిక ఇది మన సాంస్కృతిక రంగానికి రాయడానికి వస్తువుల్ని సప్లై చేయడం మొదలుపెట్టిందా ఏంటి?" అజిత అసూయను నటిస్తూ అన్నది.

"అబ్బో, నా దృష్టిలో అయితే లెక్కలేనన్ని అవతారాలే దీనివి. ఇప్పుడిక రిపేర్ క్యాంపు కామ్రేడ్సే మిగిలినట్టున్నారు. వాళ్ళు కూడా దీనికి ఏదో ఒక పాత్రను అప్పగించేస్తే సరి" ఊర్మిళ అజితను ఆటపట్టించింది.

"ఊ, అయితే ఆలోచించాల్సిందే" అంది అజిత. కానీ ఆమె కళ్ళు ఇంకా ఆ సొరకాయ బుర్ర నీళ్ళ సీసానీ,దానికి ఒక డిజైనులా అల్లిన తీగెనూ అభినందనపూర్వకంగా చూస్తూనే ఉన్నాయి. నాకు తెలిసి గిల్లూ ఆమె దృష్టిని మరల్చలేకపోయిన ఏకైక సందర్భం ఇదే.

కొంత మంది కామ్రడ్స్, ముఖ్యంగా మహిళా కామ్రేడ్స్, గిల్లూని చూసుకోవడంలో, దానికి సమయానికి తినిపించడంలో ముందుండేవారు. అది కూడా వారిని చూడ్డంతోనే ప్రతిస్పందించేది. కానీ దాని "జిగిరీ దోస్తు" మాత్రం డివిజన్ కమిటీ సెక్రటరీ నీలేష్. ఆయన ఎక్కడున్నా, ఏం చేస్తున్నా ఒక కన్ను బెట్టుడుత మీద వేసే ఉంచేవాడు. ప్రతి రోజూ క్లాసుకెళ్లే ముందు ఉదయం దానికి తినిపించడం, దాంతో ఆడుకోవడం, దాన్ని కాసేపు భుజం మీద ఎక్కించుకుని తిప్పడం ఆయనకు దినచర్యగా మారింది.

అన్నిటికంటే చెప్పుకోవల్సిన విషయం ఏంటంటే రెండేళ్ళ క్రితం ఒక బెట్టుడత వల్లే ఆయన చావుకు దగ్గరగా వెళ్ళి వచ్చాడు. ఆయనో ఆదివాసీ సీనియర్ నాకుడు. అడవి జంతువుల్ని వేటాడితినడం మాకు సాధారణ విషయమే. అయితే మా వేట వల్ల ప్రకృతిలో జంతువుల సమతులనం దెబ్బ తినకుండా చూసుకుంటుటూ ఉంటాం. మేం లెక్క తప్పినా పార్టీ గుర్తు చేస్తూ ఉంటుంది. ఆ రోజు ఆయన ఒక బెట్టుడుతను వేటాడతూ పెద్ద చెట్టు ఎక్కి అంతెత్తు నుండి జారిపడ్డాడు. ఆయన సాధారణంగా చాలా చురుకైన మనిషి కానీ ఆ రోజు అలా జరిగిపోయింది. ఆయన స్పృహ తప్పిపోయాడు. చనిపోతాడేమోనని చాలా భయపడ్డాం. ఎలాగో తేరుకున్నాడు. చాలా రోజులు కట్టె సహాయంతో నడిచాడప్పుడు.

ఆయన ఆ "తల్లి లేని పిల్ల" తో అంత మృదువుగా, మార్దవంగా వ్యవహరిస్తుంటే చూడ్డం నిజంగా కదిలించేలా ఉండేది. అయితే ఆయన్ను ఆటపట్టించడానికి మాకాయన కల్పించిన అవకాశాన్ని మేమెందుకు వదులుకుంటాం?

"అబ్బా నీలేష్, ఒక బెట్టుడుత వల్ల నువ్వు ప్రాణాలు పోగొట్టుకున్నంత పని అయ్యిందికదా, ఇప్పుడు దాన్నంతగా ఎందుకు ముద్దు చేస్తావు?" అడిగాం.

ఆయన కొద్దిగా సిగ్గు పడుతూ నవ్వేసాడు. ఏమనకుండా తాను పదిహేను నిమిషాల దూరం నుండి బెట్టుడత కోసమే ప్రత్యేకంగా కోసుకొచ్చిన ఎరుపు-దానిమ్మ రంగు పూలను దానికి తినిపించడంలో మునిగిపోయాడు. అవి బెట్టుడత గారి మెనూలో గులాబ్‌జామ్ లాంటివి మరి.

గిల్లూని వెచ్చగా దాని "స్లీపింగ్ బ్యాగు"లో పడుకోబెట్టి, ఆ సంచీని తన పక్కనే పెట్టుకుని పడుకునేవాడాయన రోజూ.

బెట్టుడుత ఎంతో ఆనందాన్నే కాదు, కొంత దిగులును కూడా పంచేది, మా పెంపకం వల్ల అది తన జంతు సహజాతాల్ని మర్చిపోతుందేమో అని అజిత దిగులుపడేది. అది స్వంతంగా కూడా కొంత తిండిని వెతుక్కుంటోందా లేక మేం పెట్టిన తిండిని మాత్రమే తింటోందా అని అజిత గమనిస్తూ ఉండేది. నాకున్న మరో దిగులును నేను అజితతో పంచుకున్నాను - భవిష్యత్తులో మిగతా బెట్టుడుతలు దాన్ని తమలో కలుపుకుంటాయో లేక బైటి జంతువుగా చూస్తాయో?!

ఒక క్యాంపును రెండుగా చీల్చిన ఒక విషయం బెట్టుడుతను రోజూ సాయంత్రం చెట్టు మీంచి దింపి సంచీలో పడుకోబెట్టే దినచర్య. నేనూ, అజిత, ఇంకొంతమందిమి దాన్ని వదిలేయమనీ, చెట్టుమీద తన ఇంటిని అది తయారు చేసుకుంటుందనీ, అక్కడే దాన్ని పడుకోనివ్వాలనీ వాదించే వాళ్ళం. కొంతమంది కామ్రేడ్స్ అదింకా "పసికూన" అంటూ మాతో విభేదించేవారు.

నాకు తెలిసిన అన్ని భాషల్లో బెట్టుడుతను "తిరగబడమనీ", కిందికి

రావద్దనీ విన్నవించుకునేదాన్ని. కానీ దాని "పెంపుడు తల్లులు" (ఆడా, మగా) చాలా సేపు బుజ్జగించే సమయం పెరిగేదంతే. కానీ అది దిగడం మాత్రం మానలేదు. ఒకరోజు అది తన "ఆకుల ఇల్లు" ని కట్టుకోవడం అనేది ఒక్కటే నాకు కలిగిన ఊరట. హమ్మయ్య! ఈ సహజాతాన్ని అది మర్చిపోలేదు.

"మనం ఈ "హింస"ను ఎలా అనుమతిస్తాం? మనం అందరి స్వేచ్ఛ కోసం పోరాడుతాం. మరి ఇప్పుడు దీని స్వేచ్ఛను ఎందుకు అరికడుతున్నాం?" విద్యార్థి రంగం నుండి వచ్చి ప్రజా గెరిల్లాగా మారిన సుధీర్ ఆవేశంగా వాదించాడు. చెట్లు ఎక్కేసి బెట్టుడుతను బుజ్జగించగల నిపుణులకు అదేం పట్టలేదు.

"దీదీ, నువ్వ దీని గురించి రాసి తీరాలి. మనం దాన్ని చెట్లలోనే నిద్రపోనివ్వాలి." వీడ్కోలు లాల్‌సలాం సందర్భంగా ఏ నూటొకటోసారో నాకు చెప్పడం మరవలేదు సుధీర్. అతను వేరే జోనుకు బదిలీ అయి వెళిపోతున్నాడు. మాకు ఎప్పటికో గానీ కలవడు. అంత ఉద్వేగపూరితమైన వీడ్కోలు సందర్భంగా కూడా అతను బెట్టుడుతను మర్చిపోకపోవడం నన్ను కదిలించింది.

ఏ ఆదివాసీ కంటే, ఏ మావోయిస్టు కంటే మన బెట్టుడుత తక్కువ స్వేచ్ఛా పిపాసి కాదనీ, అది మనల్ని నిరాశపర్చదనీ అతనికి నేను హామీ ఇచ్చాను. అది నిరాశపర్చలేదు కూడా.

సుధీర్ వెళిపోయిన కొద్దిరోజులకు ఒక ఆహ్లాదకరమైన సాయం సమయాన ఎంత బుజ్జగించినప్పటికీ అది కిందికి దిగిరాలేదు. అది తాను అల్లుకున్న "ఆకుల ఇంట్లో" వెచ్చగా బజ్జుంది. అది తన ఇంటిని ఎంత నిపుణంగా ఎటువంటి సందులూ లేకుండా బంతిలా అల్లిందంటే వానల్లో కూడా అది తడవదు.

దాని "స్వాతంత్ర్య దినం" తారీకుని నేను మనసులోనే నమోదు చేసి ఉంచుకున్నాను. ఏదో ఒక రోజున సుధీర్‌కి ఉత్తరంలో రాయాలిగా.

గిల్లూ రోజూ ఉదయాన్నే తన ఇంటి నుండి కిందికి రాగానే గెరిల్లాలు దానికి తన అల్పాహారాన్ని తినిపించేవారు. అది వారితో పాటు గ్రౌండుకు వెళ్ళేది. వారు పరుగెడుతుంటే వారితోపాటు పరుగులు పెట్టేది. వాళ్ళు పి.టి. చేస్తుంటే వారితో పాటు గెంతేది, ఎగిరేది.

వాళ్ళు అల్పాహారం కోసమో, అన్నం తినడం కోసమో కిచన్‌కి వెళితే అది కూడా వెళ్ళి, వాళ్లు తినిపించే వాటిని గబగబా మునిపళ్ళతో కొరికి తినేది. సాయంత్రం వరకూ తనకు నచ్చినవాళ్ళతో ఆటలాడేది లేదా దానితో ఆడాలనుకునేవాళ్ళతో ఆడుకునేది. మధ్యనున్న సమయమంతా కొమ్మల మీంచి పరుగులు పెడుతూ తన ఆహారాన్ని అది వెతుక్కునేది. ఆ తర్వాత తన జీవపరమైన గడియారాన్ని అనుసరించి అది తన ఆకుల ఇంట్లోకి దూరేది. చాలా బాగా గడిపిన తన రోజును, గెరిల్లాలకు తన ఉనికి ద్వారా కలిగిన ఆనందాన్నీ తలచుకుంటూ అప్పుడిక అది సంతృప్తిగా నిద్రపోయేది.

ఒక విడిపోయే సమయం వచ్చింది. వేర్వేరు బ్యాచులు వేర్వేరు దిక్కులకు పోతున్నాయి. మేమంతా వీడ్కోలు లాల్‌సలాం కోసం వరుసలుగా నిలుచున్నాం. డివిజనల్ కమిటీ వారు అజితను ఒక వీడ్కోలు ఉపన్యాసం ఇవ్వమని కోరారు. ఎందుకంటే ఇది ఆమె డికెలో నడిపిన మొదటి రిపేరు క్యాంపు. ఆమే ఇక్కడున్న అందరికంటే సీనియర్ కూడా.

సాధారణంగా అటువంటి సందర్భాల్లో సీనియర్ కామ్రేడ్స్ క్యాంపును సమర్థవంతంగా నడపినందుకూ, అలర్ట్‌గా ఉంటూ కార్యక్రమాల్ని విజయవంతం చేసినందుకూ పిఎల్‌జిఏ కామ్రేడ్స్ కృషిని మెచ్చుకుంటూ మాట్లాడ్తారు. ఒకోసారి వారు శత్రు దాడులను గురించి వివరించి రాజకీయంగా ప్రేరణనందిస్తూ మాట్లాడేవారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ అంత భీకరంగా నేపథ్యంలో కనిపిస్తుండగా అజిత అదే విషయంపై మాట్లాడుతుంది అని ఊహించాను.

అజిత, ఊహించనట్టుగానే క్యాంపును విజయవంతం చేయడంలో పిఎల్‌జిఏ పాత్రను అభినందించింది. తర్వాత పూర్తిగా కొత్త విషయాన్ని ఎత్తుకుంది. బూర్జువా పత్రికలు కూడా మావోయిస్టు ప్రాంతాల్లోనే అడవి నాశనం కాకుండా మిగిలిందనీ, కొన్ని చోట్ల కొంత పెరుగుతోంది కూడాననీ రాస్తున్నాయన్నది. విప్లవానికీ, మన భూమిని పరిరక్షించుకోవడానికీ ఉన్న సంబంధాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలంటే మార్క్సిస్టు దృక్పథం అవసరమౌతుందనీ, అది ఇప్పుడు కేవలం మన పార్టీ మాత్రమే మన దేశంలో అందించే స్థితిలో ఉందనీ నొక్కి వక్కాణించింది. చెట్లను ఎంత తక్కువ వీలైతే అంత తక్కువగా కొట్టాలనీ, ప్లాస్టిక్, మార్కెటు నుండి తెచ్చే సరుకుల బదులుగా స్థానిక వస్తువులను వీలైనంత ఎక్కువగా వాడాలని కోరింది. పిఎల్‌జిఏ కామ్రేడ్స్ జనతన సర్కార్లు చేస్తున్న కృషిని పరిపూర్ణం, బలోపేతం చేస్తూ వారిని మరింతగా ఆ దిశలో కృషి చేసేలా ప్రోత్సహించాలని చెప్పింది. మన మొత్తం కృషి అవసరమైనంతగా లేదనేది అందరికీ తెలిసిందే కనుక ఇది అవసరం అన్నది.

నేనింకా ఆమె "అసలు" ఉపన్యాసం కోసం ఎదురుచూస్తూనే ఉన్నాను. కానీ ఆమె అంతే మాట్లాడింది.

"ఇంక్విలాబ్ జిందాబాద్", "సిపిఐ (మావోయిస్టు) జిందాబాద్", "సామ్రాజ్యవాదం, అన్ని రకాల ప్రతీఘాతుకత్వం నశించాలి" వంటి కొన్ని నినాదాల్ని ఇచ్చింది. మేమూ మరికొన్ని నినాదాలతో ప్రతిస్పందించాం. వీడ్కోళ్ళ సందర్భంగా సాధారణంగా జరిగేటట్లే వాతావరణం విప్లవోత్సాహంతో నిండిపోయింది. అప్పటికే పార్టీ పదవ వార్షికోత్సవాల పండుగ వాతావరణం ఉండనే ఉంది.

ఇటువంటి వీడ్కోలు ఉపన్యాసాలు వినడం నాకు అలవాటు లేదు కనుక నేను కొంత ఆశ్చర్యపోయాను. అందరం వరసల నుండి బైటికొచ్చాక నేను అజిత దగ్గరకెళ్ళాను. మా బ్యాచు వెళ్ళడానికి ఇంకా ఒక గంట సమయం ఉండింది. అందుకని నా అలవాటు ప్రకారం అజిత బ్యాచు దగ్గర తారట్లాడాను. వెళిపోయే కామ్రేడ్స్ కళ్ళకు కనిపించనంత దూరం వెళ్ళే వరకూ నేను వారికేసే చూస్తూ అలాగే నుంచుంటూ ఉంటాను.

ఒక అజితను అడగకుండా ఉండలేకపోయాను. "నువ్వు నన్ను ఆశ్చర్యపరిచావు. నువ్వు పర్యావరణ విషయాల పట్ల ఎంతో ఆసక్తితో లోతుగా ఆలోచిస్తావు అని నాకు తెలుసు. కానీ నువ్వు కనీసం ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశను ప్రస్తావించను కూడా లేదు. అదెంత పెద్ద దాడో చెప్పలేదు. కనీసం రాబోయే సమరాల్లో ఆయుధాలను సరైన స్థితిలో ఉంచుకోవడం ఎంత ముఖ్యమో కూడా చెప్పలేదు, అది నీ రంగం కూడా కదా?!"

"మనం ఎప్పుడూ ఈ మూడవ దశ గురించి మాట్లాడుకుంటూ మనల్ని మనం దానికి సన్నద్ధం చేసుకుంటూనే ఉన్నాం. ముఖ్యమైన రాజకీయ అంశాలన్నిటినీ బోల్షవీకరణలో భాగంగా మీరు క్లాసుల్లో

చెప్పే ఉన్నారు. అవన్నీ నా ఉపన్యాసంలో మళ్ళీ చెప్పి అవసరమైనదానికంటే ఎక్కువ డోస్ ఇచ్చినట్టుగా చేసి ఉండాల్సింది నేను అని నువ్వు నిఃఎంగా అనుకుంటున్నావా చెప్పు?"

"కాదనుకో..." నసిగాను.

"నేను మాట్లాడింది కూడా ఆ దాగితో పూర్తిగా సంబంధం లేనిదేమీ కాదు మీనా. నిజానికి అది దానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో ఒక తప్పనిసరి భాగం కూడా. తెలుసా. మోడీ ప్రభుత్వం పుణ్యమా అని మనకు దొరికే బ్రహ్మాండమైన అవకాశాల్లో ఇద కూడా ఒక ముఖ్యమైన అంశమే. ఎందుకంటే కార్పొరేషన్ల కోసం అన్ని రకాల పర్యావరణ అడ్డంకులనూ ఈ ప్రభుత్వం అత్యంత వేగంగా ఎత్తేస్తూ పోతోంది. పర్యావరణ విషయాల గురించి అక్కర ఉన్న ఏ మనిషైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలబడక తప్పని స్థితి. మనం పర్యావరణ అనుకూల విధానాల్ని చైతన్యయుతంగా అమలు చేస్తే, మన ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాకి సంబంధించిన ప్రచారంలో అది నిరంతరం ఉండేలా చేయగలిగితే "బైట" ఉన్న ప్రజల్లో ఒక పెద్ద సెక్షన్‌ను మనం మన జనతన సర్కార్ల వైపుకు ఆకర్షించగల్గుతాం"

"అలా అనుకుంటే, పర్యావరణ సమస్యల మీద ఉద్యమాల్ని నిర్మించడం మరింత అవసరం అవ్వదా?"

"తప్పనిసరిగా. మనం చేయాల్సిన అత్యంత ముఖ్యమైన విషయం ఇదే. అయితే ఈ రెండు రకాల కృషి చేయాలన్నా కూడా మన పార్టీ, పిఎల్‌జిఎ కార్యకర్తలు, ఎక్కడ పని చేస్తున్నా గానీ మన పార్టీ సభ్యులందరూ పర్యావరణ సమస్యల ప్రాధాన్యతను ఆకళింపు చేసుకోవడం చాలా అవసరం సుమా".

నేనింకా అజిత చెప్పిన విషయాల్నే మననం చేసుకుంటూ ఉన్నాను, ఇంతలో ఊర్మిళ చేతిలో సొరకాయ బుర్రతో చేసిన నీళ్ళ సీసాతో పరుగెత్తుకుంటూ వచ్చింది. ఇంకా రొప్పుతూనే ఆమె దాన్ని అజిత చేతుల్లో పెట్టింది. అజిత ఆ బహుమానంతో పరమానందం పొందిందని వేరే చెప్పనవసరం లేదు.

"అజితా దీదీ, నేనసలు మర్చిపోదును. రానూ నీకోసం ఇది ప్రత్యేకంగా తయారు చేసి ఇచ్చాడు. పదవ వార్షికోత్సవాల సందర్భంగా మేంద ఏర్పాటు చేస్తున్న పెద్ద మీటింగుకు నువ్వు కూడా వస్తే ఎంతో బాగుండేదని మేమంతా అనుకున్నాం. డివిజనులోని సిపిన్నెం టీములన్నీ వస్తాయి. కళ్లతో చూసి తీరాల్సిందే" అంది ఊర్మిల బతిమాలుతున్నట్టుగా.

"నాకూ రావాలనే ఉందిరా. కానీ చెప్పాను కదా. అవే తారీకుల్లో మరింత ముఖ్యమైన పని పెట్టుకున్నాం. ఏదైనా చిన్న మీటింగుకైనా హాజరయ్యేలా ప్లాన్ చేయమని మన వాళ్ళను అడుగుతాను. సరేనా?" అజిత అనునయంగా చెప్పింది.

ఊర్మిళ సంతోషంగా తూపి వెనుతిరిగింది. ఇంతలోనే హఠాత్తుగా ఏదో మర్చిపోయినట్టుగా, "యాయో!" (వామ్మో) అని అరిచింది.

"దీదీ! మన బెట్టుడుత ఇవ్వాళ ఉదయం మనల్ని వదిలేసి వెళిపోయింది. నేను నీకోసం చూసాను, కానీ నువ్వు స్నానానికి వెళ్ళిపోయావు" అజితకు బెట్టుడుతంటే ఎంత ఇష్టమో ఊర్మిళకు తెలుసు.

"అరే, అలాగా? దానికి నేను వీడ్కోలు కూడా చెప్పలేదు కదా..." పశ్చాత్తాపపడింది అజిత.

"అయ్యో అజితా, నేను నీకు ముందే చెప్పి ఉండాల్సింది. మన కామ్రేడ్స్ దాన్ని కొంత దూరంలో అడవిలో వదిలేసి రావాలని నిర్ణయించారు. అదిప్పుడు పెద్దగా పెరిగింది, తెలుసు కదా" మన్నింపును కోరాను.

"మిగతా బెట్టుడుతలు తమ సమూహంలోకి దాన్ని కలుపుకుంటే బాగుండు, దానికో తోడు కూడా దొరికితే బాగుండు" ఎంతో మృదువుగా అన్నది అజిత.

"నేనూ అదే అనుకున్నాను" కొంచెం బెంగగా అన్నాను.

"మీనా, మన కామ్రేడ్స్ బెట్టుడుతను ఎంత ప్రేమతో పెంచారంటే పుస్తకాలతోనో, గణాంకాలతోనో కాకుండా నా మనసుతో నేను ఒక సహజాతంలా గ్రహిస్తూ వచ్చిన ఒక విషయాన్ని అది మరోసారి రుజువు చేసినట్టనిపించింది. మన భూమి, మన జీవ జంతుజాలం, మన చెట్టూ చేమా, ప్రకృతి కన్న బిడ్డలన్నీ కూడా ఆదివాసుల చేతుల్లో, మరీ ముఖ్యంగా మహిళల చేతుల్లో అత్యంత భద్రంగా ఉంటాయనిపిస్తుంది నాకు. నిజం" అంది అజిత.

"ఆదివాసులా? లేక మావోయిస్టులుగా మారిన ఆదివాసులా? ఎందుకంటే మానవులందరూ ఒకప్పుడు ఆదివాసులే కదా, ఆ తర్వాతే వర్గసమాజం, సామ్రాజ్యవాదం..." వాక్యం పూర్తి చేయకుండా వదిలేసాను.

"అబ్బా, రాజకీయ గురువువి అనిపించుకుంటున్నావు కదా, మామూలు మాటలప్పుడు కూడానా?" అజిత నిరసన వ్యక్తం చేసింది.

నేను ఏ మాత్రం వెనక్కి తగ్గే సూచనలు కనబడనివ్వలేదు. ఆమెను చిన్నగా సవాలు చేసే ఒక చిరునవ్వుతో ఆమెకేసే తదేకంగా చూస్తూ నిలబడ్డాను. ఊర్మిళ మా ఇద్దరినీ మార్చి మార్చి విచిత్రంగా చూస్తోంది.

"సరే, ఇతా అంటాను పోనీ, ఆదివాసులూ, మావోయిస్టులూ, వాళ్లు ఏ ప్రాంతానికైనా చెందనీ, ఒప్పుకుంటావా తల్లీ?"

అందులో ఒప్పుకోకపోవడానికి నాకేం కనిపించలేదు. ఎలాగూ అదిప్పుడు సర్వరోగ నివారిణిని తయారు చేయడానికి ఉపయోగపడే ఒక ఫార్ములా లాగ మారిపోయే ఉన్నది కదా.

నవ్వుతూ అజితను వీడ్కోలుగా కౌగలించుకున్నాను.

గిల్లూ మమ్మల్ని వదిలిపోయి నెలలు గడుస్తున్నాయి. గతంలోని టిట్టూలనూ, ఖుషీలను ఇప్పటి వరకూ కలవలేకపోయినట్టే గిల్లూని కూడ నేను మళ్ళీ కలవక పోవచ్చుననే విషయం నాకు తెలుసు. కానీ ఇప్పటికీ పైన చెట్ల కొమ్మల్లో ఒక అలికిడి వినడంలోనే నా కళ్ళు అప్రయత్నంగానే పైకి చూసు సారిస్తాయి. గిల్లూ నా/మా జీవితంలో విడదీయరాని విధంగా భాగమైపోయిన రోజుల్లో దాని

ఉల్లాసకరమైన ఉనికిని నాకు తెలియజేస్తుండిన ఆ మృదువైన అలికిడి!

ఇప్పుడిక గిల్లూ కూడా మా పిఎల్‌జిఎ అంత సహజంగానూ అడవితల్లి ఒడిలో ఒదిగిపోయింది.

కానీ నా మనసు లోలోతల్లో నాకు తెలుసు, గిల్లూ, మేమూ విడిపోలేదనీ, నిజానికి ఇంకా దగ్గరయ్యామనీ.

ఒకే తల్లి రొమ్ము నుండి పాలు కుడిచే కూనల్లా, ఒకే ఊయలలో దగ్గరగా కరుచుకుని పడుకున్న పసిపాపల్లా, ఒకరు లేకుండా ఒకరు ఉండలేని తోబుట్టువుల్లా...

"తల్లిలేని తనాన్ని" అన్నడూ అనుభవించాల్సిన అవసరం లేని, భవిష్యత్తులోనూ ఆ అవసరం ఎన్నడూ రాని పిల్లల్లా...

కథ

స్మృతి

- జి. వెంకటకృష్ణ

అక్కడున్నాడా... నిజంగానా... ఎప్పుడొచ్చాడో... అయితే వెళ్ళాల... చూసి తీరాలి... ఎంత గొప్ప అవకాశం, ఎన్నాళ్ల కల... పదా పదా... నడూ నడూ... పరిగెత్తూ... ఆయన్ను చూస్తున్నాననుకుందేనే ఎంత శక్తి వచ్చేసిందో గదా... గాల్లో తేలినట్లు... ఆగమేఘాల మీద వాలిపోయి చేరిపోయినట్లు... నిజంగానేగాల్లో తేలిపోతున్నానా... ఆశ్చర్యం! చుట్టూ పొగమేఘాలు ఆవరించినట్లు రంగు రంగుల ఆకారాల్లో అతని బొమ్మలు... అతని బొమ్మలు... అతని కాన్వాస్ మీద నుండీ లేచొచ్చి చుట్టూ నర్తిస్తున్న అతని బొమ్మల్లోని పాత్రలు... ఎగిరే రెక్కలున్నగుర్రం... విల్లంబులు చేతిలో పట్టుకొని కేరింతల తుళ్ళింతలతో అల్లరిగా ఎగురుతున్న పిల్లలూ... ఎన్నో భావాలు పలికించే ముఖాకృతులూ... చిత్రవిచిత్రమైన ఆకారాలు... రంగురంగుల సీతాకోక చిలుకలు... చెప్పనలవి కాని అందాలతో హొయలొలికే కాంతలూ... అన్నీ రంగుల ప్రపంచంలో సంచరించే ఆకృతులన్నీ... అన్నింటినీ మించి, అతనికి ఘనకీర్తిని తెచ్చిన "రెక్కలున్న నేలలు"... చుట్టూ తేలియాడుతూన్న దృశ్యం... అన్నీ పరుగులు పెడుతూ... ఇంకెంత దూరం... దగ్గరే అన్నారే... ఎదురుగా రంగు రంగు మేఘాలు కదలాడుతున్న ఆ షెడ్‌లో నేనా... అందులో దిగుంటాడంటావా... ఉండకూడదా... చాలా సాదాసీదాగా ఉంటాడట కదా... కాళ్ళకు చెప్పుడు కూడా వేసుకోడట... అక్కడే అందులోనే ఉండుంటాడు... పదా... పదా వచ్చేసాం... జీవిత సాఫల్యాన్ని చేరుకోవడానికి... కళాకారుడంటే అతను కదా... అతని మునివేళ్ళను చూడాలని ఎంత కోరికా... ఆ మునివేళ్ళు ఎంత అద్భుతమైనవో కదా... కుంచెను పట్టే... కాన్విస్‌ను తాకే ఆ చేతులు ఎంత మహాద్భుతమైనవో కదా... వాటిని చూడాలనీ... తపించి తపించి ఎన్ని పరుగులు పెట్టానూ... ఇన్నాళ్ళకు చేరువైందీ లక్ష్యం... తొయ్ తలుపులు... నాతో వస్తూన్న అతని సమస్త చిత్ర ప్రపంచం... ఏదీ ఎక్కడా అన్నీ ఎక్కడికెళ్ళి పోయాయి అరే అడుగులు జారి పోతున్నాయే... అరే ఎక్కడికో పడిపోతున్నానే... పట్టుకుందామంటే ఏదీ అందకుండా

ఉందే... ఏయ్... ఏదీ రంగుల ప్రపంచం... ఎక్కడా రంగుల మనిషి... ఆనందప్రసాద్... ఆ.ప్ర... ఏయ్... య్

కాళ్ళూ చేతులూ గాల్లో ఆడిస్తూ... దబ్బున పడ్డాడు మనోహర్.

"అబ్బా..."

"ఏయ్ మనూ... ఏయ్ మనూ... అట్లా పడ్డావేంది స్వామీ..." హారిక అరుపులకు కలలో నుండీ మెలుకువలోకొచ్చాడు. బెడ్ అంచు నేల మీద ఉన్నాడు. పక్కటెముకలు నొప్పి... తలంతా గజిబిజి.

"కలలో కూడా కనిపించదా ఆయనా... ఆ షెడ్... ఉమామహేశ్వర్ వాళ్ళ కార్‌షెడ్ కాదూ... ఆ షెడ్లో ఎందుకున్నట్లబ్బా... ఈ కలకు ఏమిటీ లింక్" అనుకున్నాడు.

"ఏమి స్వామీ పక్కటెముకలు భద్రమేనా, లేదా నన్నేమన్నా ఇంచమంటావా... ఏ బొమ్మ కలలోకొచ్చి నిన్ను దొర్లించినదీ..."

నాటకీయంగా అడుగుతోంది హారిక.

అయోమయంగా మొఖం పెట్టి ఇంకా కలలోనే ఉన్నట్లు భ్రమింపజేయాలని

"ఎవ్వతెవీవు భీత హరిణేక్షణా..." అనే పద్యమెత్తుకున్నాడు.

"ప్రవరా... ఓ మనోహరా... నే దిండాధినిని, దిండుతో నాలుగు మొత్తు దానిని..." అని దిండుతో నాలుగు బాదింది.

"నీ సరదాకూలా... ఆగూ... ఆ.ప్ర కలో కన్పించిందే నీతో తన్నులు తింటున్నందుకు ఆనందంగా ఉందు..." బెడ్ మీదెక్కి విషాదంగా చెంపకు చేయి ఆన్చుకొన్నాడు.

"ఓహో ఇది ఆనందప్రసాద్ స్ట్రోకా... ఆ తోపుకు పడ్డావా. ఆ బ్రష్ స్ట్రోక్ చాలా స్ట్రాంగప్పా..." ఈ సరదాకు మనోహర్ మూడ్ మారదని అర్థమై...

"కన్పించలేదా... సరే ఏం చేద్దాం... నెక్స్ట్ టైం బెస్టాఫ్ లక్. పడుకో రెండు గంటలైంది. నిన్నట్నుంచీ హైదరాబాద్‌లో చూసొచ్చిన ఆ పెయింటింగ్ గురించి మాట్లాడుతున్నావే. ఆ ప్రభావమే ఈ కల పడుకో".

"చాలా దిగులుగుంది హారికా. ఇక కన్పించడు కదా అనుకునేకి మనసు రావట్లేదు."

"ఆనందప్రసాద్. ఆ.ప్ర. ఒక వ్యవస్థ. అది తన్ను తాను రద్దు చేసుకుంటున్నానని, ప్రకటించుకున్నాక, ఇక ఎవరైనా చేసేదేముంది. తన్నుతాను రద్దు చేసుకోవడమనే ట్రెండ్ ఆయన పెయింటింగ్స్‌లో ముందు నుంచీ ఉన్నదే కదా. దాని గురించి దిగులెందుకు. దీన్ని నువ్వు జీర్ణించుకోవాల్సిందే మనోహర్"

ఆ మాటలేమీ మనోహర్ మీద పని చేయలా. అది గ్రహించి, ఇది ఆ.ప్ర (ఆనందప్రసాద్) మాయ, ఆ.ప్ర లేనితనాన్ని ఎప్పుడు జీర్ణించుకుంటాడో అనుకుంటూ నిద్రలోకి జారుకుంది హారిక.

"ఇంకేం నిద్రొస్తుంది" అనుకుంటూ స్టడీరూంలోకి వెళ్ళాడు మనోహర్.

ఆనందప్రసాద్ (ఆ.ప్ర) పేరెన్నికగన్న చిత్రకళాకారుడు. ఆ.ప్ర పేరుతో తెలుగు నేలంతా, తెలుగువాళ్ళున్న చోటంతా ప్రసిద్ధుడు. ఎక్కడో పురాతన తెలుగు స్థావరమైన హోసూరు మారుమూల పల్లెల్లో ఉన్నాయి అతని మూలాలు. అతని పూర్వీకులు చాలా మంది గొప్ప కళాకారులుగా సంగీతకారులుగా ప్రసిద్ధులు. అతని తండ్రి ఆనంద శంకర స్వామి ప్రసిద్ధ సంగీతకారుడు, అతని తల్లి కుసుమ పరాగవతి పెద్ద నాట్యగత్తె. రక్తంలో తెలుగు సంస్కృతీ మెరుపులు నింపుకొని ఆ.ప్ర మద్రాసును వదిలేసి తెలుగునేల మూలమూలలా తిరిగాడు. కొన కొనకూ వ్యాపించాడు. వ్యక్తిగా ప్రారంభమైన తన కళతో అన్ని వర్గాల వారినీ అకట్టుకొన్న అస్తిత్వ శక్తిగా ఎదిగాడు. తన బొమ్మల్లో ఎంత

సరళత్వముంటుందో అంతే సంక్లిష్టతా ఉంటుంది. అందుకే పెద్దలు మొదలుకొని పిల్లల దాకా అతని అభిమానులే. పిల్లల కోసమే ఆ.ప్ర ఎన్నో బొమ్మల్ని గీసాడు. మనోహర్ తరం పిల్లలందరూ తెలుగు నేల మీద ఆ.ప్ర రంగుల ప్రపంచంలో తేలియాడిన వాళ్ళే.

మనోహర్ వాళ్ళ నాన్న వెంకటనాగన్న, స్కూల్ టీచర్. ఆయన అభిరుచి మేరకు సాహిత్య పత్రికలు తెప్పించుకునేవాడు. అందులో వచ్చే బొమ్మల్లో ఆ.ప్ర బొమ్మల్ని మనోహర్ అనుకరించేవాడు. కొడుకులోని ఆసక్తిని తండ్రి ప్రోత్సహిస్తూ ఎక్కడెక్కడి నుండో ఆ.ప్ర కార్టూన్లూ, రంగుల చిత్రాలూ తెప్పించేవాడు. అట్లా మనోహర్ అంతరంగిక ప్రపంచంలో ఆ.ప్ర ఒక భాగమయ్యాడు. ఆ.ప్ర బొమ్మలూ, ఆ రంగుల కలయికా ఎంతో వివాదాస్పదమైనవి. వాటిమీద ఎంతో చర్చ నడిచేది. ఆయన బొమ్మలన్నీ కొన్ని భాగాల కలయికగా ఉండేవి. ఆయా భాగాల కలయిక మీద ఎంతో వివాదముండేది. కలపకూడని భాగాలను కలుపుతాడనీ, ఒక ప్రాంతాని కెప్పుడూ ఒక రంగే వాడుతాడనీ, ఇంకొన్ని భాగాల్ని ఎప్పుడూ ఎడారి రంగులనే అద్దుతాడనీ, నెర్రులు చీలిన ఆ భూశకలాలు అతనెప్పుడూ ప్రశ్నించవా అని తలపండిన మేధావులు అడుగుతుండేవారు.

ప్రవహించే నీటిజాడలను ఆధిపత్యానికి చిహ్నాలుగా వాడటం, కాలువల వెంట పారే నీళ్ళకు వాడే రంగులు, ఆక్రమణ చిహ్నాలుగా చూపడం, ఆ నీళ్ళ వల్ల మొలకెత్తే సంపదను అహంకారంగా చూపడం వంటి వాటిపై ఇంకో వైపు నుండీ పెద్ద పెద్ద దుమారాలు రేగేవి. ప్రతి వివాదానికీ ఆ.ప్ర మౌనంగా ఉండేవాడు. తనవని తాను చేసుకుపోయేవాడు. ప్రతిసారీ ఔత్సాహికుల్లో తన రంగుల ప్రపంచంతో, తన చిత్రిక విన్యాసంతో కొత్త కలలూ, కొత్త ఆశలూ రేకెత్తించేవాడు.

మనోహర్ బాల్యంలో ఈ చర్చలేవీ తెలియకుండానే ఆ.ప్ర మత్తులో పడ్డాడు. వాళ్ళ నాన్నకు కొంతవరకూ తెలుసు గానీ, ప్రజల్లో గొప్ప ఆశనూ, ఆసక్తినీ రేకెత్తిస్తున్న చిత్రాల మీద కొడుకు ఇష్టపడటం చాలా మంచి పరిణామం అనుకొని, దాన్నో మురిపెంగా భావించి కొడుకులో ఆ ఆసక్తి చివరి దాకా కొనసాగాలని కోరుకున్నాడు. అందుకే ఏమీ తెలియని వయసులో కొడుకుని చెక్కిలిపై ముద్దు పెట్టుకొని,

"ఆ.ప్ర లాగా గొప్పవాడివి కావాలి నాన్నా" అని నూరి పోసాడు.

ఆ తడి ఆరని ముద్దు మనోహర్ మనసులో శాశ్వతంగా నిలిచిపోయింది.

1970ల్లో మనోహర్‌కు ఆరేండ్ల వయసులో ఆ.ప్రను చూపిద్దామని వెంకటనాగన్న కొడుకును తీసుకొని విజయవాడ వెళ్ళాడు. అప్పుడు ఆ.ప్ర గీసిన "ఉపాధుల హద్దులు" అనే బొమ్మ మీద పెద్ద వివాదం నడుస్తుండేది. ఆయన బొమ్మల్లో సహజంగానే ఉండే భౌగోళికత వివాదాస్పదంగా తయారై పెద్ద ఉద్యమం నడిచింది. ఆ గలాటాల్లో కొడుకుతో పాటు కెనక్కు రావడానికి వెంకటనాగన్న చాలా ఇబ్బందులు పడ్డాడు. ఆ.ప్ర నేమో విజయవాడను వదలి హైదరాబాద్‌కు వెళ్ళిపోయారు. అట్లా మొదటి ప్రయత్నమే, ఎంతో మురిపెంగా గొప్ప కళాకారుణ్ణి చూపిద్దామనుకున్న ప్రయత్నం నెరవేరలేదు. అప్పటి నుండీ మనోహర్‌కు ఆ.ప్ర ను చూడాలనే ఆకాంక్ష, అది నెరవేరని నిరాశా వెంటాడాయి.

అయితే ఆ.ప్ర మాత్రం "1970" ల వివాదం తర్వాత ముప్పై ఏళ్ళ పాటు హైదరాబాద్‌తో పాటు ఎదిగాడు. అంతర్జాతీయంగా తన కళాసృజనతో పేరు తెచ్చుకున్నాడు. ఆ కాలంలో ఆయన తీసిన ఆర్ట్ డాక్యుమెంటరీలైతేనేమి, గీసిన బొమ్మలైతేనేమి తెలుగు సంస్కృతిని విశ్వవిపణిలో నిలబెట్టాయి. అతని అంతర్జాతీయ విమర్శకులు ఆ బొమ్మల్ని చూసి, ఆంధ్రులకు వ్యాపారాత్మకత ఎక్కువ అదే ఈ బొమ్మల్లో కన్పిస్తుందనేవారు. అతని అంతర్గత విమర్శకులేమో, హైదరాబాద్ మూలమూలల్నీ తన బొమ్మల్లో అలంకరించినంతగా తెలంగాణా పల్లె సొగసుల్ని పట్టుకోలేదని విమర్శించేవాళ్ళు. దాన్ని ప్రశంసగా తీసుకొని ఆ.ప్ర "హైదరాబాద్ నా ఆత్మ" అనేవాడు. అందుకే మనోహర్ తరం ఆ.ప్ర అభిమానులకు హైదరాబాద్ చిత్రాలంటే వేలంవెర్రిగా ఉండేది.

"ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్ ఎంత కళాత్మకంగా ఉందో మనోహర్. నువ్వూ నీ గురువులా ప్రొఫెషనల్ పెయింటర్ అయ్యుంటే నీది కూడా ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేదాన్ని" హారిక అంటోంది.

"వ్యంగ్యమేమీ వద్దు గానీ, ఈ బొమ్మ చూడు. "వంటావార్పూ" దీని టైటిల్. కట్టెలు మండుతున్నాయి ఒక యాంగిల్లో, పాత్రలు మనుషుల్లా లేరూ. బ్యాక్‌గ్రౌండంతా రోడ్డే కదా, ఆ బ్రష్ విన్యాసంలో ఏదో మెలిక ఉంది. లేదంటావా. ఏం చెబుతున్నాడూ. మంటలై మండుతూ బాటన పడతారు. భుక్తికీ, విముక్తికీ అనా"

"నిజమే మనూ, ఈయన చిత్రాల్లో స్త్రీలు విచిత్రంగా కన్పిస్తారు. చీరల కోసం, ఆచ్ఛాదన కోసం, ఆయనెంచుకునే రంగుల ఉద్దేశ్యం భారతీయత కోసమేనా లేదా దాన్ని తిరస్కరించడం కోసమా. అవయవాల అమరికలో ఒక డిస్‌ప్లేస్‌మెంట్ చూపిస్తాడే, ఏం కారణమో కదా"

"లేదు హారికా ఈయన మొదట్నుంచీ తన బొమ్మల్లో విడివిడి తనాన్ని సింబలైజ్ చేస్తున్నాడు. అది అస్తిత్వవాదానికి గుర్తు అనుకుంటా. ఆ.ప్రలో కొట్టొచ్చినట్టు కనిపించేది ఆ లక్షణమే. ఈ బొమ్మ చూడూ. "డైవర్సిటీ-యునైట్" థీమాటిక్ పెయింటింగ్. ఇదే ఆ.ప్ర సారం"

"నిజంగా ఈరోజు ఇక్కడికొస్తాడంటావా. ఈ నిర్వాహకుల ప్రకటన చూసి, పనులన్నీ వదిలేసి పరిగెత్తుకొచ్చామే".

"నిరాశపడొద్దు హారికా, నన్నూ నిరాశపర్చొద్దు. తప్పక వస్తాడు. నువ్వూ నేనూ అతన్ని చూస్తాం. ఇక ఇదే ఆఖరి ఎగ్జిబిషన్ ఇక నా పెయింటింగ్స్‌ను, నన్ను రద్దు చేసుకుంటానని ప్రకటించాడు గదా. ఆఖరి దర్శనం తప్పక దొరుకుతుంది"

అట్లాంటి ఆశతో మనోహర్ ఎంతగానో ఎదురుచూసాడు గానీ, సాయంత్రానికి, "ఆ.ప్ర రావట్లేదనీ, అత్యవసర పని మీద అమెరికా వెళ్ళాడనీ, క్షమించమని" ప్రకటించారు నిర్వాహకులు.

"విఫలమైన నా కోరికలా..." విషాదభరితమైన పాట ఒకటి వినిపిస్తోంది. హారికా మనోహర్ ఆర్ట్ ఎగ్జిబిషన్ నుంచి నేరుగా ఊరికి బయలుదేరారు. కారు ఎక్కినప్పటి నుండీ కలత నిద్రపోతున్నాడు మనోహర్. అతని నుదిటిపై చేయి వేసింది హారిక. ఉలిక్కిపడ్డాడు . బలహీనంగా.

"వచ్చేసామా" అన్నాడు

"దగ్గర్లో ఉన్నాం. కృష్ణను దాటేసాం. తుంగభద్ర రాబోతోంది".

"ఎక్కడన్నా ఆపమంటావా. కాస్త కాఫీ తాగుదువు. మీ ఆర్‌ఎమ్‌యు మార్క్ కాఫీ. కాఫీ నురగ మీద కాఫీపొడి చల్లుకొని తాగేది" కాస్త నవ్విద్దామని ప్రయత్నించింది. మామూలుగా ఉంటే, ఇంత ప్రయాణంలో మనోహర్ ఎన్ని పంచ్ డైలాగ్స్ పేల్చి ఉండేవాడో.

"లేదులే. నీకు తాగాలనుంటే ఆపుకో" తుంచేసాడు.

"ఇలా అయితే ఎలా. పెళ్ళైనప్పటినుంచీ ఇదే వరుస. చూడాలనుకోవడం. చూళ్ళేకపోవడం. ఈ ద్వంద్వం గురించి కాస్త తాత్త్వికంగా ఆలోచించు. చూళ్ళేకపోవడంలో చూద్దం ఉంది గదా. ఆ సమయమంతా ఆ ధ్యానంలో, ఆరాధనలో ఉండటమే గదా. అసలు ఆ.ప్ర తనను తాను రద్దు చేసుకుంటుంటే, ఇట్లా మీరు ఆయన అభిమానులు ఆయన అస్తిత్వాన్ని నిలపాలనుకోవడంలో అర్థం ఉందా"

నిజమేననిపించింది మనోహర్‌కు. తాము చూడాలను కుంటున్న ఆ.ప్ర భౌతికత, కాలవశాన తనంతకు తాన్నే రద్దయి పోతుంటే, అ వేదన ఏమిటీ? అసలెందుకూ? అనుకొని తేలిక పడ్డాడు.

మనోహర్ ఆ.ప్రను ఆరాధించినంత మాత్రాన, తానేమీ పెయింటర్ కాలేదు. బాల్యం నుంచీ ఆ బొమ్మలు చూస్తూ, చూస్తూ లైబ్రరీకి అలవాటు పడ్డాడు. లైబ్రరీకి వెళ్తూ వెళ్తూ పుస్తకాలకు అలవాటు పడ్డాడు. చదువులో మెరుగుపడి సైన్స్‌లో యూనివర్సిటీ ప్రొఫెసర్ అయ్యాడు. ఆనందప్రసాద్ ప్రభావంతో బొమ్మలపై అనురక్తి ఏర్పడి ఇప్పటికీ తాను కళాకారుడిగా మిగిలాడు. ఆ.ప్రను చూద్దం మనోహర్‌కు జీవన్మరణ సమస్య కాకున్నా ఆ.ప్ర గురించి ఆలోచించడం, అతని చిత్రాలు రగిల్చే మంటల్లో కాలడం ఒక వ్యసనంగా మారింది. అది తెరలు తెరలుగా అతన్ని సోకుతూ ఉంటుంది.

"జగదీశ్వర్‌కు తెలిసిన ఒక ఎడిటర్‌కు ఆ.ప్ర గారు బాగా దగ్గరట. ఆయన ద్వారా ఈ సారి ఫ్లైస్, టైమ్ ఫిక్స్ చేస్తా. దిగులు పడొద్దు" అన్నాడు ఉమామహేశ్వర్.

"నేనూ నువ్వూ జగదీశ్వర్‌తో పాటు శేషశాయి గారిని కలిసి వెళ్దాం. శేషశాయి గారికి పర్సనల్ పని ఉందట, కలిసి తీరుతారట. ఆయన్తో పాటు మనం. ఈ సారికి తిరుగులేదు" అని భరోసా ఇచ్చాడు.

ఆ.ప్ర వైభవం తెలుగు నేల మీద కన్నా, తెలుగువాళ్లు జీవిస్తున్న అమెరికాలోనే ఎక్కువ. ఈ మధ్య కొన్నేళ్ళుగా అక్కడే ఉంటున్నాడు. తన "విభజనరేఖలు" చిత్రం దుమారం రేపిన తర్వాత, భౌగోళిక విభజన కన్నా, భౌతిక అంతరాలకు, అగాథాలకూ ముందస్తు సూచిగా, ఆయన "బొమ్మ" రూపు కట్టాక, తెలుగునేల అల్లకల్లోలమై పోయింది. ఆ తర్వాత ఒక ప్రముఖ సాహిత్య పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ.ప్ర తనిక భౌతికంగా తెలుగు నేలపై ఉండననీ, తన బొమ్మలు ఇప్పుడు గతంలో కలిసిపోయిన ఇతివృత్తాలనీ, ప్రకటించడం, విమర్శకుల్ని ఆశ్చర్యపరిచింది. ఆ తర్వాత అమెరికా వెళ్లిపోయాడు. ఇదిగో ఎప్పుడో ఇలాంటి వ్యక్తిగతపనుల మీద మిత్రుల కోసం మాత్రమే హైదరాబాద్ వచ్చి ఓ నాలుగు రోజులుండి, మాయమవుతాడు.

"హైదరాబాద్ ఎప్పుడొచ్చినా ఇక్కడే ఉంటాడు. ఇక్కడే తన ఆఖరి బొమ్మగా ప్రచారం అయిన "స్మృతి" గీసాడు" శేషశాయి గారు చెప్తుంటే, మనోహర్‌కు ఒక్కసారిగా రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఆ.ప్ర నడయాడిన ఆ నేలనూ, ఆ గోడల్నీ తాకి కళ్లకద్దుకుందా మనుకున్నాడు. స్మృతి –ఆ.ప్రకు గొప్ప సృజనాత్మక కొనసాగింపని పేరు పొందింది. అసలు నేలలు తమ అస్తిత్వాల కోసం రెక్కలు తగిలించుకొని ఎగిరిపోవడమనే దాన్ని మొదలు పెట్టిందే ఆ.ప్ర. దాన్ని ఇన్నేండ్లలో గడించిన తాత్వికతతో దట్టించి "స్మృతి" ని గీసాడు. అతన్ని వ్యతిరేకించేవారు కూడా మెచ్చుకున్నారు. అతని కాన్సెప్ట్‌లోని అనివార్యత ముందు ఓడిపోయిన వాళ్ళే అందరూ...

మనోహర్‌కు అంతా కలలా ఉంది. నిజంగా ఈ రోజు ఆ.ప్రను చూస్తానా, లేక ఈ నేలకు దూరమైపోయిన ఆనందప్రసాద్‌ను విస్మృతిలోకి నెట్టే పనికి ఈ రోజు నుంచే మొదలు పడతానా అనుకుంటున్నాడు. ఆ మాట ముందే హారికకు చెప్పే వచ్చాడు. ఆ.ప్రను చూద్దం, చూడకపోవడం అనేవి ఇప్పుడు మనోహర్ లక్ష్యాలు కావు. ఒక స్మృతి రద్దయిపోవడం, దానికి తాను ఎదుర్కోవాల్సిన రిహార్సల్ ముఖ్యమనుకున్నాడు. ఆ.ప్ర గురించి లోపల పేరుకుపోయిన ఒక్కో దృశ్యాన్ని రద్దు చేసుకోవడం ఎలా అనే ఆలోచిస్తున్నాడు.ఇందుకు స్ఫూర్తి కూడా తిరిగి ఆనంద ప్రసాదే.

ఇంతలో "వస్తున్నాడు వస్తున్నాడు" అనే శబ్దాలు వినిపించాయి. వాతావరణం నిశ్శబ్దమయ్యింది. చూస్తూనే ఏమని మాట్లాడించాలా, ఎలా పరిచయం చేసుకోవాలని మనోహర్ సతమతమవుతున్నాడు.

"సార్ నేను మీ డెడ్లీ ఫాన్. మీ వేళ్ళ కొసలను కళ్ళకద్దుకుంటాను అనుగ్రహిస్తారా"

"మీ బొమ్మల చుట్టూ నా జీవితాన్ని పెనవేసుకున్నాను. మీ సారాన్ని పీల్చి మనిషిగా మారాను. మీ పాదాలను తాకనిస్తారా"

"చరిత్రలో కనుమరుగైన భూముల్లాగా, వాటి అస్తిత్వాల్లాగా మీరూ మీ బొమ్మలూ గత జల సేతు బంధనాలు. అప్పటి గాల్లో కలిసిన సువాసనల్లో నన్నూ ఓ శ్వాస కానిస్తారా."

ఇన్ని ఆలోచనల్లో మనోహర్ ఉండగా, రావాల్సిన వ్యక్తి రానే వచ్చాడు. మనోహర్ గుడ్లప్పగించి చూసేంతలో...

శేషశాయి గారి నమస్కారానికి ప్రతినమస్కారం చేసాడు. మిగతా వాళ్ళని గాల్లోనే స్వీకరించాడు. అందర్నీ అలా చూసి, అందరూ సంభ్రమంలో ఉండగా,

"కూర్చోండి" అని చాలా మృదువుగా అన్నాడు. శేషశాయి గారు ఒకవైపు కూర్చుంటే, ఉమా మహేశ్వర్ ఇంకో వైపు కూర్చోగలిగాడు. మనోహర్ నిలబడే ఉండిపోయాడు.

ఆ.ప్ర కాళ్ల దగ్గర కూర్చోగలను అవకాశమొస్తుందా? అన్నట్లున్నాడు

"మీ స్మృతి చాలా పాపులర్ అవుతోంది సార్. చాలా మంది క్రిటిక్స్ దాన్ని గురించి రాస్తున్నారు, మాట్లాడుతున్నారు" శేషశాయి గారు అంటుంటే,

"నా "విభజనలో" మీరు జీవిస్తారు" అన్నాడు ధీరగంభీరంగా అని చివ్వున లేచి నిలబడ్డాడు. శేషశాయి గారు ఆత్రంగా కాస్త పెద్ద కవరొకటి అందించి.

"మీరడిగింది సార్" అన్నాడు

"సరే..." అని సర్రున కారులో మాయమయ్యాడు.

మనోహర్ కళ్ళు తెరుచుకునేలోగా, కలలోలాగా మాయమయ్యాడు.

ఇది కలా నిజమా అనుకొంటూ, మనోహర్ చేతిని పట్టుకొని గట్టిగా గిల్లాడు.

"ఏయ్ మనూ నన్ను గిచ్చుతావేందబ్బా నువ్వూ. నన్ను నిద్రపోనివ్వవా"

హారిక అరుపుతో కళ్ళు తెరిచాడు.

కథ

'నియంత'

- సాదత్ హసన్ మంటో

అనువాదం: రివేరా

అది ఏ సంవత్సరమో గుర్తులేదు. కానీ, అప్పట్లో అమృత్‌సర్ గుండెల్లో విప్లవ కాంక్ష రగులుతూ ఉండేది. 'విప్లవం వర్ధిల్లాలి', 'విప్లవం చిరకాలం నిలవాలి' అనే నినాదాలు ఆ రోజుల్లో ఎల్లెడలా హోరెత్తుతుండేవి. వాతావరణమంతా ఉద్విగ్నతతో ఉడుకుతుండేది. ప్రతి ఒక్కరూ అశాంతితో తిరుగుతూ ఉండేవారు. ఊపిరి సహా దేనినైనా వదిలేయడానికి సిద్ధమన్నట్టు యువకులు కనిపించేవారు. అప్పటికి జలియన్‌వాలాబాగ్ ఊచకోతల తాలూకూ దురదృష్టకరమైన రోజులు సైతం గతించాయి. పోనీ కనుచూపుల కయినా మరుగుపడినట్టేనని చెప్పవచ్చు. ఏదో మహత్తర, అంతిమ ఘట్టం గడపలో తామంతా జీవిస్తున్నట్టు ప్రతి ఒక్కరూ ప్రగాఢంగా విశ్వసిస్తూ ఉండేవారు.

బ్రిటిష్ రాజ్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రజలు వీధుల్లో ప్రతిరోజూ కదం తొక్కేవారు. శాసన ఉల్లంఘన చేసి వందలాది వంది అరెస్టు అయ్యేవారు. నిజానికి ఇలా అరెస్టుఅయి జైలుకు పోవడం అనేది జనాలకు చాలా గొప్పగా అనిపించేది. తరచూ కనిపించే దృశ్యం ఏమిటంటే ఉదయాన్నే పట్టుకొని పోయి సాయంత్రానికి వదిలిపెట్టేవారు. వారిపై కేసు నమోదు చేసి విచారించి స్వల్ప శిక్షని విధించేవారు. శిక్షని పూర్తి చేసుకొని బయటకు రావడం..ఆ వెంటనే బ్రిటిష్ రాజ్‌కు వ్యతిరేకంగా తిరిగి కొన్ని నినాదాలు ఇవ్వడం..మళ్లీ లక్ష్యాన్ని (జైలు) చేరుకోవడం. ఇదే తంతు!

ఆ రోజులే వేరు. ఒక్కోసారి చిన్న ఘటనలా కనిపించేది అత్యంత హింసాత్మక ఉపద్రవానికి దారితీసేది. నగర కూడళ్లలోని దిమ్మెపై నిలబడి ఎవరైనా ఒకడు సమ్మెకు పిలుపునిస్తే.. సమ్మె జరిగిపోతుంది. లాంక్‌షైర్ టెక్స్‌టైల్ మిల్లు బట్టల అమ్మకాలను దెబ్బతీయడంకోసం ప్రతి ఒక్కరూ స్వదేశీ నేత బట్టలను మాత్రమే ధరించాలనే ఉద్యమం అప్పట్లో నడిచేది. విదేశాల నుంచి దిగుమతి అయిన బట్టని ప్రజలు కట్టేవారు కాదు. వాటి అమ్మకాలను బహిష్కరించేవారు. ప్రతి వీధిలో నెగడు వేసేవారు. తాము ధరిస్తున్న, ఇళ్లలో పోగుపడిన విదేశీ వస్త్రాలను తీసుకొచ్చి జనం ఆ మంటల్లో పడేసేవారు. కొన్ని సమయాల్లో మహిళలు బాల్కనీల్లో నిలబడి.. విదేశీ సిల్క్ చీరలను నెగడులో వేసేవారు. అక్కడ గుమిగూడిన జనం ఆ దృశ్యాని కి కేరింతలు కొట్టేవారు.

టౌన్ హాల్, పోలీస్ ప్రధాన కార్యాలయాల ఎదుట మా కుర్రాళ్లు పెద్ద పెద్ద నెగళ్లు వేయడం ఇప్పటికీ నాకు కళ్లకు కడుతుంది. ఆ నిర్భీతి క్షణాల్లో నాతో కలిసి చదువుతున్న షేఖూ తాను ధరించిన సిల్క్ జాకెట్‌ని విప్పేసి మంటల్లో పడేశాడు. అంతే.. ఆ ప్రాంతమంతా పెద్దెత్తున అరుపులు, కేకలతో హోరెత్తిపోయింది. అవునుమరి. షేఖూ చిన్నాచితక వాడా? వాడి తండ్రి నగరంలోని సంపన్నుల్లో ఒకడు. పైగా కాకాల రాయుడు. కాకాలు పట్టి కార్యాలు జరిపించుకోవడంలో సిద్ధహస్తుడని ఆయనకు పేరు. ఆ రోజుల్లో ప్రభుత్వానికి విధేయంగా ఉండేవారిని జనం 'కాకాల రాయుడు' అంటూ పరిహాసాలాడేవారు. అక్కడి సందడి షేఖూని మరింత రెచ్చగొట్టింది. అంతే.. వంటి మీద ఉన్న సిల్కు చొక్కానీ తీసి.. అందరూ ఆసక్తిగా కళ్లు పెద్దవిచేసుకొని చూస్తుండగా విరురుగా నెగడులోకి వేసేశాడు. ఆ తరువాతగానీ దానికి బంగారు నగిషీలు అద్దినట్టు వాడికి గుర్తుకురాలేదు.

నా మిత్రుడిని ఎగతాళి చేయడం కోసం నేను ఇదంతా చెప్పడం లేదు. అలాగంటే ఆ రోజుల్లో నా ఆలోచనలూ అంతే బీభత్సవంగా మండుతూ ఉండేవి. తుపాకులను సంపాదించి ఒక రహస్య ఉగ్రవాద సంస్థని నడపాలని కలలు కనేవాడిని. ఒక ప్రభుత్వ ఉద్యోగి కొడుకుననే వెరపూ ఉండేది కాదు. అప్పట్లో నేను ఎంత అశాంతితో రగిలిపోయేవాడినంటే అసలు నేను అంత అశాంతికి ఎందుకు గురికావాలో కూడా తెలిసేది కాదు.

మామూలుగానే నాకు బడికిపోవడం ఇష్టం ఉండేది కాదు. ఇక ఆ రోజుల్లో చెప్పేదేముంది! చదువుకు పూర్తిగా దుమ్మాకొట్టి తిరిగేవాడిని. రోజంతా జలియన్‌వాలాబాగ్‌లోనే పొద్దుపుచ్చేవాడిని. చెట్టు కింద కూర్చొని చూస్తే, పార్కుకు ఆనుకొని ఉన్న ఇళ్లల్లో వితంతువులు పనులు చేసుకుంటూ కనిపించేవారు. ఆ ఇళ్లలోని ఆడపిల్లల గురించి ఆలోచనలు గిలిగింతలు పెట్టేవి. వారిలో ఒక్కరైనా నాతో ప్రేమలో పడతారని ఎందుకనో తెగ అనిపించేది.

జాతీయ కాంగ్రెస్ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమానికి జలియన్‌వాలాబాగ్ ప్రధాన కేంద్రంగా మారింది. ఎక్కడ చూడు..చిన్నా పెద్దా శిబిరాలు, రంగురంగుల మేలుకట్టులే దర్శనమిచ్చేవి. అక్కడ ఉన్నవాటిలో పెద్దదిగా కనిపిస్తున్న శిబిరంలో రాజకీయ ప్రధాన కేంద్రం నడిచేది. వారంలో ఒకసారి, ఒక్కోసారి రెండుసార్లు కూడా తమ 'నియంత'ని ప్రజలు ఇక్కడే ఎన్నుకునేవారు.. ఆ రోజుల్లో తమని నడిపించే నాయకుడిని 'నియంత' అని పిలిచేవారు. తిరిగి మరొకరు తన స్థానంలో ఎన్నికయ్యేవరకూ అతడు ఉద్యమాన్ని ముందుండి నడిపిస్తాడు. ఆయనగారు పెద్ద శిబిరంలో కొలువు తీరతాడు. కార్యకర్తలు వచ్చేటప్పుడూ పోయేటప్పుడూ ఆయనకు వంగి వంగి ప్రణామాలు చేస్తుంటారు. అక్కడ కూర్చొని ఆయన చేసే పని ఏమిటంటే, స్వదేశీ నేత బట్టలు కట్టుకొన్న యువ రాజకీయ బృందాలను కలుసుకుంటాడు. దానితోపాటు.. శిబిరాల నిర్వహణ, తిండితిప్పల కోసం నగరంలోని బడా వ్యాపారులు, పెద్ద దుకాణదారుల నుంచి విరాళాలు సేకరిస్తాడు. పోలీసులు వచ్చి పట్టుకుపోయేదాకా ప్రతిరోజూ ఇదే తంతు కొనసాగుతుంది.

గులామ్ అలీ అని నాకో స్నేహితుడు ఉన్నాడు. మేం ప్రాణ మిత్రులం అని చెప్పడానికి దాఖలా ఏమిటంటే.. ఏడాది చివరన

నిర్వహించే పరీక్షల్లో ఇద్దరం కూడబలుక్కుంటున్నట్టు వరసగా రెండుసార్లు దమికీ కొట్టాం. ఒకసారి మేమిద్దరం ఇంట్లో చెప్పకుండా బొంబాయికి పారిపోయాం. అటునుంచి అటు సోవియట్ రష్యాకు వెళ్లాలనేది మా ఆలోచన. ఇంతలో వెంట తెచ్చుకొన్న డబ్బులు అయిపోయాయి. ఫుట్‌పాత్‌ల మీద కొన్ని రాత్రులు నిద్రపోయాం. ఆ తరువాత..'మళ్లీ ఇలాంటి పని చేయం. మమ్మల్ని క్షమించండి' అని వేడుకుంటూ ఇళ్లకు ఉత్తరాలు రాశాం. సరేనని మా వాళ్లు మన్నించడంతో తిరిగొచ్చాం.

షాజాదా గులామ్ అలీ (తరువాతి కాలంలో వాడిని అలాగే పిలిచేవారు) మంచి అందగాడు. కశ్మీరీల్లా తెల్లని శరీరచ్ఛాయతో పొడవుగా చూడముచ్చటగా ఉండేవాడు. మేకపోతు గంభీర్యంతో ఆకతాయి కుర్రాళ్లతో కలిసి తిరిగేవాడు. అన్నట్టు మేం కలిసి చదువుకునే రోజుల్లో వాడేమీ షాజాదా, అంటే రాకుమారుడు ఏమీ కాదు. సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటూ, రాజకీయ ఉపన్యాసాలు దంచుతూ, ప్రజా ప్రదర్శనలు తీస్తూ..పనిలోపనిగా సుందరాంగులైన మహిళా కార్యకర్తలతో సామాజిక 'సంపర్కం'లో ఉంటూ పూలదండలు, నినాదాలు, విప్లవ గీతాలాపనల ఊపులో వాడు షాజాదా అయిపోయాడు.

అడవిలో నిప్పురవ్వ పడి నలుదిశల్లో చుట్టుముట్టినట్టు, వాడికి శరవేగంగా కీర్తి పట్టేసింది. అమృత్‌సర్ ఎలాంటి పిదప చోటంటే అక్కడ కీర్తి రావడానికి, అపకీర్తి పాలు కావడానికి అట్టే కాలం పట్టదు. నిజానికి, ఈ నగర ప్రజలు దైనందిన వ్యవహారాల్లో బహు విమర్శనాత్మకంగా ఉంటారు. కానీ, మత, రాజకీయపరమైన నాయకత్వం విషయంలో మాత్రం ఉదారంగా ఉండేవారు. మత ధర్మోపదేశాలకు, విప్లవ ప్రసంగాలకు సమానంగా స్పందించే విచిత్ర గుణం వారిది. ఈ నగరం ఎందరో నాయకులను చూసింది. ఆ రోజుల్లో నాయకులుగా అవతరించేందుకు వోపినంత వీలు!. ఎందుకంటే ప్రధాన నాయకత్వమంతా లక్ష్య ఛేదన (జైలు)లో ఉండి నాయకత్వ స్థానాలు తరచూ ఖాళీ అవుతూ ఉండేవి. ఇలాంటప్పుడు గులామ్ అలీ వలె, జలియన్‌వాలాబాగ్ శిబిరంలోకొద్దికాలం ఉండి, ఒకటి రెండు ఉపన్యాసాలు దంచి జైలుకు పోయేవారు ఉద్యమానికి అవసరం.

ఆ రోజుల్లో జర్మనీ, ఇటలీ దేశాలు నియంతల పాలనలోకి వెళ్లడం అనేది యూరోపియన్ రాజకీయాల్లో కొత్త పరిణామం. ఈ పోకడ భారతదేశంలోని జాతీయ కాంగ్రెస్ నాయకత్వాన్ని ప్రభావితం చేసింది. దానినుంచి వారు ఒక ప్రత్యేక 'లక్ష్యం' కోసం సిద్ధం చేసే కార్యకర్తలను 'నియంత'లుగా వ్యవహరించేవారు. 'లక్ష్యాన్ని' అందుకునే గడియలను (జైలు) గులామ్ అలీ చేరుకునేటప్పటికి, వాడిలాంటి 'నియంత'ల్లో 40వ వాడిగా తేలాడు.

మా వాడు 'నియంత' అయిపోయినట్టు తెలుసుకొని, పలకరించడానికి జలియన్‌వాలాబాగ్‌కు వెళ్లాను. పెద్ద శిబిరం వద్ద వాలంటీర్లు నిలబడి ఉన్నారు. గులామ్ అలీ చెప్పిన తరువాత లోపలకు వెళ్లనిచ్చారు. మెత్తని పత్తితో చేసిన తివాచీపై వాడు కూర్చొని ఉన్నాడు. కాళ్లు కూరుకుపోయే తివాచీపై పైకి కిందకు ఊగుతూ ఎవరితోనో మాట్లాడుతున్నాడు. బహుశా వాళ్లు నగరంలోని నేత బట్టల వ్యాపారులు అయి ఉండవచ్చు. కూరగాయల వ్యాపారం గురించి అనుకుంటా, వారితో గులామ్ అలీ సుదీర్ఘంగా చర్చిస్తున్నాడు. వాళ్లు వెళ్లిపోయిన తరువాత వాలంటీర్లను పిలిచి కొన్ని సూచనలు చేసి, నా వైపు తిరిగాడు. వాడి గంభీరమైన వదనం ఏదో తెచ్చిపెట్టుకొన్నట్టు, పరిహాసప్రాయ వేషం కట్టినట్టు తోచింది. వాలంటీర్లు అంతా వెళ్లి పోయి..ఏకాంతంగా ఉన్నప్పుడు వాడిని సరదాగా ఆట పట్టించేందుకు ప్రయత్నించాను. 'మా రాకుమారుడు ఎలా ఉన్నాడు?' అని కొంటెగా నవ్వుతూ అడిగాను.

కానీ, వాడు నిజంగానే మారిపోయినట్టు ఆ తరువాత వాడి మాటలను బట్టి తెలుసుకొన్నాను. వాడూ, వాడి వాలకం అంతా ఒట్టి బూటకం అన్నట్టు వ్యవహరిస్తున్న నన్ను వారించాడు. "సాదత్! ఈ విషయంలో పరిహాసాలొద్దు. నాకు అర్హత లేకపోయినా గొప్ప గౌరవాన్ని నాకు కల్పించారు. ఇప్పటిదాకా ఏమి చేశాను, ఎక్కడ తిరగానేది కాదు, ఇక ముందు నేను గడిచే క్షణాలే నా జీవితంలో ముఖ్యమైనవి" అని భావోద్వేగంతో అన్నాడు. ఆ రోజు సాయంత్రం తాను ఉపన్యాసం ఇవ్వనున్నట్టు వాడు చెప్పాడు. సరే తప్పనిసరిగా వస్తానని చెప్పి బయటపడ్డాను. నేను వెళ్లేసరికే వేదిక చుట్టూ జనం గుంపులు గుంపులుగా పోగుపడ్డారు. కార్యక్రమం కోసం ఆత్రుతగా వారంతా ఎదురుచూస్తున్నారు. ఇంతలో పెద్దపెట్టున కరతాళధ్వనులు వినిపించాయి. గులామ్ అలీ వేదిక మీదకు వస్తూ కనిపించాడు. దవళ వస్త్రాల్లో మెరుస్తున్న అందమైన వదనానికితోడు రెట్టించిన ఆత్మవిశ్వాసంతో వాడు వేస్తున్న అడుగులు అదనపు ఆకర్షణని తీసుకొచ్చాయి. వాడు గంటో అంతకన్నా ఎక్కువో మాట్లాడాడు. ఎంత భావోద్వేగంతో ప్రసంగించాడంటే నేను సైతం కదిలిపోయాను. అది ఎంతగా అంటే దేశ దాస్య శృంఖలాలను ఛేదించడానికి ఉన్న ఫణాన మానవబాంబుగా మారిపోయి నన్ను నేను పేల్చేసుకోవాలని అనిపించింది.

ఇది జరిగిపోయి చాలాకాలమే అయింది. అప్పటి విషయాలను గుర్తుచేసుకోవడంలో మతిమరుపు చేసే గమ్మత్తు అంతా ఇంతా కాదు. అయినా..ఆవేశంతో రగిలిపోతున్న ప్రజలను ఉద్దేశించి ఉపన్యసిస్తున్న వాడి రూపం ఇప్పటికీ నా కళ్లలో మెదులుతోంది. వాడు ఏమి చెప్పాడు, అందులో రాజకీయాలపాలు ఎంత అనేది కాదు నేను ఆలోచిస్తున్నది. ఒక యువకుడు.. అదీ విప్లవానికి అంకితం అవుతాడనే ఆశని కల్పిస్తున్న యువకుడి ఉపన్యాసం నన్ను అమితంగా అప్రమత్తుడిని చేసింది. వాడిలో నిజాయితీ, దేన్నీ లెక్కచేయనితనం తొణికిసలాడుతున్నాయి. వీడు గతంలో ఏమైనా కావచ్చు. వీధిలో పోతున్న యువతిని ఆపి జంకూగొంకూ లేకుండా 'చూడండి! నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను" అని చెప్పి కూడా ఉండవచ్చు. కానీ, ఇప్పుడా గులామ్‌అలీ నాకు కనిపించడం లేదు.

ఆ రోజులు ఎలాంటివంటే అటు బ్రిటిష్ రాజ్‌కు గానీ, ఇటు దానిపై పోరాడుతున్న ప్రజలకు గానీ పరిణతి ఉన్నట్టు అనిపించేది కాదు. తమ చర్యల పర్యావసానాల గురించి ఇరుపక్షాలకూ పెద్దగా తెలిసినట్టు తోచదు. తాత్పర్యం గురించి ఇసుమంత కూడా ఆలోచించకుండా వేలాది మందిని ప్రభుత్వం 'లక్ష్యం' (జైలు) వైపునకు తోస్తుంది. ఆ లక్ష్యాన్ని చేరుకోడానికి తహతహలాడేవారికేమో, తాము దేనికోసం ఉద్యమిస్తున్నామో, దాని ఫలితం ఏమిటో కించిత్తూ తెలియదు. అప్పుడు అంతే!

సమాజ పరిస్థితులు తీవ్ర అల్లకల్లోలంగా ఉండేది. అది ఎలాంటి సమాజం అంటే, చూస్తుండగానే నింగిలోకి నాలుకలు చాపే మంటలు అంతే చప్పున ఆరిపోతాయి. ఆ వెంటనే మరో జ్వలనానికి రంగం సిద్ధమయిపోతుంది. ఉద్యమం బద్దలయినట్టు అనిపిస్తుంది. అంతలోనే అంతా సర్దుకుంటుంది. దీనివల్ల మందగించిన, విచారభరితమైన మనుషుల బానిస మన:స్థితిలో నిత్యాగ్ని, అంతులేని ఉద్రేకాలు సదా రగులుతూ ఉండేవి.

గులామ్ అలీ ప్రసంగం పూర్తి అయ్యేటప్పటికి జలియన్‌వాలాబాగ్ దిక్కున లేచి నిలబడింది. వాడిని అభినందించడానికి కొన్ని అడుగులు ముందుకేశాను. కానీ, వాడి చూపులు ఇక్కడ లేవు. అవి ఎవరినో వెతుకుతున్నాయి. ఏమిటబ్బా వీడు..అని అనుకుంటుండగానే, విషయం అర్థం అయిపోయింది. అక్కడికి కొంత దూరంలోని పూలపొదల వెనక తెల్లని నేతచీర కట్టుకొని ఓ అమ్మాయి నిలబడి ఉంది.

మా వాడు, ఆ అమ్మాయి ప్రేమించుకుంటున్నారని మరుసటి రోజు నాకు తెలిసింది. నేను విన్నదాన్ని బట్టి ఆ అమ్మాయి ముస్లిం. పైగా అనాథ. స్థానిక ఆసుపత్రిలో నర్సు. ముస్లిం యువతి అయిఉండి బ్రిటిష్ రాజ్‌కు వ్యతిరేకంగా జాతీయ కాంగ్రెస్‌లో చేరిన తొలి వ్యక్తి బహుశా మొత్తం అమృత్‌సర్ నగరంలోనే ఈమే అయిఉండవచ్చు.

జాతీయ కాంగ్రెస్‌లో పనిచేస్తుండటం, తెల్లనేత చీరలు ధరించడం, దానితోపాటు ఆస్పత్రిలో సేవలు వల్ల కావచ్చుగానీ, సాధారణ ముస్లిం అమ్మాయిల్లో అంతటి సౌకుమార్యం కనిపించదు. అలాగని ఆమె పెద్ద అందగత్తె కూడా కాదు. కాకపోతే నిండైన ఆడతనంతో ప్రసన్నంగా ఉంది. సాధారణంగా హిందూ అమ్మాయిల్లో కనిపించే సేవా తత్పరత, ఆత్మవిశ్వాసం, మానవత్వం అనే సుగుణాలను ఈ అమ్మాయి ఎలాగోమరి సంతరించుకుంది. సంప్రదాయ ముస్లిం ప్రార్థనల్లోని మార్దవాన్నీ, ఆలయ పూజల్లోని భక్తిభావాన్నీ తనలో నింపుకున్నట్టు అనిపించింది.

ఆమె షాజాదాని ఆరాధించింది. ముందు తటపటాయించినా చివరికి వాడు ఆమె ప్రేమని స్వీకరించాడు. ఒక నిరసన ప్రదర్శనలో వారిద్దరు తొలిసారి కలుసుకొన్నారు. ఏమాత్రం జాగు చేయకుండా వెంటనే ప్రేమలో పడిపోయారు. అరెస్టు తప్పదని తెలిసి, పైగా దానికోసమే ఎదురుచూస్తున్నట్టు కనిపించే గులామ్ అలీ..ఎందుకనో జైలుకు పోవడానికి ముందే నిగార్‌ని పెళ్లాడాలని అనుకున్నాడు. ఆ కారణం నేను కూడా చెప్పలేను. నిజానికి, వాడు జైలు నుంచి తిరిగి వచ్చిన తరువాతైనా ఆపని చేయవచ్చు. అప్పట్లో 'లక్ష్య' విలంబన కాలాల్లో తేడాలుండేవి. కొంతమందికి మూడు నెలలు పడితే, ఇంకొందరు సంవత్సరంపాటు గడిపేవారు. జైలులో ఎక్కడ ఉంచాలో తెలియక, కొంతమందిని పది, పదిహేను రోజులకే అధికారులు వదిలించుకునేవారు. పెళ్లికి మరే అడ్డంకులేవీ లేవుగానీ, ముందుగా బాబాజీ ఆశీస్సులు తీసుకోవాలి. ఆ రోజుల్లో బాబాజీని మహనీయునిగా కొలిచేవారు. వారు నగరంలోని అతి సంపన్న నగల వ్యాపారి హరిరామ్ గారి దేదీప్యమానమైన భవనంలో బస చేసేవారు. సాధారణంగా బాబాజీ తన ఆశ్రమంలోనే గడుపుతారు. అమృత్‌సర్‌కు వచ్చినప్పుడు మాత్రం నగర శివార్లలోని రాజ ప్రాసాదం లాంటి ఈ నివాసంలోనే ఉంటారు. ఆయన రాకతో ఆ భవనం పరిసరాలు పూజా మందిరంలా మారిపోయేవి. అక్కడంతా వాలంటీర్లు తచ్చాడుతూ ఉంటారు. బాబాజీని ఒక్కసారి కనులారా చూడాలని, ఆయన సన్నిధిలో కొన్ని క్షణాలైనా గడపాలని, అంటే వారి దర్శనం చేసుకోవాలని బారులు కట్టి నిలబడేవారు. మామిడి తోటలో ఎత్తుగా కట్టిన వేదికపై వారు రెండు కాళ్లూ ఒకవైపునకు మడిచి..ఆశీనులై, సందర్శకులను కలుస్తూ ఉంటారు. వారు నడుపుతున్న ఆశ్రమం కోసం విరాళాలు, బహుమతులను అందుకుంటూ ఉంటారు. సాయంత్రాలు యువ మహిళా కార్యకర్తలను దగ్గర కూర్చోబెట్టుకొని హిందూ భక్తిగీతాలను పాడించుకొంటారు.

ధార్మిక చింతన, అసమాన పాండిత్యానికి బాబాజీ పెట్టింది పేరు. హిందువులు, ముస్లింలు, సిక్కులు, అంటరానివారు.. ఇలా అన్ని తరగతులు, మతవిశ్వాసాలకు చెందిన స్త్రీలూ పురుషులూ ఆయనకు అనుచరులుగా మెలిగేవారు. పై చూపులకు, బాబాజీ రాజకీయాలకు సంబంధం లేని వ్యక్తిలాగే కనిపిస్తారు. కానీ, అమృత్‌సర్‌లో ఏ ఉద్యమం రాజుకోవాలన్నా, ఆరిపోవాలన్నా బాబాజీ ఆశీస్సులు తప్పనిసరి. బ్రిటిష్ అధికారులకు వారు ఎప్పటికీ కొరుకుడుపడని చిక్కు ప్రశ్నే! బాబాజీ మోముపై చిద్విలాసం సదా నిలిచి ఉండేది. ఆ నవ్వులో వెయ్యి రకాల అర్థాలు ప్రతిఫలించేవి.

వారు నేరుగా పాల్గొనలేదుగానీ, అమృత్‌సర్‌లో బద్దలయిన సహాయ నిరాకరణ ఉద్యమం, అందులోభాగంగా కొనసాగుతున్న రోజువారీ అరెస్టులు, ప్రజా ప్రదర్శనలు అన్నీ..బాబాజీ కనుసన్నల్లోనే సాగుతూ ఉన్నాయి. ఉద్యమం ఎత్తుగడలు ఎలా ఉండాలనేదానిపై కొన్ని మెళుకువలను నాయకులకు ఆయన బోధించేవారు. మెడలో మహత్తు గల తాయెత్తుని ధరించినంత సంబరంగా ఆ వాక్కులను తలన దాల్చి మరుసటి రోజు పోరాటానికి నాయకులు ఉత్సాహంగా కదిలిపోయేవారు.

ఎవరినీ నొప్పించని మార్దవమైన, అందరినీ కలుపుకునిపోయే అనునయమైన, సూక్ష్మాలను విడమరిచే సుబోధకత వల్ల బాబాజీ స్వరానికి అమేయమైన సమ్మోహన శక్తి ఉంది. ఎంతటి తీవ్రమైన విమర్శని ఎదుర్కొన్నా, వారి ప్రశాంతచిత్తంలో కించిత్తు భంగపాటు కూడా ఉండదు. వారు తన ప్రత్యర్థులకు ఎప్పటికీ ఒక రహస్యమే! తనను గురించిన సందేహాల్లో వారు ఎప్పటికీ తలమునకలు అయ్యేలా బాబాజీ వ్యవహారం ఉంటుంది.

బాబాజీ తరచూ అమృత్‌సర్‌కు వస్తుంటారుగానీ, నేనెప్పుడూ ఆయనని చూడలేదు. అందుకనే బాబాజీని కలిసి, తమ పెళ్లికి ఆశీస్సులు పొందాలని అనుకుంటున్నట్టు గులామ్ అలీ చెప్పగానే నాకూ వెళ్లాలని అనిపించింది. వాడు సరేననడంతో గులామ్ అలీ, నిగార్, నేను టాంగాపై హరిరామ్‌గారి మిరిమిట్లుగొలిపే భవనానికి చేరుకొని బాబాజీ దర్శనం చేసుకొన్నాం. అప్పటికే బాబాజీ ఉదయపు సంధ్య వార్చుకొని స్నానం, పూజలు ముగించేశారు. మేం కలుసుకునేటప్పటికి మామిడి తోటలోని ఎత్తయిన వేదికపై ఖర్జూరపు చెట్టు పత్రాలతో అల్లిన చాపపై ఆశీనులై కశ్మీరీ పండిట్ కుటుంబానికి చెందిన అమ్మాయి ఆలపిస్తున్న దేశభక్తి గీతాన్ని ఆలకిస్తున్నారు. చాపపై కాళ్లకు ఒకవైపుకు ముడుచుకొని ఉన్న బాబాజీ చుట్టూ మెత్తని తివాచీలు పరిచి ఉన్నా, ఆయన వాటికి దూరంగా కూర్చొన్నారు. ఆయనకు వయసు 70లకు పైబడ్డాయి. కానీ, శరీరంపై ఎక్కడా

చిన్న ముడత కూడా లేదు. ఆలివ్ ఆకుల నుంచి తీసిన తైలంతో ప్రతి రోజూ ఉదయం బాబాజీ వంటికి మర్దన చేయించుకుంటారని తెలుసు. కానీ, దానివల్ల శరీరానికి ఇంత నిగారింపు వస్తుందా అని ఆశ్చర్యపోయాను.

బాబాజీ.. గులామ్ అలీని చూసి నవ్వి, చాపపై తన పక్కన కూర్చోనేందుకు మమ్మల్ని ఆహ్వానించారు. ఆ సమయంలో బాబాజీని సమ్మోహితుడిని చేస్తున్న ఆ విప్లవ గానం కన్నా కూడా, తమ యుగళ యువ ప్రేమ గీతంపైనే గులామ్ అలీ, నిగార్‌లకు ఎక్కువ పట్టింపు ఉంటుందనేది ఎవరైనా చెప్పగలరు. ఎట్టకేలకు ఆ అమ్మాయి పాడటం ముగించింది. బాబాజీ చిన్నగా తలని పంకించారు. అందులోనే ఆయన ఆప్యాయమైన ప్రసన్నతని ఆ అమ్మాయి వెతుక్కొని నిష్క్రమించింది. ఆ తరువాత వారు మా వైపు తల తిప్పారు.

గులామ్ అలీ.. తనను, నిగార్‌ను వారికి పరిచయం చేసేందుకు ప్రయత్నించాడుగానీ, బాబాజీ ఆ అవకాశం ఇవ్వలేదు. అబ్బా ఎంత జ్ఞాపకశక్తి! ఒకసారి చూసిన ముఖాన్ని, విన్న పేరును వారు మరిచిపోరు అనిపించింది. 'రాకుమారా! నీవు ఇంకా అరెస్టు కాలేదన్నమాట?" అని స్పష్టతపరిచే సన్నని స్వరంతో బాబాజీ ఆరా తీశారు. 'లేదయ్యా' అంటూ గులామ్ అలీ లేచి నిలబడి గౌరవంగా చేతులు కట్టుకున్నాడు. 'కానీ నువ్వు ఇప్పటికే అరెస్టు అయిపోయి ఉంటావని అనుకుంటున్నాను' అంటూ ఎక్కడో సంపాదించిన పెన్సిల్‌తో గీతలు గీయడం మొదలుపెట్టారు. నిగార్ వైపు అర్థమంతంగా చూపు సారించి, "ఈ అమ్మాయి మా రాకుమారుడిని అరెస్టు చేసేసింది" అని అన్నారు. తిరిగి క్రితం సారి గీతాన్ని ఆలపించిన అమ్మాయి వైపు తల తిప్పారు. "ఈ పిల్లలు నా ఆశీస్సుల కోసం విచ్చేశారు. సరే నీ సంగతి చెప్పు. కమల్‌ను ఎప్పుడు పెళ్లి చేసుకుంటున్నావు" అని అడిగారు. ఆ అమ్మాయి ఎర్రటి ముఖం సిగ్గుతో మరింత ఎర్రబడింది. "అది నాకెలా సాధ్యం? నేను ఆశ్రమానికి వచ్చేశాను కదా" అని ఆ అమ్మాయి సమాధానమిచ్చింది. సలోచనగా తల ఊపి గులామ్ అలీ, నిగార్‌ల వైపు చూశారు "అయితే మీరు అంతా ఆలోచించుకొని వచ్చారన్నమాట" అని అడిగారు. 'అవునయ్యా' అని ఇద్దరూ ఒకేసారి తలూపారు. 'ఒక్కోసారి నిర్ణయాలు మారిపోతూ ఉంటాయి' అని బాబాజీ అన్నారు. అక్కడ అలుముకొని ఉన్న భక్తిపూర్వక పూజ్య వాతావరణాన్ని సైతం గులామ్ అలీ విస్మరించాడు.'నిర్ణయాలు వాయిదా పడొచ్చు. కానీ, మారిపోవడం అంటూ ఉండదు' అని కాస్త ఉద్రేకంగానే అనేశాడు. బాబాజీ కనులు మూసుకొని మరింతగా స్వరం తగ్గించి 'ఎందుకు?' అని ప్రశ్నించారు. గులామ్ అలీ ఎంతమాత్రం తగ్గలేదు. "ఎందుకంటే మేం మా దేశ స్వాతంత్ర్యం పట్ల ఎంత నిబద్ధులమో, పెళ్లి పట్ల అంతే బద్ధులం. పరిస్థితులు మారి సమయం అటూ ఇటూ కావచ్చుగానీ, ఈ కార్యక్రమం మాత్రం జరిగి తీరుతుంది. ఇది తథ్యం. ఇది నిశ్చయం" అని తేల్చేశాడు. దానికి బాబాజీ నవ్వారు. "షాజాదా ఎలాగూ కొన్నిరోజుల్లో 'లక్ష్యం' కోసం వెళతాడు. నువ్వెందుకు మాతోపాటు ఆశ్రమంలో ఉండకూడదు?" అని నిగార్‌ను ఉద్దేశించి బాబాజీ అడిగారు. 'అలాగే ఉంటాను' అని ఆమె గొణిగింది. బాబాజీ వెంటనే వేరే విషయాలపైకి చర్చను మళ్లించారు. జలియన్‌వాలాబాగ్‌లో రాజకీయ కార్యకలాపాల గురించి మమ్మల్ని అడిగి తెలుసుకొన్నారు. మేం అక్కడ గడిపిన ఆ గంట లేదంటే కొంచెం ఎక్కువ కూడా, అరెస్టులు, ఊరేగింపులు, చివరకు కూరగాయల ధరలు.. ఇలా అన్ని విషయాలూ ముచ్చటించారు. ఈ పరిహాసప్రాయ ఉబుసుపోని సంగతులకు నేను దూరంగా ఉన్నాను. కాకపోతే యువ జంటకు ఆశీస్సులు అందించేందుకు వారు ఎందుకు వెనకాడుతున్నారనేది మాత్రం పాలుపోలేదు. బాబాజీ తీరు విచిత్రంగా అనిపించింది. వారిద్దరి ప్రేమ విషయంలో బాబాజీకి అనుమానాలు ఉన్నాయా? ఎందుకని వారు నిగార్‌ని తనతో ఆశ్రమంలో ఉండమని చెబుతున్నారు? 'లక్ష్యం' చేరుకున్న గులామ్ అలీ గురించిన ఆలోచనలు నిగార్‌ని కుంగదీయకుండా ఉండేందుకే ఆహ్వానిస్తున్నారా? లేక ఆశ్రమంలో చేరితే, ఆమె ఇక పెళ్లి యోగ్యతని కోల్పోతుందనా?. ఎంత ఆలోచించినా నాకేమీ పాలుపోలేదు.

ఆశ్రమంలో ఉండేందుకు నిగార్ అంగీకరిస్తే, ఆ తరువాత ఆమె పరిస్థితి ఏమిటి? బాబాజీకి ఆధ్యాత్మిక, రాజకీయ ఉత్తేజాన్ని ఇచ్చే భక్తి, విప్లవ గీతాలను పాడుకుంటూ గడపవలసిందేనా? అది ఆమెను సంతోషంగా ఉంచగలుగుతుందా? ఆశ్రమాల్లో ఉండేవారిని ఎందరినో నా జీవితంలో చూశాను. ఉదయాన్నే చన్నీటి స్నానాలు చేస్తారు. మైళ్లకు మైళ్లు ఆరోగ్య నడకలు సాగిస్తారు. ఇంతచేసినా వారు నిర్జీవంగానూ, లంఖణాలు చేసినట్టుగానూ కనిపిస్తారు. ముఖాలు పాలిపోయి, కళ్ల కింద నల్లటి చారలతో దర్శనమిచ్చేవారిని చూసినప్పుడల్లా నాకు గోవుల 'పాలిండ్లే' గుర్తుకువస్తాయి. నిగార్ వంటి నిగారించే యవ్వన యువతిని అటువంటివారి మధ్య నేను ససేమిరా చూడలేను. ఆలోచిస్తే ఇదంతా నాకు ఎలా ఉన్నదంటే తేనె-పాలు, కాషాయంలా పొసగని వ్యవహారం అనిపించింది. అయినా దేశ స్వాతంత్ర్యంతో ఆశ్రమాలకు ఏమి పని?

ఆశ్రమాలన్నా, మత విద్యాలయాలన్నా, సన్యాసుల మఠాలన్నా, అనాథ శరణాలయాలన్నా నాకు మొదటినుంచీ చచ్చేంత వళ్లు మంట. ఏదో తెచ్చిపెట్టుకొన్న అసహజత్వం వాటిలో ఉంటుంది. తరచూ కనిపించే దృశ్యం ఏమిటంటే కుర్రాళ్లు వీథుల్లో ఒకే వరసలో సాగుతుంటే, ముందుండి కొంతమంది పెద్దవాళ్లు వాళ్లకు అజ్ఞలు ఇస్తూ ఉంటారు. ఈ కుర్రాళ్ల మంచిచెడ్డలు పట్టించుకునే సంస్థలను ఇదిగో ఈ పెద్ద మనుషులే నడిపిస్తుంటారు. నేను పలు మత గోష్ఠులకు, మత బోధన చేసే విద్యాలయాలకు వెళ్లి.. సదాచారులైన అక్కడివారిని కలుసుకొన్నాను. వయసులో పెద్దవాళ్లు బారు బారు గడ్డాలతో దర్శనమిస్తే, కుర్రాళ్లు అక్కడక్కడ పిల్ల వెంట్రుకలు మొలిచి చూడటానికే వికారంగా ఉండే గడ్డాలతో అటూ ఇటూ తిరుగుతూ కనిపిస్తారు. దినంలో ఐదుసార్లు ప్రార్థన చేసిన తరువాత కూడా, వీరి ముఖాల్లో ఎక్కడా ఆత్మజ్ఞాన వెలుగులు ఛాయలకైనా గోచరించవు.

నిగార్ యువతి. ఆమె ముస్లిమో, హిందువో, సిక్కో, క్రిస్టియనో కాదు. ఒక యువతి. అంతే! ఒక మరబొమ్మలా రోజూ ఉదయం ఆశ్రమంలో ప్రార్థనలు జరిపే నిగార్‌ని నేను ఊహించలేను. అయినా ఆమె ఎందుకు ప్రార్థించాలి? ప్రార్థనంత స్వచ్ఛమైన ఈ అమ్మాయి.. స్వర్గం వైపు చేతులసలు ఎందుకు చాపాలి?

మేం సెలవు తీసుకొని తిరిగి వస్తుండగా.. తన ఆశీస్సులు గులామ్ అలీ, నిగార్‌లకు ఉంటాయని, తానే దగ్గరుండి మరుసటి రోజు వివాహం జరిపిస్తానని బాబాజీ మాట ఇచ్చారు. అన్నట్టుగానే

వారు మరునాడు వచ్చారు. వాలంటీర్ల పరివారం దారి చూపుతుండగా, నగల వ్యాపారి హరిరామ్‌ని తోకలా వెంటేసేసుకొని వచ్చారు. వివాహ వేడుక కోసం అతి విశాలమైన వేదికను అప్పటికే సిద్ధం చేశారు. మహిళా వాలంటీర్లు.. నిగార్‌ను బాగా ముస్తాబు చేశారు. గులామ్ అలీ మాత్రం ప్రత్యేకంగా ఏమీ తయారు కాలేదు. ఎప్పటిలాగే ఆ రోజు కూడా.. విరాళాలు వసూలు చేయడం వంటి దైనందిన విధుల్లో పాల్గొన్నాడు. పెళ్లి కార్యక్రమం అయిపోయిన తరువాత కలిసి జాతీయ కాంగ్రెస్ జెండాని ఎగరేయాలని ఆ జంట నిశ్చయించుకుంది.

అప్పటికింకా బాబాజీ వేదిక వద్దకు రాలేదు. నేనూ, గులామ్ అలీ ఇద్దరమే ఉన్నప్పుడు ఏం చెప్పానంటే, 1919లో, అంటే కొన్నాళ్ల క్రితం జలియన్‌వాలాబాగ్‌లో సరిగ్గా ఏమి జరిగిందనేది మనం ఎప్పటికీ మరిచిపోకూడదన్నాను. ఈ పార్కులో ఒక బావి ఉంది. గుంపుల వైపు కాల్పులు జరుపుతున్న జవాన్లను జనరల్ డయ్యర్ ఆపే సమయానికి బావి నిండా శవాలు మేటవేశాయి. నేను వాడికి చెప్పిందేమిటంటే, ఈ బావిని ఈనాటికీ మంచినీళ్ల కోసం వాడుతున్నారని, ఆ నీళ్లు ఎంతో తీయగా పంచదారలా ఉంటాయని వివరించాను. బ్రిటిష్ జనరల్, అతడి ఆజ్ఞలపై కాల్పులు జరిపిన గూర్ఖా జవాన్లు పారించిన నెత్తుటి ఛాయలు ఈ నీళ్లలో లేశమాత్రమూ కనిపించవని వాడికి చెప్పాను. ఆ రోజువలే ఇప్పుడూ పార్కులో పువ్వులు విచ్చుకుంటున్నాయని, అవి అంతే అందంగా ఉంటున్నాయని విడమరిచి చెప్పాను.

పార్కులోని దట్టమైన చెట్లు, ఎత్తయిన మొక్కలు కప్పేసిన ఒక ఇంటిని వాడికి చూపించాను. ఆ ఇంట్లో ఒక యువతి ఉండేదని, పార్కులో కనిపిస్తున్న ఊచకోత దృశ్యాన్ని కిటికీలోంచి తొంగి చూస్తుండగా గుండు దూసుకొచ్చి ఆమె ఛాతీని చీల్చివేసిందని చెబుతుంటారు. ఆమె అప్పుడు నిలబడి ఉన్న గోడకు రక్తపు మరక అంటింది. కొంత జాగ్రత్తగా చూస్తే, ఇప్పటికీ నెత్తుటిచారలను చూస్తాం. నాకు బాగా గుర్తు, ఊచకోత జరిగిన ఆరు నెలలకు మా ఉపాధ్యాయుడు మా క్లాసు పిల్లలనందరినీ జలియన్ వాలాబాగ్‌కు తీసుకొచ్చాడు. అక్కడున్న మట్టిని గుప్పెట నిండా పట్టుకొని, "పిల్లలూ! మన అమరులు చిందించిన నెత్తురు ఇదిగో..ఈ మట్టికి ఎరువు అయిందనేది మీరు ఎన్నటికీ మరవొద్దు" అని ఆయన చెప్పాడు. అదే విషయం గులామ్ అలీకి గుర్తు చేశాను.

బాబాజీకి వాలంటీర్లు సైనిక పద్ధతుల్లో అభివాదం చేశారు. వారినీ, గులామ్ అలీని శిబిరం, దాని చుట్టుపక్కల పరిసరాలకు తోడ్కొని వచ్చి అక్కడ జరుగుతున్న కార్యక్రమాలను పరిచయం చేశారు. సాయంత్రం అవుతుండగా అమ్మాయిలు భక్తి గీతాలు ఆలపించడం మొదలుపెట్టారు. బాబాజీ కనులు మూసుకొని చాలాసేపు తదేకంగా ఆలకించారు. పాట పూర్తి అవగానే వారు చిన్నగా కనులు తెరిచారు. "ఈ ఇరువురు స్వేచ్ఛా ప్రేమికులు పవిత్ర వివాహ బంధంలో ఒకటి అవుతున్న శుభ సన్నివేశంలో పాలుపంచుకునేందుకు నేను ఇక్కడకు వచ్చాను" అని బాబాజీ అనగానే అక్కడున్న గుంపులో ఒక్కసారిగా ఉత్సాహం ఉరకలు వేసింది. నిగార్ జాతీయ కాంగ్రెస్ జెండాలోని మూడు రంగులు- జేగురు, ఆకుపచ్చ, తెలుపు - అద్దిన చీరను ధరించింది. హిందూ, ముస్లిం సంప్రదాయాలను మేళవించి పెళ్లి తంతుని జరిపించారు. అది అయిన వెంటనే బాబాజీ లేచి నిలబడి ప్రసంగించారు. "ఈ ఇరువురు ఇప్పుడిక మరింత ఇనుమడించిన అనురక్తితో దేశసేవకు అంకితం అవుతారు. వివాహానికి అసలు అర్థం సోదరభావంలోనే ఇమిడిఉంది. ఈరోజు ఇక్కడ జరిగిన పవిత్ర కార్యం అనేది దేశ స్వాతంత్ర్య సాధనకు తప్పక దోహదకారి అవుతుంది. తుచ్ఛమైన కామేచ్ఛని జయించినదే ఉత్తమ వివాహం అవుతుంది. ఎవరైతే తమ జీవితాల నుంచి ఈ దుష్టశక్తిని ప్రారదోలగలుగుతారో, వారు మహనీయులవుతారు" అని బాబాజీ హితబోధ చేశారు. వారి సుదీర్ఘ ప్రసంగంలో వివాహం పట్ల తనకున్న భావాలను విడమరిచే ప్రయత్నం చేశారు. బాబాజీ దృష్టిలో సంచికుత పరిమితులను దాటుకొని స్త్రీ పురుషుల సంబంధాన్ని గురించి ఆలోచించినప్పుడే వివాహంలోని నిజమైన ఆనందాన్ని అనుభూతి చెందగలుగుతాం. పరస్పరం శరీరాలతో ఆడుకుంటూ పొందే వినోదంలో ఎప్పటికీ అంతటి ఆనందాన్ని పొందలేం. వివాహంలో లైంగిక సంబంధానికి గల ప్రాధాన్యత గానీ, అసలు ఆ తంతు దానికోసమే ఏర్పాటయిందనే విషయం గానీ బాబాజీకి పట్టదు. ఆయన ఆలోచనలో అది భోజనం చేయడం వంటిది. భోజనాన్ని అయిష్టంగా తిని లేచిపోవాలి. బతకాలి కాబట్టి తిని చేతులు కడుక్కోవాలి. స్వాభావిక లైంగిక సంతృప్తిని పొందటంకన్నా వివాహ పవిత్రతని కాపాడటమే అతి ముఖ్యమని బాబాజీ తలుస్తారు.

తలాతోకా లేని బాబాజీ ఉపన్యాసాన్ని గులామ్ అలీ పూర్తి తన్మయస్థితిలోకి వెళ్లిపోయినట్టు.. ఆలకించాడు. బాబాజీ ప్రసంగం ముగింపునకు వస్తుండగా, పక్కనే ఉన్న నిగార్ వైపు వంగి ఏదో గుసగుసలాడాడు. బాబాజీ ముగించగానే.. గులామ్ అలీ ఒక్క ఉదుటున వేదిక వద్దకు వచ్చాడు. అప్పటికే మనిషి కొంత వణుకుతున్నాడు. భావోద్వేగంతో గొంతు తడబడుతోంది. "నేను మీ అందరి అనుమతితో ఒక ప్రకటన చేయాలనుకుంటున్నాను. అది ఏమిటంటే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేవరకూ నేనూ, నిగార్ భార్యాభర్తల్లా కాదు..సోదరీసోదరుల్లా మెలుగుతాం" అంటూ అదే ఉద్రేకంలో భార్య వైపు చూశాడు. "నిగార్! చెప్పు. భూమి మీద పడిన క్షణానే బానిసగా మారే సంతానానికి జన్మనిచ్చి తల్లిని కావాలని అనుకుంటున్నావా? లేదు. నీవు ఎన్నటికీ అలా చేయవు" అని మరింత భావోద్రేకంతో ఊగిపోయాడు. ఆ తరువాత కూడా పొంతన లేకుండా ఒక విషయం నుంచి మరో విషయంలోకి పోతూ ప్రసంగం సాగించాడు. అయితే, బ్రిటిష్ రాజ్ నుంచి దేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించిపెట్టడంపై భావోద్వేగంతో తాను చేసిన ప్రకటన నుంచి మాత్రం ఎక్కడా వెనక్కి పోలేదు. మాట్లాడుతూ మాట్లాడుతూ ఒక క్షణం నిగార్ వైపు చూశాడు. జేబులోని పర్సు నిండుకున్నదని తెలిసిపోయిన నిషారాయుడి అవస్థ ఆ క్షణాన వాడిలో కనిపించింది. ఆ మరుక్షణంలోనే సర్దుకొని బాబాజీ వైపు తిరిగాడు. "మా ఇరువురిని ఆశీర్వదించండి. ఈ వేదిక సాక్షిగా ద్రుఢచిత్తంతో మీకు మేమిద్దరమూ మాట ఇస్తున్నాం. ఈరోజు మేమిక్కడ చేసిన ప్రతిజ్ఞని నెరవేర్చి తీరుతాం" అని అన్నాడు.

గులామ్ అలీని ఆ మరునాడే పోలీసులు పట్టుకొని పోయారు. భారతదేశంలో బ్రిటిష్ రాజ్ సాగినంతకాలం తాను తండ్రిని కాబోనని

వాడు చేసిన వ్యాఖ్యలను దేశద్రోహంగా ప్రభుత్వం పరిగణించింది. బ్రిటిష్ రాజ్‌ని కూల్చడానికి ప్రయత్నించిన అభియోగంపై వాడికి ఎనిమిది నెలల జైలుశిక్ష విధించారు. పొరుగునే ఉన్న ముల్తాన్ 'లక్ష్యాని'కి పంపించారు. అమృత్‌సర్‌లో అప్పటికి అరెస్టు అయిన 'నియంత'ల్లో వీడు 40వ వాడు. సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లినవారిలో వాడి సంఖ్య 40,000.

అప్పట్లో ఉద్యమ పరిస్థితులను అంచనా వేస్తున్నవారిలా మాకు ఏమి అనిపించేదంటే బ్రిటిష్ రాజ్‌కు కాలం చెల్లిపోయిందని, రేపోమాపో, మహా అయితే కొన్ని రోజుల్లోనే ఈ వ్యవహారం ముగిసిపోతుందనిపించేది. అయితే, ఏ మాటకు ఆ మాట చెప్పుకోవాలి. ఏమైనా బ్రిటిష్‌వాడి తెలివే తెలివి! ఉద్యమాన్ని బాగా రగలనిచ్చి, నాయకులతో ఒప్పందాలు చేసుకునేవాడు. అంతే.. అప్పటిదాకా అగలుపొగలు కక్కుతున్న ఉద్యమం ఒక్కపెట్టున చప్పబడిపోతుంది.

జైలు నుంచి ఒక్కొక్కరుగా విడుదల అవుతున్న కార్యకర్తలకు బయట వాతావరణం మారిపోయినట్టు అర్థం అవుతూ ఉంది. వారిలో అత్యధికులు తెలివిగా తిరిగి తమ సాధారణ, ఒకనాడు తాము నిస్సారం అనుకున్న జీవన సాగరంలోకి మళ్లిపోతున్నారు. ఏడునెలల కారాగారం తరువాత షాజాదా గులామ్ అలీ విడుదల అయి వచ్చాడు. మునుపటంత ముప్పిరిగొనే ఉత్సుకత కనిపించడం లేదనేది తెలుస్తూనే ఉంది. అయినా, అమృత్‌సర్ రైల్వే స్టేషన్‌లో భారీ సందోహం వాడికి ఘన స్వాగతం పలికింది. నగర వీధుల గుండా ఊరేగింపుగా తోడ్కొని పోయింది. గులామ్ అలీ రాక సందర్భంగా నగరంలో పలు చోట్ల సమావేశాలు ఏర్పాటయ్యాయి. ఇంత జరుగుతున్నా, గతంలో కనిపించినంత ఊపుని గానీ, ఉద్వేగాన్నిగానీ అవేవీ తీసుకురాలేకపోతున్నాయి. అలసిసొలసిన భావన ఏదో మనుషుల్లో కనిపిస్తున్నది. అది ఎలా ఉన్నదంటే మరథాన్‌లో పరుగు తీస్తున్నవారిని నిర్వాహకులు అర్థంతరంగా మధ్యలోనే ఆపేసి వెనక్కి పిలిచి.. తిరిగి పరుగు తీయమన్న చందంగా వారిలో తీవ్ర అసహనం, అలసట కనిపిస్తున్నాయి.

ఏళ్లు గడిచిపోయాయి. కానీ, అప్పుడంత గొప్పగా మరెప్పుడూ రోజులు గడవలేదు. నా జీవితంలో చిన్నా పెద్ద విప్లవాలు ఎన్నో వచ్చాయి. పోయాయి. ఈ క్రమంలో నేను కాలేజీలో చేరాను. వరసగా రెండుసార్లు డమికీలు కొట్టాను. ఈ లోగా నాన్న చనిపోయాడు. ఏదైనా పని దొరుకుతుందేమోనని ఆఫీసుల చుట్టూ తిరిగాను. ఎట్టకేలకు మూడో శ్రేణికి చెందిన ఓ చౌకబారు పత్రికలో పని దొరికింది. కానీ, రోజంతా పని..పని.. అని చావగొడుతుండటంతో అక్కడ మానేసి, అలీగఢ్ యూనివర్సిటీలో చేరాను. ఆ తరువాత కొద్దిరోజులకే తీవ్రంగా జబ్బుపడ్డాను. వాతావరణం మారితే మంచిదన్న ఉద్దేశంతో కశ్మీర్‌కు పంపించారు. అక్కడ కొంత కాలం ఉండి ముంబైకి వచ్చాను. అప్పట్లో ఆ నగరంలో ఎప్పుడూ హిందూ, ముస్లిం మధ్య గొడవలు జరుగుతుండేవి. దానివల్ల నేను ఢిల్లీకి మకాం మార్చాను. ఢిల్లీ నగర జీవితంలోని నింపాదితనం, నిస్సత్తువ నచ్చక తిరిగి ముంబై చేశాను. ముంబై నగరం ఎలాంటిదంటే ఒకడి గొడవ ఒకడికి పట్టదు. కొత్తగా ఎవరైనా వస్తే, వాడి కోసం ఒక క్షణం సమయాన్ని కేటాయించగల పరిస్థితి ఉండదు.

అమృత్‌సర్‌ని వదిలిపెట్టి వచ్చి ఎనిమిదేళ్లు అవుతుంది. నా చిన్ననాటి స్నేహితుని విశేషాలు గానీ, నా తొలి యవ్వనదినాలు గడిపిన అక్కడి వీధులు, కూడళ్ల గురించిగానీ నాకేమీ తెలియవు. ఇన్నాళ్లలో నేను ఎవరికీ ఎలాంటి ఉత్తరాలు రాయలేదు. నిజం చెప్పాలంటే, నేను బతుకుతున్న ఈ వర్తమానం పట్ల తప్ప గతం పట్ల గానీ, భవిష్యత్తు పట్ల గానీ నాకు ఎలాంటి ఆసక్తి లేదు. నా దృష్టిలో గతం అనేది ఖర్చు పెట్టేసిన డబ్బు. దాని గురించి ఆలోచించడం ఎలాంటిదంటే నీ దగ్గర లేని డబ్బుల లెక్కలను ఖాతా పుస్తకంలో నమోదు చేసినట్టు ఉంటుంది.

ఒక రోజు మధ్యాహ్నం ఎటయినా వెళ్లిరావడానికి నాకు కొంత సమయం చిక్కింది. చేతిలో కొంత డబ్బు కూడా ఉండటంతో మేజోళ్లు కొందామని బయలుదేరాను. ఒకసారి వీధుల్లో వెళుతున్నప్పుడు ఆర్మీ అండ్ నేవీ స్టోర్‌కు పక్కన ఒక షాపుని చూశాను. షాపు చూడటానికి చిన్నదిగా ఉన్నదిగానీ, చాలా అందంగా ఆకర్షణీయంగా ఉంది. అయితే, ఎంత వెతికినా ఆ షాపు కనిపించలేదు. కానీ, ఆ ప్రాంతంలోనే మరో షాపు కంటపడింది. 'మనస్థాయికి ఫరవాలేదు' అనిపించి.. లోపలకు వెళ్లాను. 'రబ్బర్ తోలు మేజోళ్లు చూపింపు" అని అక్కడున్న అబ్బాయిని అడిగాను. 'అవి మా దగ్గర లేవు సార్' అని అతడు తల అడ్డంగా ఊపాడు. వర్ష రుతువు ఎప్పుడైనా ఊడిపడేలా వాతావరణం మారుతుండటంతో, పొడవాటి రబ్బరు బూట్లు చూపించమని అడిగాను. 'అవీ మా దగ్గర లేవు సార్. అదిగో ఆ మలుపు దగ్గరున్న షాపులో సంప్రదించండి. మా దగ్గర అయితే రబ్బరుతో చేసిన ఉత్పత్తులేవీ లభించవు" అని అతడు చెప్పాడు. నాకు ఆశ్చర్యం అనిపించింది. 'ఎందుకు?' అని అడిగాను. 'అది మా యజమాని ఆదేశం' అని చెప్పి తన పనిలో పడిపోయాడు. 'రబ్బరు ఉత్పత్తులే అమ్మరట! ఇదేమీ షాపురా బాబూ..' అనుకుంటూ బయటకొచ్చాను. అక్కడ రోడ్డు మీద ఒక వ్యక్తి చిన్న బాబును భుజాన వేసుకొని నారింజపండ్ల బండి దగ్గర బేరాలాడటం కనిపించింది. కాస్త దగ్గరగా వెళ్లి చూస్తే వాడు.. గులామ్ అలీ.

సంభ్రమాశ్చర్యాలతో 'గులామ్ అలీ' అని పెద్దగా కేక పెట్టాను. వాడు దిక్కున చూసి..అంతే గట్టిగా 'సాదత్' అంటూ గట్టిగా నన్ను ఆలింగనం చేసుకొన్నాడు. మా ఇద్దరి వ్యవహారం ఆ చిన్నారికి నచ్చినట్టు లేదు. ఒక్కపెట్టున ఏడుపు లంఘించుకున్నాడు. గులామ్ అలీ వాడిని ఊరడిస్తూ.. షాపులోకి దారితీశాడు. ఇప్పటిదాకా నేను మాట్లాడిన అబ్బాయికి పిల్లాడిని ఇచ్చి, ఇంటి దగ్గర వదిలేసి రమ్మని పంపించాడు. ' చాలా ఏళ్లు అయింది కదా?' అని గులామ్ అలీ అన్నాడు. వాడు మునుపటిలా లేడు. బాగా మారిపోయాడు. వాడిక ఎంతమాత్రం జలియన్‌వాలాబాగ్‌లో ఉద్రేక ప్రసంగాలు చేస్తూ నేత దుస్తుల్లో మెరిసిపోయే విప్లవకారుడు కాడు. చాలా సాదాసీదాగా, సంసారపక్షంగా ఉన్నాడు. ఆ పిల్లాడు ఎవడు? వాడితో మాట్లాడుతున్నా నాడు వాడు చేసిన ప్రసంగం చుట్టూ నా ఆలోచనలు తిరుగుతున్నాయి. "నిగార్! చెప్పు. భూమి మీద పడిన క్షణానే బానిసగా మారే సంతానానికి జన్మనిచ్చి తల్లిని కావాలని అనుకుంటున్నావా? లేదు. నీవు ఎన్నటికీ అలా చేయవు"

అని నిగార్ వైపు చూస్తూ వాడన్న మాటలు పదేపదే జ్ఞప్తికి

వస్తున్నాయి. "ఆ పిల్లాడు ఎవరబ్బాయి?" అని అడిగాను. 'మా వాడే. వీడికన్నా ముందు ఇంకొకడు ఉన్నాడు' అని ఎలాంటి తొట్రుపాటు లేకుండా గులామ్ అలీ చెప్పాడు.

నా మెదడంతా ప్రశ్నల పుట్టలా మారిపోయింది. అసలు ఏమి జరిగింది? వీడు ఆనాడు తానుచేసిన ప్రతిజ్ఞని వదిలేశాడా? లేక మొత్తంగా రాజకీయ జీవితాన్నే వదిలేశాడా? దేశ స్వాతంత్ర్యం కోసం పడిన ఆరాటమంతా ఏమయింది? నేను యెరిగిన ఆగ్రహోదగ్ధ విప్లవకారుడు ఏమయ్యాడు? నిగార్‌కు ఏమయింది? ఒక బానిస బిడ్డకు జన్మనివ్వాల్సిందిగా ఆమెను ఏ శక్తులు ప్రేరేపించాయి? పోనీ వీడు రెండో పెళ్లిగాని చేసుకోలేదు కదా?..

చెదల్లా ప్రశ్నలు నన్ను తినేస్తుండగా, "మనం ఒకరిని ఒకరం చూసుకొని ఏళ్లు గడిచిపోయాయి. మనం చాలా విషయాలు మాట్లాడుకోవాలి" అని గులామ్ అలీ అన్నాడు. ఎక్కడ నుంచి ప్రారంభించాలో అర్థంకాక తన్నుకులాడుతుంటే వాడే మొదలు పెట్టాడు. "ఇది నా షాపే. రెండేళ్లుగా బొంబాయిలోనే ఉంటున్నాం. రాస్తే చాట భారతం అయ్యేంత కథ ఉంది. మన చిన్నప్పటి రోజులు నీకు గుర్తు ఉన్నాయా? మనిద్దరం ఇల్లు వదిలిపెట్టి ఇదిగో.. ఈ బొంబాయికే వచ్చాం. దేవుడా! కాలం ఎలా తిరిగొచ్చిందో చూశావా?" అనివాడు అంటుండగా ఒక వ్యక్తి షాపులోకి వచ్చాడు. టెన్నిస్ షూస్ కావాలని అతడు అడగ్గా, అదిగో.. ఆ మలుపులోని షాపుకి వెళ్లండి అని అతడికి అటువైపు దారిచూపించాడు. "అయినా మీరు రబ్బర్ ఉత్పత్తులను ఎందుకు అమ్మడం లేదు? నీకు తెలుసా నేను కూడా షూస్ కోసం మీ షాపులో అడిగాను" అని ఆసక్తిగా వాడి వైపు చూశాను. "పెద్ద కారణం ఏమీ లేదు. ఆ ఉత్పత్తులంటే నాకు ఇష్టం లేదు. అంతే"అని ముక్తసరిగా సమాధానం ఇచ్చాడు. "ఏ ఉత్పత్తులు?" కాస్త నొక్కి అడిగాను. "అవే.. గగుర్పొడిచే రబ్బరు వస్తువులు. ఎందుకనేది నేను నీకు వివరంగా చెబుతాను' అంటూ కొద్దిసేపు ఎటో చూశాడు. ఆసక్తిగా చూస్తున్న నాకు, వాడి అందమైన ముఖంలో నల్లటి మబ్బులు కమ్ముకోవడం స్పష్టంగా కనిపించింది. "ఛ! ఎంత చెత్త జీవితం. సాదత్! దెయ్యం పట్టినట్టు రాజకీయాలు నా నెత్తిన ఎక్కి కూర్చున్న రోజులను నేను ఎన్నడో మరిచిపోయాను. ఇది నిజం. నన్ను నమ్ము. ఇప్పుడు నేను చాలా..అంటే చాలా ఆనందంగా ఉన్నాను. నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యాపారం కూడా బాగా సాగుతోంది" అని గులామ్ అలీ చెప్పుకుపోతున్నాడు.

ఇంతలో షాపులో పనిచేసే అబ్బాయి తిరిగి రావడంతో, నన్ను వెంటబెట్టుకొని షాపుకు వెనకగా ఉన్న ఒక గదిలోకి తీసుకుపోయాడు. కొద్ది నిశ్శబ్దం తరువాత తన కథ చెప్పడం ప్రారంభించాడు. "తొలిదినాల్లో నా రాజకీయ జీవితం ఎలా మొదలయిందో, అసలు నేను ఎలాంటి వాడినో నీకు బాగా తెలుసు. అంటే నేను అంటున్నది, మనిద్దరం కలిసి పెరిగాం. కలిసి తిరిగాం. చెప్పుకోవడానికి అంత గొప్ప విశేషమేదీ మన జీవితంలో లేదు. నేనంత ద్రుఢ చిత్తుడినేమీ కాదు. కానీ, జీవితంలో ఏదో సాధించాలని మాత్రం ఉండేది. దేవుడి సాక్షిగా చెబుతున్నాను. ఇప్పుడు ఎలాగయితే ఒక జీవనసరళికి సిద్ధపడ్డానో, అప్పుడూ అంతే గట్టిగా, ద్రుఢంగా దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాన్ని అంకితం చేయాలని నిర్ణయించుకున్నాను. అనేక అనుభవాలను, ఎదురుదెబ్బలను చవిచూసిన తరువాత, దేశ రాజకీయాలకు గానీ, దేశ రాజకీయ నాయకులకు గానీ అంత పరిణతి లేదని నిర్ధారించుకొన్నాను. సముద్రంలో తుపాను పుట్టినట్టే పుట్టి.. ఇంతలోనే తీరం ప్రశాంతమయిపోతుంది. అప్పటికప్పుడు తోసుకొచ్చే పరిణామాలకు, ఘటనలకు తగినవిధంగా స్పందించే గుణం ఉద్యమానికీ, నాయకత్వానికీ కొరవడింది" అని ఆవేదన నిండిన స్వరంతో అన్నాడు.

"చూడు సాదత్! మనిషి మంచివాడా చెడ్డవాడా అనేది ముఖ్యం కాదు. ఏ ప్రయోజనం కోసం భగవంతుడు వాడిని సృష్టించాడో దానికోసం బతికితీరాలి. గుండు కొట్టించుకొని, కాషాయం ధరించి, విబూది రాసుకొని..ఆ తిప్పలన్నీ పడకుండానే నీవు పవిత్ర జీవితం గడపొచ్చు. ఇవన్నీ చేయాలని చెప్పే మహానుభావులు మరిచిపోతున్న విషయం ఏమిటంటే, పవిత్రతని కాపాడుకోవడం పేరిట దడులు కట్టి, కంచెలు వేసి, దానికొక మహత్తుని ఆపాదించి చేసే తతంగమేదీ..దాన్ని పాటించేవారికి పట్టనే పట్టదు. చివరకు ఏమి జరుగుతుందంటే క్రతువులు మిగిలిపోయి, వాటి పరమార్థం మాత్రం పులుసుగారిపోతుంది. అంతెందుకు మన ప్రవక్తలనే తీసుకో. వారి బోధనలేవీ అట్టేకాలం నిలిచి ఉండవుగానీ శిలువలు, జంధ్యాలు, కత్తెర ముఖం యెరగని జట్టు రూపంలో వాటి ప్రతీకలు మాత్రం మిగిలి ఉంటాయి. ఆ మహానుభావులు మనలో ఉన్న మూల స్వార్థాన్ని చంపుకోవాలని సెలవిచ్చారు. అదే జరిగితే.. ఈ ప్రపంచం ఎలా ఉంటుందో కదా!" అంటూ ఒక క్షణం ఆగి తిరిగి చెప్పడం ప్రారంభించాడు.

"సాదత్! స్వతహా:సిద్ధ మానవ ప్రవృత్తికి దూరమయి నేనెంత నరకం అనుభవించానో నీవు ఊహించలేవు తెలుసా? ఏదో ఉత్సాహంలో, పిల్లలను కనమని అప్పుడు అలా నేను ప్రతిజ్ఞ చేశాను. రోజులు గడుస్తున్నకొద్దీ నా శరీరంలోని ఒక ముఖ్యమైన భాగం చచ్చుబడిపోయినట్టు అనిపించడం మొదలైంది. అన్నింటికన్నా ముఖ్యంగా ఇదంతా నా చేజేతులా నేనే చేసుకున్నాదనే భావన కుదిపేస్తూ ఉండేది. నేను తీసుకొన్న ప్రతిజ్ఞ గుర్తొచ్చినప్పుడల్లా గర్వపడిన గడియలు గతించిపోయాయి. చిన్నగా జ్ఞాన పొరలు తెరుచుకొంటూ తెలివిడిలోకి వస్తుండగా, నేను తీసుకొన్న స్వీయ సంకల్పం వాస్తవం ముందు తల వొంచక తప్పదని అనిపించింది. జైలు నుంచి బయటకొచ్చిన తరువాత నిగార్‌ను కలిసినప్పుడు ఆమె ఎంతో మారినట్టు కనిపించింది. బాబాజీకి ఇచ్చిన మాట మేరకు ఒక ఏడాది విడివిడిగానే ఉన్నాం. అదంతా ఒక నరకం! ఆ కాలమంతా రుచీపచీ లేని నిస్సారపు వైవాహిక జీవితాన్ని గడిపాం" అని ఊపిరి కోసం అన్నట్టు ఆగి.. తిరిగి తన కథలోకి వెళ్లిపోయాడు.

"బయట ప్రపంచం కూడా మారిపోయింది. విప్లవ నినాదాలకు, నేత బట్టలకు, త్రివర్ణ జెండాలకు కాలం చెల్లిపోయింది. జలియన్‌వాలాబాగ్‌లోని శిబిరాలు మాయమయ్యాయి. ఒకనాడు భారీ జన సందోహంతో కిటకిటలాడిన పరిసరాల్లో.. దానికి గుర్తుగా అన్నట్టు లోతయిన గుంతలు మిగిలాయి. రాజకీయాల మాట వింటేనే నరాల్లోకి నెత్తురు సర్రున పాకే ఉద్విగ్నతకి దూరం అయిపోయాను. రోజులో ఎక్కువ సమయం ఇంట్లోనే ఉండేవాడిని. దగ్గర దగ్గరగా ఉన్నా మాలో ఏమి జరుగుతున్నదనేది మనసు విప్పి మాట్లాడుకోలేక పోయేవాళ్లం. ఆమెను తాకాలంటేనే భయంగా ఉండేది. నా మీద నాకే నమ్మకం పోయింది. ఒకరోజు ఏమి జరిగిందంటే, ఇద్దరూ

(మిగతా 29వ పేజీలో...)

సీరియల్

సూర్యోదయ

- కె.వి. కూర్మనాథ్



(13)

(గత సంచిక తరువాయి...)

రవీందర్, రైతు

ఆ రోజు ఊరు ఊరంతా అగ్గిలా మండుతోంది.

కోపంతో రగిలిపోతూ వుంది. రెండుగా విడిపోయి వుంది.

రెండుగా విడిపోయింది కానీ, ఒక భాగమే గట్టిగా మాట్లాడుతోంది.

ఒక భాగమే అరుస్తున్నది. ఒర్రుతున్నది. పూనకం వచ్చినట్టు వూగిపోతున్నది.

మరో భాగం మిన్నకుండి పోయింది. కోపాన్ని పళ్లబిగువున దాచుకుంటున్నది. మాట్లాడే ధైర్యం చెయ్యలేకున్నది.

"ఇక రాములుకి కొరడా దెబ్బలే. గుంజకి కట్టేసి కొడతారు నా ....లు," అంది లచ్చుమమ్మ. మనసులోనే అనుకుంది. మనసులోనే అనుకున్నాని అనుకుంది. కానీ బయటకే అన్నది. ఒకరిద్దరు తలలూపారు.

"ఏమీ చెయ్యకపోతేనే కాల్చుకుతింటారు. దొంగతనం చేస్తే ఊరుకుంటారా," అని పక్కనున్నామె.

రాములు నాకు చిన్నప్పటి మిత్రుడు. నాలుగెకరాల భూమి వుండేది రాములికి. మెట్ట రైతు భాగ్యం గురించి తెలీంది ఎవరికి వర్షం పడితేనే పంట. పండినా మిగిలేది ఏమిటి? పండితే నాలుగు గింజలు, పండకపోతే అప్పులు. ఓ వాన పడి ఆగిపోతే, విత్తు మొలకెత్తి ఆగిపోతే మరో వానకోసం ఎదురుచూపు. మొలకెత్తి చచ్చిపోయిన విత్తు స్థానంలో మరో విత్తుకోసం అప్పు. అప్పులు తడిసి మోపెడై పంట పండినా నవ్వు మిగిలేది కాదు.

ఆ ఏడూ అలానే జరిగింది.

మూడుసార్లు విత్తు వెయ్యాల్సి వచ్చింది. ఎరువులూ, చీడపీడలకోసం మందులు - వీటితో అప్పులు చేశాడు రాములు. పంటైతే పండింది కానీ, అప్పు లెక్క తేలే వరకూ పంటమీద చెయ్యి వెయ్యడానికి వీల్లేదన్నాడు దొర. ఆ వూళ్ళో విత్తనాలమ్మేది,

నాగళ్ళమ్మేది, పురుగుమందులమ్మేది, పంట పండితే కొనేది – అన్నీ దొరే. దొర, దొర కాకపోతే దొర పెట్టిన మనుషులు.

రాములు పంటే కాదు, ఆ ఏడు ఎవరి పంటా పండలేదు. పండలేదా అంటే పూర్తిగా పండలేదని కాదు పదిబస్తాలు పండాల్సిన చోట రెండు బస్తాలు పండింది. పది బస్తాలు పండితేనే తీరని బాధలు, తీరని అప్పులు రెండో, మూడో బస్తాలు పండితే ఎలా తీరతాయి? ఇల్లు ఎలా గడుస్తుంది? బట్టల సంగతో, పిల్లల చదువుసంగతో పక్కన పెట్టండి. కనీసం, ఆకలితీరాలి కదా.

చిన్న రైతులందరూ అప్పుల్లో వున్నారు. పీకల్లోతు బాధల్లో వున్నారు. అందరూ ఏంచేశారో, ఏం చేస్తున్నారో తెలీదు.

"అప్పుల లెక్కలు తేలేవరకూ, అప్పులు ఎలా తీరుస్తారో చెప్పేవరకూ, గింజ ముట్టడానికి వీల్లేదు," అన్నాడు దొర. ఎక్కడి పంట అక్కడే ఆగిపోయింది. పండిన నాలుగ్గింజలూ కల్లంలోనే వుండిపోయాయి. ఎవరి కల్లంలో పంట వాళ్ళ కల్లంలోనే వుండిపోయింది. లెక్క తేలేవరకూ ఎవరి కళ్ళానికి వాళ్ళే కాపలా.

* * *

కడుపుమండిందో, పిల్లల ఆకలి చూసి గుండే రగిలిందో, ఇంకెక్కడా అప్పుపుట్టలేదో రాములు ఒక రోజు కుంచెడు బియ్యం ధాన్యం దొంగతనం చేశాడు. దొంగతనమంటే ఎవరింట్లో ధాన్యాన్నో కాదు. తన పంటలోదే, తన కల్లంలోదే ఓ కుంచెడు బియ్యాన్ని "దొంగిలించాడు".

దొంగిలిస్తూ పట్టుబడి పోయాడు.

దొర దగ్గర మార్కులు కొట్టేయ్యడానికి, దొర దగ్గర మెప్పు పొందడానికి రాములు పొలం పక్కన వుండే రైతు దొరకి ఉప్పందించాడు.

దొర అగ్గిమీద గుగ్గిలమయ్యాడు.

చిందులేశాడు.

దొంగలం......లకి సిగ్గూ శరం లేదని రంకెవేశాడు

ఊరంతా చాటింపు వేశాడు, రాములి తప్పుకి శిక్ష వెయ్యడానికి పంచాయితీ ప్రకటించాడు.

అందుకే ఆ ఎండాకాలం మధ్యాహ్నం రావి చెట్టు కింది చప్టా దగ్గరికి అందరూ చేరేరు. పిల్లలూ, పెద్దవాళ్లూ రైతులూ, రైతులు కాని వాళ్ళు, దొర బంధువులు, స్నేహితులు – అందరూ చేరేరు.

* * *

ఇది సూర్యుడికి పరిచయం వున్న ఒకానొక రవీందర్. ఓ ఇరవై ఏళ్ల ముచ్చటని నాతో పంచుకున్నాడు, నేను వాళ్ళ వూరు వెళ్ళినపుడు.

* * *

"నేను కూడా వెళ్ళేను ఆ పంచాయితీకి," అన్నాడు రవీందర్ నాతో.

సూర్యుడి గురించి నేను రాస్తున్న నవల గురించి తెలిసినపుడు యాదగిరి, " అయితే నిన్ను రవీందర్ కి కలిపించాలి తప్పక," అన్నాడు.

ఓ రోజు తీసుకెళ్ళాడు, రవీందర్ ఇంటికి. రవీందర్ కి ఇప్పుడు అరవై ఏళ్ళు వుంటాయేమో. తల, గెడ్డం, మీసం పూర్తిగా తెల్లబడిపోయింది. జీవితంలో నూరు యుద్ధాలు చేసి, యుద్ధ తంత్రాలగురించి అలవోకగా చెప్పగలిగే సేనానిలా వున్నాడు. సిగరెట్లూ, బీడీలూ తాగడంవల్లనేమో గొంతు జీరబోయి, గంభీరంగా వుంది. మైకులో మాట్లాడున్నవాడిలా వుంది రవీందర్ గొంతు.

మూడుగదుల శ్లాబ్ ఇల్లు, ముందు పశువుల పాకలో మేతకెళ్లొచ్చిన గొడ్లున్నాయి.

నన్ను పరిచయం చేసి, విషయం చెప్పేదు యాదగిరి. చాయ్ లు అవీ అయ్యాక, "రాములు సంగతి చెప్తే సూర్యుడి గురించి నీకు తెలుస్తుంది," అన్నాడు.

* * *

"రాములు నాకు దోస్తు. ఒక తల్లి కడుపులో పెరగలేదు కానీ, అన్నదమ్ముల్లా పెరిగేం. ఈనలభై ఏళ్లలో మేం విడిగా వున్నది లేదు. వాడికి నాతో తప్ప అంత చనువూ స్నేహం ఇంకెవరితోనూ లేదు. అందుకే దండోరా వినగనే పరిగెత్తుకు వెళ్ళేను రాములింటికి."

"ఏందిరా, రాములూ," అన్నాను.

కోపంతోనో, దుఖ్ఖంతోనో కళ్ళు ఎర్రబడివున్నాయి. కన్నీళ్లు వచ్చి ఆగిపోయాయో, రాడానికి సిద్ధంగా వున్నాయో తెలీదం లేదు.

ఇంటిముందు అరుగుమీద కూచుని వున్నాడు. అప్పటికే చీకటి పడిపోయింది. భార్య ఇంట్లో వున్నట్టుంది. కొడుకు ఎక్కడో ఆడుకుంటున్నట్టున్నాడు.

నాకోసమే చూస్తున్నట్టు, లేదాఎవరు ముందు అడుగుతారా అన్నట్టు మొదలు పెట్టేడు.

"మూడురోజులైంది ఇంట్లో మీ చెల్లి వండబట్టి. ఎక్కడికెళ్లినా అప్పుపుట్టలేదు. ఏం, నేను పక్కింట్లో కన్నం వేశానా," అన్నాడు.

అవును, రాములు ఎక్కడా కన్నం వేయలేదు. ఎక్కడా దొంగతనం చేయలేదు. పంట తనదే. కానీ, దొర చేతిలో వుందది. నాకు ఏదో తెలుస్తూ వుంది, కానీ పూర్తిగా తెలియడం లేదు.

నేను ఏం మాట్లాడి ఓదార్చానో నాకు తెలీదు. ఏం చెప్పి, ధైర్యం ఇచ్చానో తెలీదు.

"చూద్దాం," అని మాత్రం అన్నాను.

దొర తీర్పు చెప్పనీ, దాని బట్టి ఆలోచిద్దాం అన్నాను. నా ధైర్యం ఏమిటంటే, ఇదివరకులా దిక్కులేని వాళ్ళం కాదిప్పుడు.

"సూర్యమన్నతో మాట్లాడొచ్చు," అనుకున్నాను.

* * *

పంచాయితీ మొదలైంది. ప్రజలు గునగునలకు పరిమితమయ్యారు. దొర, దొరమనుషులు గట్టిగా ఒర్రుతున్నారు. కేకలు వేస్తున్నారు. ఆరోపణ చేసేరు, వాదన చేశారు. సాక్ష్యం చెప్పించేరు. శిక్షవేయించారు. కొరడా దెబ్బలతో రాములు వాళ్ళు వుండైపోయింది. కానీ, అంతకుముందే రాములు మనసు చితికిపోయింది. అవమానమూ, కోపామూ, బాధా, అసహనమూ, నిస్సహాయతా – వీటన్నిటితో ఎవరో కాళ్లని పాతేసినట్టు, తనని ఎవరో నిలువునా పాతరేసినట్టు వుండిపోయాడు.

రక్తమూ, చెమటా రాములు వంటినిండా చారికలు కట్టేశాయి.

రాములి మూలుగులూ, ఇంటివాళ్ల అరుపులతో వూరివాళ్ళ కళ్ళలో బాధతో రక్తమే కారింది.

"నేను అప్పుడు ఏం చేశాను? ఏమీ చేయలేదు.

బహుశా నాకు రాముడి చేసిన తప్పు తప్పే అనిపించి వుండవచ్చు.

తప్పుకి పరిహారం చెల్లించాడని అనుకున్నా.

బహుశా నాకు ఆ తీర్పుని వ్యతిరేకించడానికి ధైర్యం సరిపోయి వుండకపోవచ్చు.

దెబ్బలు తింటుంటే రాములు వైపు చూడలేదని మాత్రం గుర్తుంది.

* * *

ఇది జరిగిన కొన్ని రోజులకే మొట్టమొదటిసారి జిల్లాలో అన్నల అలికిడి మొదలైంది.

ఆవూరొచ్చారని, ఈ వూరొచ్చారని, నేను ఆ వూరికీ చుట్టపు చూపుగా పోయినరోజే వచ్చారని, ఆ సమస్యగురించి మాట్లాడారని, ఈ పరిష్కారం చూపించారని మాట్లాడుకోవడం మొదలైంది. వూళ్ళో పోలీసుల అలికిడి పెరిగింది. జీపులు వచ్చిపోవుడు మొదలైంది. వాళ్ళు మా వూరు కూడా వచ్చారు. వాళ్ళు ఎవరై వుంటారా? ఏ సమస్యలు ఎలా పట్టుకుంటారు, అని మిత్రులం మాట్లాడుకుంటున్నాం, వాళ్ళు మా దగ్గరకు వచ్చారు. పల్లమెరిగిన నీళ్ళు ఒడుపుగా ఒంపులోకి జారినట్టు వచ్చారు.

ఎప్పుడో తప్పిపోయిన మిత్రుల్లాగా అనిపించారు నాకు. "రవీందర్ అన్నా ఎట్లున్నవే," అన్నారు ఓ తెలిసిన మిత్రుడితో నా దగ్గరకొచ్చి.

అలా కలిసిపోయారు. లేదా కలిసిపోయాను వాళ్ళతో. కలిసి పోవడం అంటే వాళ్ళతో వెళ్ళిపోలేదు. వాళ్లతోనే వున్నాను. అప్పటినుంచి, ఇప్పటిదాకా.

కలిసిన కొన్ని రోజులకే వూరి రైత్వారీ సమస్యలు చర్చకు వచ్చాయి. కరువు ఎలా కమ్ముకొస్తున్నదీ వాళ్ళకు వివరించాం. రాములు కూడా చెప్పేడు అప్పులు ఎలా రైతుల్ని కుంగదీస్తున్నాయో.

అన్నీ నోట్ చేసుకున్నారు.

* * *

ఓ రోజు నాతో పాటు మరి కొందర్ని తీసుకెళ్లారు వాళ్ళ సమావేశానికి.

ఇప్పుడు మీకిది కొత్తగా అనిపించక పోవచ్చు. వింతేముంది అనుకోవచ్చు. కానీ, ఏదో చిన్న రాపిడి, ఏదో చిన్న తెలివిడి కలిగించిన విషయం అప్పటి కాలమాన పరిస్థితుల నేపథ్యంలోంచి చూడాలి. అప్పటికి నాకది కొత్త. మన సమస్యల్ని ఏదో ఎవరింట్లోనో, పొలం గట్లపక్క చుట్ట కాల్చుకుంటూనో ఊసుపోకో, బరువు దించుకోడానికో మాట్లాడడం కాదు.

సమస్యలో వున్న వాళ్ళు కూచుని సమస్యని గుర్తించడం, దాన్ని వివరంగా చర్చించడం, దాన్ని సంగంగా కలిసి ఎలా పరిష్కరించు కోవడం - ఇరవై ఏళ్ల కిందట నాకు ఒక ఆశ్చర్యం. నాకే కాదు, రాములికీ, మా లాటి వాళ్ళు ఎందరికో కూడా ఆశ్చర్యం.

మా వూరునుంచే కాదు చుట్టుపక్కల మరికొన్ని వూళ్ళ నుంచి వచ్చారు మాలాటి వాళ్ళు. మాకు వున్న సమస్యలు వున్న వాళ్ళు. మాకులేని సమస్యలు వున్న వాళ్ళు.

ఆ సమావేశంలోనే కలిసేను సూర్యాన్ని. రాములు గురించి, నా గురించి అప్పటికే తెలుసుకుని వున్నట్టు వున్నాడు. మా సమస్యల గురించి విని వున్నట్టున్నాడు. పాత స్నేహితుల్లాగా పలకరించాడు.

నేను కూడా అప్పటికే అతడి గురించి వినివున్నాను.

నేను మొదటిసారి, ఆఖరిసారి కలిసిందీ అదే. ఆ తర్వాత కొన్ని వుత్తరాలు రాసేడు కానీ, మళ్ళీ ఎప్పుడూ కలిసే అవకాశం రాలేదు. కానీ కలిసిన ఆ ఒక్కసారీ సమస్యని ఎలా అర్థం చేసుకోవాలో నేర్చుకున్నాను.

అందరూ అన్నీ మాట్లాడాక ఒక లిస్ట్ సిద్ధం చేశారు. ఏవి తక్షణ పరిష్కారం కావాల్సినవి, వేటికి కొంత సమయం పడుతుంది అని.

సమావేశం ముగింపులో సూర్యుడు మాట్లాడాడు. ఒకటి రెండు పిట్ట కథలు చెప్పేడు. పేదరికం గురించీ, ఆకలి గురించీ, దాని వెనకవున్న చట్రాల గురించీ చెప్పేడు.

"పేదరికమే అతిపెద్ద హింస. నా చుట్టుపక్కల తినడానికి లేని వాళ్ళున్నారంటే అందులో హింస కనిపించాలి. పిల్లలు స్కూల్ కి వెళ్ళి చదువుకోవడం లేదంటే అందులో హింస కనిపించాలి. ఎవరైనా చిరిగిపోయిన బట్టలు కట్టుకున్నారంటే అందులో రక్తసిక్త హింస కనబడాలి," అన్నాడు.

చేతిలో వున్న సమస్యల లిస్ట్ ఒక సారి చూసేడు.

భారతదేశంలో ఎక్కడివలెనే మన దగ్గర కూడా భూమే సమస్య. అన్నీ సమస్యలూ భూమి చుట్టూనే.

"రాములు సంగతే తీసుకోండి. భూమి వున్నది. కానీ, పండించుకోలేకపోవడం ఓ పెద్ద హింస. దానికోసం మళ్ళీ మళ్ళీ అప్పులు చేయాల్సి రావడం. పండకపోతే ఒక బాధ. పండితే ఒక బాధ. పండకపోతే తినడానికి ఏమీ వుండదు, అప్పులు, వడ్డీలు అలానే వుంటాయి. పండితే గిట్టుబాటు ధర వుండదు. కాబట్టి పండింది అమ్మితే అప్పులే తీరవు ఇక తిండానికి ఏం మిగులుతుంది?"

రాములు గాని, రాములి కుటుంబ సభ్యులు గానీ ఏం తింటారు? ఏం తినాలి? ఎలా తినాలి? ఇది "రాములుకి పెద్ద సమస్య. ఎవరు వినాలి ఈ సమస్యని? ఎవరు తీర్చాలి?" అని అడిగాడు. సమాధానం కోసం కాదు తనడిగింది.

నాకు అనిపించింది. "రాములి సమస్య ఎవరిది? ఒక్క రాములిదేనా?" అని.

మళ్ళీ తానే అన్నాడు: " రాములి బంధువులా? మిత్రులా, చుట్టుపక్క వున్న వాళ్ళా? వూరా? పంచాయితీనా? ఎవరు ఆలోచించాలి రాములి సమస్య గురించి?"

బంధువులు, మిత్రులు, చుట్టుపక్కల వాళ్ళు తప్పకుండా సహాయం చేస్తారు. వున్నదాంట్లోనే ఇచ్చి పుచ్చుకుంటారు. ఇవ్వాలి. ఇస్తారు. కానీ వాళ్ళ పరిస్థితి రాములి పరిస్థితికంటే ఎంత భిన్నంగా వున్నది?

రాములి మొహం లోకి చూశాను. రాములి పరిస్థితి నా పరిస్థితిలాగే వుంది. మాకు తెలిసిన సమాధానాలకు ఆవల ఏదో కొత్త వివరణ వున్నట్టు అనిపిస్తోంది. అది మాకు అంతకుముందు పరిచయం వున్నది కాదు.

"రాములు నష్టపోతాడు. రవీందర్ అప్పుల్లో మునిగి వుంటాడు. రాములు లాటి వాళ్ళు, రవీందర్ లాటి వాళ్ళ పరిస్థితి ఎక్కడైనా ఒక్కటే. ప్రతి మెట్ట రైతు పరిస్థితి అంతే. విత్తనంకోసం అప్పు, ఎరువుకోసం అప్పు, పురుగుమందులకోసం అప్పు. అన్నీ కలిసి తడిసి మోపెడవుతున్నాయి. ఎప్పుడూ అప్పుల్లోనే వున్నాడు. కానీ విత్తనం అమ్మినవాడు, ఎరువు అమ్మినవాడు, పురుగు మందులమ్మే వాడు, అప్పులిచ్చేవాడు, ఉద్దరికిచ్చేవాడు ఎప్పుడూ లాభాల్లోనే వున్నాడు.

కొన్ని వూళ్లలో ఈ వ్యాపారాలన్నీ ఒకరిద్దరి చేతుల్లోనే వుంటాయి," అని వివరించేడు.

"పంట పోయి మిగిలిన నాలుగ్గింజలే రాలినా, అవి కల్లాల్లోనే వుండిపోయి దొర ఇంటికి వెళ్లిపోతాయి గాని రైతుకి మిగిలింది ఓ బొచ్చే. మన మొత్తం శ్రమా, శ్రమించేందుకు వాడే పనిముట్లూ మన వూళ్లోనే ఇంకో చోటికి పోతున్నాయి. సంపద వృద్ధి చెందుతోంది. న్యాయ భావన అనేదే ఏ కోశానా లేదు," అన్నాడు సూర్యుడు.

ఇంతకీ రాములు చేసిన నేరం ఏమిటి? కుంచెడు ధాన్యం తీసుకున్నాడు. ఎక్కడినుంచి? పక్కింట్లోంచో, దొర ఇంట్లోంచో కాదు. తను, తన కుటుంబం పగలూ రాత్రీ, నిద్రాహారాలు లేకుండా పండించిన పంట అది. అది రాములి కుటుంబ చమటలోంచి చుక్కల్లోంచి పండిన పంట. కానీ, అది దొర పరమైపోయింది.

ఒక్క రాములి కల్లంలోని పంటే కాదు. వూళ్ళోని దాదాపు అందరి చిన్న రైతుల పంట దొర ఒక్క చమట చుక్క కార్చకుండా తీసుకున్నాడు. తీసేసుకున్నాడు.

"మరి రాములు చేసింది దొంగతనమైతే, దొర చేసింది ఏమిటి? దొర, దొర చుట్టూ వుండే వ్యవస్థా మనమే దోషులని చెప్తుంది. మనల్ని మనమే దోషులని ఒప్పుకొమ్మంటుంది. నిజంగానే మనం అనుకుంటాం కూడా. నిజమే మనం చేసింది నేరమే కదా అని," అన్నాడు.

నాకు ఒక్క సారి చెంప మీద కొట్టినట్టు అనిపించింది. "నిజమే నేను కూడా అనుకున్నాను కదా. నమ్మాను కదా, రాములు చేసింది నేరమే కదా అని," అనుకున్నాను.

"ఎన్నో ఏళ్లుగా చేస్తున్నదేమిటి? దీని గురించి ఎవరు ఆలోచించాలి. ప్రభుత్వం కళ్ళు మూసుకుని వుంటుంది. దీన్ని మనమే పరిష్కరించుకోవాలి. మన శ్రమ ఫలితం మనదే కావాలి. మన పంట మనది కావాలి. అప్పుల వూబిలోంచి బయటకి రావాలి. మనం కొత్త పంటలు పండించుకోవాలి. మొక్కల్ని విషతుల్యం చెయ్యమని చెప్పే పురుగుమందుల దొంగ వ్యాపారానికి ముగింపు పలకాలి," అన్నాడు.

* * *

ఆ సమావేశంలో కొన్ని నిర్ణయాలు జరిగాయి.

నెల రోజుల తర్వాత మా వూళ్ళో కరువుదాడి జరిగింది. రాములు కల్లంలోని ధాన్యం రాములు ఇంటికి చేరింది. దొర కొట్టంలో మూల్గుతున్న బస్తాలు ప్రజల ఇళ్ళలో చేరాయి.

అప్పుడు మా ఇళ్లలోకి చేరిన ధాన్యం మాకు ఎన్నిరోజుల ఆకలి తీర్చిందో తెలీదు. కానీ, మాకు జీవితానికి సరిపడా ధైర్యాన్నిచ్చింది.

(25వ పేజీ తరువాయి...)

పక్క పక్కన కూర్చున్నాం. ఆమె ముఖాన్ని చేతుల్లోకి తీసుకొని గట్టిగా ముద్దు పెట్టాలని ఎందుకో వెర్రి ఆవేశం తన్నుకొచ్చింది. అంతే.. ముద్దు పెట్టుకొన్నాను. అంతలోనే ఏదో గుర్తు వచ్చినట్టు సర్దుకున్నాను. కానీ, అప్పుడు కలిగిన తీవ్రమైన అనుభూతి ఏదైనా ఉందో దాన్ని నేను మాటల్లో చెప్పలేను మిత్రమా! ఏదో పాపం చేస్తున్నామన్న భావన ఆ క్షణంలోనే మనసులోంచి తొలగిపోయింది. ఇకనీ అనంతగమైన వ్యవహారానికి తెరదించే దారిని వెతకాలని అనిపించింది. ఒకరోజు ఇద్దరం ఒక అంగీకారానికి వచ్చాం. పిల్లలను కనొద్దు, దానికి సంబంధించిన అన్ని జాగ్రత్తలు తీసుకుంటూనే.. భార్యాభర్తలుగా కలిసి ఉందామనే పద్ధతుల్లో సర్దుబాటు చేసుకున్నాం. ఆ రోజు నుంచి మా జీవితంలో కొత్త అధ్యాయం మొదలయింది. కానీ, అది ఎలాంటి జీవితం అంటే.. రెండు కళ్లు పోయిన వాడికి ఒక కన్నుకు చూపు వచ్చిన చందంగా ఉంది. మేం మా సంతోషాలను తీర్చుకోగలుగు తున్నాంగానీ, సంపూర్ణ దృష్టి ప్రాప్తిస్తే మంచిగుంటుందని మాకు అనిపించేది. అప్పటినుంచి ఇద్దరినీ విచారం కమ్మేసింది. మా జీవితాల్లోని ప్రతి భాగమూ రబ్బరుగా మారిపోతున్నట్టు అనిపించింది. చివరకు శరీరం కూడా ఎబ్బెట్టుగా సాగుతున్న భావన కలిగింది. నిగార్ మరింత దుర్భరమైన వేదనని అనుభవిస్తున్నది. తల్లి కావాలని ఆమెకు బలంగా ఉండేదిగానీ, ఏమీ చేయలేక తనలో తానే కుమిలిపోయేది. ఇరుగుపొరుగు ఇళ్లలో ఎవరికైనా పిల్లలు పుడితే..తాను ఆ రోజంతా మనిషి కాలేకపోయేది. గదిలో గడియ పెట్టేసుకొని పొగిలి పొగిలి ఏడ్చేది.

నా వరకు నాకు పిల్లల విషయంలో పెద్ద పట్టింపు లేదు. కాస్త ఆలోచిస్తే ఎవడూ, పిల్లలను కనాలని కనడు. ఈ ప్రపంచంలోని కోట్లాదిమంది తాము తలవకుండానే తండ్రులు అయిపోతుంటారు. నేను కూడా ఆ బాపతు వాడినే! కానీ, ఈ చేతులు.. చూడు ఇవి జిగటకారుతున్నట్టు అనిపించేది. దేన్ని తట్టుకొన్నా ఈ భావనని మాత్రం భరించలేకపోయేవాడిని. ఏది తిన్నా..రబ్బరుని తింటున్నట్టే ఉండేది. అది ఎలా ఉంటుందంటే బాగా సబ్బు రాసుకొని కడుగడం మరిచిపోయిన చేతులతో ఏదైనా పని చేయాలంటే ఎలా ఉంటుంది.. అలా ఉంటుదన్నమాట! నా మీదే నాకు అసహ్యం పుట్టింది. అసహజమైన, అవాస్తవికమైన ఈ రబ్బరు స్పర్శ తప్ప తక్కిన ప్రేరణలన్నీ నశించాయి. ఒక్కోసారి ఏమి అనిపిస్తుందంటే, ఇదిగో.. ఈ రెండు వేళ్ల మధ్య పట్టుకొని..నన్ను గుల్లచేస్తున్న ఈ మనోవ్యధని పెరికి అవతల పడేయాలని ఉంటుంది. కానీ, నాకు అంత ధైర్యం లేదు. అప్పుడు నా పరిస్థితి ఎలా ఉండేదంటే నీళ్లలో మునిగిపోతున్న వాడు గడ్డిపరక కోసం వెతుకులాడినట్లు అన్నిదారులనూ గాలించేవాడిని. ఒకరోజు ఎట్టకేలకు నేను అన్నాళ్లూ ఎదురుచూస్తున్న గడ్డిపరక దొరకనే దొరికింది. ఒక మత గ్రంథం తిరగేస్తున్నప్పుడు అది కంటపడింది. అంతే.. ఎగిరి గంతేశాను. ఆ గ్రంథంలో ఏమి రాసి ఉన్నదంటే "ఒకవేళ స్త్రీ పురుషులు వివాహ బంధంలోకి వెళ్లినట్టయితే, వారు తప్పనిసరిగా ఫలవంతులు కావాల్సి ఉంటుంది" అని అందులో స్పష్టంగా ఉంది. ఆ గడియలోనే నాకు శాప విముక్తి కలిగింది. ఇక వెనక్కి తిరిగి చూసుకోలేదు" అంటూ గులామ్ అలీ ముగించాడు.

అప్పుడే షాపులో పనిచేసే అబ్బాయి బాబుని ఎత్తుకొని మా గదిలోకి వచ్చాడు. పిల్లాడి చేతిలో బుడగ ఉంది. వాడు ఆడుతుండగా అది టప్పుమంది. చూస్తే.. పిల్లాడి చేతిలో బుడగకు కట్టిన దారం, దాని కొసన వికారంగా ముడుచుకుపోయి వేలాడుతున్న రబ్బరు మిగిలాయి. గులామ్ అలీ సాగిపోతున్న ఆ బుడగని జాగ్రత్తగా రెండు వేళ్లతో పట్టుకొని లాగేశాడు. రోత పుట్టించే ఏదో వికారమైన భావనని లాగి అవతల పారేసినట్టుగా..దాన్ని దూరంగా విసిరేశాడు.

వ్యాసం

"రాబంధు" వస్తోంది

- ఎం. ఆదిత్య

అది క్రీస్తు శకం 1498 ..అంటే సరిగ్గా 517 ఏళ్ల క్రితం వాస్కోడిగామా అనే ఓ బుడతకీచు భారతదేశంలో అడుగు పెట్టాడు. వ్యాపారం పేరిట వలస ఆధిపత్యానికి బీజాలు నాటాడు. ఆ వలస విధానమే దేశాన్ని బానిస సంకెళ్లల్లోకి దిగజార్చింది. ఇప్పుడు దేశానికి "స్వాతంత్ర్యం" లభించి 67 సంవత్సరాలు దాటింది... పెట్టుబడుల మత్తులో పడిన పాలకులు దేశ సార్వభౌమాధికారాన్ని సైతం తాకట్టు పెట్టి మరోసారి వలస విధానాన్ని దేశంలో పునస్థాపించడానికి పాశ్చత్య దేశాలకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారు...

ఒబామా పర్యటన నేపథ్యం

అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా రిపబ్లిక్ డే సందర్భంగా భారత్ లో పర్యటిస్తున్నారు. అమెరికా సామ్రాజ్య వాదం మన దేశంలోకి అడుగు పెట్టడం అంటే కార్మిక, శ్రామిక అణగారిన వర్గాల హక్కులు ఇక పాలక వర్గాల చేతుల్లో నాశనం కాబోతున్నాయి అని అర్థం. ఇది నిజంగానే ఆందోళన చెందాల్సిన సందర్భం. ఓ వైపు 150 దేశాల్లో యుద్ధ వాతావరణాలు సృష్టించి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ యుద్ధాలు చేస్తున్న యుద్ధోన్మాద అమెరికా ఇవాళ భారత దేశంలో తన మార్కెట్ ను విస్తరించుకునేందుకు సిద్ధపడుతోంది. మన విదేశాంగ విధానం బడా పారిశ్రామిక వర్గాలకు అనుకూలంగా మారడం, వారి కింద భారత పాలక వర్గ పార్టీలు తొత్తులుగా పనిచేయడం ఇప్పుడు మన కళ్ల ముందు కనిపిస్తున్న దృశ్యం. ఈ బడా కార్పోరేట్ అధిపతులంతా అమెరికా అనుకూల ఆర్థిక విధానాలతో అంకుల్ శాం కనుసన్నల్లో దేశాన్ని నెట్టేయాలని ఉవిళ్లూరుతున్నారు. అందుకు కారణం లేకపోలేదు. అమెరికా బహుళ జాతి కంపెనీలకు వీరంతా ప్రతినిధులు. సరళీకరణ ఆర్థిక విధానాల ఫలితంగా అమెరికా పెట్టుబడులకు భారత్ అతి పెద్ద మార్కెట్‌గా మారిపోయింది. మరో వైపు ప్రపంచ ఆర్థిక సంక్షోభం కొనసాగుతూనే ఉందని తాజాగా ఐఎంఎఫ్ లాంటి సంస్థలు పేర్కొంటున్నాయి. దీంతో మొత్తం పెట్టుబడిదారీ సమాజం పెను సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. దీంతో అమెరికా దాని అనుంగు దేశాలకు ఓ మార్కెట్ కావాలి. వారి పెట్టుబడుల వేట కత్తికి ఓ బలి పశువు కావాలి.. గత దశాబ్దంలో యూరప్‌ను, అక్కడి బ్యాంకులను దివాళా తీయించిన అమెరికా, దాని కార్పోరేట్ సంస్థలు ఇప్పుడు యూరప్ రుణ సంక్షోభంతో మరో కొత్త మార్కెట్ అన్వేషణలో పడ్డాయి. ఇక అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా పర్యటన నేపథ్యం విషయానికి వస్తే దీని వెనుక కారణాలు ప్రధానంగా భారత్ లాంటి మార్కెట్‌లో తమ పెట్టుబడులను రుద్దడం ప్రధాన ఉద్దేశ్యం. అందుకు అనుకూల వాతావరణం ఏర్పాటు చేసేందుకే కాషాయ శక్తుల ఆధ్వర్యంలో మెజారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు దేశీయ కార్పోరేట్ శక్తులు మోడీని ముందుకు తోశాయి. గతంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా కార్పోరేట్ కంపెనీల పెట్టుబడుల కోసం ప్రజా ప్రయోజనాలను తాకట్టు పెట్టిన ఘన చరిత్ర మోడీ సొంతం. పైగా కాషాయ శక్తుల విజృంభణ నీడన అటు అమెరికా అనుకూల ఉదారవాద ఆర్థిక విధానాలను అమలు చేయడంలో మోడీ దిట్ట. ఇదే అనువైన సమయం అని గుర్తించిన అమెరికా కార్పోరేట్ కంపెనీలు భారత్ పై పంజా విసిరేందుకు సిద్ధపడిపోతున్నాయి. గతంలో అమెరికా ఛీకొట్టిన మోడీ, భారత ప్రధానిగా అమెరికాలో పర్యటించి వారిని పెట్టుబడులు పెట్టేందుకు రమ్మని దగ్గరుండి ఆహ్వానించారు.

ఈ ఆహ్వానం అందుకున్న ఒబామా ఇదే అదనుగా ఓ వ్యాపార లాబీయిస్టు ముఠాను వెంట బెట్టుకుని ఢిల్లీలో వాలనున్నాడు. ఈ పర్యటనతో మోడీ సర్కారు అసలు రంగు బయట పడింది. గత యూపీఏ ప్రభుత్వాలు కూడా అమెరికా తొత్తులుగానే పనిచేసినప్పటికీ వారిపట్ల ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకతను గుర్తించి మోడీ రూపంలో కొత్త శక్తులను ప్రవేశ పెట్టాలని భారత పెట్టుబడి దారీ వర్గాలను ఆదేశించాయి. దీంతో మోడీ రూపంలో కార్పోరేట్ లాబీయిస్టులకు ఓ కొత్త శక్తి దొరికింది. అయితే అమెరికాతో మొదలవ్వనున్న ఈ బంధం దేశాన్ని ఏ అంచుల వైపునకు తీసుకెళ్తుందా అనే ఆందోళన అటు కార్మిక, శ్రామిక వర్గాల్లో నెలకొని ఉంది.

అమెరికా కూలిపోతున్న ఓ పెట్టుబడిదారీ విషవృక్షం

వంద గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలి వానకు చచ్చినట్లు ప్రపంచాన్ని గుప్పిట్లో ఉంచుకోవాలని చూసిన అమెరికా తాను గీసిన సామ్రాజ్య వాద చట్రంలోనే ఇరుక్కొని విలవిల్లాడుతోంది. నిజానికి సెప్టెంబర్ 11 దాడుల తర్వాత ఉగ్రవాదం పై పోరు పేరుతో మొదలు పెట్టిన అమెరికా యుద్ధోన్మాదం సిరియా పై యుద్ధ మేఘాలు కమ్మే వరకూ కొనసాగుతూనే ఉంది. మరో వైపు ఇరాక్, లిబియా, ఆఫ్ఘనిస్తాన్ లో మొదలు పెట్టిన యుద్ధంతో అమెరికాకు సైన్యం నిర్వహణా ఖర్చు తడిసి మోపెడయ్యింది. మరో వైపు పెంటగాన్ వర్గాల ఒత్తిళ్లతో ప్రపంచ వ్యాప్తంగా 150 దేశాల్లో యుద్ధవాతావరణాన్ని సృష్టించి అమెరికా ప్రపంచ పోలీసుగా మారింది. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ ముసుగులో నెత్తుపుటేరులు పారిస్తూనే, మధ్య ప్రాచ్యంలో ఇస్లామిక్ స్టేట్ పేరిట మరో నాటకానికి తెర లేపింది. ఇది అమెరికా యుద్ధోన్మాదానికి పరాకాష్ట.

ఇదే సమయంలో చమురు క్షేత్రాలపై ఆధిపత్యం కొనసాగిస్తున్న అమెరికా , తాను తీసుకున్న గోతిలోనే పడింది. సడెన్‌గా చమురు ధరలు పతనం కావడం మొదలయ్యాయి. అమెరికన్ షేల్ గ్యాస్, పెట్రోల్‌కు ఇది శరాఘాతం. దీని నేపథ్యంలో రష్యాను దెబ్బతీసేందుకు యూరో జోన్ లో కొత్త నాటకాలకు తెర తీసింది అమెరికా. వెరసి ఈ అంతర్జాతీయ కుట్రలన్నింటిలోనూ అమెరికా దాని కార్పోరేట్ శక్తులు

తీవ్రంగా నష్టపోయాయి. అలాగే అమెరికా ఆయుధ మార్కెట్ కు ఇప్పుడు భారత్ అతి పెద్ద కస్టమర్ అందుకే అమెరికా కన్ను భారత్ పై పడింది. దీని నేపథ్యంగానే ఒబామా పర్యటన కొనసాగుతోంది.

ఒబామా పర్యటన - విధ్వంస ప్రణాళిక

సరళీకృత ఆర్థిక ఫలితాల అనంతరం దేశంలోకి కుప్పలు తెప్పలుగా దూసుకువచ్చిన బహుళ జాతి కంపెనీలు తమ విష కౌగిలితో లాభాలను గుంజుకొని పోయాయి. ఫలితంగా వ్యవసాయం నడ్డి విరిగింది. కార్మిక లోకం గొంతు నులిమింది. ఉదార వాద విధానాల మత్తులో అటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సెజ్ ల పేరిట ప్రజల నుంచి భూముల్ని లాక్కొని విదేశీ కంపెనీలకు కట్టబెట్టాయి. ఫలితంగా నయా వలస విధానం దేదీప్యమానంగా వెలిగింది.

చీనాంబరాలు నేసి విదేశాలకు ఎగుమతి చేసిన చరిత్ర మాది అని జబ్బలు చరుచుకున్న మోడీ ఇప్పుడు విదేశీయులను పిలిచి మా దేశంలో పరిశ్రమలు పెట్టండి ఇక్కడ ఉత్పత్తి చేసి ఎగుమతి చేసుకోండని పిలుపునిస్తున్నాడు. ఓ వైపు చైనా లాంటి దేశాలు మేడిన్ చైనా అంటూ అగ్రరాజ్యాలను తలదన్నేలా దూసుకుపోతుంటే మనం మాత్రం ఒంగి ఒంగి సలాములు చేస్తూ మేకిన్ ఇండియా అంటూ తిరోగమన నినాదాలకు దేశభక్తి జోడించి మరీ పిలుపునివ్వడం సిగ్గు చేటని విశ్లేషకులు, ఆర్థిక వేత్తలు భావిస్తున్నారు.

నిజానికి మంచి రోజులంటూ ఊదర గొట్టిన మోడీ...వస్తూ వస్తూనే దేశంలో పీవీ హయాంలో మొదలైన సరళీకృత ఆర్థిక విధానాలకు రెండో దశను మొదలు పెట్టేశారు. పీవీ, మన్మోహన్ జోడీ అమలు చేసిన మొదటి ఆర్థిక సంస్కరణల దెబ్బతో గ్రామీణ ఉపాధి రంగం, చిన్నతరహా పరిశ్రమలు, వ్యవసాయ రంగం నడ్డి విరిగింది. సోడా నీళ్లు అమ్ముకొనే చిరు వ్యాపారుల ప్రయోజనాలను సైతం తూట్లు పొడిచేలా విదేశీ కోలా భూతాలు మార్కెట్లో వరద పారించాయి. లాబీయిస్టులు సంస్కృతి మొగలై దేశ సార్వభౌమాధికారానికే తూట్లు పడ్డాయి.

1991అనంతరం మొదటి దశ సరళీకృత ఆర్థిక విధానాల హోరులో పల్లెలన్నీ కన్నీరు పెడుతున్నా పాలకులు తుడిచే తీరిక లేకపోయింది. పైగా విదేశీ కంపెనీల సీఈఓల కరచలనాలే వారికి ప్రాధాన్యం అయ్యాయి. దాంతో పాటు ప్రపంచాన్ని పీల్చి పిప్పి చేస్తూ సహజ వనరులను, కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ, చిన్న చిన్న దేశాలను మింగేస్తున్న విదేశీ కార్పొరేట్ కొండచిలవలకి మన పాలకులు రెడ్ కార్పెట్ వెల్కం పలికారు. ఫలితంగా మనదేశంలో ఉత్పత్తి రంగంలో ఉత్పత్తి వృద్ధి రేటు మాత్రమే నమోదయ్యింది. దానికి బదులు విదేశీ పెట్టుబడులన్నీ సేవారంగం అయిన సాఫ్ట్ వేర్, బీపీఓ లాంటి రంగాలకు మరలాయి. దీంతో విదేశీయులకు సేవలు చేసి పెట్టే రంగం ఒకటి దేశంలో వేళ్లూనుకుపోయింది. సేవా రంగం అర్థం మారిపోయింది. మన దేశ పౌరులకు అందాల్సిన సేవలు పొరుగు సేవలుగా మారిపోయాయి.

ఆర్థిక సంస్కరణల ఫలితంగా నాటి వాజ్పేయి ప్రభుత్వం, నిన్నటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం సేవా రంగాలను, ఔషధ ఉత్పత్తుల రంగాలను, శీతల పానీయాలు, ఐస్క్రీమ్ల తయారీ రంగాలను విదేశీయులకు అప్పగించాయి. ఫలితంగా ఉప్పును సైతం విదేశీ సంస్థలు తయారు చేస్తున్నాయి. అలాగే ఆలుగడ్డ చిప్స్ వేయించి, డబ్బాలలో భద్రపరచే పరిశ్రమలు, కోలా నీళ్లు అమ్మే పరిశ్రమలు దేశంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. మౌలిక రంగాల్లో ప్రవేశించిన విదేశీ సంస్థలు కేవలం భూములను గుప్పిట్లో ఉంచుకొని నయా వలస విధానానికి తెరలేపాయి. చివరకు మంచినీటి సీసాలను సైతం విదేశీ సంస్థలు అమ్ముతూ లాభాలను తమ దేశాలకు తరలించాయి

పెట్టుబడులు...పెట్టుబడులు ఇవే మోడీ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అందుకున్న జపం. నిజానికి పెట్టుబడులు పెట్టాలంటే డబ్బు కావాలి. మన దేశంలో డబ్బు లేదా అనే ప్రశ్న తలెత్తవచ్చు. నిజానికి స్విస్ బ్యాంకుల్లో, చిన్న చిన్నఇతర దేశాల బ్యాంకుల్లో దాచిన డబ్బు, హవాలా ద్వారా విదేశాలకు తరలుతున్న డబ్బు, ఇతర విధాలుగా దేశ సరిహద్దులు దాటుతున్న డబ్బు, ప్రపంచంలోనే అత్యధిక ఆస్తులు కలిగిన దేశీయ కార్పొరేట్ల డబ్బు, కస్టమ్స్, రాయితీల పేరుతో కార్పొరేట్లకు ఇస్తున్నఅయిదేసి లక్షల కోట్లు డబ్బు, ఇక ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చు చేసే కోట్ల రూపాయలు, ఇలా దేశంలో పెట్టబడులు పెట్టడానికి నిధులు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి.

గతంలో మోడీ అమెరికాలో పర్యటించారు. ఆ సందర్భంగా మా దేశంలో పెట్టుబడులు పెట్టండి అని అర్థించారు. ఇదే సరైన సమయమని విదేశీ పెట్టుబడిదారులు దేశంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారు. ఇప్పటికే దేశంలో 3,254 విదేశీ సంస్థలున్నాయి. దేశంలో ఆర్థిక పరిస్థితి బాగాలేదని వారు బిచాణా ఎత్తేసి వారివారి దేశాలకు వెళ్లిపోలేదు. లాభాలు సంపాదిస్తున్నారు, విస్తరిస్తున్నారు. వారి ప్రధాన కార్యాలయాలు, పరిశ్రమలు అనేక దేశాల్లో కర్మాగారాలు స్థాపించి

ఉత్పత్తులు చేస్తున్నాయి. రాయల్టీలు, లాభాల పేరిట దేశ సంపదను తమ దేశాలకు దోచుకుపోతూనే ఉన్నారు.

మరోవైపు బ్రిక్స్ కూటమి సభ్య దేశంగా అమెరికా బద్ధ శత్రువులుగా అవతరిస్తున్నరష్యా, చైనాలతో ఇండియా సత్సంబంధాలు కొనసాగిస్తోంది. అమెరికా కరెన్సీ డాలర్ ను అంతర్జాతీయ కరెన్సీ స్థానం నుండి కూల్చేందుకు చైనా, రష్యాలు సాగిస్తున్నప్రయత్నాలకు ఇండియా కూడా అంతో ఇంతో తోడ్పాటు అందిస్తోంది. దీంతో కలత చెందిన అమెరికా వెంటనే మోడీని అమెరికాకు పిలిచింది. ఈ నేపథ్యంలో మోడీ అమెరికా టూర్ మొదలైంది. అయితే నిండా 18 ట్రిలియన్ డాలర్ల అప్పుల ఊబిలో ఉన్న అమెరికాను పెట్టుబడులు పెట్టమని ఆహ్వానించడం నిజంగానే హాస్యాస్పదం.

"అధికారం చేపట్టాక ప్రధాని నరేంద్ర మోడి భారత దేశం "వ్యాపారాలకు బహిరంగ ప్రదేశం" అని ప్రకటించారు. విదేశీ పెట్టుబడులకు ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రామిస్ చేశారు. భారత దేశంతో వ్యాపారం చేయడానికీ, భారత దేశంలో ఉత్పత్తులు చేయడానికీ ప్రపంచానికి సానుకూల అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకూ నూతన ప్రభుత్వ పాలన చూస్తే తన సొంత విధానాలతో మరిన్ని సమస్యలు సృష్టించడం తప్ప చేసిందేమీ లేదు. ఈ విషయం పెట్టుబడి దారులను కాస్త కలవరపరిచే అంశమే.

అయితే ప్రస్తుత ఒబామా పర్యటనలో అమెరికా కోరికల చిట్టా పెద్దగానే ఉంది. మోడీని ఇప్పటికే అమెరికాకు చెందిన పెద్ద పెద్ద వ్యాపార దిగ్గజాలు కలుస్తూనే ఉన్నాయి. వీరంతా అమెరికా వలస దోపిడీకి గేట్లు ఎత్తేసే డిమాండ్లను కూడా తెరపైకి తెస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అందులో ప్రధానంగా అమెరికా కంపెనీల అధిపతులు ఇండియా దిగుమతి సుంకాల పెంపుపై మోడీ బృందానికి ఫిర్యాదు

చేశాయని విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. కొన్ని విదేశీ దిగుమతులపై ఇండియా సుంకాలు పెంచిందని వాటిని తగ్గించేలా చూడాలని కంపెనీలు మోడీ బృందాన్ని కోరాయి. అలాగే సమాచార, ప్రసార సాంకేతిక పరిజ్ఞానంకు సంబంధించిన ఉత్పత్తులను దిగుమతి చేసుకునే ముందు నూతన పరీక్షలకు ఇండియా గురిచేస్తోందని, ఈ పరీక్షలు తమకు భారంగా మారాయని కంపెనీలు మోడీ బృందానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

నిజానికి భారత ప్రభుత్వ కంప్యూటర్ సమాచార వ్యవస్థలపై హ్యాకర్ల దాడులు పెరగడంతో ప్రభుత్వం వినియోగిస్తున్న సమాచార, ప్రసార సాంకేతిక పరికరాలపై ఇండియా దృష్టి సారించింది. యాంటెన్నాలు, బ్రాడ్ బాండ్ మోడెంలు మొదలుకొని భారీ సమాచార ప్రసార ఉత్పత్తుల వరకు విదేశీ గూఢచర్యానికి, హ్యాకింగ్ కు అనువుగా దేశీయ వ్యవస్థలు మారాయని భారత ప్రభుత్వం అనుమానించింది. ఈ నేపథ్యంలో పలు చైనా తయారీ ఎలక్ట్రానిక్ పరికరాల దిగుమతులపై ఆంక్షలు విధించింది. పశ్చిమ దేశాల దిగుమతులపై కూడా వివిధ పరీక్షలు నిర్వహించడానికి నిర్ణయించింది. దేశ భద్రత రీత్యా ఇది అత్యవసరం. ఇలాంటి పరీక్షలు లేకుండా నేరుగా దిగుమతులు చేసేసుకోవాలని అమెరికా బహుళజాతి కంపెనీలు డిమాండ్ చేస్తున్నాయి. చైనా పరికరాలపై ఆంక్షలు కూడా పశ్చిమ, అమెరికా కంపెనీల సరుకులపై ప్రభావం చూపుతోందని అర్థం చేసుకోవచ్చు. ఈ వ్యవహారానికి ముగింపు పలికించాలని అమెరికా కంపెనీలు భావిస్తున్నాయని మోడీ బృందానికి వారు చేసిన ఫిర్యాదు ద్వారా అర్థం అవుతోంది.

దీంతో పాటు డబ్ల్యు.టి.ఓ వేదికపై రూపొందించిన ట్రేడ్ ఫెసిలిటేషన్ అగ్రిమెంట్ ను భారత్ ఆటంకపరచడం మానుకోవాలని, ఒప్పందాన్ని అంగీకరించాలని అమెరికా కంపెనీలు మోడి బృందంపై ఒత్తిడి తెస్తున్నట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. మోడి పర్యటనలో ఇదే ప్రధాన అంశంగా మారిందని విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అమెరికా ఒత్తిడికి ప్రధాని మోడి తల ఒగ్గినట్లయితే భారత పార్లమెంటు ఆమోదించిన ఆహార భద్రతా చట్టం అటకెక్కినట్లే. ఈ చట్టాన్ని అమలు చేయాలంటే ఆహార గింజలను కేంద్రం పెద్ద మొత్తంలో నిల్వ చేసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈ ఒప్పందం ప్రకారం దేశంలో పండే గింజల్లో 10 శాతం మాత్రమే నిల్వ చేసుకోవాలి. తమ ఆహార భద్రతా చట్టానికి అనువుగా బాలి ఒప్పందంలో తగిన స్థానం కల్పిస్తేనే ఒప్పందాన్ని అంగీకరిస్తామని నాడు ఇండియా సంతకం చేయకుండా వెనక్కి తగ్గింది.

ఇక మోడీని కలిసిన వ్యాపార కంపెనీల సంఘాల్లో అనేక రంగాల కంపెనీలు ఉన్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ రంగం, సినిమా నిర్మాణం, ఔషధ రంగం, టెలికాం... మొదలైన అనేక రంగాలకు చెందిన వ్యాపార సంఘాలు తమకు ఇండియాలో వ్యాపారం చేసుకునేందుకు వీలుగా ఆటంకాలు తొలగించాల్సిందిగా మోడీ బృందాన్ని డిమాండ్ చేస్తున్నాయి. మోడిపై ఒత్తిడి తెచ్చేందుకు అంతర్జాతీయ లాబీయిస్టులను రంగంలో దింపాయి. తమ వ్యాపార దోపిడీ మార్గాలన్నింటినీ సరళం చేయాలని మోడీ బృందంపై తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నట్లు ఈ పర్యటనలో అర్థం అవుతోంది.

ఇదిలా ఉంటే అమెరికా కాంగ్రెస్ లో వాణిజ్యం, ఫైనాన్స్ వ్యవహారాలను పర్యవేక్షించే కమిటీ ఏకంగా ఇండియా అనుసరిస్తున్న వాణిజ్య విధానాలపై విచారణ చేయాలని అమెరికా అంతర్జాతీయ వాణిజ్య కమిషన్ కు ఆదేశాలు జారీ చేసింది. మోడి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇండియా వాణిజ్య విధానాలలో మార్పులు వచ్చిందీ లేనిదీ విచారించాలని కమిషన్ ను కోరింది. సెప్టెంబర్ 24, 2015 తేదీ నాటికి విచారణ నివేదికను కాంగ్రెస్ కు సమర్పించాలని కమిటీ ఆదేశించింది. అంటే మనతో స్నేహం కోరుతూనే వారి వ్యాపార ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు అమెరికా ఎలాంటి ఎత్తులకైనా సిద్ధం అవుతున్నట్లు సూచనలిస్తోంది.

మోడి అధికారంలోకి వచ్చాక అమెరికా బహుళజాతి కంపెనీలకు ప్రయోజనం కల్పించే చర్యలు తీసుకున్నారని కానీ అవి చాలవని అమెరికా వాణిజ్య విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. రక్షణ రంగం, బీమా రంగం, రైల్వే రంగం లలో పలు నిబంధనలు, నియంత్రణలను మోడి సరళీకరించారని మెచ్చుకుంటూనే తమ ప్రయోజనాలకు పెద్ద పీట వేయాలని మోడీ సర్కారును అమెరికా కంపెనీలు గట్టిగానే డిమాండ్ చేస్తున్నాయి. భారత ప్రభుత్వం, చట్ట సభలు ఆమోదించి అమలు చేస్తున్న పర్యావరణ చట్టాలను, మేధో సంపత్తి హక్కుల చట్టాలను సవరిస్తామని మోడి ప్రభుత్వం పలుమార్లు హామీ ఇచ్చింది. ఈ హామీలకు సంతోషం ప్రకటించిన కంపెనీలు వాటిని ఇంకా అమలు చేయకపోవడం పట్ల మోడీ బృందం ఎదుట ప్రత్యక్షంగానే అసంతృప్తిని ప్రకటించాయి. అమెరికాలో వివిధ రంగాల్లో పేరు మోసిన బడా బహుళజాతి కంపెనీలైన గూగుల్, ఐ.బి.ఎం, జనరల్ ఎలక్ట్రిక్, గోల్డ్ మాన్ సాక్స్, బోయింగ్, పెప్సీ కో మొదలైన అధిపతులు ప్రధాని మోడీని కలిసి ఈ అంశాలపై చర్చలు జరిపారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ కంపెనీల గొంతెమ్మ కోర్కెలకు కనీస ఆమోదం తెలిపినా భారత ప్రజల ప్రయోజనాలకు తీవ్ర నష్టం చేకూర్చడమే అవుతుంది.

ఇక అమెరికా కంపెనీల డిమాండ్లను ఆమోదిస్తే దేశ వనరులను, సంపదలను మార్కెట్ ప్రయోజనాలను మొత్తంగా వారి చేతుల్లో పెట్టడమే. ఎలాగయితే అమెరికా ప్రభుత్వం దాదాపు ప్రైవేటు బహుళజాతి కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి జారిపోయిందో అలాగే భారత ప్రభుత్వాన్ని సైతం వారి చేతుల్లో పెట్టాలన్నది బహుళ జాతి కంపెనీల అసలు కోరిక.

ఇప్పటికే అనేక పేర్లతో మన దేశ నిధులు ఇతర దేశాలకు తరలిపోతున్నాయి. ఆ దేశాలు పరిశ్రమలను మన దేశంలో స్థాపిస్తే ఉద్యోగావకాశాలు పెరుగుతాయనేది భ్రమ. ఇక్కడ పెట్టుబడులు పెట్టే దేశాలు టెక్నాలజీ పరంగా ఎంతో అభివృద్ధి చెందినవి. ఆటోమేటిక్, రోబోటిక్ విధానాలతో వీలైనంత తక్కువ కార్మికులను నియమిస్తారు. అంతే కాదు వారి దేశాలతో పోలిస్తే, మన కార్మిక శక్తి చౌక. దీంతో మరింత లాభాలు చేసుకొంటారు. 125 కోట్ల జనాభా గల దేశం మనది. అంటే అతి పెద్ద మార్కెట్. ఇప్పటికే బహుళజాతి కంపెనీలు గ్రామీణ మార్కెట్ పైపు దృష్టి సారించాయి. ఆ ప్రజల కొనుగోలు శక్తి తక్కువగా ఉంటుందని గ్రహించి మార్కెట్ను పెంచుకుంటున్నారు. అందుకే బ్యూటీ ప్రొడక్టులు మొదలు తినుబండారాల వరకూ పాకింగ్ లో అమ్ముతున్నారు. ఈ దెబ్బకు స్థానిక చిన్నతరహా మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిని దేశం ఆర్థికంగా పరాధీనం అవుతుంది.

ఒబామాకు వెల్ కం చెప్పడం అంటే విషపు కౌగిలిని ఆహ్వానించడమే.. ఒబామా పర్యటనను అటు విద్యార్థి, యువజన, కార్మిక, శ్రామిక, రైతాంగ వర్గాలు వ్యతిరేకించాలి. అమెరికా దాని సామ్రాజ్య వాద కుట్రలను తిప్పికొట్టాలంటే వర్గ పోరాటాలే శరణ్యం..

కవితా శిల్ప రహస్యాలు తెలిసిన కొప్పర్తి

- అరసవిల్లి కృష్ణ

ఒక నిద్రలేని రాత్రిని బహుకరించినందుకు
ఈ కవిత్వానికి నమస్కారం
నిదురనంతా
కవిత్వంగా మలిచినందుకు
ఈ రాత్రికి నమస్కారం

రెండు దశాబ్దాలు పైబడిన కవితా ప్రయాణంలో కొప్పర్తిగా పరిచయమయిన కొప్పర్తి వెంకట రమణమూర్తి విలక్షణమైన కవి. కవిత్వం శిల్ప రహస్యాలు తెలిసిన కవి. వస్తువును ఎలా కవిత్వం చేయవచ్చో, వస్తువును విస్తరిస్తూ గాఢమైన కవితాభి వ్యక్తీకరణలోకి పారకుట్టి తన కవితావరణలోకి, ప్రవేశింపజేసే కవి తెలుగు కవిత్వంలోకి పిట్టపాడే పాట కోసం (1991) కవితా సంపుటితో అడుగిడిన కొప్పర్తి విషాదమోహనం (2003), యాభై ఏళ్ళ వాన (2014) వరకు, కవితా నడకసాగింది. తాను తీసుకున్న వస్తువు, తన హృదయం దాకా వచ్చిన ఘటనను ఎలా కచ్చితంగా మలచవచ్చో, కవితను విస్తరింపజేయడంలో మెళకువలు తెలిసిన కవి. నిజానికి మామూలు వచనాన్ని కూడా కవిత్వం చేసే శక్తి కొప్పర్తిది. అస్పష్టత, సంక్లిష్టత అనేవి కొప్పర్తి కవిత్వంలో కనబడవు. తాను వ్యవక్తీకరించే వస్తువు పట్ల అత్యంత సున్నితమైన భావనలను ప్రోది చేయగలిగిన కవి. విశాలమైన, సామాజికావరణ నుండి తనను తాను ఆవిష్కరించుకున్న స్వీయానుభూతితో, సామాజిక అనుభూతిని మిళితం చేస్తూ, తనని కల్లోలానికి లేదా, తనని వేదనకి గురిచేస్తున్న సామాజిక ముఖచిత్రం, దాని విష పరిణామాల పట్ల విమర్శనా దృష్టి కలిగి ఉంటూనే, దానిలో ఒక్కడిగా మనలేని ఓ మానసిక వాతావరణాన్ని సృష్టించుకున్న కొప్పర్తి, కల్లోల ముఖచిత్రాన్ని మార్చడమెట్లా! లేదా దాని క్షీణ విలువల్ని ప్రశ్నించడమా, లేదా మొత్తం ఈ ఆవరణ నుండి వైదొలగి, తనదయిన జీవితంలోకి వెళ్లిపోవడమా! నిజానికి తెలుగు కవిత్వంలోకి, ఆవేశంతో, ఆలోచనతో, గొప్ప కవితా సాంద్రతతో, ఆశను కలిగించిన కవులు అంతే వేగంగా నిష్క్రమించడం, కవితా వేదిక నుండి దిగిపోయి, తనదయిన జీవితంలోకి వెళ్ళిపోవడం తెలుగు కవిత్వానికి పరిచయం లేనిదికాదు. ప్రజల పట్ల ఆర్తి ఉంటే చాలదు. ఆ ఆర్తికి తగిన ఓ వాతావరణాన్ని కవి కల్పించుకోవాలి. కవిత్వం సృజనాత్మక వ్యాపారం మాత్రమే కాదు, కేవలం సున్నితమైన భావనలు మాత్రమే కాదు, కవిత్వం విశాల ప్రపంచాన్ని హృదయంతో ఒడిసిపట్టే సృజనాత్మక రూపం. అంతేనా కాలంతో పాటు సకల ఉద్యమాలకు, పోరాటాలకు, సామాజిక ఘర్షణలకు, మానవజీవన, నిరాశ, నిస్పృహలకు మొత్తం సామాజిక దృశ్యానికి ప్రతిబింబం. ఈ ఎరుకతో ప్రజల వైపు నుండి కవిత్వాన్ని చూసిన కవి కొప్పర్తి.

ఈ రెండు దశాబ్దాల కవితా సృజనతో, లేదా ఈ కాలంలో అనేక పాయలుగా లేదా ఎంతో కొంత అస్తిత్వ ఛాయలతో వస్తున్న కవిత్వం, రెండో వైపు మొదటి, రెండవ దశ ఆర్థిక సంస్కరణలు, వాటి ప్రతిఫలాలు. విప్లవోద్యమానిది సమాంతర దశ. ఏ కవికైనా సామాజిక సందర్భముంటుంది. అది కవిత్వంలో ప్రతిఫలిస్తుంది. నిరంతరంగా రాస్తున్న కవులు సమాజం, దాని ఘర్షణను, ఆ ఘర్షణ రూపాన్ని ఎంతో కొంత మేర అవలోకిస్తారు. అదే సమయంలో కవితా తాత్వికత నుండి దాన్ని చూచే ప్రయత్నం చేస్తారు. సమూహంలో జీవించే కవి ఆ సమూహం తాత్విక వ్యక్తీకరణను అనువదింపజేస్కో గలిగితే అనువదింపజేసుకోవడంలోని ఎరుకని సొంతం చేసుకోగలిగితే ఖచ్చితంగా కవి నుండి ఎంతో కొంత మేర కవిత్వానికి కావాల్సిన పరికరాలు లభించవచ్చు. కేవలం పరికరం అనేది సాంకేతిక శబ్దం కానక్కర్లేదు. స్వీయానుభూతి సామాజిక అనుభవం అనుసంధానమయితే, వస్తువు తీవ్రత వ్యక్తీకరణలో ప్రతిఫలిస్తే, కవి నేర్పు కూడా చేర్పు అయితే కవిత్వం బలమైన సాంద్రతతో వచ్చే అవకాశమెక్కువ. ఇవన్నీ ఏ కవికైనా పూర్వ రంగం. కవితా సృజనలో ఇన్ని అంశాలు ఇమిడితే, నిఖార్సయిన కవిత్వాన్ని ఆశించవచ్చు. మళ్ళీ ఇక్కడ నిఖార్సయిన కవిత అంటే ఏమిటి? అనే ప్రశ్న రావచ్చు. కవిత్వ మనేది అల్లిక కళ. మామూలు భాషను విస్తరించేది. భాషకు, భాష కవిత్వం అనుకున్నప్పుడు కవిత్వం కూడా ఆ స్థాయిలోనే ఉండాలి. ఉన్నప్పుడే అది కవిత్వం. ఏ సామాజిక ఆవరణ నుండి వస్తువు ఎంచుకున్నా అది కవిత్వం కావడం ప్రధానం. వచనానికి, కవిత్వానికి స్పష్టమైన విభజనను ఈ రేఖ నుండి చూడ గల్గుతాం. కాలంతో పాటు ప్రయాణిస్తున్న కవి ఆ కాలం యొక్క ప్రతిఫలాన్ని కవిత్వంలో వ్యక్తీకరించాలి. ఈ అభ్యాసం ఉన్న కవి కొప్పర్తి.

ఈ కాలంలో రెండు, మూడు ప్రధాన ప్రవంతుల కవిత్వం వచ్చింది. స్త్రీ, దళిత, మైనారిటీ కవిత్వం ఓ వైపు ప్రపంచీకరణ ప్రతిఫలనం ఓ వైపు. వీటి మధ్య కవిత్వ నడక కవి తనదయిన ఆత్మిక ప్రపంచంలో జీవిస్తున్నా, బయట ప్రఫలిస్తున్న వాదాలుంటాయి. వాటి వ్యక్తీకరణలుంటాయి. వాటి ఛాయలు లేదా వాదవివాదాలు గమనిస్తున్న కవులు ప్రాతినిధ్య కవితా ఛాయలను గమనించక ఉండరు. నిజానికి కొప్పర్తి స్త్రీలపై దళిత ఘటనలపై రాసిన కవితలను పరిశీలించినప్పుడు కేవలం సహానుభూతితో మాత్రమే రాయలేదు. దానికి తగిన భూమిక అతని కవిత్వంలో దొరుకుతుంది. వస్తు సంస్కృతి మిగిల్చిన సామూహిక ఒంటరితనం, దాని భావ తీవ్రత విశాలమయిన విస్తృతమయిన మానవ జీవితం మనిషి అస్తిత్వం కుచించుకు పోవడం, అది సకల రంగాలను అమానవీయకరణ వైపు నెట్టడం, మళ్ళీ అదే సమయాన స్థానీయత నుండి లేదా తమదయిన ప్రాతినిధ్యం నుండి మళ్ళీ గొంతు చిగురించి బలమైన వాహకంగా రూపు కట్టడం, ఒక దగ్గర కోల్పోవడం నుండి మళ్ళీ ఓ బిందువు దగ్గర చిగురించే సామాజిక చలనం ఏదయితే ఉందో, ఆ బిందువు దగ్గర కేంద్రీకృతమై కొప్పర్తి కవిత్వాన్ని అంచనా వేయగలగాలి. నిజానికి రాజకీయ విశ్వాసాలు, వాటి నిబద్ధత, అనిబద్ధత అనే చర్చ అసందర్భమయిన ఏ కవిదైనా కొంతమేరకు రాజకీయ నిబద్ధత ఉంటుంది. తను ఏ పక్షం వహించాలో, ఏ అమరికలో భాగం కావాలో అవగాహన కలిగిన కవుల కవిత్వం ఓ దర్పణంలా ఉంటుంది రాజకీయ

విశ్వాశాలు కవి వ్యక్తిగత జీవితంలో కవిత్వంలో ప్రతిఫలిస్తాయి. అనుభూతి, సామాజిక సందర్భం తను నిలిచిన పక్షం ఈ మూడింటి స్థితి నుండి కొప్పర్తిని అర్థం చేసుకోవడం, లేదా వ్యాఖ్యానించడం లోతుగా చర్చలు పెట్టడం సమాజంతో తలపడుతున్న కవికి, సమాజ అస్తిత్వంతో ఘర్షణ పడుతున్న కవికి కవితా న్యాయం . మూడు కవితా సంపుటాల నుండి కవి ప్రోది చేసిన కవి సమయాల నుండి కవితాత్మికతను అర్థం చేసుకునే అవకాశముంది. సమాజంలో విడివడి సంభాషణ కాకుండా, సమాజంతో ప్రత్యక్షంగా సంభాషించడం, తలపడటం మూలానే కవిత్వం మరింత సాంద్రత చెందుతుంది. కొప్పర్తి మొత్తం కవిత్వ రచనలో ప్రారంభం నుండి తాజాగా వచ్చిన యాభై ఏళ్ళ వాన దాకా సాగిన పరిణామంలో సామాజికుడుగా, ఆలోచనాశీలిగా తన అస్తిత్వాన్ని సామాజిక అస్తిత్వంతో పెనవేసుకున్న దశ నుండి వైయుక్తిక భావనలలోకి, లేదా అంతర్ముఖుడవుతున్న దశ కూడా కనబడుతున్నది. ఇటీవల కొప్పర్తి కవిత్వం గమనిస్తున్నప్పుడు కళ కళ కోసమే, కవిత్వం కవిత్వం కోసమే అనే ఆలోచనల వ్యక్తీకరణ కనబడుతున్నది. ప్రగతిశీల కవి ప్రజల పట్ల ఆర్తి ఉన్న కవి. రాజకీయ అవగాహన ఉన్న కవి. రాజకీయ అవగాహన ఉన్న కవి. గాంధీపై రాసిన రెండు కవితలు 1. అంతిమసత్యం 2. జెండర్‌పాలిటిక్స్ లోతుగా అంచనా వేసినప్పుడు గాంధీ ఆచరణను పై పై చూడటం, గాంధీని విమర్శనా దృష్టితో అంచనా వేయకపోవడం, రాజకీయ తాత్వికత కలిగిన కవి మామూలు ఆలోచనలు చేయడం, బూర్జువా రాజకీయాల స్థితిలో గాంధీని ఉన్నతీకరించడం అవగాహన సమస్య మాత్రమే కాదు కవి అంతరంగంలో గాంధీ భావజాలంతో ఎక్కడో ఓ చోట మిళితం అవుతుంది. అంతిమ సత్యం కవిత పరిశీలించినప్పుడు కవి అవగాహన సమస్య మాత్రమే కాదు, స్త్రీల పట్ల ఇంకా కవి జాలి చూపుతున్నటువంటి కవితా వ్యక్తీకరణ ఉంది.

పురుషుల క్రీడలోకి
స్త్రీలను ప్రవేశపెట్టడమే కాదు
ఒక జాతి జాతి నంతా స్త్రీలుగా మార్చినవాడు

అతను పురుషుడు కాదు స్త్రీ (జెండర్ పాలిటిక్స్) కొప్పర్తి స్త్రీల వైపు నుండి పురుషుణ్ణి అంచనా వేసే క్రమంలో స్త్రీల సున్నిత హృదయం కలిగిన వారుగా జాలి, కరుణ వంటి పడికట్టు పదాలను ప్రతీకలుగా చూపే ప్రయత్నం. స్త్రీల పట్ల కవి అభిప్రాయం ఏదయినా, స్త్రీలు రెండవ శ్రేణి మనుషులనే దృష్టి కనబడుతున్నది. నిజానికి స్త్రీ, పురుష అస్తిత్వాలు కలగలిసి ఉండవు. విడి విడి అస్తిత్వాలుగా చూచినప్పుడే ఒకరు తక్కువ ఒకరు ఎక్కువ అనే భావన తొలగిపోతుంది. ఇద్దరి అస్తిత్వాలను ఒక్కటిగా చూచినప్పుడు ఎక్కువ తక్కువలు ఆధిపత్య భావనలు ముందుకు వస్తాయి. జెండర్ పాలిటిక్స్ కవిత నిర్మాణపరంగా మంచి కవిత . కాని దానిలో ఉండే వైరుధ్యం వలన కవి అవగాహన ఏమిటి? అనే ప్రశ్న మొదలవుతుంది.

రాముడంటే భగవంతుడు
భగవంతుడంటే సత్యము కదూ
సత్యం అతని అణువణువునా ఆక్రమించుకుని ఉండకపోతే
హఠాత్తుగా మృత్యువు దాడి చేసినప్పుడు
ఆర్తనాదానికి బదులు
సత్య వచనం ఎట్లా బయటపడుతుంది (అంతిమ సత్యం)

గాంధీ మరణించినపడు అతని చివరి మాటగా హేరామ్ అనే శబ్దం వచ్చిందని బహుళ ప్రచారం. ఈ ప్రచారంలో వాస్తవమేమిటి? నిజానికి ఓ మనిషి హఠాత్తుగా మృత్యువు దరికి చేరుతున్నప్పుడు అతని అన్ని హృదయ స్పందనలు అదృశ్యమవుతాయి. అక్కడ చివరి మాటలుండవు. హిందూ భావజాలం ఏదయితే ఉన్నదో, తన ఆధిపత్యం కోసం, హేరామ్ అనే పదానికున్న హిందూ మత ఆమోదం వలన బహుళ ప్రచారమయింది. గాంధీ జీవితం ముగింపు ఈ దేశం హిందుత్వ శక్తులకు ఊతమయింది. ఈ ఎరుక కవికి లేదని కాదు. గాంధీ జీవితంలో ఆచరణతో కవి కలగలసినప్పుడు కవి అవగాహన కనుమరుగయి వ్యక్తిగా గాంధీని చూడటం మూలాన వచ్చే సమస్య. కొప్పర్తి వంటి పరిణితి కలిగిన కవుల నుండి వీటిని ఆశించలేం.

కొప్పర్తి కవిత్వంలో గమనించాల్సిన అంశం అస్తిత్వ గొంతుల వెనుక దాగిన ఆర్తిని, ప్రశ్నలను సొంతం చేసుకోవడం. ఆ కవి సమయంలో కొనసాగిన అస్తిత్వ ధోరణులను గమనిచండం మాత్రమే కాదు, ఆ ధోరణుల నుండి వైదొలగకుండా, అవి ముందుకు తెచ్చిన ప్రశ్నలను అవగాహనలను అర్థం చేస్కోవడం. అంతేనా. వాటిని తిరస్కరించడమో, మౌనం వహించడమో కాకుండా అస్తిత్వ ధోరణులకు తన గొంతునివ్వడం కొప్పర్తిలో స్వీకరించాల్సిన అంశం.

ఒక పురుషజాలం కృష్ణ పక్షమై ఇల్లంతా అలుముకుంటుంది
పెద్దయ్యే కొద్దీ వాడు
ఇంట్లో ఒకొక్క వస్తువు మీద తన హక్కును ప్రకటిస్తున్నప్పుడు
అదృశ్యంగా, ఆమె అల్లుకున్న సహజానురాగాల తీగలు తెగిపోతుంటాయి.
ఆ ఇల్లు తనది కాదన్నప్పుడు
నమ్ముకున్న కాళ్ళ కింద నేల కదలడం తెలిసొస్తుంది
అమ్మని కూడా వాడు తన ఆస్తిగానే చేసుకున్నప్పుడు
బొడ్డు కోసిన బాధ పునరావృతమౌతుంది (కాళ్ళ కింద నేల)

కొప్పర్తి కవితా నిర్మాణం పట్ల స్పష్టత ఉన్న కవి. వస్తువును విస్తరించే క్రమంలో అది మరింత ప్రస్ఫుటమవుతుంది. కవితా విస్తరణ అనేది కవిత్వ రచన పట్ల ప్రేమ ఉంటే చాలదు. వస్తువుని విశాలం చేసే వాతావరణం పట్ల స్పష్టమైన చూపు ఉండాలి. స్త్రీ, పురుష సంబంధాలలో స్వేచ్ఛాపూరిత అవగాహన ఉన్నా ఎక్కడో ఓ చోట స్త్రీ, పురుషుని ఆస్తి అనేది ఇంకా ప్రచలితమవుతుంది. స్త్రీవాదం స్పష్టమైన అవగాహనతో స్త్రీ, పురుష సంబంధాలను సమాజంలో చర్చకు పెట్టినా ఆధిపత్య ఫ్యూడల్ భావజాలం ఇంకా స్త్రీల పట్ల పెత్తనం చేస్తుంది. స్త్రీవాద అవగాహన నుండి కవి సహానుభూతితో చిత్రించిన కవిత.

నీది
కటిక నేల మీద అన్నం పెట్టిన
పశున్యాయం
శవాల బట్టలు కట్టుకోమన్న
శవ నాగరికత
ముట్టుకున్నందుకు మరణశిక్ష వేసిన
విలోమ స్మృతి
అతనిప్పుడు నాగరికుడవుతున్నాడు
నిన్ను నాగరికుణ్ణి చేస్తున్నాడు (ప్రతిక్రియ)

దళిత అవగాహనతో రాసిన కవిత. సహానుభూతితో కవి స్వరం నుండి నిజాయితీగా వెలువడిన కవిత సామాజిక అంతరాలలో కులం పాత్ర, అది నిర్వహించిన అసమానత. ఆ అసమానతల నుండి

మూగబోయిన "లాల్‌బనో" గళం

- వివి

ఎన్‌కెగా 1970 నుంచి విప్లవ సాహిత్యోద్యమానికి పరిచయమైన నెల్లుట్ల కోదండరామారావు వరంగల్‌జిల్లా కూనూరులో ఒక సంప్రదాయ దేశ్‌ముఖ్ కుటుంబంలో జన్మించాడు. నెల్లుట్ల రామకృష్ణామాత్యుడుగా -1940లలోనే తన పద్యాలతో, సురబాల కావ్యంతో ప్రసిద్ధుడైన ఆయన తండ్రి ఎన్‌కెకు ఒక ఛాయవంటి పురాస్మృతి గానే మిగిలిపోయాడు. ఆయనెక్కడికి వెళ్లిపోయాడో తెలియదు. ఆయన జాషువా శిష్యునిగా వరంగల్‌లో జాషువాను సన్మానించినవాడు. కొప్పరపు వెంకటకవుల అనుయాయిగా తిరుపతివెంకటకవులను సవాల్ చేసినవాడు. ఎన్‌కె తన ఊహ తెలిసేనాటికే కనిపించకుండా పోయిన ఆ "కన్నతండ్రి"పై రాసిన పద్యాలు

"ఎప్పుడో నీవు అనుకోక ఎదురుపడిన
నీటితెర నాకు అడ్డంబు నిలుచుననుచు
కనులకొలుకుల కన్నీరు కదలనీను
కదలి రావయ్య రావయ్య కన్నతండ్రి"

వంటి చరణాలు ఆయన నోట వింటూ వుంటే ఎవరూ కంటతడి పెట్టకుండా ఉండలేరు. ఆయన మేనమామ దేవులపల్లి రామానుజరావుగారికి అప్పటికింకా వరంగల్‌లో ఒక పెద్ద ఇల్లు ఉండేది. ఆ ఇంట్లో 68-69 ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నాన్‌గెజిటెడ్ ఉద్యోగులసంఘం అధ్యక్షుడు నెల్లుట్ల జగన్మోహనరావు ఉండేవాడు. ఆయన రామానుజరావుగారికి మేనల్లుడే గాక అల్లుడు. ఎన్‌కెకు అన్నయ్య. చరిత్రాత్మకమైన టిఎన్‌జివో తెలంగాణ సాధన సమ్మెకు ఆయన నాయకత్వం వహించాడు. ఇటు సాహిత్య ప్రభావం, అటు తెలంగాణ ఉద్యమ వాతావరణంలో ఎన్‌కె వరంగల్ ఆర్ట్స్ కాలెజ్‌లో ఒక చిరు ఉద్యోగిగా 'మిత్రమండలి'కి వచ్చేవాడు. ఆయన కన్నతండ్రి పద్యాలైనా, అప్పుడప్పుడే రాస్తున్న కవితలైనా తండ్రి రాసిన పద్యాలైనా ఎవరివైనాసరే ఆయన చూసి చదివింది ఎప్పుడూ లేదు. అన్నీ కంఠతా అద్భుతమైన స్వరంతో చదివేవాడు. మిత్రమండలిలో కాళోజీ సోదరులకు, ఇతర సాహితీమిత్రులకు, సృజన "సాహితీ మిత్రులకు" ఆయనట్లా సన్నిహితమయ్యాడు. అదేకాలంలో సృజనలో "ట్రిగ్గర్ మీది వేళ్లతో...." లోచన్ కవిత, 69 నాటికి శివసాగర్ "లెనిన్-నా లెనిన్" వంటి కవితలు, శివసాగర్ "జేగంటలు", "తూర్పుపవనం వీచెనోయ్" వంటి పాటలు ఎన్‌కెను ఆవహించి ఆయననింక విప్లవోద్యమం నుంచి వెనక్కి చూడకుండా చేసినవి. 'ప్రజను సాయుధం చేస్తున్న రెవల్యూషనరీ నేడు కవి' అనే సమష్టి ప్రకటనతో వరంగల్ నుంచి పెండ్యాల కిషన్‌రావు సంపాదకత్వంలో 1970

అణిచివేత. మొత్తంగా కుల సమాజం మరింత ఆధిపత్యం చలాయించడం ఈ మూలాల నుండి దళిత అస్తిత్వం ఓ వెల్లువలా రావడం ఆధిపత్య దురుసు అవగాహనను ఎంతో కొంతమేర ప్రశ్నించడం. ఇవన్నీ దళిత కవిత్వంలో ప్రతిఫలించాయి. ఈ పరిణామ దశలను బయట వ్యక్తిగా తనకుతాను అనువదించుకొని నిజాయితీతో వ్యక్తీకరించడం. ఇంకా ఒడిస్సాలో స్టెయిన్ హత్య వరకు సాగిన హిందూ మతోన్మాద హత్యాకాండ వీటి పట్ల కవి ఈ ఎరుకతోనే స్పందించాడు.

ముక్కలు కావడం ఒక అరిష్టం
కానీ
ముక్కలు కావడంలో
ఏకం అనేకం కావడం ఉంది
అనేకం కావడంలో
ఒక్కొక్కటి అన్ని కలిసిన ఏకమంత బలీయం కావడముంది
(ఎర్రగింజల దానిమ్మ)

ప్రగతిశీల రాజకీయ అవగాహన కలిగిన కవిలో ఉండే ప్రధాన గుణం అన్ని పాయలను తన కవితా స్రవంతులలోకి ఆహ్వానించడం, దారి ఇవ్వడం వాటి ప్రగతిశీలతను, ఆత్మగౌరవ పోరాటాలను ఎత్తిపట్టడం, వాటితో ప్రయాణించడం ఇది కవికి, ముఖ్యంగా రాజకీయ అవగాహన కలిగిన కవికి ఉండవలసిన కవితా లక్షణం. నిజానికి కొప్పర్తి ఎర్రగింజల దానిమ్మ కవిత నిర్మాణపరంగా మంచి కవిత మాత్రమే కాదు. తెలంగాణ అస్తిత్వం పట్ల కవికి స్పష్టమైన ఆలోచన లేకుండా అది బలమైన కవితగా రూపొందదు. ఈ దేశం/ లోపలి పదార్ధమంతా ఒకేలా ఉండే యాపిల్ లా లేదు/ చెట్టునంతా ఇముడ్చుకున్న విత్తనాలతో/ దేనికదే ఒకదానికొకటి అంటి పెట్టుకొని ఉండే/ తెల్ల తొనల నారింజలా ఉంది. ఇది దేశం అనే భావన మాత్రమే కాదు, దేశమంటే ప్రజలు. వారి అవసరాలు, ఆకాంక్షలు. భౌతికపరంగా కలిసి ఉండటమా, విడిపోవడమా! అనే చర్చ కాదు. ఏది ఏ మంచికా మేలు చేస్తుంది అన్నది ముఖ్యం.

కొప్పర్తి రెండు దశాబ్దాల కవిలా సృజనలో అనేక పార్శ్వాలున్నాయి. కవి చలనం, సామాజిక చలనం కొప్పర్తి కవిత్వం రాయలేకుండా ఉండలేనితనం మాత్రమే రచనకు పునాది. సాంద్రత బలమైన వ్యక్తీకరణ కలిగిన కవి మాత్రమే కాదు, దానికి తగిన రాజకీయ తాత్వికత ఉన్నది. చూసింది చూసినట్లు చెప్పడంలా కాకుండా, కవితకు కళాత్మకతను అద్దే కవితాలోకనముంది. తెలుగు సమాజంలో కవులకు కొరత లేదు. కాని కవిత్వాన్ని జీవన వాహికగా చేసుకున్న కవులు అరుదు. కవిత్వమై జీవించే కవులు తక్కువ. కవిత్వంగా జీవించడమే కాదు. ప్రజల పక్షం వహించడం. ప్రజల ఆర్తిని కవిత్వంలో పలికించడం ఈ దశలన్నీ కొప్పర్తి కవిత్వంలో ఉన్నాయి. వస్తువును ఎలా విస్తరించాలో, ఏ వస్తువును సూక్ష్మంగా చెప్పాలో తెలిసిన కవి. రెండు దశాబ్దాల కొప్పర్తి కవిత్వాన్ని అంచనా వేయడమంటే తెలుగు సమాజ దరిని దాటి ప్రపంచాన్ని అవలోకించడమే.

జూలై 4న మేం ప్రచురించిన 'మార్చ్' విప్లవ కవుల్లో ఎన్.కె. ఉన్నాడు. జూలై 4 హైదరాబాద్‌లో విరసం ఆవిర్భావంలో ఎన్.కె. ఉన్నాడు.

సృజన సాహితీమిత్రుల్లో రచనల ఎన్నిక విషయంలోనే కాదు, ప్రెస్‌లో ప్రూఫులు చూడడం మొదలు, ఇంట్లో మనిషి వలె తలకెత్తుకున్నవాడు ఎన్‌కె. ఆయన వరంగల్‌లో ఉండేవాడు కనుక వరంగల్ వెంకటరమణ ముద్రణాలయంలో సృజన పనులన్ని చూసే క్రమంలో మా అందరికన్న ఆయనే ప్రెస్‌వర్కర్‌లలో ఒకడుగా మసలుకునేవాడు. ఆయన ప్రేరణతోనే ప్రెస్‌వర్కర్ ఎన్.రాజశేఖరం రచనలు చేయడం ప్రారంభించి సాహితీమిత్రులులో చేరాడు. ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో రాజశేఖరం మరణించినప్పుడు ఎన్‌కె ఆరోగ్యపరిస్థితి అది తెలుసుకోగలిగే స్థితిలో కూడా లేదు. మూడు నాలుగేండ్లుగా పార్కిన్సన్, మధుమేహం, రక్తపోటుతో బాధపడుతూ, గుండెజబ్బుకు కూడా శస్త్రచికిత్స జరిగి చూపు, నడక దాదాపు కోల్పోయి ఎన్‌కె అనారోగ్యంతో శయ్యాగతుడుగానే ఉన్నాడు. ఆయన తీవ్ర అనారోగ్యంతో ఉన్నాడని తెలిసి గంగాధర్, రవిచంద్ర, బాసిత్ మొదలయినవారు అప్పుడప్పుడు పరామర్శించారు. సృజన 200 డివిడి విడుదల వరంగల్‌లో జరిగినపుడు రాగలిగాడు కాని మాట్లాడలేక పోయాడు. ఆఖరిసారి ఈ సెప్టెంబర్ 7న కాళోజీపై లోచన్ పుస్తకావిష్కరణకు వెళ్లి, ఆయనను వెళ్లిచూసినపుడు మాత్రం కొంచెం మెరుగ్గా ఉన్నట్టు అనిపించింది. అయితే అది ఆయన సహచరి ప్రసూన, అమెరికాలో ఉన్న కూతుళ్లు వసుబాల, ప్రాణహిత, వాళ్ల భర్తలు తీసుకున్న శ్రద్ధ, చేయించిన చికిత్సా ప్రభావమే కానీ ఇంక ఆయన మళ్లీ కాళ్లూ చేతులూ కూడదీసుకొని, ముఖ్యంగా కంఠం సవరించుకొని మనమధ్యకు వచ్చి ఆ 70ల, 80ల రోజులను ఆలపించగలడనే ఆశ 2014 డిసెంబర్ 27 రాత్రి 8 గంటలకు శాశ్వతంగా విగత ఆశ అయిపోయింది.

ఎన్‌కె జీవితంలోనయినా అటువంటి చాలామంది విప్లవాభిమానుల జీవితంలో అయినా 1968-85 ఒక ఉజ్వల కాలం. 1985 ఆరంభంలో కాకతీయ యూనివర్సిటీలో కెమిస్ట్రీ ల్యాబ్ షార్ట్ సర్క్యూట్ వల్ల తగులబడిపోయింది. అది రాడికల్స్ తగులబెట్టారన్న కేసులో కల్తి మోహనరావు, ప్రొఫెసర్లతో పాటు ఎన్.కె.ను కూడా పెట్టారు. ముఖ్యంగా వరంగల్‌లో 85 సెప్టెంబర్ 3న డాక్టర్ రామనాథం గారి హత్యతో మేం పదిహేడేళ్లు ఒక గూటిపక్షులుగా పంచుకున్న జీవితాలు, ఉద్యమాలు అన్నీ చెల్లాచెదురయిపోయినవి. కొందరు కూడదీసుకున్నారు. 1985-89 గడ్డుకాలాన్ని గడిచి మునుసాగారు. కాని ఎన్‌కె విరసం క్రమశిక్షణా నియమాల వల్ల కూడా 1994 నాటికి విరసంనుంచి నిష్క్రమించాడు. అయితే హృదయంలో విప్లవం పట్ల, విప్లవసాహిత్యం పట్ల గూడుకట్టుకున్న భావోద్వేగాలు ఎప్పుడూ చెదిరిపోలేదు. ఆయన కూడా మాతో కలిసి నిర్మించిన విరసం వరంగల్‌లో నలభై నాలుగేళ్లలో తొలిసారిగా 2014లో మహాసభలు జరుపుకున్నప్పుడు ఆయనను ఆహ్వానించడానికి మేం వెళ్లాం. కాని ఆయన కదిలేస్థితిలో లేడు. విరసం కార్యకలాపాల గురించి, దండకారణ్య ఉద్యమం గురించి అడిగి తెలుసుకున్నాడు.

1985 దాకా విరసం కార్యకలాపాల్లో చాల క్రియాశీలంగా పాల్గొన్న ఎన్‌కె 70లో ఖమ్మంలో కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహినగర్‌లో జరిగిన ప్రథమ మహాసభల నుంచి వరంగల్, హైదరాబాద్, తెనాలి, గుంటూరు, విశాఖపట్నంల దాకా వేదికలపై విప్లవగీతాల ఆలాపనలతో చాలా ప్రసిద్ధుడయ్యాడు. అప్పుడు విరసం సభలకు వేలాదిమందిగా జనం వచ్చేవాళ్లు. తాను రాసిన పాటలకన్నా శివసాగర్ అజ్ఞాతం నుంచి, జైలు నుంచి పంపించే పాటలకు ట్యూన్ కట్టి "చెల్లీచెంద్రమ్మ", "మేరిమి కొండల్లో మెరిసింది మేఘం", "తోటరాముడి తొడకు...." వంటి పాటలకు విస్తృత ప్రచారం చేకూర్చినవాడు ఎన్‌కె. 1979లో జైలునుంచి బయటికి వచ్చి వరంగల్‌లో విరసం సాహిత్యపాఠశాలలో పాల్గొనడానికి ఎస్‌ఎం వచ్చినపుడు ఆయన పాటలు ఆయనే పాడితే ఎన్‌కె గొంతుతో చెవికి అలవాటయిన ఆ పాటలు ముందుతరం వాళ్లు పాడుతున్నట్టుగా మాకనిపించింది. ఇప్పుడేమయ్యాయో తెలియదుగానీ సృజనకు వచ్చే శివసాగర్ ప్రతిరచనా శివసాగర్ స్వదస్తూరిలో ఆయన దాచుకున్నాడు.

అమరుడు పరిటాల శ్రీరాములుపై మరో విరసం సభ్యుడు కామ్రేడ్ పెద్దారెడ్డి రాసిన 'పరిటాల రాములు, నీకు లాల్ సలాములు' పాట కూడా ఎన్.కె. నోట తెలుగు నేలంతా ప్రచారమైంది. 'పిల్లలారా తల్లిలాంటి విప్లవాన్ని పాడండి' పాట కూడా మొదట ఎన్.కె. నోటనే ఎక్కువ ప్రచారమైంది.

సృజన, విరసం కార్యకలాపాల్లో ఎన్‌కె కంఠదఘ్నంగా నిమగ్నం కావడంతో ఎమర్జెన్సీ ప్రకటించగానే 1975 జులై4న ఆయనను మీసా కింద అరెస్టుచేసారు. ఎమర్జెన్సీ అంతా ఆయన జైలులోనే ఉన్నాడు. 75 అక్టోబరు1 దాకా జైలులో మా గదిలోనే ఉన్న చెరుకూరు రాజకుమార్‌తో కలిసి ఎప్పుడూ ఆయన విప్లవగీతాలు ఆలపిస్తుండేవాడు. 1985 జనవరి 12న జగిత్యాలలో ఎపిసిఎల్‌సి జిల్లా నాయకుడు గోపి రాజన్నను సంఘ్ పరివార్ వాళ్లు చంపేసారు. ఆయన న్యాయవాది. ఫాసిస్టు ఉన్మాదంగా మారిన సామ్రాజ్యవాద భూస్వామ్య సంస్కృతిని సంఘటితంగా ప్రతిఘటించవలసిందిగా ప్రజాతంత్రవాదులను కోరుతూ గోపిరాజన్నను అంకితంగా రెండవ ముద్రణ 1985లో వెలువడింది.

ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత విప్లవోద్యమం ప్రజాపంథాను చేపట్టి మాకు జన్నుచిన్నాలు తలలో నాలుకయ్యాడు. 1979 అక్టోబరు 19న జన్నుచిన్నాలు హత్య జరిగినప్పుడు "నీ కోసం పాట పాడుతా చిన్నాలన్నా , ఒక్కసారి లేచిరావయ్యా చిన్నాలన్నా" అని ఆయన పాడిన పాట ఎన్నిసభల్లో మారుమోగేదో.

ఎన్‌కె 1978లో కాకతీయ యునివర్సిటీలో తెలుగు ఎంఎలో చేరాడు. అక్కడ ఆయన సహాధ్యాయి లింగమూర్తి ఆ తర్వాత కాలంలో విప్లవోద్యమ నాయకత్వానికి ఎదిగి 2002లో కృష్ణానదిలో పుట్టిమునిగి అమరుడయ్యాడు. 78-80 లింగమూర్తి- ఎన్‌కెలు సహాధ్యాయులుగా పోటీపడి చదువడమే కాదు, విప్లవ విద్యార్థి ఉద్యమంలోనూ, సాహిత్య ఉద్యమంలోనూ అదే తీవ్రతతో పాల్గొనేవాళ్లు. ఆర్ఎస్‌యు, పిడిఎస్‌యులు కలిసి ఎన్నికల్లో గెలిచి కాకతీయ యునివర్సిటీ కార్ల్‌మార్క్స్ యునివర్సిటీ అని గిట్టనివాళ్లతో అనిపించుకున్న రోజులు అవి. ఆ ఉద్యమానికే కాదు, జిల్లాకే విప్లవోద్యమ నాయకుడు పులి

అంజయ్య అప్పుడు వీళ్లందరికీ మార్గదర్శకుడు. సృజనలో 1982 ఆగస్టులో అచ్చయిన "లాల్‌బనో గులామీ ఛోడో బోలే వందేమాతరమ్" అనే ఎన్‌కె దీర్ఘకవిత అంతే సుదీర్ఘమైన బాలగోపాల్ ముందుమాటతో 1983లో ఒకసారి, 85లో మళ్లీ ఆర్ఎస్‌యునే ప్రచురించి, విస్తృత ప్రచారం చేసింది. ఈ కవితకు ఒక చరిత్ర ఉంది.

అవి తెలంగాణలో రాడికల్స్, ఎబివిపి శక్తులు క్యాంపస్‌లలో, కళాశాలలలో భావఘర్షణలకే కాక భౌతిక ఘర్షణలకు కూడా తలపడుతున్న రోజులు. నక్సలైట్లు ఏ దేశభక్తులు, చైనా చెంచాలు, రష్యా తొత్తులు అని గోడలమీద ఎబివిపి వాళ్లు నినాదాలు రాస్తే "నక్సలైట్లే దేశభక్తులు" అని రాడికల్స్ రాసిన రోజులు. "లాల్‌గులామీ ఛోడ్‌కే బోలో వందేమాతరమ్" అని ఎబివిపి వాళ్లు రాస్తే దానికి ముహ్‌తోడ్ జవాబివ్వాలని ఆవేశపడిన ఎన్‌కె ఏకంగా ఒక దీర్ఘకవితయే రాసాడు. అదే "లాల్‌బనో..". తెలంగాణ పట్టణాల నిండా ఈ కవిత్వ నినాదాలు వెలిసాయి. ఎన్‌కె ఈ దీర్ఘకవితను వేలాదిమంది ప్రేక్షకుల ముందు కంచుకంఠం మోగినట్లు అరమోడ్పు కన్నులతో పాడుతుంటే అది ఓ రోమాంచితదృశ్యం. ఒక ఉద్రిక్త అనుభవం. 1985 జనవరి గద్వాల విరసం సాహిత్యపాఠశాల అంశం – మతవర్గతత్వం. కెవిఆర్, త్రిపురనేని మధుసూదనరావు, సివి సుబ్బారావు చరిత్ర, తత్వశాస్త్రం, రాజకీయ ఆర్థికశాస్త్రం నేపథ్యంలో మనం మతం అనుకుంటున్నది ఒక మతవర్గతత్వంగా ఎట్లా వర్గపోరాటంలో భాగమే అవుతుందో విశ్లేషిస్తూ ప్రసంగించారు. ఆ నేపథ్యంలో బహిరంగసభలో వేలాదిమంది ముందు ఎన్‌కె లాల్‌బనో ప్రసంగాలకన్నా ఎక్కువ ప్రభావాన్ని వేసింది.

ఈ దీర్ఘకవిత పుస్తకంగా ముద్రణకు వెళ్లేవరకు నల్గొండలో శేషయ్య అనే ఆర్ఎస్‌యు విద్యార్థిని ఎబివిపి వాళ్లు చంపేసారు. శేషయ్య ఉదయం ఇళ్లల్లో వార్తాపత్రికలు వేసే జీవికతో సాయం కళాశాలలో చదువుకునేవాడు. నలగొండ జిల్లాలో ఆ తరం విద్యార్థులనందరినీ విప్లవభావజాలంలోకి తెచ్చిన మిర్యాలగూడ శేషుసారు శిష్యుడు శేషయ్య. శేషుసారు తొలితరం విరసం నాయకుడు. ఆయనపై కూడ ఎబివిపి విద్యార్థులు దాడిచేసి తలపగులగొట్టి చనిపోయాడని వదిలేసారు. ఈ వాతావరణంలో గద్వాలలో రాడికల్ విద్యార్థులు పూనుకొని నిర్వహించిన విరసం సాహిత్యపాఠశాలలో 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం నుంచి అప్పటిదాకా అంటే 1985 దాకా చరిత్రను గతితార్కిక చారిత్రక భౌతికవాద దృష్టితో తీవ్రభావావేశంతో ఎన్‌కె రాసిన దీర్ఘకవిత ఎటువంటి ప్రభావం వేస్తుందో ఎవరైనా ఊహించవలసిందే. ఈ దీర్ఘకవిత కన్నడంలోకి, హిందీలోకి కూడ అనువాదమయింది. కర్ణాటకలో బాబాబుడన్‌గిరి దర్గా ఐదువందల ఏళ్లకు పైగా సూఫీ భావజాలానికి కేంద్రంగా ఉన్నది. హిందూ పుణ్యక్షేత్రమని సంఘ పరివార్ చేస్తున్న ప్రతీకారానికి లౌకిక ప్రజాస్వామిక శక్తులు ఒకటికి రెండు సార్లు కన్నడంలో ఈ దీర్ఘకవితను ప్రచురించి విస్తృత ప్రచారం చేసారు. అట్లే 1990లో బొంబాయిలో మత వర్గతత్వానికి వ్యతిరేకంగా ఎఐఎల్ఆర్‌సి అఖిల భారత స్థాయి సదస్సు ఏర్పాటు చేసినపుడు హిందీ పుస్తక్ అప్పటి దాకా సాధారణ ఎన్నికలలో మత కలహాల పేరుతో జరిగిన ఘర్షణలు, హత్యల జాబితాలో వెలువడింది. 'ఈసారి మత ఘర్షణలలో నెత్తుటి వర్షం చాలా కురిసింది. ఓట్ల పంటలు బాగా పండుతాయి' అన్న గోరఖ్‌పాండే సుప్రసిద్ధ కవితా చరణం కూడా ఈ పుస్తకం పైన హిందీలో వేసారు. హిందీ ప్రోగ్రెస్ పబ్లిషర్స్ తరఫున కంచనకుమార్ ఢిల్లీ నుంచి ప్రచురించాడు. ఇంగ్లిషు జె.సి.వోరా అనువాదం విరసం, ఎఐఎల్ఆర్‌సి 1993లో ఎఐఎల్ఆర్‌సి దశాబ్ది ఉత్సవాలు హైదరాబాదులో 'మతతత్వానికి' వ్యతిరేకంగా జరిగిన సందర్భంగా ప్రచురించారు. దీనికి నేపథ్యం బాబ్రీమసీదు విధ్వంసం. బొంబాయి సూరత్ పట్టణాలలో ముస్లింల హత్యలు. అపాయకుమార్ బాగ్చీ, అనురాధగాంధీ, జిలానీబాను ఈ మహాసభల్లో పాల్గొన్నారు.

1984లో ఎన్‌కె తన తొలి కవితాసంకలనం "రిహార్సల్" ప్రచురించాడు. అంతకు చాలముందుగానే 1971లో "బంగ్లాదేశ్" కవితాసంకలనానికి సంపాదకత్వం వహించాడు. ఎమర్జెన్సీకన్నా ముందు వద్దేపల్లి సుధాకర్ సంపాదకత్వం వహించిన "కొక్కొరోకో", అగ్నిమిత్ర సంపాదకత్వం వహించిన "సమరం" కవితాసంకలనంలో కూడ ఎన్‌కె కవితలు ఉన్నాయి. 1985-89 ఆటా మాటా పాట బందయిన తీవ్ర నిర్బంధకాలం తర్వాత వరంగల్‌నగరం ఒక లాటిన్ అమెరికన్ నగరం వలె మారిన స్థితి గురించి కె.రామమోహనరాజు సంపాదకత్వంలో వెలువడిన "నిశ్శబ్దం చీడ కాదు" కవితా సంకలనంలో కూడ ఆయన రాసాడు.

1970 జులై 4న విరసం ఏర్పడినరోజు తనతో పాటు కరపత్రాలు పంచి నిర్బంధింపబడి చిత్రహింసలననుభవించిన జమ్మికుంట ఆదర్శకళాశాల విద్యార్థి తిరుపతి తర్వాత కొద్దిరోజులకే కరెంటుషాక్‌తో మరణించినపుడు ఆయనపై ఎన్‌కె రాసిన పాట చాల ప్రచారాన్ని పొందింది. తిరుపతిలో విప్లవోద్యమాన్ని నిర్మించిన చలపతి, నాగరాజులలో నాగరాజు అమరుడైనపుడు 'ఒక చేత్తో కన్నీరు తుడుచుకొని / వేరొక చేత్తో ఎర్రజెండా ఎత్తుకొని అంటాము మేము నాగరాజు / గుండెల్లో మండేవు రాజుకొని రోజు రోజు' అని రాసిన పాట ఇప్పటికీ విప్లవ సాహిత్యాభిమానులు అందరూ గుర్తు పెట్టుకుంటారు. శివసాగర్ "జాలరన్నా" పాట ప్రభావంలో "ఏయె ఏయె సెల్లె వల వేయవే" వంటి పొలిమికల్ పాటలు కూడ ఎన్‌కె రాసాడు. అయితే ఇప్పటికీ విప్లవోద్యమంలో, అజ్ఞాత జీవితంలో ఆదర్శ వివాహాలు జరిగినపుడు "పోదాం కలిసి పోరాటానికి, వస్తావ నువు నావెంట" అనే పాటతో ఎన్‌కె గాయకుడుగానే కాదు, పాటల రచయితగా కూడ విప్లవ కవిత్వోద్యమంలో నిలిచిపోయాడు.

కాకతీయ యునివర్సిటీలో జయశంకర్‌గారు రిజిస్ట్రార్‌గా, వైస్‌ఛాన్సలర్‌గా పనిచేసిన రోజుల్లో ఎన్‌కె విశ్వవిద్యాలయ ఉద్యోగసంఘ నిర్మాణం చేసి నాయకత్వాన్ని అందించాడు. దూరవిద్య కేంద్రంలో ప్రొఫెసర్ మురళీమనోహర్ నాయకత్వంలో పనిచేసినపుడు దూరవిద్యకోసం శాస్త్రీయమైన పాఠ్యాంశాలు తయారుచేయడంలో తోడ్పడ్డాడు. ఒకరకంగా విరసంకు దూరమై, ఉద్యోగ విరమణ కూడ చేసిన తర్వాత తండ్రి ముద్రిత, అముద్రిత రచనలు అచ్చువేయడంలోనే ఎక్కువ నిమగ్నమైపోయాడు. అనారోగ్యానికి గురికావడానికన్నా

వ్యాసం

ఇస్లాం తీవ్రవాద మూలాలు - పరిణామాలు

- ఎర్రంరెడ్డి నర్సింహారెడ్డి

ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లోనూ, చమురు నిక్షేపాల దృష్ట్యా కీలక ప్రాంతమైన పర్షియన్ గల్ఫ్‌లో నూతన తైనాతీ ఒకరుండాలని అరబ్బు దేశాల పక్కలో బల్లెంలా పాలస్తీనాను విచ్ఛిన్నం చేసి ఇజ్రాయిల్‌ను సృష్టించింది అమెరికా. పశ్చిమాసియాలో ఇజ్రాయిల్ సృష్టి సరిపోదన్నట్లు ఇరాన్‌లో, ఇరాక్‌లో, లెబనాన్‌లో, సిరియాలో, ఒమెన్‌లో, సౌదీ అరేబియాలో, జోర్డాన్‌లో, లిబియాలో, ఈజిప్ట్‌లో సైనిక స్థావారాలు ఏర్పాటు చేసుకొని దేశాల మధ్య, దేశాలలో అంతర్గతంగా ఘర్షణలు సృష్టించి తగాదాలు పెంచి, పోషించి ఇరు పక్షాలకు ఆయుధాలు అమ్ముకొని, అక్కడున్న చమురును తన గుప్పెట్లో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నది అమెరికానే. ప్రచ్ఛన్న యుద్ధానంతరం అమెరికా ఆదిపత్య వ్యూహంలో భాగంగానే తీవ్రవాద సంస్థల సృష్టి జరిగింది. సోవియట్ అమెరికాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం సమసిపోవడంతో ఇక శాంతి రాజ్యమేలుతుందనే ఆశలను వమ్ము చేస్తూ అమెరికా, నాటో దేశాలు చేపట్టిన నూతన ఆధిపత్య వ్యూహం ప్రపంచానికి కొత్త ప్రమాదాన్ని తెచ్చి పెట్టింది. అమెరికా సామ్రాజ్యవాద కనుసన్నల్లో పెరిగిన తీవ్రవాద అర్ధరహిత హింసకాండతో 162 దేశాల్లో అమాయక ప్రజలు బలవుతున్నారు. గత ఏడాది గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ నివేదిక ప్రపంచ వ్యాప్తంగా 162 దేశాల తీరుతెన్నులను, పరిణామాలను ఆధ్యయనం చేసిన ప్రపంచ ఆర్థిక, శాంతి అధ్యయన సంస్థ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పీస్ - ఐఈపీ) వెలువరించిన నివేదిక దిగ్భ్రాంతికరమైన వాస్తవాలను వెలుగులోకి తెచ్చింది. ఈ నివేదిక ప్రకారం ప్రధానంగా 5 దేశాలు ఈ ఉన్మాదం తాకిడికి తీవ్రంగా నలిగిపోతున్నాయి. ఇవి ఇరాక్, అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్, నైజీరియా, సిరియా. గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా సుమారు 17,958 మంది ఉగ్రవాద దాడుల్లో చనిపోగా వీరిలో దాదాపు 82% మంది ఈ దేశాలకు చెందిన వారే కావడం గమనార్హం.

మహమ్మద్ మరణాంతరం 624లో ఏర్పడిన ఖలీఫా వ్యవస్థ మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత 1924లో అట్టోమాన్ సామ్రాజ్యం పతనంతో టర్కీ అధినేత కమాల్ అతులే తుర్క్ రద్దు చేశారు. దీనికి కారణం మొదటి ప్రపంచ విజేతలు బ్రిటన్ -ఫ్రాన్స్ దేశాలు సైయిన్ పికోట్ ఒప్పందం ద్వారా ఒట్టోమాన్ సామ్రాజ్యంలోని అరబ్బు ప్రాంతాల దేశాల సరిహద్దులను ఏర్పరచడం జరిగింది. ఆంగ్లో ఫ్రెంచి వలసవాదులు వలసవాద దృష్టితో గీసిన సరిహద్దును చెరిపి ఐఎస్ఐఎస్ ఆక్రమించిన ప్రాంతానికి ఇస్లామిక్ స్టేట్ (కాలిఫెట్ రాజ్యం) అని జూన్ 30న పేరు పెట్టారు. మీరు గీసిన సరిహద్దులను మేము గుర్తించబోము మా సరిహద్దులను మేమే ఏర్పరుచుకుంటాం అంటూ కాలిఫెట్ రాజ్యం ఆవిర్భావం జరిగింది. వారి అధినేత అబు బేకరును ప్రపంచంలోని అందరికీ ఖలీఫాగా ప్రకటించారు.

ఈ నేపథ్యంలో ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ పరిణామలు ఒకేచోట పెనవేసుకున్నాయి. ఇపుడు అమెరికా పశ్చిమ దేశాలు తమ ప్రాబల్యం కొనసాగడానికి ఇరాక్ సమాజంలోని సంప్రదాయక విభజనలపైనా, షియాల- సున్నీల మధ్య విభజనల పైనా, అరబ్బులు - కుర్దుల మధ్య విభజన పైనా ఆధారపడింది. అమెరికా సామ్రాజ్యవాదం తన ఎత్తుగడలను మారుస్తుంది. ఇప్పుడు ఇరాక్ విభజనను అమెరికా సామ్రాజ్యవాదం ముందుకు తెచ్చింది. ఒకవైపున,

---

ముందు "అమ్మస్పర్శ" పేరుతో తన స్వీయచరిత్ర రాసుకున్నాడు. ఎంత మంచి పేరు. అందులో తన కన్నతల్లిదే కాదు, ప్రసూనలోని అమ్మ స్పర్శ కూడ ఎంతో ఆర్ద్రంగా చిత్రించాడు. ఆ పుస్తకానికి అల్లంరాజయ్య సాహిత్యానికి రాసినటువంటి ముందుమాట రాయమని నన్ను అడిగాడు. ఎందుకంటే ఆయన జీవితం కూడ 68, 70ల నుంచి సృజన, విరసంలతో పెనవేసుకున్న జీవితం. 68 నుంచి 85 దాకా ఆయన మా ఇంట్లో పెద్దకొడుకు వలె వ్యవహరించాడు. నా సాహిత్య, రాజకీయ దృక్పథంతో మమేకమయ్యాడు. పిచ్చిపేగులవాడు. నన్ను చిన్నబాపు అని, నా సహచరి హేమలతను చిన్నమ్మ అని పిలిచేవాడు. ఆమెను కూడ కన్నతల్లి అంతగా అభిమానించాడు. ఇంట్లో పిల్లలవలెనే అలకలు, కోపాలు, ఉద్రేకాలు, అపార్థాలు, సాధించడాలు - మళ్లా కరిగిపోవడాలు అన్నీ ఉండేవి. తనకు మా ఇంట్లో హక్కు ఏదో ఉన్నట్లుగా ఉండేవాడు. 1990 తర్వాత మాకు పరస్పరం ప్రేమాభిమానాల్లో ఏ కల్మషమూ రాలేదుగానీ ఆయన విరసంకు దూరమయ్యాడు. "అమ్మ స్పర్శ" వస్తుగత దృష్టితో కాకుండా స్వీయాత్మక దృష్టితో రాసాడనిపించింది. విరసం నిర్మాణం, కార్యకలాపాల పట్ల కూడ కొన్ని తప్పులు దొర్లాయి. కనుక అవి సవరించుకొని మళ్లీ రాయమన్నాను. అంతే. ఆ పుస్తకానికి ముందుమాటలో ఆ అలక, కోపం, బాధ, వేదన కనిపిస్తాయి. కాని ప్రేమలున్నచోట ఇవన్నీ కన్నీళ్లలో కరిగిపోతాయి కంట్లో నలుసులు కరిగిపోయినట్లుగా. చినబాపూ, చిన్నమ్మా, చెల్లెళ్లూ, తమ్ములూ అని ఆయన నాభి దగ్గర్నించి వచ్చే పిలుపు, గాలిలో తేలిపోయే ఆయన పాటలు మా చెవుల్లో మోగుతూనే ఉంటాయి. గుండెల్లో తడిగా మిగిలి ఉంటాయి. ఇవన్నీ విప్లవానుబంధం వల్ల, సృజన వల్ల, విరసం వల్ల ఏర్పడినవే. కనుక మరింత స్వచ్ఛమైనవి.

తన మిత్రులైన గల్ఫ్ రాచరికాలను తన చెప్పు చేతల్లో ఉంచుకొవడానికి, మరోవైపున ఇరాక్ పలుకుబడిని ఆరికట్టుటకూ ఇరాక్ విభజనను ముందుకు తెచ్చింది. హాస్యాస్పదమైన విషయమేమంటే, అమెరికా సామ్రాజ్యవాదం తాను గతంలో కూలదోసిన శక్తులనే నేడు అక్కున చేర్చుకుంటుంది. పశ్చిమాసియా చమురుతో సంపద్వంతమైన ఆ ప్రాంతంలో తన పలుకుబడిని నిలబెట్టుకోవడానికి చేయని కుట్రలేదు.

ఇస్లాం తీవ్రవాద మూలాలు :

1979-88 మధ్యకాలంలో ఆఫ్ఘన్ యుద్ధం జరుగుతున్న కాలంలో సున్నీ ముస్లిం వర్గాల ప్రాబల్యంలో ఉన్న ఆఫ్ఘాన్ ముజాహిదీన్లను సౌదీ అరేబియా సమర్ధించింది. ఆఫ్ఘాన్‌లోకి ఆయుధాలను, సైనికులనూ తరలించే సందర్భంలో పాకిస్తాన్ ప్రచ్ఛన్న సహకారం అందించింది. ఆఫ్ఘానిస్తాన్ నుంచి సోవియట్ సేనలను వెళ్లగొట్టడానికి అమెరికా సహకారంతో, పాకిస్థాన్ ఐఎస్ఐ అండదండలతో పురుడుపోసుకున్న తీవ్రవాద సంస్థ తాలిబాన్ , అరబిక్ బాషలో తాలెబ్ అంటే విద్యార్థి అని అర్థం. ప్రాథమికంగా వీరంతా సున్నీమతవాదులు ఆఫ్ఘానిస్తాన్‌లోని పుస్తూన్ గిరిజన ప్రాంతాలకు చెందినవారు. ఆఫ్ఘానిస్తాన్ లోని స్వాత్‌లోయ ప్రాంతంలో వీరి అధిక్యం ఎక్కువగా కనబడుతుంది. అలాగే పాకిస్తాన్‌లోని గిరిజన అధీనంలో పాలన సాగుతున్న ప్రాంతాల్లో కూడా తాలిబాన్ ప్రాబల్యం ఎక్కువగా వుంది. 1980 ప్రాంతంలో ఆఫ్గానిస్తాన్‌లో సోవియట్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ముజాహిదిన్లకు అమెరికాలోని రీగన్ ప్రభుత్వం నిధులు సమకూర్చింది. మరోవైపు పాకిస్తాన్ లోని ఇస్లామిస్టుల సహకారముండనే వుంది.

ఆఫ్ఘానిస్తాన్ నుంచి సోవియెట్ సేనల ఉపసంహరణ తరువాత నజీబుల్లా నేతృత్వంలో లౌకిక ప్రభుత్వం ఏర్పడింది. దానిని కూలగొట్టడానికి అమెరికానే తాలిబన్ భూతాన్ని సృష్టించింది. 1995లో ఆఫ్ఘనిస్తాన్‌లో మత చాంధస తాలిబన్ అంతర్యుద్ధంలో విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. తరువాత 1996 నుండి ఆఫ్ఘాన్‌లో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. తాలిబన్ల ప్రాబల్యం ఉచ్ఛస్థానంలోకి వెళ్ళిపోయింది. షరియత్ అమలు చేశారు. దానిని అంతమొందించే పేరుతో అమెరికా సైన్యాలు అఫ్ఘానిస్తాన్‌లో తిష్టవేశాయి. ఆఫ్ఘానిస్తాన్‌లో తాలిబన్లను అంతమొందించడం పూర్తి కాలేదు సరి కదా, అది పాకిస్థాన్‌కు కూడా పాకింది. పాకిస్తాన్ సైన్యం పూర్తిగా అక్కడి ప్రభుత్వ నియంత్రణలో లేదు. ఇప్పటి వరకు పాకిస్తాన్‌ను నడిపిన సైనిక నియంతలు అందరూ అమెరికా కీలుబొమ్మలే. ఇప్పటికీ పాకిస్థాన్ సైన్యానికి తాలిబన్‌లకు సత్సంబంధాలు ఉన్నాయి.

గత 6 మాసాలుగా పాకిస్తాన్ సైన్యం వజీరిస్థాన్ ప్రాంతంలోని తాలిబన్లపై దాడులు ప్రారంభించింది. ఇప్పుడు పాకిస్తాన్ తాలిబన్లకు ఆఫ్ఘానిస్తాన్ కేంద్ర స్థానంగా మారింది. ఆఫ్ఘానిస్తాన్ ప్రభుత్వం పాకిస్తాన్‌కు చెందిన తాలిబన్లపై దాడులు చేయకుండా ప్రోత్సహిస్తున్నది. ఆఫ్ఘానిస్తాన్, పాకిస్తాన్ ప్రభుత్వాలను, వాటి సైన్యాలను ప్రభావితం చేసే శక్తి అమెరికాకు ఉంది. అయినా ఈ రెండూ దేశాలు తాలిబన్లను ప్రోత్సహిస్తున్నా ఎందుకు కండ్లు మూసుకొని వ్యవహరిస్తున్నదనే సందేహం కలుగుతున్నది. సిరియా-ఇరాక్ ప్రాంతంలో కూడా ఐఎస్ఐఎస్ తీవ్రవాదులకు సౌదీ అరేబియా, ఖతర్ వంటి అమెరికా మిత్ర దేశాలే ఆయుధాలు, నిధులు సమకూరుస్తున్నాయి. వాటిని అమెరికా కట్టడి చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. అమెరికా మిత్ర దేశాల ద్వారా మిలిటెంట్ తిరుగుబాటు గ్రూపులను పశ్చిమ దేశాలు పెంచి పోషించాయి. టర్కీ, జోర్డాన్‌లలో శిక్షణా శిబిరాలు నెలకొల్పి అల్‌ఖైదా తీవ్రవాదులకు సిఐఎ సైనిక శిక్షణ ఇస్తున్న సంగతి నడుస్తున్న చరిత్రే. ఆ గ్రూపులే అనంతర కాలంలో ఐఎస్ఐఎస్/ఐఎస్ఐఎల్, ఇతర అల్‌ఖైదా గ్రూపులుగా పరివర్తన చెందాయి.

అల్-ఖైదా ఒక్కో దేశంలో ఒక్కోపేరు. ఒకేదేశంలో వివిధ పేర్లుతో సంచరించగల అవకాశం కూడా అల్-ఖైదా సొంతం. వద్దించే సామ్రాజ్యవాద ప్రభువుకు నమ్మకమైన బంటు కావడం మూలానా ఎన్ని పేర్లతోనైనా వ్యవహారించగల సౌకర్యం అల్-ఖైదాకు సొంతమైంది. లిబియాలో ఎల్ ఐ ఎఫ్ జి, ఎక్యూ ఐఎం లుగా వ్యవహారిస్తోంది. మాలిలో అన్సార్ దినే, ముజావో పేర్లు ధరించింది. సోమాలియాలో అల్-షబాబ్‌గాను, యెమెన్‌లో ఎక్యూఎపిగాను, సిరియాలో ఆల్ నుస్రా ఫ్రంట్‌గాను, ఆల్ ఖైదా వ్యవహరిస్తుంది. ఇరాక్ లో ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ (ఐఎస్ఐ)పేరుతో వ్యవహారించిన అల్-ఖైదా గత సంవత్సరం ఏప్రిల్ నుండి ఐఎస్‌కె/ఐఎస్ఐఎస్‌గా పేరు మార్చుకుని సిరియాలోని ఇతర గ్రూపులను కలుపుతుంది. ఇరాక్, సిరియాలతోపాటు లెవంత్ లోని ఇతర దేశాలు కూడా కలిసి వచ్చేలా ఈ పేరు ఎంచుకుంది.

2001లో వరల్డ్ ట్రేడ్ సెంటర్ కూల్చివేత సాకుతో అమెరికా ఆఫ్ఘన్‌పై యుద్ధాన్ని ప్రకటించింది. నాటో దళాల దాడులు, మరోవైపు తాలిబాన్, ఆల్-ఖైదా ఉగ్రవాదుల ప్రతిదాడులతో ఆఫ్ఘాన్ నిత్యం బాంబులతో దద్దరిల్లిపోయేది. ఆత్మాహుతి దాడులు సర్వసాధారణంగా మారిపోయాయి. వేలాది మంది అమాయక ప్రజలు ఈ దాడుల్లో ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఆఫ్ఘన్‌పై అమెరికా దాడివల్ల ఇస్లామిక్ దేశాల మధ్య పునరేకీకరణ వేగవంతమైంది. ప్రతీకార విధ్వంసకాండ ద్విగుణీకృతమైంది. 2004లో ఆఫ్ఘాన్‌లో హమీద్ కర్జాయ్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. దేశాన్ని ఇస్లామిక్ రిపబ్లిక్‌గా నిర్వచించారు. నగరాలకు దారితీసే రహదారులపై ఆత్మాహుతి దాడులు అన్నవి తాలిబన్ ఎంచుకుంది.

2003లో అమెరికా నాయకత్వంలోని సంకీర్ణసేనలు ఇరాన్‌లో ప్రవేశించాయి. సద్దాంను పదవీచ్యుతిణ్ణి చేశాయి. ఆ తర్వాత ఉరితీసి చంపారు. ఇరాక్ సైన్యం నుండి (సున్నీ తెగకు చెందిన) పదిలక్షల మందిని తప్పించాయి. ఇరాక్‌పై అమెరికా దురాక్రమణకు పర్యవసానంగానూ, విఫలమైన అరబ్ తిరుగుబాటు నేపథ్యంలోనూ పశ్చిమాసియా దేశాల్లో ఇస్లామిస్టు ఉన్మాదం పెచ్చరిల్లింది. అమెరికా సామ్రాజ్యవాదంతో పోరాడేందుకు జోర్డాన్‌లో పుట్టిన అల్ జర్ధానీ 2004 అక్టోబర్‌లో అంగీకరించారు. జర్ధానీని అమెరికా 2006లో హతమార్చింది. జర్ధానీ హత్య తర్వాత 2006లో ఆ సంస్థ తన పేరును "ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాన్"గా మార్చుకుంది. 2010లో

రహస్యంగా ఉంటూవచ్చిన డా? ఇబ్రహీం అల్ బద్రి పేరును మార్చుకొని అబూ బకర్ అల్ బగ్దాదీగా ఐఎస్ఐఎస్ సారథ్యాన్ని స్వీకరించారు. 2013 ఏప్రిల్‌లో ఐఎస్ఐ కార్యకలాపాలను సిరియాలోకి విస్తరించింది. ఇప్పుడు ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాన్ అండ్ అల్ షామ్ (లెవంట్) అని పిలుస్తారు. ఐఎస్ఐఎస్ ఇరాన్‌లోని పశ్చిమప్రావిన్స్ అన్వర్ లో సున్నీలు ఎక్కువగా నివసిస్తున్న ఫల్లూజాను తన ఆధీనంలోకి తెచ్చుకుంది. జూన్ 2014లో మోసూల్‌ను చేజిక్కించుకుంది. ఉత్తర ఇరాక్‌లోని పలు చమురు క్షేత్రాలపై పట్టుబిగించింది. ఆ తర్వాత యూఫ్రేట్స్ అన్వర్‌లలో మరిన్ని పట్టణాలు స్వాధీనం చేసుకుంది.

ఐఎస్ఐఎస్, ఐఎస్ఐఎల్ అనే పేర్లతో వ్యవహారంలో ఉన్న కూటమి లక్ష్యం ఇరాక్, సిరియా, లెబనాన్, పాలస్తీనా దేశాల్లో తీవ్రవాద సున్నీ ప్రభుత్వాలను ఏర్పాటు చేయడమే, అయితే ఈ కూటమి ఏకశిలా సదృశంగా లేదు. భిన్నమైన ఆశయాలూ, ఆకాంక్షలూ లక్ష్యాలూ, ఆశలతో కూడిన అనేక బృందాల కలుగలుపు ఇది. వీటిలో కొన్నిటికి అంతర్జాతీయ స్థాయి లక్ష్యాలుంటే, మరికొన్నిటి లక్ష్యాలు కేవలం ప్రాంతీయమైనవి. అలాగే కొన్నిటి ఆకాంక్షలు స్వల్పకాలికమైనవి కాగా, మరికొన్ని దీర్ఘకాలికమైనవి. కొన్ని బృందాలు ఇస్లాం మతంలోని పరస్పరం భిన్నమైన శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. మరికొన్ని మొత్తంగా ఇస్లాం సామ్రాజ్య స్థాపనకు నిబద్ధమై ఉన్నాయి. ఒక దేశానికో, ఒక ప్రాంతానికో, ఒక జాతికో పరిమితం కాకుండా సార్వత్రికమైన ఉమ్మడి లక్ష్యంకోసం ఒక సర్దుబాటు మాదిరిగా ఏకమైన బృందాలివి. అమెరికాకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసిన ఇరాకీ సున్నీ తీవ్రవాదులూ, మాలికీకి వ్యతిరేకంగా తిరగబడిన సున్నీసైనికులూ కూడా ఈ కూటమిలో భాగస్వాములుగా ఉన్నారు. ఇరాక్ సరిహద్దుల్లో ఉన్న సిరియా ప్రాంతాలపై అసాద్ పెత్తనం సాగడంలేదు. ఇరాక్‌కు చెందిన సున్నీ తిరుగుబాటుదారులు సిరియాలోకి చొరబడ్డారు. వహాబీ జీహాదీలతో వారు చేతులు కలిపారు.ఇరాక్ ఉత్తర, పశ్చిమ సరిహద్దుల్లోని లక్ష్యాలపై దాడులు చేశారు. ముల్లా ఒమర్ హాఫీజ్ మహమ్మద్ సయీద్ లాంటి కొందరికి భారతదేశంలోని కొన్ని ప్రాంతాలను కూడా కలుపుకొని ప్రపంచవ్యాప్త ఇస్లామిక్ సామ్రాజ్యాన్ని స్థాపించాలన్న భ్రమలు లేకపోలేదు. కానీ, సున్నీ దళాలలో ఎక్కువమంది ఇరాక్ గురించీ, దాని ఇరుగు పొరుగు దేశాల గురించి మాత్రమే పట్టించు కుంటున్నారు.

అబూ బకర్ అల్ బాగ్దాదీ, ప్రపంచవ్యాప్త ఇస్లామిక్ సామ్రాజ్యపు ఖలీఫాగా అవతరించడానికి ముందు ఆయన నామధేయం డా॥ ఇబ్రహాం అల్ బద్రి. ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ లెవాంత్ అధినేతగా వెలుగులోకి వచ్చి ప్రపంచానికి అధినాయకునిగా మారిపోయిన ఇబ్రహీం... మహ్మద్ ప్రవక్త మామ, మధ్యయుగాల నాటి ప్రముఖ ఖలీఫా అబూ బకర్ అల్ బాగ్దాదీ వేషం కట్టారు. కానీ నిజంగా ఖలీఫాల కాలమైతే అతన్ని ఇస్లాం నుంచి వెలివేసేవారే, ఖలీఫా అబూ బుకర్ నుండి చిట్టచివరి ఖలీఫా అబ్దుల్ మోసిద్ (1868-1944) వరకు అంతా గొప్ప వివేచనాపరులు, పండితులు, ప్రపంచ వైజ్ఞానిక, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు ఇస్లాం నాగరికత అందించిన గొప్ప వారసత్వ సంపదకు కారకులు. వారందరికీ భిన్నంగా నేటి నకిలీ ఖలీఫా ప్రతి ఒక్కరినీ చంపండి అనే సందేశాన్ని, మసీదులను, ఇస్లామిక్ సాంస్కృతిక వారసత్వ సంపదను కూల్చేయండి, ప్రత్యర్థుల్ని కిరాతకంగా చంపే కర్తవాల్ని ప్రబోధిస్తున్నాడు. అల్ బగ్దాదీ 21 శతాబ్దపు జీహాదీగా నిరూపించుకున్నాడు. అయితే మహోన్నత మతపెద్ద రాజకీయ నాయకుడైన ఖలీఫ్ నాయకత్వంలోని ఇస్లాం రాజ్యాన్ని పునరుద్ధరించాలనే పాతతరం ఇస్లామీవాద కోరిక అలాగే ఉంది. ఈ సున్నీ సంస్థ ఇరాన్-సిరియా దేశాల్లో ఉనికిలో ఉంది. సిరియాలోని అలెప్పో నుంచి ఉత్తర ఇరాక్‌లోని అన్బర్ ప్రావిన్స్‌లో పూర్తిగా విస్తరించి ఉంది. అయితే, అభినవ ఖలీఫా యూదు ఇజ్రాయిల్‌కు ఆనందం కలిగించేలా అరబ్బు ప్రపంచంలో చిచ్చు రగిల్చారు. ఇస్లామిక్ సామ్రాజ్యం పేక మేడ అప్పుడే కూలడం మొదలైంది. నైనివే రాష్ట్రంలో సున్నీ మిలీషియాలు ఐఎస్ఐఎస్ వ్యతిరేక పోరాటానికి నాయకత్వం వహిస్తున్నారు.

సిరియా, ఇరాక్ దేశాలకు తరలివెళ్ళిన పాకిస్తానీ తీవ్రవాదులూ, కిరాయి సైనికులూ ఆ దేశపుపాలకులకు తెలిసే వెళ్ళారని లాహోర్ కేంద్రంగా పనిచేసే రక్షణ రంగ విశ్లేషకుడు రిటైర్డ్ మేజర్ ఆఘా అమీన్ విశ్వాసం. 1987-1989 సంవత్సరాల మధ్య పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐకి అధిపతిగా పనిచేసిన హమీద్ గుల్ ఈ తరహా నియమాకాలకు ప్రధాన సంధానకర్తగా వ్యవరించారని అమీన్ పెర్కొన్నారు. అంతేకాక ఈ సైనిక శ్రేణులలో పాకిస్తాని తీవ్రవాదులూ,మాజీ సైనికులూ వందల సంఖ్యలో చేరుతున్నారని ఆయన పెర్కొన్నారు. 2010లో వికీలిక్స్ వెల్లడి చేసిన అమెరికన్ దౌత్య సంభాషణ ప్రకారం- హమీద్ గుల్‌కు అల్ ఖైదా ఆఫ్ఘన్ తాలిబన్ సంస్థలతో సన్నిహిత సంబంధాలున్నాయి. విశేషమేమిటంటే, సెప్టెంబర్ 2013 నుంచి లెఫ్టినెంట్ జనరల్ గుల్ పాక్ మాజీసైనికుల సంఘానికి అధినేతగా వ్యవరిస్తున్నారు.

సిరియాలో ప్రభుత్వ బలగాల చేతుల్లో ఆల్-నుస్రా తదితర తీవ్రవాద సంస్థలు వరుస ఓటములు ఎదుర్కొంటున్న కాలంలోనే ఐఎస్ఐఎస్/ఐఎస్‌కె ఉనికిలోకి రావడం జరిగింది. అమెరికా పన్నిన భౌగోళిక రాజకీయ వ్యూహం ప్రకారం సిరియాలో ఈపాటికి ప్రభుత్వం కూలిపోయి ఉండాలి. దానికి భిన్నంగా రష్యా, చైనాల మద్దతుతో సిరియా ప్రభుత్వం నిలదొక్కుకుంది.అస్సాద్ ను కూడా పదవి నుండి తప్పిస్తే పశ్చిమా సామ్రాజ్యవాదుల భౌగోళిక రాజకీయ వ్యూహం సంపూర్ణం అవుతుంది. కానీ అది మరోకోణంలో రష్యా, చైనాల ఉనికికి విఘాతం. అస్సాద్ కూలిపోతే ఇరాన్ ను దారిలోకి తెచ్చుకోవడం అమెరికాకు తేలికవుతుంది. అదే జరిగితే రష్యాచైనాల వాణిజ్య, చమురు ప్రయోజనాలు దెబ్బతింటాయి. ఈ ప్రమాదంవల్లనే అస్సాద్‌ను కాపాడుకోవడంలో ప్రధానంగా రష్యా నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తోంది. అయితే సిరియా ఉత్తర-తూర్పు ప్రాంతాలు ఇసిస్ అధీనంలో కొనసాగుతున్నాయి. ఇరాక్ లోనూ కుర్దిస్తాన్ స్వయం ప్రతిపత్తి ప్రాంతాన్ని మినహాయించి ఉత్తర ఇరాక్ అంతా ఇసిస్ నియంత్రణలోకి వచ్చినట్లు వార్తలు తెలియజేస్తున్నాయి

(మిగతా వచ్చే సంచికలో)

ఈజిప్ట్: విప్లవం - ప్రతికూల విప్లవం - సోషల్ మీడియా

- మేరిలిన్ వోట్-డాని

స్వేచ్ఛానువాదం : పి. అరవింద

నవంబర్ 30, 2014 నాడు ఒక ఈజిప్ట్ జడ్జి మాజి ఈజిప్ట్ నియంత హోస్నీ ముబారక్ పైనున్న నేరాలనన్నిటిని కొట్టి పారేసాడు. దీని నేపథ్యం లోకి వెళ్తే - యు ఎస్ ప్రభుత్వ రాజకీయ, సైనిక సహకారంతో ముబారక్ ఈజిప్ట్ ని 30 ఏళ్ళు నిరంకుశంగా పాలించాడు. ఈజిప్ట్ లో జనవరి 25, 2011 నుండి మొదలైన "అరబ్ వసంతం", ఫిబ్రవరి 11, 2011 నాడు ముబారక్ అరెస్టు తో గొప్ప విజయాన్ని సాధించింది. దాని పర్యవసానంగా అవినీతి, ఇతర అనేక నేరారోపణల పై ముబారక్ దోషిగా నిర్ధారించ బడ్డాడు. ఇప్పుడు ముబారక్ పై నేరాలని కొట్టి పారెయ్యడంతో ఈజిప్ట్ 'విప్లవం' ముగిసిందని, ముబారక్ పాలన కొనసాగుతోందని అనుకోవచ్చు.

ప్రస్తుతం ఈజిప్ట్‌లో యు ఎస్ ప్రభుత్వ అండదండలతో పాలిస్తున్న మిలటరీ ప్రభుత్వం, ప్రజా హక్కులని, మాట్లాడే స్వేచ్ఛని అణచివేసే పోలీస్ వ్యవస్థని రూపొందించింది. ముబారక్ విడుదలని నిరసిస్తూ మాట్లాడిన కొద్ది మందిలో 85 మందిని పోలీసులు అరెస్టు చేసారు, ఒకరిని చంపేసారు. ఇదీ ఇప్పుడు అక్కడి పరిస్థితి.

అసలు జనవరి 25, 2011 ఈజిప్ట్ 'విప్లవం' వెనక కారణాలేమిటి, అందులో జరిగిన తప్పులేమిటి? ఈ ప్రశ్నలకి జవాబులు కావాలంటే, మొదట అమెరికన్ ప్రభుత్వ అంతర్జాతీయ 'సైబర్ అసమ్మతి' అనే ఎదురుదాడి గురించి, అది ఈజిప్ట్ లో ఎలా పని చేసిందో తెలుసుకోవాలి. వీటి గురించిన విలువైన సమాచారం లిండా హెరెరా రాసిన 'రెవలూషన్ ఇన్ ద ఏజ్ ఆఫ్ సోషల్ మీడియా' లో ఉంది.

వేల్ ఘోనిం కంప్యూటర్ ఇంజినీరింగ్, మార్కెటింగ్ లో డిగ్రీలుండి, 2008 నుండి గూగుల్ ఈజిప్ట్ లో పశ్చిమ ఆసియా, ఉత్తర ఆఫ్రికా ప్రాంతాలకి మార్కెటింగ్ మేనేజర్ గా పని చేస్తున్నాడు. జూన్ 2010 లో, కతార్ లో ఇద్దరు ముగ్గురు సహోద్యోగులతో కలిసి ఈజిప్ట్ లోని 'అరబ్ విప్లవా' నికి సంబంధించిన 'సోషల్ మీడియా' అంశాలని రూపొందించాడు. దాని పర్యవసానంగా లక్షల మంది ఈజిప్షియన్లు తెహరీర్ స్క్వేర్ లో నెల రోజులపాటు బైఠాయించి ముబారక్ నిరంకుశ పాలనని రద్దు చేసారు.

గుర్తించాల్సినదేమిటంటే ఘోనిం పని వెనుక చాల శక్తివంతమైన 'సైబర్ అసమ్మతి' యంత్రాంగం ఉంది, ముఖ్యంగా రెండు అమెరికన్ సంస్థలు - గూగుల్, అమెరికన్ ప్రభుత్వ స్టేట్ డిపార్ట్మెంట్. ఈ రెండు సంస్థలు అప్పటికి కొన్ని సంవత్సరాలుగా కలిసి సైబర్ అసమ్మతి వ్యూహాల మీద పని చేస్తూ ఉన్నాయి. ఘోనిం వెనక ఇవి రెండే కాక అనేక ఇతర ప్రైవేట్ కంపెనీలు కూడా ఉన్నాయి. ఈ కంపెనీలు సైబర్ అసమ్మతి అనే శక్తివంతమైన ఇంటర్నెట్ సాధనాన్ని అమెరికాకి, ఫ్రీ మార్కెట్ కి అనుకూలంగా వాడుకోవాలని చాలా ఉత్సాహంగా ఉన్నాయి.

ఈ పరిణామాలన్నీ హెరెరా తన వ్యాసం లో చాలా వివరంగా డాక్యుమెంటు చేసారు. అందులోని సమాచారం చూస్తే అమెరికన్ పాలక వర్గం, ప్రభుత్వం ఎట్లా హై టెక్, మార్కెటింగ్, ఎడ్వర్టైజింగ్ కంపెనీల తో కలిసి సైబర్ రంగం మీద పూర్తి ఆధిపత్యం సాధించాయో తెలుస్తుంది. ఈజిప్ట్ లో 2010-14 మధ్య జరిగిన పరిణామాలు సైబర్ ఆధిపత్యం తో ఏమి సాధించవచ్చు, ఏది నాశనం చెయ్యవచ్చు అనే దానికి మంచి ఉదాహరణలు.

తెహరీర్ స్క్వేర్ లోని ప్రజా తిరుగుబాటుతో ముబారక్ పాలన అంతమైనా, నిజానికి ఈజిప్ట్ ప్రజలు అంతిమంగా మోసపోయారు. సైనికులు తమ వైపు ఉన్నారని, పోలీస్ బారి నుండి తమని కాపాడతారని నమ్మారు. ముబారక్ తర్వాత బూర్జువా ప్రజాస్వామిక ఎన్నికలు జరిగినా, జులై 2013 నాటికల్లా ఆర్మీ ఎన్నికైన అధ్యక్షుడిని పదవీచ్యుతిడిని చేసి చిలి లోని పినోచెట్ పాలనని తలపించే సైనిక పాలనని విధించింది. అన్ని పౌర హక్కులు నిర్మూలించబడి, కోర్టులు, మీడియా, చివరికి విశ్వవిద్యాలయాలు కూడ ప్రభుత్వ అధీనం లోకి వచ్చాయి. మిలిటరీ ప్రభుత్వాన్ని కాని, దాని అధికారులని కాని విమర్శించిన వాళ్ళని అరెస్టులు చేసి నెలల తరబడి జైళ్ళలో పెట్టడం లేదా చంపెయ్యడం, పోలీసు హింస, జైళ్ళలో కఠోరమైన పరిస్థితులు అనేవి సాధారణమై పోయాయి. దాదాపు 900 విద్యార్థులు సంవత్సరం పైనే విచారణ లేకుండా జైళ్ళలో బందీలుగా ఉన్నారు. ముస్లిం బ్రదర్ హుడ్ పార్టీ నిషేధానికి గురై దాని నాయకులు అరెస్ట్ చెయ్యబడ్డారు.

ఈజిప్ట్ మిలిటరీ ప్రభుత్వం ఇజ్రాయెల్ తో మిత్రత్వం పాటించి, నవంబర్ 2014 లో గాజా సరిహద్దున ఉన్న సినై లోని రఫ నగరాన్ని మొత్తంగా నాశనం చేసి, గాజా ని బయటి ప్రపంచానికి కలుపుతున్న సొరంగాలని కూల్చేసింది. పేరుకి ఇది ఆటంకవాదం మీద దాడిగా చేసినా, దీని పర్యవసానంగా పాలస్తీనా ప్రజలు ఇంకా ఒంటరి వార్తై పోయారు. ఇవన్నీ కాకుండ, అరబ్ విప్లవం లో అంత ముఖ్యమైన పాత్ర పోషించిన సైబర్ అసమ్మతి అనేది ఈ ఘోరాలకి వ్యతిరేకంగా ఎప్పుడూ నోరు విప్పలేదు. అంతిమంగా ఈజిప్ట్ లోని 'విప్లవం' అక్కడి ప్రజానీకానికి ఉపయోగ పడకుండ అమెరికాకి, ఇజ్రాయెల్ కి మాత్రం ఉపయోగ పడింది. ఒక గొప్ప 'విజయం'అని అనుకున్నది చివరికి ఒక విషతుల్యమైన ఉచ్చు గా మిగిలింది. అట్లా 2011 లో ఈజిప్ట్ లో జరిగినది 'విప్లవం' కాదు, కేవలం 'పాలన మార్పు' మాత్రమే. దీని వెనకనున్న అమెరికన్ స్టేట్ డిపార్ట్మెంట్, గూగుల్, ఇతర కంపెనీలు పెంటగన్ అనుబంధ సంస్థలుగా పని చేస్తూ

ఉంటాయి.

'ప్రజా తిరుగుబాట్లు' అనే ముసుగులో 'పాలన మార్పులు' ఈజిప్ట్ లోనే కాకుండ, ఇంకా అనేక దేశాల్లో జరపబడ్డాయి, అది ఉక్రెయిన్ లో ఫిబ్రవరి 2014 లో విజయం కూడా సాధించింది. అమెరికా వెనక ఉండి చేయిస్తున్న ఈ 'పాలన మార్పుల' వలన ప్రజల సమీకరణ జరుగుతుందే కాని వాళ్ళకి ఏమీ ఉపయోగం ఉండదు. అంతే కాక, అత్యధికులకు ఈ మార్పులు తీవ్ర నష్టాన్నే కలుగజేస్తాయి. ఐతే, ఈ నష్టాలని కూడా అమెరికన్ ప్రభుత్వం, పెట్టుబడిదారులు, వాళ్ళతో కుమ్మక్కై పని చెసే వాళ్ళు, తాము నిలబెట్టిన ప్రభుత్వాలకి చాలా ప్రజాదరణ ఉందని చూపెట్టడానికి ఒక మార్గంగా వాడుకుంటాయి.

హెరెరా పుస్తకంలో అమెరికన్ 'సైబర్ అసమ్మతి' ఎదురుదాడి దశల వివరాలున్నాయి. 2003 ఇరాక్ పై దురాక్రమణ తర్వాత అరబ్, పశ్చిమాసియా దేశాల్లోని యువత ని ఆకట్టుకోవాల్సిన అవసరాన్ని అమెరికన్ ప్రభుత్వం గుర్తించి ఈ ఎదురుదాడి వ్యూహాన్ని రచించింది. ఈ దేశాల్లో జనాభాలో దాదాపు 75 శాతం ఉన్న యువత అమెరికన్ ప్రభుత్వం ఇజ్రాయెల్ని సమర్థించడం, ఇరాక్ ని నాశనం చెయ్యడం, వాళ్ళ దేశాల నియంతలని సమర్థించడం పై తీవ్ర వ్యతిరేకత కలిగి అమెరికాని ద్వేషిస్తున్నారని సర్వే లో వెల్లడైంది. అమెరికా తానే స్వయంగా పెంచి పోషించిన ముస్లిం తీవ్రవాదులకి వ్యతిరేకంగా మితవాద ముస్లింలని తయారు చేయ్యడానికి ఈ 'సైబర్ అసమ్మతి' దాడిని టెక్నాలజి తెలిసిన అరబ్ యువత ని లక్ష్యంగా పెట్టుకుని సాగించింది. 1997-2007 మధ్య ఈజిప్ట్ ప్రజలు అధికంగా సెల్ ఫోన్ యుగంలోకి ప్రవేశించారు. కేబుల్, సోషల్ మీడియా, ఇంటర్నెట్ అన్నీ ప్రజల అవగాహన, ఆలోచనల మీద మహత్తర ప్రభావాన్ని వేశాయి. 2012 కల్లా, దేశంలో 20 - 43శాతం పేదరికమున్నా, 56 మిలియన్ల ఈజిప్షియన్ల (72శాతం!!) వద్ద సెల్ ఫోన్లున్నాయి. ఈ పరిణామాలు ఈజిప్ట్ ప్రజల సామాజిక స్పృహలో నాటకీయమైన మార్పులు తెచ్చాయి.

2003 లో, మాజీ సి.ఐ.ఏ., యు.ఎస్. విదేశీ శాఖ, రేండ్ కార్పొరాషన్ ఏజంట్ గ్రహం ఫుల్లర్ రాసిన 'యువత అంశం: మధ్య ప్రాచ్య దేశాల మారుతున్న జనాభా, యు.ఎస్. విధానాలపై దాని ప్రభావం' అనే రిపోర్ట్ లో, అరబ్, ముస్లిం యువత మెదళ్ళని, హృదయాలని మృదువుగా ఎట్లా ఆకర్షించవచ్చో రాసాడు. వాషింగ్టన్ అరబ్ యువత ని అమెరికా వ్యతిరేకత నుంచి అమెరికా కి, మార్కెట్ కి అనుకూలంగా తిప్పుకోవాలని రాశాడు. 2003 లోనే, కాలిన్ పావెల్ అరబ్, ముస్లిం దేశాలతో నెరపవలసిన సంబంధాల కోసం అమెరికన్ ప్రభుత్వంలో ఒక సలహా మండలిని స్థాపించాడు. ఈ మండలి సమాచార, ప్రసార సాంకేతిక సాధనాల ఆధారంగా 9 అంశాల వ్యూహాన్ని రచించింది. దీని ప్రకారం, వాషింగ్టన్ దౌత్య సంబంధాలతో కాకుండా సూటిగా విదేశాల్లోని ప్రజలతో సంభాషణ సాగించాలి. ఈ మొత్తం ఎదురుదాడిని త్వర పరచడానికి, అమెరికన్ ప్రభుత్వ శాఖలు 2003 నుంచి ఎన్నో రకాల కార్యక్రమాలని మొదలు పెట్టాయి. ఫోన్ ల ద్వారా, చాట్ రూం ల ద్వారా అమెరికా కి మద్దతు పెంచుకునే ప్రయత్నాలు చేశాయి. ఐతే ఈ ప్రయత్నాలు ఫలించలేదు.

ఈ లోపు, యు.ఎస్.ఎ.ఐ.డి. (అంతర్జాతీయ అభివద్ధి కోసం పని చేసే యు.ఎస్. సంస్థ) ఈ దిశగా తన ప్రయత్నాలలో భాగంగా 2002 లో, 'మధ్య ప్రాచ్య భాగస్వామ్యం' పేరుతో, ప్రజాస్వామ్య విస్తరణ, విద్యా సదుపాయాలు, ఆర్థికాభివద్ధి, స్త్రీల సాధికారత అంశాల మీద అరబ్ దేశాల్లో పని మొదలు పెట్టింది. ఇంటర్నెట్, బ్లాగులు పెరిగిన క్రమంలో, ఈ ప్రోగ్రాం ద్వారా సైబర్ జర్నలిజం, సైబర్ కార్యకర్త ల ట్రైనింగ్ లోకి అడుగు పెట్టింది. సైబర్ కార్యకర్తలకి ఇంటర్నెట్, ప్రసార పరికరాల గురించి నేర్పే ఎన్.జి.ఒ. లకి అన్ని రకాల వనరులు సమకూర్చింది. 2002 - 2005 మధ్య, యు.ఎస్. స్టేట్ డిపార్ట్మెంట్ కూడా వాషింగ్టన్ కథనాన్ని వినిపించడానికి బ్రస్సెల్స్, లండన్, దుబాయ్ లలో ప్రాంతీయ మీడియా సెంటర్లని తెరిచింది.

యు.ఎస్. ప్రభుత్వ సైబర్ అసమ్మతి దాడిలో గుణాత్మకమైన మార్పు 2008 లో జేంస్ కే గ్లాస్మన్ స్టేట్ డిపార్ట్మెంట్ లో చేరడంతో వచ్చింది. గ్లాస్మన్ అంతకు ముందు అమెరికా కి అనుకూలమైన ప్రచారం చేసే అంతర్జాతీయ మీడియా లో ఉన్నాడు. వాషింగ్టన్ మునుపెన్నడూ చెయ్యని రీతిలో గ్లాస్మన్ ప్రచారాన్ని విస్తృత పరచాడు. దీని కోసం మూడు సైబర్ అసమ్మతి ఉద్యమాలని ఉదాహరణలుగా తీసుకొన్నాడు. అవి - ఇ) ఈజిప్ట్ లో నైల్ డెల్టా కార్మికుల సమ్మెని బల పరచడానికి సమీకరించ బడిన '6 ఏప్రెల్ యూత్ మూవ్మెంట్' 2) కొలంబియా లో విప్లవ సంస్థ ఫార్క్ కి వ్యతిరేకంగా సోషల్ మీడియా లోని 'నో మోర్ ఫార్క్' 3) సెర్బియా లో స్లోబోదాన్ మిలోసెవిక్ వ్యతిరేకంగా నడిచిన 'ఒట్పొర్'. సోషల్ మీడియా ద్వారా ప్రజాభిప్రాయాన్ని నిర్దిష్ట కార్యాల వైపు మళ్ళించ గలిగే శక్తి కి ఇవి మంచి నిదర్శనాలు. స్టేట్ డిపార్ట్మెంట్ కొత్త సైబర్ వ్యూహానికి 'ఆలయన్స్ ఆఫ్ యూత్ మూవ్మెంట్స్ (ఎ.వై.ఎం)' అని పేరు పెట్టారు.

సెర్బియా 'ఒట్పొర్' కి 1998-2003 మధ్య యు.ఎస్.ఎ.ఐ.డి, అంతర్జాతీయ రిపబ్లికన్ ఇన్స్టిట్యూట్, నేషనల్ ఎండోమెంట్ ఫర్ డెమోక్రసి నిధులు సమకూర్చాయి. 'ఒట్పొర్' లో ప్రముఖ పాత్ర పోషించిన ఇవాన్ మారోవిక్ యువత క్రియాశీలత్వాన్ని రాజకీయ కార్యాచరణగా కాకుండ బ్రాండ్ ఉన్న సరుకు గా అభివర్ణించాడు.

ఏ.వై.ఎం దీన్ని పునాదిగా చేసుకుంది. ఎ.వై.ఎం 2008 లో స్టేట్ డిపార్ట్మెంట్ లో పని చేసిన యారెడ్ కొహెన్ రూపకల్పన. ఎ.వై.ఎం సమస్యల మీద కాకుండా బ్రాండ్ మీద కేంద్రీకరిస్తుంది. అంటే సమస్యలు కూడా సరకులలాగా ఐపోతాయి. డిసెంబర్ 4-5, 2008 కొలంబియా యూనివర్సిటీ లా స్కూల్, న్యూ యార్క్ లో ఎ.వై.ఎం మొదటి అంతర్జాతీయ యువ సమావేశం జరిగింది. దీనిలో 15 దేశాలకి చెందిన యువత పాల్గొన్నారు. వక్తల్లో స్టేట్ డిపార్ట్మెంట్, హోంల్యాండ్ సెక్యూరిటీ, హూవర్ ఇన్స్టిట్యూట్, గూగుల్, ఫేస్బుక్, ఏటిటి, పెప్సి తదితర సంస్థలు, కంపెనీలకి చెందిన వాళ్ళు, ఒబామా మీడియా సలహాదార్లు, హాలీవుడ్ నటి వూపీ గోల్డ్బర్గ్ ఉన్నారు. ఈ సమావేశాన్ని ఎంటీవీ లో చూపించారు.

హెరెరా అన్నట్టు 'ఇంటర్నెట్ ద్వారా యువత ని

తీవ్రవాదాన్నుంచి మళ్ళించి, వాళ్ళకి సాధికారత కలిగిస్తున్నట్టుగా నమ్మించి, అమెరికన్ వ్యాపారాలకి లాభం చేకూర్చి పెట్టడమే ఎ.వై.ఎం లక్ష్యం శాంతం.

ఎ.వై.ఎం గాంధీని, మార్టిన్ లూథర్ కింగ్ జూని యువతకి మార్గదర్శకులుగా నిలబెడుతుంది. అహింసాయుత మార్గాల ద్వారా ప్రజా నిర్మాణాలని ఏర్పాటు చేయడం పై ఎ.వై.ఎం మ్యానువల్స్ని, వీడియోలని తయారు చేసి వాటిని ఇంటర్నెట్ ద్వారా అందజేస్తుంది. గ్లాస్మన్ వీటిని 'తీవ్రవాదాని పై ఆయుధాల'ని అంటాడు. ఇదొక భావజాల యుద్ధం, ఇందులో ముస్లిం, అరబ్ యువత అమెరికా విదేశీ విధానాలకి, ప్రయోజనాలకి సాధనాలు మాత్రమే. హెరెరా అన్నట్టు 'ఎ.వై.ఎం యువత లోని క్రియాశీలత్వానికి వినియోగతత్వాన్ని జోడించి రాజకీయాలు, రాడికల్ ఆలోచనలు లేకుండా చేస్తుంది'.

ఎ.వై.ఎం అమెరికా స్టేట్ డిపార్ట్మెంట్కి, హై టెక్, మార్కెటింగ్, ఎడ్వర్టైజింగ్, యువతనుద్దేశించిన మీడియా, తిండి, పానీయాల కంపెనీల మధ్య భాగస్వామ్యంగా ఏర్పడింది. ఎ.వై.ఎం రాజకీయాలని, కార్యక్రమాలని నడిపే పద్ధతికి కార్పొరేట్ అమెరికా మార్కెటింగ్ పద్ధతులు నమూనా. ఎ.వై.ఎం ప్రాజెక్ట్ లో కొహెన్ తో పాటు, అమెరికాలో అత్యంత పెద్దదైన ఆన్లైన్ షాపర్ల కంపెనీ 'యాక్సెస్ 360 మీడియశాతం, శాతంహౌకాస్ట్ మీడియ' కూడా ఉన్నాయి. అమెరికా స్టేట్ డిపార్ట్మెంట్ సహకారంతో 'హౌకాస్ట్ మీడియ' మానవ హక్కుల మీద బ్లాగులు రాయడం, పౌర నిరసన (??) పద్ధతులు, సోషల్ మీడియా ద్వారా క్యాంపెయిన్లు మొదలైన వాటిపై వీడియోలు తీసి ఇంటర్నెట్ కార్యకర్తలకి అందజేసింది. రాజకీయాలని సరదాగా, సృజనాత్మకంగా, 'కూల్'గా ప్యాకేజీ చేసి, యువతని ఉదారవాదులుగా, వ్యాపారాలకి, అధికార వ్యవస్థలకి అనుకూలురుగా తయారు చేసే పనిలో ఏ.వై.ఎం ఉంటుంది. ఈ చర్యలకి యు,ఎస్. ప్రభుత్వం నుంచి ఫండ్స్ అందుకొంటున్న ఎన్.జీ.వో.ల సహకారం చాలా ఉంటుంది. ఈ ఎన్.జీ.వో లు ప్రజలకి ల్యాప్టాప్లు, ఆఫీసు సామాను, టెక్నికల్ సాయం వగైరా అందజేస్తాయి. ఈ సైబర్ అసమ్మతి పద్ధతులతో యువతకేదో మంచి చెయ్యాలనే పరోపకార బుద్ధి ఏది అమెరికా కి లేదు. అది కేవలం తన మిలిటరి, ఆర్థిక లక్ష్యాల సాధన కోసం చేసినదే ఇదంతా. ఉక్రెయిన్, ఈజిప్ట్ దీనికి చక్కటి ఉదాహరణలు.

2010 లో స్టేట్ డిపార్ట్మెంట్ వదిలి యారెడ్ కొహెన్ 'గూగుల్ ఐడియాస్' లోనూ, విదేశీ సంబంధాల కౌన్సిల్ లో తీవ్రవాద, రాడికల్ వ్యతిరేక అంశాలలోను పని చెయ్యడానికి వెళ్ళాడు. జియోనిస్ట్ బిలియనీరు షెల్డన్ అదెల్సన్ తో కలిసి 'సైబర్ డిసిడెంట్స్.ఓఆర్జి' అనే వెబ్ సైట్ ని స్థాపించాడు. దీన్ని ఇంకో జియోనిస్ట్ దేవిడ్ గార్టెన్స్టెన్ రాస్ నడుపుతాడు. వీరు తమని తాము తటస్థ వాదులుగా, వివిధ దేశాలకి, మతాలకి ప్రతినిధులుగా, మానవ స్వేచ్ఛకి అంకితమైన వారుగా వర్ణించుకొంటారు. తమ రాజకీయ ప్రయోజనాలు ఎక్కడా బయట పడకుండా ఉండేందుకు వాళ్ళు అనామకంగా ఈ పనులు చేస్తారు.

2010-11 లో ఈజిప్ట్లో జరిగిన పరిణామాల క్రమాన్ని అర్థం చేసుకోవడానికి హెరెరా ఘోనిం, అతని సహచరుల ఫేస్బుక్ పేజీలని, ఈ-మెయిల్ మెసేజీలని, ముఖ్యంగా ఘోనిం తయారు చేసిన 'వీ ఆర్ ఆల్ ఖాలెద్ సయీద్' అనే ఫేస్బుక్ పేజిని ని పరీక్షించారు. ఘోనిం గూగుల్ లో నేర్చుకున్న మార్కెటింగ్ విద్యలని ఎట్లా సైబర్ అసమ్మతి నమూనాకి, తన ఫేస్బుక్ పేజీలకి ఈజిప్ట్లోని యువతని ఆకర్షించడానికి వాడుకున్నాడో హెరెరా విశదీకరించారు. వీటి వలన ఘోనిం ఫేస్బుక్ పేజీని లక్షల మంది చూసారు. ఈ విధంగా కతార్ లో గూగుల్ ఉద్యోగి ఐన ఘోనిం, తెర వెనుక ఉండి, తన వెబ్ పేజీల ద్వారా జనవరి 25, 2011 న జరిగిన ప్రజా సమీకరణకి పథకం రూపొందించాడు. చివరికి ఈ ప్రజా సమీకరణే ముబారక్ ని గద్దె దింపింది. ఘోనిం ఇదే సమయంలో ముబారక్ ప్రత్యర్థి మొహమ్మద్ ఎల్-బరాదై వెబ్ సైట్ ని కూడా రూపొందించాడు.

ఘోనిం తన సందేశాన్ని చాల జాగ్రత్తగా ఈ అంశాలు జోడించి రూపొందించాడు: 1) అహింస 2) అరాజకీయత 3) రాజకీయ ఆలోచనల పై వ్యతిరేకత 4) నాయకత్వం లేకపోవడం లోని ప్రయోజనం 5) క్యాపిటలిజం ని, మార్కెట్ ని ప్రశ్నించే ఆర్థిక చర్చలు లేకపోవడం. ఇవన్ని ఎ.వై.ఎం ప్రధాన అంశాలే. ఐతే, జనవరి 25, 2011 నాటికి పోరాటం పదునెక్కడంతో, స్టేట్ డిపార్ట్మెంట్ రచించిన సైబర్ అసమ్మతి వ్యూహానికున్న పరిమితులు తేటతెల్లమయ్యాయి.

'వీ ఆర్ ఆల్ ఖాలెద్ సయీద్' ఆధారంగా పని చేస్తున్న ఈజిప్ట్ కార్యకర్తలు సమర్థవంతమైన ప్రజా సమీకరణ చెయ్యడానికి పై సందేశం సరిపోదని, కేవలం ఎమర్జెన్సీ పాలన ఎత్తివేత, హింసని ఆపడం చాలవని గుర్తించారు. తమ దేశాన్ని పీడిస్తున్న దారిద్ర్యం, అధిక ఆహార ధరలు, నిరుద్యోగం గురించి మాట్లాడక తప్పదని, వెబ్ ద్వారా దారిద్ర్యం మీదా, ఆర్థిక రంగం మీదా కోర్సులు నిర్వహించే ప్రయత్నం చేశారు. ఐతే, వాళ్ళ ప్రయత్నాలు సంతృప్తికరంగా సాగలేదు. సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలని జోడించే ప్రయత్నంలో 'వీ ఆర్ ఆల్ ఖాలెద్ సయీద్' గందరగోళంగా, స్పష్టత లేకుండా తయారయ్యింది. చివరికి అది రెండే డిమాండ్లు పెట్టింది: 1) కనీస వేతనం పెంచడం, 2) యూనివర్సిటీ గ్రాడ్యుయేట్లకి కొంత కాలం నిరుద్యోగ భత్యం ఇవ్వడం.

హెరెరా తేల్చినట్టు, ఘోనింతో ప్రభావితమై పని చేసిన కార్యకర్తలెవరు ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాన్ని రూపొందించడనికి, వ్యవస్థీకతమైన దారిద్ర్యాన్ని, ఆర్థిక అసమానతలని నిర్మూలించడానికి అవసరమైన కార్యాచరణని రూపొందించలేకపోయారు. రష్యాలో ఫిబ్రవరి 1917 విప్లవానంతరం వచ్చిన 'భూమి, తిండి, శాంతి' తరహాలో, 'తిండి, స్వేచ్ఛ, సామాజిక న్యాయం' అనే నినాదం సృష్టించడమొకటే వాళ్ళు చేసింది, కాకపోతే 2011 ఈజిప్ట్ లో, ఈ నినాదాలని ఒక విప్లవ కార్యక్రమంలో భాగంగా చెయ్యగలిగే బోల్షెవిక్ పార్టీ కరువైంది. అందుకే, అవి నినాదాలుగానే మిగిలిపోయాయి. ఫిబ్రవరి 11, 2011 ముబారక్ పతనం తర్వాత, ఖాలెద్ సయీద్ పేజీ పూర్తిగా దిశ కోల్పోయింది. ప్రజలని వెళ్ళి వీథులు శుభ్రం చెయ్యమనడం లాంటి పిలుపులిచ్చి, ప్రజల ఎగతాళికి, నిరసనకి గురైంది.

యు.ఎస్. సామ్రాజ్యవాదం ఎ.వై.ఎం, ఇంకా ఇతర వెబ్, సైబర్ సంబంధిత దాడులని లోకంలో పలు చోట్ల కొన్ని ఏళ్ళుగా నడుపుతూనే ఉంది. జనవరి 21, 2010 న హిలరి క్లింటన్ ఇంటర్నెట్ స్వేచ్ఛ గురించి మాట్లాడుతూ 'యు.ఎస్, స్టేట్ డిపార్ట్మెంట్ నలభై దేశాలకు పైన ప్రజలతో వారిని అణచివేస్తున్న ప్రభుత్వాలకి వ్యతిరేకంగా పని చేస్తోంద'ని చెప్పారు. ఈ దేశాల్లో ఇరాన్, ఈజిప్ట్, ట్యునీషియా, లెబనాన్, సౌది అరేబియా, పాకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, వియత్నాం, చైనా ఉన్నాయి.

పైన పేర్కొన్న దేశాల్లో ఏదైనా అమెరికా రాజకీయ రంగంలో ప్రవేశించి, ఇవే పద్ధతుల్లో 'పాలన మార్పు' తెచ్చేందుకు ప్రజా సమీకరణని చేపడితే ఏమౌతుందో, యు.ఎస్. స్టేట్ డిపార్ట్మెంట్ ఎంతవరకు సహిస్తుందో ఊహించండి. హెరెరా అన్నట్టు, యు.ఎస్. ప్రభుత్వానికి నిజంగానే అరబ్ దేశ ప్రజల సుప్రుద్భావన కావాలంటే, అది తక్షణమే యుద్ధాలనాపేసి, కలిగించిన నష్టాలకి నష్ట పరిహారం చెల్లించాలి.

2010 నుండి యు.ఎస్ సైబర్ దాడులు సాగిస్తున్న దేశాల సంఖ్య బాగా పెరిగింది. 2014 కీవ్ లో 'మైదాన్' ప్రజా నిరసనల ద్వార ఉక్రెయిన్లో జరిగిన 'పాలన మార్పు' ఈ కోవకి చెందినదే. పాలన మారితే తమ జీవన పరిస్థితులు మెరుగౌతాయని ఆశించిన ఉక్రెయినియన్ శ్రామిక వర్గం, కొత్త పాలనా యంత్రాంగం, సామ్రాజ్యవాదులతో కలిసి ప్రవేశ పెట్టిన ఆర్థిక విధ్వంసాన్ని ఆపడానికి తయారుగా లేదు, అంతే కాక దేశంలో జరుగుతున్న అంతర్యుద్ధాన్ని ఆపలేక పోయింది.

మరోవైపు హంగరిలో ఇంటర్నెట్ వాడకంపై పెంచిన పన్నుకి వ్యతిరేకంగా, హాంగ్కాంగ్ లో ఎన్నికల చట్టంలో మార్పులకి వ్యతిరేకంగా, చెక్ రిపబ్లిక్ లో అవినీతిపరుడైన అధికారికి వ్యతిరేకంగా 'ఫ్లాష్ మాబ్' అనే యువ గ్యాంగులు తయారయ్యాయి. ఇవన్ని యారెడ్ కొహెన్, గూగుల్, హౌకాస్ట్ మీడియ, స్టేట్ డిపార్ట్మెంట్ తదితరులు రచించిన సైబర్ ఆధారిత ఎదురుదాడులకి సరికొత్త ఉదాహరణలు. క్యాపిటలిస్టు లోకంలోని ఏ దేశం ఈ సామ్రాజ్యవాద జోక్యం నుంచి తప్పించుకోలేదు. ఏ దేశమైన ఒ.ఈ.సి.డి., ఐ.ఎం.ఎఫ్., ప్రపంచ బ్యాంక్, ఐక్య రాజ్య సమితి నుంచి ఆర్థిక సహాయం పొందాలంటే సమాచార ప్రసార సాధనాల నెట్వర్క్ లోకి ప్రవేశించాల్సిందే.

ఎ.వై.ఎం సృష్టించే యువజనోద్యమాలు ప్రస్తుత వ్యవస్థలని భంగ పరచడానికి, పాలకులకి ఇబ్బంది, విసుగు కలిగించి చివరికి వాళ్ళు నిరసనకారుల మీదకి సైనిక బలగాలని పంపి చెడ్డ పేరు తెచ్చుకునేట్టుగా ఉంటాయి. అంతే కాని సామాన్య ప్రజల జీవితాలని బాగుపరచడానికి అవి ఎటువంటి దారీ చూపవు. ఈ ఉద్యమాలు మహా ఐతే 'పాలన మార్పు' వరకు సాధించగలవు, అవే విషమించితే విధ్వంసకర అంతర్యుద్ధాన్ని సృష్టిస్తాయి.

ఏ రకంగా చూసినా ఈ 'సైబర్ అసమ్మతి ఎదురుదాడి' యు.ఎస్. కి గెలుపే. తనకి కావాల్సిన పాలకులను అధికారం లోకి తీసుకు రావడానికి అక్కడి యువతని భాగస్వాములను చెయ్యడమే కాకుండా, తనకి అనుకూలంగా ఉన్న పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న యువతని లోబరచుకోవడానికి కూడా ఇవే పద్ధతులు పని చేస్తాయి. ఈ సమాచార, ప్రసార సాధనాల ద్వారా చేపట్టే చర్యలన్నీ యు.ఎస్ దౌత్య కార్యాలయాల, హై-టెక్ కంపెనీల, యు.ఎస్. ప్రభుత్వ ఫండ్లతో పని చేసే ఎన్.జీ.వో.ల, స్థానిక కార్యకర్తల భాగస్వామ్యంతో నడుస్తాయి.

మనమేమి చెయ్యాలి?

ప్రపంచం లో దాదాపు అన్ని చోట్లలో విప్లవ సంఘాలు, పార్టీలు ఏదో ఒక రూపంలో ఉండి ఉంటాయి. ఐతే అవి చిన్నవి గ ఉండడమే సమస్య. ప్రజలు పెట్టుబడిదారీ వ్యవస్థతో విసిగి పోయి ఉన్న ఈ తరుణంలో విప్లవ సంఘాల అవసరం చాలా ఉంది. ఉత్పత్తి సాధనాలు వ్యక్తుల సొంత ఆస్తి గా ఉండడమే సమస్య అని, వాటిని శ్రామికుల ఆధీనంలోకి తీసుకు రావడమే పరిష్కారమని చెప్పే విప్లవ రాజకీయాలు కావాలి.

లోకంలోని విప్లవకారులందరి ముందు ఇప్పుడొక కీలక ప్రశ్న ఉంది: క్యాపిటలిజం ప్రయోజనాల కోసం సామ్రాజ్యవాద సిద్ధాంతకర్తలు, టెక్నీషియన్లు కలిసి సృష్టించిన ఈ సైబర్ సాధనాలని క్యాపిటలిస్టు వ్యవస్థని కూలదోయగల సాధనాలుగా మలచ గలమా? ఈ విషయంపై లోతైన ఆలోచన చెయ్యవలసి ఉంది. ఇది కనుక సాధించ గలిగితే, శత్రువు సృష్టించిన ఆయుధాలని శత్రువు పైకే సంధించగలం. ఒకవేళ ఈ సైబర్ సాధనాలు మనకి పనికి రావని తేలిపోతే, అప్పుడు ఒక విషయం తేటతెల్లమవుతుంది. సామ్రాజ్యవాదానికి విరుగుడు యదార్థ రాజకీయాల్లోను, కార్మిక వర్గ అధికారం దిశగా జరిపే రాజకీయ పోరాటాల్లోనూ మాత్రమే ఉంది. దీని అర్థం - గత పోరాటాల నుంచి నేర్చుకున్న పాఠాలు, చారిత్రక నమూనా పునాదిగా కొత్త పోరాటాలని నిర్మించడం. అంతిమంగా దీని అర్థం - మానవాళి ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యల పరిష్కారం దిశగా, క్యాపిటలిస్టు వ్యతిరేక విప్లవకర పరివర్తన దిశగా ముందుకు సాగడం. ఐతే మనకి సమయం మించి పోతోంది. క్యాపిటలిస్టు వ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాలతోనూ, క్రూరమైన సామ్రాజ్యవాద యుద్ధాలతోనూ లోకంలోని శ్రామిక వర్గం ఇటీవలి కాలంలో అతలాకుతలమై పోతోంది.

ఇటీవలి డేటా ప్రకారం వినియోగదారులు తమ సమయంలో 25శాతం మొబైల్ ఫోన్ల మీద గడుపుతున్నారు. ఈ పరికరాలు విప్లవ సాధనాలైనా కావచ్చు లేదా మనపై ఎక్కుపెట్టిన ఆయుధాలైనా కావచ్చు. అత్యధిక ప్రజలు గతాన్నుంచి ఏమి నేర్చుకోకుండా, తమ ఖాళీ సమయంలో అధిక భాగం వీడియో ఆటల్లోనూ, సోషల్ మీడియా చూడడంలోనూ గడిపేస్తే, బూర్జువా పాలకులు మనని ఓటమి దిశగా తీసుకువెళ్ళే తీవ్ర ప్రమాదం ఉంది. లేదూ, ప్రజలు అప్రమత్తంగా ఉంటే, ఈ పరికరాలే పరిస్థితిని మనకు అనుకూలంగా మార్చుకునే సాధనాలౌతాయి.

ప్రపంచ ప్రజల మీద ఒక మహత్తరమైన శక్తి సంధించబడింది, దాన్ని ప్రజలే ఆపగలరు.

మార్కెట్ మాయలో చక్రబంధమైన భూమి కథ

-పి. వరలక్ష్మి

ఇదొక రియలెస్టేట్ కథ. ప్రస్తుతం ఇది హాట్ టాపిక్. హైదరాబాద్ భూముల్ని కబళించిన మాఫియా, ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని చుట్టూ మంటలు రేపుతోంది. రియలెస్టేట్ అంటే బడుగు జీవికి నిలువ నీడ కరువుజేసి, మధ్య తరగతిని ఊహాస్వర్గంలో తేలియాడించి, కబ్జాకోరుల నేరసామ్రాజ్యాన్ని పాదుకొల్పిన మాయాజాలం. ఈ మాయలో వ్యవస్థ స్వభావం ఇమిడి ఉంది. పైకి చూస్తే అంతుతెలియనట్టుండే ఈ మాయ పొరను విప్పి చూపించే ప్రయత్నం చేశాడు మధురాంతకం నరేంద్ర. దాని కోసం తిరుపతి రియలెస్టేట్ ఇతివృత్తాన్ని తీసుకున్నాడు.

తిరుపతి అంటే చాలా మందికి ఆధ్యాత్మిక కేంద్రమని స్ఫురిస్తుంది. దైవ భక్తి పెట్టుబడై, సరుకై, సంపదల్ని సృష్టించి, సంపదల్ని కొల్లగొట్టి ప్రజల మానసిక, సాంస్కృతిక పీఠాలపై తిష్టవేసుక్కూర్చుని ఆడే ఆటల్ని అక్కడ ఎంతైనా చూడొచ్చు. భక్తి ఎంత పెద్ద ఇండస్ట్రీయో తిరుపతి చూపిస్తుంది. ప్రజల సంపద దేవుని పాలై, అటు నుంచి మఠాల ద్వారా, పీఠాల ద్వారా భూస్వాముల, పెట్టుబడిదారుల పాలై ప్రజల్ని పీడిస్తుంది. తిరుపతి రియలెస్టేట్ మూలం దేవుని మాన్యం భూములు. అందుకే మఠం స్వాముల భాగోతాల దగ్గర అసలు కథ మొదలు పెడతాడు రచయిత. ఉత్తరాది స్వాములు మాట్లాడే హిందీ కొంచెం ఇబ్బంది పెడుతుంది గాని, కథనం ఆసక్తికరంగా సాగుతుంది. కొండపైన దేవునికి కొండ కింద భూములు ఆస్తులుగా సంక్రమించాయి గనక వాటి పరిరక్షకునిగా విచారణాధికారి వస్తాడు. మఠం సన్యాసే విచారణాధికారి కావడానికి అర్హుడు. పొట్ట చేత పట్టుకుని వలస వచ్చిన కూలీలతో వ్యవసాయం చేయిస్తాడు. అలా 1906లో ఉత్పాదనలోకి వచ్చిన భూమి 2007 వరకు లోనైన మార్పుల్ని ఈ నవల స్థూలంగా పరిచయం చేస్తుంది.

గాలీ, నీరూ, భూమి ఒకరు సృష్టించింది కాదు. ప్రకృతి సంపద. అది ప్రకృతిలో జీవనం సాగించే జీవరాశులన్నిటిదీ. భూయాజమాన్యం ఏర్పడే వరకు భూమి ఎవరిదీ కాదు. మరో మాటలో శ్రమ చేసేవారందరీ. అది ఆక్రమితమయ్యాకనే యజమాని వచ్చాడు. "భూ"స్వామ్యం సమాజపు నీతుల్ని, రీతుల్ని నియంత్రించింది. భూమి సరుకయ్యాక ఎన్ని అక్రమాలు, దౌర్జన్యాలు, చేయగలదో అంతా చేసింది. భూయాజమాన్యం ఆది నుండి హింసాత్మకంగానే ఉంటూ వచ్చింది. ఈ కథలోనూ తొలిదశలోనే మఠం ఆస్తుల గురించి విచారణాధికారి హత్య జరుగుతుంది. భూమి పత్రాలు గల్లంతవుతాయి. చచ్చాక ఆస్తి ఏమన్నా వెంటబెట్టుకుని పోతామా అంటూ ఉంటారు గాని ఇక్కడ బ్రహ్మచారి అయిన మఠాధికారి హరిదాసు కూడా తన తర్వాత మఠం భూములు వేరెవ్వరికీ సొంతం కానివ్వనంటాడు. తన ద్వారా పుట్టిన రాజమన్నార్ రెడ్డికి భూములు సంక్రమించేలా చేస్తాడు.

రాజమన్నార్‌రెడ్డిది ఆ భూమిలో శ్రమ చేసిన కుటుంబం. కాని తానెప్పుడూ శ్రమ చేసి ఎరుగడు. అన్నలిద్దరూ మట్టిలో చెమటను పారిస్తే అతను మఠం చుట్టూ తిరుగుతుంటాడు. అట్లని ఊరికే పైపైన తిరిగే మనిషి కాదు. అతనికి ఆస్తి ఎట్లా కూడబెట్టాలో తెలుసు. సునాయాసంగా సంక్రమించిన భూమిని మార్కెట్లో పెట్టి నేలకు మరింత నేలను సొంతం చేసుకోడం తెలుసు. అతని తర్వాతి తరంలో తలెత్తిన రియలెస్టేట్ రాజమన్నార్ రెడ్డి ఇల్లరికపుటల్లుడు జనార్ధనరెడ్డిని భోగాల్లో ముంచి తేలుస్తుంది. రాజమన్నార్‌రెడ్డి దగ్గర జీతగాడు రోసిరెడ్డి వ్యవసాయ పనులు చూసుకుంటే రోసిరెడ్డి కొడుకు శేషారెడ్డి జనార్ధనరెడ్డికి భూములమ్మి పెట్టే రియలెస్టేట్ బ్రోకరు.

జనార్ధనరెడ్డి కరిగించగా మిగిలిన ఆస్తి కోసం అతని అల్లుడు అమిత్‌రెడ్డి వస్తాడు. మిగిలిన ఒకే ఒక భవనం కోర్టు చిక్కుల్లో ఉంటుంది. రెండు పార్టీలనూ కూర్చోబెట్టి సెటిల్‌మెంటు చేస్తానని మూలొంక మస్తాన్‌రెడ్డి ఇద్దర్నీ పక్కకు తోసి ఇంటిని తన సొంతం చేసుకుంటాడు. మస్తాన్‌రెడ్డి ఈజీ మనీకీ, గూండాయిజానికీ పుట్టిన వికృత శిశువు. ఎన్నికల రాజకీయ పార్టీలు దాని బంధువులు. మఠం భూముల్లో మొట్టమొదట శ్రమను ధారపోసిన ఇలవరసి నుండి మనవరాలు మోనిక దాకా ఆ ఇంట్లో స్త్రీలు మాత్రం ఆస్తిని గుదిబండలా మోస్తుంటారు గాని సంపదపై అధికారం కాని, సంపద నుండి ఆనందం కాని పొందరు. ఇది ఈ నవలలో అంతర్లీనంగా ఉన్న మరో ఆసక్తికర అంశం.

2000సంవత్సరానికంతా జడలు విప్పిన రియలెస్టేట్ సర్పం జీర్ణం చేసుకోవడం ప్రారంభించింది. కొండల్ని తొలిచి, చెరువుల్ని మింగి సునాయాసంగా పైకెగసిన భవంతులు ఒకవైపైతే, కాసింత నీడ కోసం తాటిమట్టలో, టార్పాలిన్ పట్టలో కప్పుకునే జానెడు గూడుకై మనుషుల జీవితకాల ఆరాటం మరో పక్క. బ్రోకరు శేషారెడ్డి రియలెస్టేట్ అభివృద్ధిని పారవశ్యంగా చెప్పుకొస్తుంటాడు. అతని దృష్టిలో రియలెస్టేట్ గాడ్ బలరామయ్య ఎన్ని రకాలుగా అధికారుల్ని, ప్రజాప్రతినిధుల్ని వాడుకుని మఠం భూములు, చెరువులు వగైరాలన్నీ బేరం పెడతాడో చెప్తాడు. చట్టపరంగా అనేక చిక్కులున్న మఠం భూమిని బలరామయ్య దగ్గర పది పద్రెదు అంకనాల చొప్పున బీదా బిక్కీ జనం కొనుక్కొని పాకలేసుకుంటారు. వాటిని ప్రభుత్వాధికారులొచ్చి బుల్డోజర్లతో కూలుస్తున్నప్పుడు గాని తాము అన్యాయమైపోయినట్లు వాళ్ళర్థం కాదు. మఠం స్వాములు, రాజమన్నార్‌రెడ్డి దగ్గరినుండి బలరామయ్య, మస్తాన్‌రెడ్డి దాకా చట్టప్రకారంగా చూసినా భూమి చేతులు మారుతున్నదంతా అక్రమ పద్ధతుల్లోనే. అంతా ఆక్రమితమే, అన్యాక్రాంతమే. బుల్డోజర్లు మాత్రం పూరిపాకలపై నుండే వెళతాయి.

"..యిదంతా మన చేతల్లో వుండే కతగాదు. యెవురో చక్రం

పోరు పాటకు రంగులద్దిన ఆటోగ్రీబల్

- పి. మోహన్

"మేలుకోండి పేద ప్రజలారా
మేలుకోండి నలు దిశలా
శ్రామికులు చూపిరి మార్గం
లేచిందోయ్ విముక్తి పథం
తరతరాల కుటిలాచారం
చెయ్యాలిక పూర్తి హతం
తుడిచేయ్ జన దీనాలాపం
జీవన్-మరణమని పోరి
తుదిపోరు ఇది ఓ కామ్రేడ్స్
కలవండోయ్ ఏకంగా
ఇంటర్నేషనల్
ఒకటౌదాం-మానవులం"

కవాతు పాటలా సాగే అంతర్జాతీయ శ్రామిక గేయం...అన్ని భాషల్లో ఒకే బాణీతో ఒకే ఊపుతో పోటెత్తే ఆ రణ నినాదానికి ఒక రూపమిస్తే ఎలా ఉంటుంది? దోపిడీ పీడనలను తుదముట్టించేందుకు నలుమూలల నుంచీ నడుం కట్టి, భుజం కలిపి, కదం తొక్కుతున్న నానా దేశాల, నానా జాతుల శ్రమజీవుల శత్రువుల గుండెలు పగిలేలా కంఠ నాళాలు తెంచుకుని పాడే ఆ పాట కళ్ల ముందు రంగురేఖల్లో కదలాడితే ఎలా ఉంటుంది? అచ్చం ఆటో గ్రీబల్ బొమ్మ కట్టిన "ఇంటర్నేషనల్" లా తప్ప మరోలా ఉండదు.

ఇంటర్నేషనల్ పాట స్ఫూర్తితో జర్మన్ చిత్రకారుడు గ్రీబల్ 1928, 30 మధ్య అదే పేరుతో తైలవర్ణ చిత్రాన్ని వేసాడు. కొలతలు దాదాపు 130 సెంమీ× 190 సెంమీ. బెర్లిన్‌లోని డ్యూషే జీసిస్తే మ్యూజియంలో ఉంది. ఫ్రెంచి విప్లవకారుడు ఈజిన్ పాటియర్ 1871 లో ఫ్రెంచి కమ్యూన్ కాలంలో రాసిన ఈ మంటల పాటను స్త్రీలు, పురుషులు, యువతీయువకులు, వృద్ధులు, తల్లవాళ్ళు, తెల్లవాళ్ళు... నానాజాతుల శ్రామికులనేకమంది పుదుతున్నట్లు చిత్రించాడు గ్రీబల్. చిత్రంలోని జనం నిల్చున్నట్లు కనిపిస్తున్నా వాళ్ళందరూ కెరటంలా లేచిన విముక్తి పథంలో కవాతులా సాగుతున్నట్లూ గోచరిస్తుంది. అందరి కళ్ళలో దైన్యపు తడి మధ్యనే జీవన్మరణపు తుదిపోరులో అమీ తుమీ తేల్చుకోవాలన్న సంకల్పమూ ఉంది. గ్రీబల్ కు వాళ్ళ ఈతి బాధలు, ఆశలు, ఆకాంక్షలు బాగా తెలుసు కనుకే మహాసంగ్రామానికి కదులుతున్న ఆ శ్రామిక జనావళిని అంత శక్తిమంతంగా పొదగట్టాడు. వాళ్ళకు సంఘీభావంగా చిత్రంలో తననూ రూపుగట్టుకున్నాడు. చిత్రంలో కుడి నుంచి రెండో మనిషి అతడే. నీలికోటు తొడుక్కున్న గ్రీబల్ తన పక్కనున్న గని కార్మికుడి భుజంపై నీవెంటే నేనూ అన్నట్టు చెయ్యేసాడు.

జర్మన్ నవ్యవాస్తవికతా కళకు గొప్ప దోహదం చేసిన గ్రీబల్ 1895లో శాక్సనీలోని మీరాన్‌లో పుట్టాడు. తండ్రి బ్రూనో ఇళ్ళకు వాల్ పేపర్లు అంటిచదంలో నిష్ణాతుడు. గ్రీబల్ స్కూలు చదువయ్యాక గ్లాస్ పెయింటింగ్‌లో శిక్షణ పొందాడు. డ్రెస్డెన్ వెళ్ళి పెయింటింగ్‌లో మెళకువలు నేర్చుకున్నాడు. లోకపు దుర్మార్గాలను వాంతికొచ్చేలానే కాకుండా, రక్తం మరిగేలానూ చూపిన ఎక్స్‌ప్రెషనిస్ట్ చిత్రకారులు మ్యాక్స్ బెన్ మాన్, ఆటో డిక్స్‌లతో పరిచయమైంది. బూర్జువా భావాలపై రోత పుట్టింది. కార్మికవర్గ రాజకీయాలు ఒంటబట్టాయి. 1915లో మొదటి ప్రపంచ యుద్ధంలో వలంటీర్‌గా చేరాడు. యుద్ధంలో తీవ్రంగా గాయపడ్డంతో ఇంటికి పంపారు. తిరిగి కళాసాధన చేసాడు. తొలినాళ్ళలో క్యూబిజం, డాడాయిజాలపై మనసు పారేసుకున్నా తేరుకుని రియలిజంపై మళ్ళాడు. కాల్పనిక ఎక్స్‌ప్రెషనిజం వద్దని శక్తిమంతమైన, ప్రత్యక్ష కార్యచరణకు ఉసిగొల్పే న్యూఆబ్జెక్టివిజంలోకి ప్రవేశించాడు. గని కార్మికులను, ఓడ

తిప్పుతా వుండారు. మనం కదలినా, కదలకపోయినా, ఆ చక్రం తిరిగినప్పుడు, దాంతో గూడా తిరగక తప్పదు.." అని రియలెస్టేట్ గురించి మర్మం చెప్తూ శేషారెడ్డి అంటాడు. చక్రం తిప్పేదెవరు, చక్రాల కింద నలిగిపోయేదెవరు అన్నదే అసలు ప్రశ్న. బుల్డోజర్ల కింద నుజ్జయిన పూరిపాకల ఇళ్ళవాళ్ళు మోసం తెలుసుకున్నప్పుడు బలరామయ్య భవంతికి పైకి ఎదురుతిరుగుతారు. చక్రం తిప్పేది బలరామయ్య లాంటి రియలెస్టేట్ బ్రోకరో, మస్తాన్‌రెడ్డి లాంటి గూండాలు కూడా కాదు. ప్రపంచీకరణ సృష్టించిన ఎల్లలు లేని మర్కాట్ శక్తులు. అవి అన్నిటినీ సరుకుల్ని చేసి కింది నుండి పైదాకా దోపిడికి అన్ని ఎల్లల్ని చెరిపేశాయి. లంపెన్ పెట్టుబడిదారీ శక్తుల్ని, వ్యాపార వర్గాల్ని తయారుచేసి ఉత్పత్తితో సంబంధం లేని లాభాల మార్కెట్‌లోకి సమాజాన్ని దిగలాగేసింది. భూచక్రం నవల చదువుతుంటే అది ఒక్క తిరుపతి కథే కాదు కాబట్టి మన చుట్టుపక్కల జరుగుతున్న రియలెస్టేట్ దారుణాలన్నీ మనకు గుర్తొస్తాయి.

1906లో సారవంతమైన నేలలో జన్మించిన చెట్టు ఒకటి ఈ నవలలో వందేళ్ళ పరిణామాలకు సాక్షీభూతంగా ఉంటుంది. 2007లో అదీ రియలెస్టేట్ బారిన పడి దాన్ని నరికేసేంతవరకూ మిగిలి ఉన్న ఏకైక వృక్షమది. అది కూలిపోతూ చెప్పే వీడ్కోలుతో నవల ముగుస్తుంది. కథనంలో ఈ చెట్టు, ప్రస్తావనగా రెండు మూడు సార్లు తప్ప కనిపించదు. అది ఉంటే మరో పార్శ్వాన్ని- ప్రకృతికీ మనిషికి మధ్య సంబంధాన్ని, వైరుధ్యాన్ని, పెట్టుబడి వికృతిని బలంగా వ్యక్తీకరించేది.

బాయిలర్లలో బొగ్గేసే వాళ్ళను, హమాలీలను, సమస్త వృత్తుల కార్మికులను విరివిగా చిత్రించాడు. రెచ్చగొట్టే వేశ్యలను, మనసు కరిగించే బిచ్చగాళ్ళనూ వేసాడు. వీమార్ రిపబ్లిక్ ప్రవచించిన నవ్య కళావాదాలను తలదాల్చి బూర్జువాలను, వాళ్ళ విలాసాలను బొమ్మల్లో భయంకరంగా ఎండగట్టాడు. 1919లో జర్మన్ కమ్యూనిస్ట్ పార్టీ (కేడీపీ) లో చేరి కార్మిక సంఘాలకు పోస్టర్లు, పత్రికలకు బొమ్మలు వేసాడు. యంగ్ రీస్ లాండ్, డ్రెస్డెన్ సెపెషన్, నవంబర్, రెడ్ వంటి అనేక విప్లవ కళాకారుల సంఘాల స్థాపనలో పాలుపంచుకున్నాడు. వేరే వాళ్లు స్థాపించిన వాటిలో సభ్యుడిగా చేరాడు. 1924లో మాస్కోలో జరిగిన అంతర్జాతీయ కార్మిక ప్రదర్శనలో చిత్రాలు ప్రదర్శించాడు.

అవి హిట్లర్‌కు కోరలు మొలుస్తున్న రోజులు. గ్రీబల్ సైన్యాన్ని విమర్శించాడని పోలీసులు విచారణ జరిపారు. నాజీల వేధింపులు పెరిగాయి. బలవంతంగా సైన్యంలో చేర్చారు. 1933లో గెస్టపో (నాజీల రహస్య పోలీసు విభాగం) పోలీసుల గ్రీబల్ ఇంటిని సోదా చేసి, అతన్ని అరెస్ట్ చేసారు. చాలా బొమ్మలను జప్తు చేసారు. మ్యూజియాల్లోంచి అతని బొమ్మలను తీసేసారు. వాటిని 'క్షీణకళ' ప్రదర్శనలో పెట్టి గేలి చేసారు. చివరకు కళాకారుల నిరసనతో అతన్ని వదిలేసారు. రెండో ప్రపంచ యుద్ధంలో గ్రీబల్‌ను మళ్లీ సైన్యంలోకి బలవంతంగా తీసుకుని పోలండ్ పంపారు. గ్రీబల్ తార్నో కాన్ సంట్రేషన్ క్యాంపు నుంచి ఇరవై మంది యూదులను మిత్రులతో కలిసి తప్పించాడు. తనూ సైన్యం నుంచి పారిపోయాడు. 1944,45లో అక్షరాజ్యాలు డ్రెస్డన్ పై విమానాల నుంచి జరిపిన బాండు దాడుల్లో గ్రీబల్ ఇల్లు నేలమట్టమైంది. బొమ్మలు నాశనమయ్యాయి. ఆ బాధలో 'తగలబడుతున్న డ్రెస్డెన్' పేరుతో పది బొమ్మలు వేసాడు. గ్రీబల్ వేసిన ఇంటర్నేషనల్ చిత్రం పోలీసు దాడులో కనిపించకుండా పోయింది. 1945లో యుద్ధానంతరం పోలండ్‌లో తేలి తిరిగా అతని చెంతకు చేరింది. హిట్లర్ ఓడిపోయాడు. గ్రీబల్ జర్మనీలోని సోవియట్ మిలటరీ విభాగంలో పని చేసాడు. డ్రెస్డెన్ ఆర్ట్ స్కూళ్ళలో పాఠాలు చెప్పాడు. ఎర్ర కళాకారుల సంఘాల్లో పనిచేసాడు. 1972 మార్చి 7న డ్రెస్డెన్ లోనే కన్ను మూసాడు. అతని జీవితానుభవాలు 'నేను వీధి మనిషిని' పేరుతో వచ్చిన పుస్తకంలో ఉన్నాయి.

గ్రీబల్ వాస్తవికతకు తీవ్రత జోడించాడు. సామ్యవాద వాస్తవికతా కళకు కొత్త మెరుగులు దిద్దాడు. మూసల్లో ఒదగకుండా ప్రయోగాలు చేసాడు. అతని కార్మికులు మడతలు పడ్డ ముఖాలతో తీవ్రంగా చూస్తుంటారు. వాళ్ళకు తలకిందుల వ్యవస్థపై మహా నిరసన, అసహనం, తిరగబడేందుకు సిద్ధంగా ఉంటారు. దైన్యంతో అంతర్ముఖులుగా కనిపిస్తున్నా తరతరాల కుటిలాచార లోకపు పునాదులనే పెకిలించే మహాశక్తి వాళ్ళ లోపల సుడులు తిరుగుతూ ఉంటుంది. అతని బలిష్టమైన 'ఓడ కార్మికుడు' కదిలిస్తే చాలు కొట్టేలా ఉంటాడు. 'పాటగాడు' బావురుమనే కాంక్రీటు అరణ్యంలో క్షతగాత్ర గీతాన్ని ఆలపిస్తుంటాడు.

గ్రీబల్ నిబద్ధ కళాకారుడు. జీవితాంతం ప్రజా ఉద్యమాల వెంట నడిచాడు. జన దీనాలాపాలు లేని, మానవులంతా ఒకటయ్యే లోకం కోసం త్యాగాల నెత్తుటి దారిలో సాగే పోరువీరుల పాటకు రంగులద్దిన అరుణారుణ స్మృతి చిత్రంలా నిలిచిపోయాడు.

రచనలకు ఆహ్వానం

అరుణతార అనేక ఇబ్బందుల మధ్యనే విప్లవ సాహిత్య సాంస్కృతిక రంగంలో కృషి చేస్తోంది. విరసం అధికార పత్రికగా ప్రజా ఉద్యమాల పక్షాన నిలబడి ప్రగతిశీల విలువలను నిలబెట్టడంలో సోదర సాహిత్య, రాజకీయ, సామాజిక పత్రికలతోపాటు తన వంతు బాధ్యత నిర్వర్తిస్తోంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పెచ్చరిల్లిన ఈ తరుణంలో విప్లవోద్యమంతోపాటు అనేక ప్రజా ధిక్కార స్వరాలు, నిరసనలు, పోరాటాలు వెల్లువెత్తుతున్నాయి. సామాజిక సంబంధాలను, విలువలను, ప్రజా ఆకాంక్షలను పాలకవర్గ విధానాలు ధ్వంసం చేస్తున్నాయి. ప్రజలు తమ వనరుల నుంచి, స్థావరాల నుంచి విస్థాపనకు గురవుతున్నారు. ప్రజల సహజీవన సంస్కృతి మీద దారుణమైన అణచివేత కొనసాగుతోంది. ఆదివాసుల పోరాటాల మీద రాజ్యం అతి పెద్ద స్థాయిలో యుద్ధం ప్రకటించిన సందర్భంలో మనం ఉన్నాం. అణగారిన ప్రాంతాలు, కులాలు, మహిళలు, మత మైనార్టీలు తీవ్ర అభద్రతలోంచే ఆత్మగౌరవం కోసం, న్యాయమైన ఆకాంక్షల కోసం పెనుగులాడుతున్నారు. ఈ సంఘర్షణను తెలుగు సృజనాత్మక సాహిత్యం అద్భుతంగా వ్యక్తీకరిస్తోంది. మారుతున్న ఈ సామాజిక సందర్భాన్ని తెలుగు రచయితలు గతం కంటే శక్తివంతంగా వివిధ ప్రక్రియల్లో ప్రజానుకూల చైతన్యాన్ని ప్రదర్శిస్తున్నారు, సామాజికవేత్తలు విశ్లేషిస్తున్నారు.

ఈ వ్యక్తికరణలకు, విశ్లేషణలకు అరుణతార మరింతగా వేదిక కావాలని మా ఆకాంక్ష. కథ, కవిత్వం, పాట, విమర్శ, పుస్తక సమీక్ష, అనువాదాలతోపాటు విశాల ప్రజా సాహిత్య సాంస్కృతిక రంగంలోని ఏ విషయం మీదైనా రచనలు పంపండి. సాహిత్య, కళా సిద్ధాంత, భావజాలపరమైన వాదాలను, విమర్శలను, వివిధ భాషా సాహిత్యాల్లోంచి ప్రగతిశీల రచనలను అనువాదం చేసి పంపించండి. సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాల మీద, ఉద్యమాల మీద విశ్లేషణలు, నివేదికలు పంపించండి. రాజ్యహింసా రూపాల మీద వ్యాసాలు పంపిండి. అమరులైన ప్రజా ఉద్యమ కార్యకర్తలు, బుద్ధిజీవులు, రచయితలపై స్మృతి వ్యాసాలు పంపించండి.

మీ రచనల వల్లే అరుణతార తాను నిర్దేశించుకున్న సాహిత్య, సాంస్కృతిక కర్తవ్యాలను, ప్రజా ఉద్యమ బాధ్యతలను మరింత శక్తివంతంగా నిర్వర్తించగలుతుంది. మీ రచనల వల్లే పత్రిక ప్రమాణాలు మరింత బలోపేతమవుతాయి. పత్రికలో వస్తున్న రచనల మీద ఎప్పటికప్పుడు అభిప్రాయాలను, విమర్శలను రాసి మా కృషిని మెరుగులు దిద్దండి. అన్ని రకాలుగా మీ నుంచి సహకారాన్ని కోరుతూ...

\- సం.

సాహిత్య వ్యాసం

(12, 13, డిసెంబరు, 2014న పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, తెలుగు విభాగం, విజయవాడవారు "తెలుగులో సాంఘిక నాటకాలు : సామాజిక చైతన్యం" అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో సమర్పించిన పరిశోధన పత్రం)

తెలుగులో నిషేధిత నాటకాలు : జమీన్ రైతు

- ఎస్. చంద్రయ్య

సంక్షిప్తి

ఈ పత్రంలో తెలుగులో నిషేధిత నాటకాలను సంక్షిప్తంగా పరిచయం చేసాను. 'జమీన్‌రైతు' నాటక నేపథ్యాన్ని, ఇతివృత్తాన్ని తలస్పర్శిగా పేర్కొన్నాను. భూస్వామ్య స్వభావాన్ని, అది ప్రవర్తిల్లే భిన్న రూపాల్ని, ఈ భూస్వామ్య వ్యవస్థలో రైతు ఎదుర్కొనే అనేక అవమానాలను ఈ పత్రంలో విశ్లేషించాను. మరీ ముఖ్యంగా వెట్టి విధానాన్నీ, అధిక శిస్తు వసూలు విధానాన్నీ ఈ పత్రం చర్చిస్తుంది. 'జమీన్‌రైతు' అనే ఒక నాటకాన్ని మాత్రమే ప్రధానంగా ఆకరంగా తీసుకోవటం ఈ పత్రానికున్న పరిమితి.

1. తెలుగులో నిషేధిత నాటకాలు - సంక్షిప్త పరిచయం

తెలుగు సాహిత్యానికి నిషేధాలు కొత్త కాదు. అసలు ఒక సృజనాత్మక రచనను కానీ, కళారూపాన్నీ కానీ ప్రభుత్వాలు ఎందుకు నిషేధిస్తాయి? ఈ నిషేధ సంప్రదాయం ఎక్కడి నుంచి వచ్చింది? అని మనం ఆలోచిస్తే... ఎప్పుడైతే తమ మనుగడకు, అస్తిత్వానికి, అధికారానికి దూరమవుతామని ప్రభుత్వం భావిస్తుందో తత్కారణమైన రచనను, కళారూపాన్ని అధికారికంగానూ, అనధికారికంగానూ నిషేధిస్తూ ఆజ్ఞలు జారీ చేస్తుంది. మనకు ఈ కుసంప్రదాయం బ్రిటిష్ వారి నుంచి వచ్చింది. స్వరాజ్య కాంక్షను బలంగా వ్యక్తపరిచిన సాహిత్యాన్ని వారు ఏ మాత్రం ఉపేక్షించక నిషేధించారు. ఆంగ్లేయులు 1876లో Dramatic performance Act 1876 (D.P.A.) ను మొదటిసారిగా ప్రవేశపెట్టి (Act xi of 1876) బెంగాల్ నాటకమైన 'నీల్ దర్పణ్'ని నిషేధించారు. అది మొదలుకొని నిషేధాల పర్వం తెలుగు నేలకు ప్రవేశించి, 'మాలపల్లి' మొదలుకొని నేటి విప్లవ సాహిత్యం వరకు కొనసాగుతూనే ఉంది. "మనకు లభించిన సమాచారం ప్రకారం తెలుగు నాటక సాహిత్యంపైన విధించిన నిషేధాలు 1920 ప్రాంతం నుండి ఎక్కువగా కనిపిస్తున్నాయి." (తిరుమలరావు జయధీర్ 1991 : జమీన్‌రైతు నాటకానికి రాసిన ముందుమాట)

1920లో దామరాజు పుండరీకాక్షుడు "స్వరాజ్య సోపాన గ్రంథమాల" అనే పేరుతో వరసగా ప్రచురించిన "గాంధీ మహోదయం అను నవయుగారంభం, గాంధీ విజయం అను నవయుగం, పాంచాల పరాభవం అను పంజాబు హత్యలు" అనే మూడు నాటకాలనూ ఆంగ్లేయ ప్రభుత్వం నిషేధించింది. 1920 ప్రాంతంలో కృష్ణా, గుంటూరు జిల్లాల పరిసర ప్రాంతాల్లో జాతీయోద్యమ చైతన్యం అధికంగా ఉండటంతో అక్కడ స్వరాజ్య కాంక్షేతివృత్త నాటక ప్రదర్శనలు కూడా ఎక్కువగా సాగేవి. కనుక జీ.వో. నెం. 499, తేది 14-2-1922ను అనుసరించి డి.పి.ఎ. సెక్షన్ 10 ప్రకారం ఆ రెండు జిల్లాల్లోనూ నాటక ప్రదర్శనల నిషేధం పెద్ద ఎత్తున ప్రారంభమైంది.

మద్దూరి అన్నపూర్ణయ్య "చిచ్చుల పిడుగు", సోమరాజు రామానూజరావు "స్వరాజ్య రథం", శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి "తిలక్ మహారాజు నాటకం", "గాంధీ విజయ ధ్వజం", కొడాలి ఆంజనేయులు, విశ్వనాథ సత్యనారాయణలు సంయుక్తంగా రాసిన "విప్లవ పరివర్తనం" మొదలైన ఎన్నో నాటకాలు నిషేధానికి గురయ్యాయి. వేదాంతం వెంకట సుబ్రహ్మణ్య శర్మ రాసిన "శాంతి సంగ్రామం, స్వతంత్ర గర్జన, జమీన్ రైతు, బ్రిటిష్ గయోపఖ్యానం"' అనే నాలుగు నాటకాలు నిషేధానికి గురయ్యాయి. ప్రకృత పత్రానికి ఆకరమైన "జమీన్‌రైతు" నాటకాన్ని నిషేధిస్తున్నట్లు ఆంగ్లేయ ప్రభుత్వం 19-10-1938న అధికారిక ప్రకటన చేసింది. తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంలో సుంకర, వాసిరెడ్డిలు సంయుక్తంగా రాసిన "మా భూమి" నాటకం కూడా నిషేధానికి గురయింది.

2. 'జమీన్‌రైతు' నాటక నేపథ్యం

'ఆంగ్లేయుల ఏలుబడిలో భారతదేశంలో 1935 భారత రాజ్యాంగ చట్టం ప్రకారం వివిధ రాష్ట్రాలలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో జాతీయ కాంగ్రెస్ ప్రధానంగా రైతు సమస్యలైన రుణ విముక్తిని కలిగించడం, జమీందారీలలో శిస్తుల తగ్గింపు మొదలైన వాగ్దానాలతో పాటు రైతుల కనీస కోర్కెలు చాలా వరకు వారి మేనిఫెస్టోలో చేర్చినందుకు కాంగ్రెస్‌కు, అటు కమ్యూనిస్టుల నుంచీ, ఇటు రైతుల నుంచి అనూహ్యమైన మద్దతు లభించింది. తద్వారా ఎక్కడికక్కడ రైతు సంఘాలు ఏర్పడి రైతుల్లో చైతన్యం పెల్లుబికింది. ఈ నూతన చైతన్యంతో 1938న ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకు దాదాపు 1512 మైళ్ళు, దాదాపు 130 రోజులు కాలినడకన 'రైతు రక్షణ యాత్ర'ను చేపట్టారు. ఆ తర్వాత, ఆంధ్రదేశంలో 1938-39లో వచ్చిన జమీందారీ వ్యతిరేక పోరాటాలకు ఈ రైతు రక్షణ యాత్ర గొప్ప ప్రేరణను కల్గించింది. అది రెండవ ప్రపంచ యుద్ధం నడుస్తున్న కాలం కనుక బ్రిటిష్ ప్రభుత్వం 'భారత రక్షణ చట్టం' పేరుతో అనేక మంది అతివాద కార్యకర్తలను బంధించినిది. దీన్ని వ్యతిరేకిస్తూ అతివాద పార్టీలు, జాతీయ కాంగ్రెస్ పార్టీలకు చెందిన మంత్రివర్గం రాజీనామాలను సమర్పించింది. ఇదే అదునుకోసం కాచుకొని ఉన్న జమీందారీ వర్గం రైతులపై దౌర్జన్యాలను యథావిధిగా కొనసాగించడం మొదలెట్టింది.' (చూ. కృష్ణారావు వై.వి. 1990: 63-70). ఈ జమీందారీ గ్రామాల్లోని రైతులు పడుతున్న కష్టాలను నాటకీకరించే క్రమంలో వచ్చిందే 'వేదాంతం వెంకట సుబ్రహ్మణ్యశర్మ'గారు రాసిన ఓ 'జమీన్ రైతు' నాటకం.

3. 'జమీన్‌రైతు' నాటక ఇతివృత్తం

"...it has been stated that the staging of the play might create unnecessary hitch and disaffection between the Zemindars and their tenants..." (చూ. తిరుమలరావు, జయధీర్. 1991: అనుబంధం-Vii) 'రైతులకు,

జమీందారుల మధ్య గల సంబంధాలను చెడగొట్టాలనే ఉద్దేశంతో ఈ నాటకం రాయబడింది.' అంటూ ఈ నాటకాన్ని నిషేధించిన బ్రిటిష్ ప్రభుత్వం 23-6-1938 నాడు పేర్కొంది. స్థూలంగా ఇదే ఈ నాటక ఇతివృత్తం. భూస్వామి, రైతుల మధ్య ఉన్నటువంటి బానిస, యజమాని సంబంధాలను - అనేక రకాలైన దోపిడీ రూపాలను ప్రస్తావిస్తూ ఈ నాటకం కొనసాగుతుంది. ఈ నాటకంలో 'చౌదరి, కవి' పాత్రలు జమీందారుకు వ్యతిరేకంగా ప్రజల్ని సమీకరించే పాత్రను పోషించాయి. జమీందారుకు వ్యతిరేకంగా రైతులందరూ ఏకమై సమ్మె చేయటానికి వెళ్ళడంతో ఈ నాటకం ముగుస్తుంది.

4. జమీన్‌రైతు నాటకం : భూస్వామ్య విధానం

20వ శతాబ్దపు పూర్వార్ధంలోని ఆంధ్రదేశ రైతుల స్థితిగతులను ఎంతో వివరంగా నాటకీకరించింది నాటకం. ముఖ్యంగా ఇది ఆ కాలం నాటి భూస్వామ్య విధానం ఎంత పెత్తందారీతనంతో మెలిగేదో చూయిస్తుంది. "రేయింబవళ్ళు మాయాబిడ్డలతో కలవారి లోగిళ్ళ బానిసమౌచు" (జమీన్‌రైతు: 1991:1) అంటూ రైతులు వాపోతారు. కనుక ప్రధానంగా ఈ సమాజాన్ని భూస్వామి, రైతు సంబంధంగా (ఒక రకంగా యజమాని, బానిస సంబంధంతో పోల్చదగింది). సూత్రీకరించవచ్చు. జమీందారులు, ప్రజల్ని బ్రిటిషు ప్రభుత్వం నిర్దేశించిన దానికంటే 12 రెట్లు అధికంగా శిస్తులు వసూలు చేసేవారు. శిస్తు కట్టని పక్షంలో వారిని వారి స్వంత భూమినుంచి బేదఖలు చేసి ఆక్రమించేవారు. తమ తాబేదార్లయిన సర్వేయర్లను నియమించి, భూమి ఉన్నదానికంటే ఎక్కువ ఉన్నట్లు కొలిపించి మరో రకంగా రైతులను దోపిడీ చేసేవారు. భూస్వాములకు ఎదురు తిరిగిన రైతులను అటవీ సంపదనూ మాటకొస్తే దేన్నీ ఉచితంగా కాదు కదా కనీసం డబ్బులు చెల్లించినా అమ్మకుండా సకల రంగాల్లో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేసేవారు. తమ వేల ఎకరాల్లో వెట్టిచాకిరీ చేయించు కునేవారు. పూట గడవక వేరే చేలకు వెళ్ళిన రైతులను బలవంతంగా లాక్కొచ్చి తమ భూముల్లో వెట్టి చేయించుకునేవారు. వీరికి తోడు కరణాలు ఎవరికీ అర్థం కాని తమ గొలుసుకట్టు రాతతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసేవారు. కష్టపడి ఎలాగోలా శిస్తు చెల్లించినప్పటికీ ముట్టినట్టు రశీదులు ఇచ్చేవారు కాదు. పైగా తమ ఈ దుస్థితికి లోకాతీతమైన శక్తులను నిందిస్తూ నిస్సహాయులుగా మార్చే ఒక భావదాస్యాన్ని ప్రజల్లో ఉండేట్టు జాగ్రత్తపడేది భూస్వామ్య విధానం. అనేక సంఘటనల ద్వారా నాటకంలో వీటన్నింటినీ చిత్రించినా, 1. వెట్టిచాకిరి. 2. అధిక శిస్తు వసూలు. అనే విషయాల కిందికి క్రోడీకరించి అధ్యయనం చేయవచ్చు.

4.1 వెట్టిచాకిరి విధానం

తొలి రోజుల్లో ఆటవిక తెగలకు, ఇతర వెనుకబడిన కొన్ని సాంఘిక తెగలకు మాత్రమే ఈ వెట్టి విధానం పరిమితంగా ఉండేది. తరువాతి కాలంలో అన్ని కులాల వారికి ఇది వర్తింపబడింది. ఈ విధానంలో పటేల్, పట్వారీ, జమీందారీల ఇళ్ళలో అనేక రకాల పనులు చేయడానికి ప్రతి ఇంటికి ఒకరు చొప్పున కేటాయించ బడేవారు. ఇలా అన్ని కులాల వారిచేత తమ వృత్తికి సంబంధించిన పనులను ఏమాత్రం డబ్బులు ఇవ్వకుండా ఉచితంగానూ, నిరంతరంగానూ చేయించుకునేవారు భూస్వాములు. ఈ విధానాన్ని మనం ఈ నాటకంలోనూ చూడవచ్చు. దొర/జమీందారు పొలంలో పనిచేస్తే తమ పిల్లాజెల్లల్ని పోషించుకోలేమని గ్రహించిన 'వెంకన్న, రామన్న' మొదలైన కూలీలు జమీందారు పొలానికి వెళ్ళటానికి నిరాకరిస్తారు. అది తెలుసుకొని ఆగ్రహించిన జమీందారు "ఇదిగో ఆకాస్తా అణిగిస్తా. వెనకముందు చూడకుండా కనపడిన కూలోణ్ణల్లా తన్నుకొంటూ పొలంలోకి యీడ్చుకులి. తర్వాత ఆ కావరమేమిటో చెప్తా" (జమీన్‌రైతు:1991:11) అంటూ 'అంజి' అనే పాలేరును పురమాయిస్తాడు. అంజి- "ఏమిరా! రామాయ్! ఒళ్ళు మదించి కొట్టుకొంటున్నావటే! కూలి ముఠానంతా తిరుగుబాటు చేసి దివానాన్ని సాధించాలనుకొన్నారా? నిలబడి మిర్రి మిర్రి చూస్తావేమిటి? బయలు దేరవేం ముందు. ఓయ్ కూలీలు! ఒక్కొక్కళ్ళవ్వొళ్ళు యిరగ పొడవమన్నారా? అవతల దివాణంనాటు వదిలిపెట్టి, మీ సొమ్ము మించుకుపోయినట్లు ఇక్కడ కొచ్చారా? ఇవాళ్ళ చచ్చారే నా చేతిలో కదలరేం. అరే గోపాల్ చూస్తావేం. ఒక్కొక్కళ్ళని బాదుకొంటూ పద." (జమీన్‌రైతు:1991:23) అంటూ కొడుతూ బలవంతంగా రప్పించి, జమీందారు పొలంలో పని చేయిస్తాడు. శ్రామిక వర్గంలోనుంచే కొంత మందిని చేరదీసి, మచ్చిక చేసుకొని, మరలా ఆ శ్రామిక వర్గాన్ని దోచుకోడానికే పురమాయించటం జమీందారీ/ భూస్వామ్య స్వభావం.

4.2 అధిక శిస్తుల వసూలు

ఈ పత్రంలోని నాల్గవ విభాగంలో చర్చించినట్టు పన్నెండు శాతం అధికంగా పన్నులను వసూలు చేసేవారు భూస్వాములు. "నిరుడు మాకెవరికి గిద్దెడు గింజలు కూడా పండలేదయ్యా పాతబకాయీలెక్కణ్ణుంచి తెచ్చేమయ్యా." (జమీన్‌రైతు:1991:8) అని 'బాపిరెడ్డి' అనే రైతు మొరపెట్టుకున్నా "ఏమిటీ? గిద్దెడు గింజలు కూడ పండలేదుగా? పాపం. పండకపోతే ఇప్పటిదాక గొడ్డు బిడ్డా యెట్లా బ్రతికున్నారు? వింటున్నారా పంతులుగారూ! వీళ్ళ చమత్కారం." అంటూ జమీందారు వెటకారం చేస్తాడు. "అయ్యా తినే కంచాలు తాగే చెంబులమ్ముకొని తెచ్చాం" అంటూ పది రూపాయలు కరణానికి ఇచ్చి రశీదు అడుగుతాడు. "ఇప్పుడు రశీదు ఇవ్వకపోతేయేం. ఇవ్వలేదని ముట్టలేదని దొరగారు పేచీ పెడతారనుకొన్నావా! ముందు పొలంలోకి పదండి." అంటూ కరణం జమీందారు మెచ్చుకోలు కోసం, ప్రాపకం కోసం తిట్లు లభించుకుంటాడు. ఈ విధంగా భూస్వామ్య వర్గం తమ అనుయాయులను ఎలా పెంచి పోషిస్తుందోననే విషయాలు మనకు ఈ నాటకం ద్వారా ప్రదర్శితమయ్యాయి.

4. ఉపయుక్త గ్రంథసూచి

1. కృష్ణారావు, వై.వి. (సం.పా.) 1990. ఆంధ్రప్రదేశ్‌లో రైతు ఉద్యమాలు పోరాటాలు (1 & 2 భాగాలు). హైదరాబాదు : విశాలాంధ్ర పబ్లికేషన్స్.
2. తిరుమలరావు, జయధీర్. 1988. తెలంగాణ రైతాంగ పోరాటం ప్రజాసాహిత్యం. హైదరాబాదు: సాహితీ సర్కిల్.
3. వెంకట సుబ్రహ్మణ్య శర్మ, వేదాంతం. 1991. జమీన్‌రైతు. హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం.
4. సుబ్బరామిరెడ్డి, గండవరం. 1989. ఆధునిక తెలుగు నాటకం. (మొదటి భాగం) సికింద్రాబాద్: ప్రవీణ్ పబ్లికేషన్స్.
5. సుందరయ్య, పుచ్చలపల్లి. 1992. వీర తెలంగాణ విప్లవ పోరాటం గుణపాఠాలు. హైదరాబాదు: హైదరాబాద్ బుక్‌ట్రస్ట్. నాల్గవ ముద్రణ.

(2వ కవర్ పేజి తరువాయి...)

వలసవాదానికి వ్యతిరేకంగా 1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం జరగడానికి ముందు నుంచే నిర్దిష్టంగా ఈ ఒరవడిలో సామాజిక ఉద్యమాలు మొదలయ్యాయి. ఆరోజుల్లో మొదలైన ప్రజాస్వామిక విప్లవక్రమానికి ఇవి సన్నిహితమైనవి. ప్రజాస్వామిక విప్లవంలో భాగమైన రాజకీయార్థిక ఉద్యమాలు ప్రగతిని, సామాజిక ఉద్యమాలు సాంఘిక విముక్తిని సూచిస్తాయి. ఉదాహరణకు ఆనాడు జరిగిన రైతాంగ ఉద్యమాలు ఉత్పత్తి సంబంధాల మార్పు కోసం ప్రయత్నిస్తే, వివిధ సామాజిక ఉద్యమాలు బ్రాహ్మణ ఆధిపత్యంపై తిరుగుబాటుగా ఆత్మగౌరవాన్ని, సమాన అవకాశాలను కోరుకున్నాయి.

ఆనాటి ప్రజాస్వామిక విప్లవ క్రమం ఎలా అనేక పరిమితులకు లోనై వాయిదా వేయబడిందో, దగా చేయబడిందో, సామాజిక ఉద్యమాలూ ప్రతిష్టంబనకు గురయ్యాయి. సాంఘిక సమానత్వం, సమాన అవకాశాలు పొందడం ద్వారా ఆత్మగౌరవం నిలబెట్టుకోడానికి వలస ప్రభుత్వ చట్రంలో జరిగిన సామాజిక ఉద్యమాలు అధికార మార్పిడి కాలం నాటికి పార్లమెంటరీ మార్గానికి చేరువయ్యాయి. ఈ మాట అన్ని సామాజిక ఉద్యమ స్రవంతులకూ వర్తించకపోవచ్చు. కానీ ఈ ధోరణే ప్రధానం. అగ్ర కులాల నుండి వచ్చిన సామాజిక ఉద్యమకారుల్లోనూ ఇది చూడవచ్చు. సహజంగానే వాళ్లకు ఈ మార్గం మరింత ఎక్కువ అందుబాటులో ఉంటుంది. మొత్తంగా సామాజిక సాంస్కృతిక ఉద్యమాల్లోని ప్రగతిశీలతను ఆ స్థల కాల ప్రత్యేకతల్లో భాగంగా గుర్తిస్తూనే ఈ మాట అనవచ్చు. అయితే స్వభావ రీత్యానే అట్టడుగు కులాల నుండి వచ్చిన సామాజిక ఉద్యమకారుల పాత్ర విలక్షణమైనది. మౌలికమైనది. వలసానంతరం జరిగిన, జరుగుతున్న సామాజిక ఉద్యమాలు రాజ్యాంగవాద పరిమితికి లోనయ్యాయి. ఈ మార్గంలో కొన్ని రంగాల్లో సమాన అవకాశాలు, ఆత్మగౌరవం పొందే వీలున్నా భూమిపై, ఉత్పత్తి సాధనాలపై అధికారం అసాధ్యమేనని రుజువవుతున్నది. ఆమేరకు సాంఘిక విముక్తి ఆకాంక్ష వాయిదా పడుతున్నట్టే.

ఈ కాలం పొడవునా కుల ఆధిక్యానికి వ్యతిరేకంగా అనేక మంది సాంఘిక ఉద్యమకారులు, ప్రగతిశీల కమ్యూనిస్టు విప్లవశక్తులు పోరాడినా బ్రాహ్మణ వాదం పునాదిగా గల హిందుత్వ పెచ్చరిల్లిపోయింది. దీనికి మార్కెట్ శక్తుల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. బ్రాహ్మణీయ భావజాలానికి, మార్కెట్ భావజాలానికి ఉన్న సారూప్యతల వల్ల హిందుత్వ సంక్లిష్టంగా తయారై బలపడుతున్నది. నిజానికి జాతీయోద్యమ కాలం నుండీ ఈ రెండు శక్తులు, వాటి భావజాలాలు కలిసే నడుస్తూ ఉన్నాయి. ఇప్పుడు దేశంలోని కార్పొరేట్ శక్తుల అవసరాల కోసం నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాడు. దీన్ని సంఘపరివార్ శక్తులు రాజకీయాధికారంలోకి వచ్చాయని అనుకుంటేనే మరింత స్పష్టంగా ఉంటుంది. బ్రాహ్మణీయ హిందుత్వ భావజాలం వల్ల సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఆధిక్యంలో ఉండటంతోపాటు ఇప్పుడు రాజకీయాధికారంలోకి ఈ శక్తులు వచ్చాయి. బి.జె.పి.తోపాటు కాంగ్రెస్‌కూ హిందుత్వ చరిత్ర, వారసత్వం తక్కువేం లేదు. అయితే బి.జె.పి. ముందు వెనుకల ఉన్న సంఘపరివార్‌కు సామాజిక సాంస్కృతిక, భావజాల రంగాలపట్ల ఫాసిస్టు వైఖరి ఉన్నది. ఇవాళ హిందుత్వను బలంగా వాడుకోగల రాజకీయ శక్తిగా కార్పొరేట్ పెట్టుబడి అండతో బి.జె.పి. ముందుకు వచ్చింది. జాతీయత, మోడిత్వ కలిసి జర్మనీలో హిట్లర్ లేవదీసిన ఫాసిజం ఇవాళ మన దేశంలో హిందూ ఫాసిజంగా ముంచుకొని వస్తున్నది.

అందువల్ల కూడా ఇవాళ రాజకీయార్థిక పోరాటాలతోపాటు సామాజిక పోరాటాల ప్రాధాన్యత పెరిగింది. దీని కోసం గత కాలంలో జరిగిన సామాజిక ఉద్యమాల్లోని శక్తిని విమర్శనాత్మకంగా సొంతం చేసుకోవాలి. మరింత వైవిధ్యభరితమైన, విశాలమైన ప్రాతిపదికలపై సామాజిక ఉద్యమాలను బ్రాహ్మణీయ ఆధిపత్యానికి, హిందుత్వకు వ్యతిరేకంగా నిర్మించాల్సి ఉంది. ఇందుకోసం గతంలో జరిగిన సామాజిక ఉద్యమాలను ప్రజాస్వామిక విప్లవ నేపథ్యంలో మరో సారి అధ్యయనం చేయాల్సి ఉంది. రాజకీయార్థిక పోరాటాలతోపాటు సామాజిక సాంస్కృతిక ఉద్యమాలను రాజ్యాంగ పరిధికి ఇవతల పెద్ద ఎత్తున నిర్మించాల్సి ఉంది. సామాజిక ఉద్యమాలకు సంబంధించినంత వరకు ఈ సాహిత్య పాఠశాల వలస యుగానికే పరిమితమై ప్రజాస్వామిక విప్లవంలో వాటి పాత్ర, ఆ రెండిటి అన్యోన్య సంబంధాలను విశ్లేషిస్తుంది. కమ్యూనిస్టు, విప్లవోద్యమాలు ఆధిపత్య కులం, మెజారిటీ మతభావజాలంపై చేసిన పోరాటాలు, అభివృద్ధి పొందుతూ వచ్చిన అవగాహనలను చర్చిస్తుంది. వివిధ సాంఘిక ఉద్యమాల చైతన్యం తెలుగు సాహిత్యంలో వ్యక్తమైన తీరును విశ్లేషిస్తూ, ఇవాళ కుల, మత, వర్గ తత్వంగా హిందుత్వ ఎంత ప్రమాదరకంగా పరిణమించిందో వివరిస్తుంది.

నిర్దిష్టంగా తెలుగు సాహిత్యంలో గుర్రం జాషువా, కుసుమ ధర్మన్నల కాలం నుంచే బ్రాహ్మణీయ వ్యతిరేక భావాలు వ్యక్తమవుతూ వస్తున్నాయి. ప్రగతిశీల విప్లవ సాహిత్యం బ్రాహ్మణీయ, కుల వ్యతిరేక భావజాలంతో కళా సాహిత్యాలను సృష్టిస్తున్నది. దళిత సాహిత్య పవనాలు దేశ వ్యాప్తంగా వీచిన 80వ దశకంలో విప్లవ సాహిత్యోద్యమం దీనికి బాసటగా నిలిచింది. ప్రజాస్వామిక విప్లవ సాహిత్యంలో ఈ స్రవంతులు భాగం కావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. సామాజిక ఉద్యమాలు, ఉద్యమకారుల గురించి గతంలో ఎన్నోసార్లు మాట్లాడినా మళ్లీ హిందూ ఫాసిజం రూపంలో ఇవాళ అతి ముఖ్యమైన సందర్భం ముందుకు వచ్చింది. సామాజిక ఉద్యమాలను ప్రజాస్వామిక విప్లవ క్రమంలో మరింత అర్థవంతంగా వ్యాఖ్యానించే లక్ష్యంతో జరుగుతున్న ఈ సాహిత్యపాఠశాలను విజయవంతం చేయాలని కోరుతున్నాం.

ఆవిష్కరించే పుస్తకాలు 1. కథల పంట-3, 2. షహీదా కథలు, 3. షహీదా కవిత్వం, 4. నిత్య, మైనా, సుజాత కథలు, 5. జైలు కథలు (బి.అనూరాధ), 6. భాష-కొన్ని సంగతులు (వి.చెంచయ్య వ్యాస సంకలనం), 7. బీజభూమి (వరవరరావు కవిత్వం), 8. కాలిబాట (ఉదయమిత్ర కవిత్వం), 9. రివేరా కవిత్వం, 10. కాశీం కవిత్వం, 11. బాసిత్ కవిత్వం, 12. వేక్ అఫ్ తెలంగాణ నాటకం (బాసిత్), 13. దండకారణ్యం ఒక ఆకుపచ్చని కల (కెనరీ దీర్ఘ కవిత), 14. సాదత్ హసన్ మంటో కథలు, 15. పాదముద్రలు (శాఖమూరి రవి కవిత్వం), 16. పాల్గుణ (పద్మకుమారి నవలిక), 17. చైనా కమ్యూనిస్టు పార్టీ మౌలిక అవగాహనలు, 18. బాలగోపాల్ తాత్విక గందరగోళం, 19. భారత వ్యవసాయ సంబంధాల విశ్లేషణ, 20. విప్లవోద్యమంలో ఆటుపోట్లు-చైనా విశ్లేషణా రచన, 21. ఐక్య సంఘటనపై వ్యాసాలు, 22. రష్యాలో స్టోలిపిన్ కాలంనాటి నిర్బంధం... మరికొన్ని పుస్తకాలు.

- విప్లవ రచయితల సంఘం

డిసెంబర్ 28

డిసెంబర్ 2014న విజయవాడలో ఎం.టి.ఖాన్ తెరేష్‌బాబుల సంస్మరణ సభలో మాట్లాడుతున్న వక్తలు

జనవరి 1 నుంచి 11 వరకు విజయవాడలోని పి.డబ్ల్యూ.డి. గ్రౌండ్స్‌లో జరిగిన పుస్తక ప్రదర్శన దృశ్యాలు

KLVA101M175

ARUNATARA A Literary and [illegible] Telugu Monthly Journal of Revolutionary Writers' Association (VIRASAM)

• RNI Regn.No.21152/72 • Published on 04/02/2015 311 - February, 2015

కలం మీద జులుం కొత్త కాదు. ఈసారి మతోన్మాద శక్తులు తమిళ రచయిత పెరుమాళ్ మురుగన్ రచయితగా మరణించానని ఆత్మహత్యా ప్రకటన చేసేదాకా వదిలిపెట్టలేదు. ఆయన నాలుగేళ్ళ క్రితం రాసిన నవల "మధోరుభగన్" మీద నెల రోజులుగా రాజేసిన మంటల్లోకి నవలనూ, నవలా రచయితను కూడా తోసేశారు. పాతికేళ్ళ సృజన నెత్తురు కక్కుకుంటూ నేల రాలింది. ప్రాణం నిలబెట్టుకోవడం కోసం ప్రాణప్రదమైన రచనను చంపుకోవడం నిజంగా ఏ రచయితా వర్ణించనలవికాని బాధ. పెరుమాళ్ మురుగన్ చివరి ఫేస్‌బుక్ ప్రకటనలో (చివరిది కాకూడదని ఆశిద్దాం) ప్రతి అక్షరం క్షతగాత్రమైనట్టు కనపడుతుంది. రచన చచ్చిపోకూడదు. సృజన మరణిస్తే సామాజిక చలనం అంతమవుతుంది. మానవసమూహం స్పందనలు నశించి గడ్డగట్టిపోతుంది. ఇది పెరుమాళ్ మురుగన్ ఒంటరి దు:ఖం కాదు. భావ ప్రకటనపై దాడి. రచయితలందరిపైనా దాడి. అందుకే సాహిత్యలోకం మురుగన్‌ను కాపాడుకోవాలి. దగ్ధమైపోతున్న భావాలను ప్రతి సాహితీ హృదయం పునర్లిఖించాలి.

\- విరసం

Edited, printed, published and owned by Chalasani Prasad, H.No. 33-13-3, Seetharampuram, Vijayawada - 520 002
Printed at Nagendra Printing Press, Vijayawada - 520 002.
Editor : Chalasani Prasad

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M175
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	53
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Bhanu
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	Afsal
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good